www.andhrajyothy.com
వెల (Price) : Rs. 6.50
వరంగల్
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
పేజీలు: 14
సంపుటి (Volume) : 23
సంచిక (Issue) : 38
బుధవారం | 7-5-2025
శ్రీ విశ్వావసునామసంవత్సరం, ఉత్తరాయణం, వసంతఋతువు, వైశాఖమాసం, శుక్లపక్షం, తిథి: దశమి ఉ.10.20 తదుపరి ఏకాదశి, నక్షత్రం: పుబ్బ సా.6.17 తదుపరి ఉత్తర, వర్జ్యం: రా.2.19-4.06, దుర్ముహూర్తం: ఉ.11.46-12.37, అమృతఘడియలు: ఉ.11.14-1.00, రాహుకాలం: మ.12.00-మ.1.30, సూర్యోదయం: 5.49, సూర్యాస్తమయం: 6.33
Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru


మిస్ వరల్డ్ పోటీల్లో పాల్గొనేందుకు హైదరాబాద్‌కు వచ్చిన వివిధ దేశాలకు చెందిన సుందరీమణులు


మీడియాతో జూపల్లి, మిస్ ఇండియా నందినీగుప్తా, సోనూసూద్

తెలంగాణ విజయాలను ప్రపంచానికి చాటే అవకాశం!

మిస్ వరల్డ్ పోటీల నిర్వహణ మనకు గర్వకారణం.. రాష్ట్ర పర్యాటక అభివృద్ధికీ ఊతం

ఈ పోటీలు ప్రపంచ ఐక్యతకు వేదిక.. మన సంస్కృతి ఉట్టిపడేలా విమానాశ్రయాన్ని తీర్చిదిద్దాలి

అతిథులకు ఘన స్వాగతం పలకాలి: మంత్రి జూపల్లి.. నేడు 70 దేశాల సుందరీమణుల రాక

హైదరాబాద్/సిటీ/శంషాబాద్ రూరల్, మే 6 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ సుందరి పోటీలను తెలంగాణలో నిర్వహించడం మనకు గర్వకారణమని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు చెప్పారు. తెలంగాణ సాంస్కృతిక మూలాలు, మనం సాధించిన విజయాలను ప్రపంచానికి చాటిచెప్పే అవకాశాన్ని ఈ పోటీలు కల్పిస్తాయని అన్నారు. ఈ పోటీల కోసం ప్రపంచ స్థాయిలో ఏర్పాట్లు చేశామని జూపల్లి తెలిపారు. తెలంగాణలో తొలిసారిగా నిర్వహిస్తున్న మిస్ వరల్డ్ పోటీల ఏర్పాట్లు, ఇతర అంశాలను వివరించేందుకు మంగళవారమిక్కడ మీడియా సమావేశం నిర్వహించారు. ఇందులో మంత్రి జూపల్లితో పాటు పర్యాటక శాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్ రంజన్, పర్యాటకాభివృద్ధి సంస్థ ఛైర్మన్ పటేల్ రమేశ్‌రెడ్డి, మిస్ వరల్డ్ సీఈవో జూలియా మోర్లే, నటుడు

మిగతా 14వ పేజీలో...

గాలికి ఏడేళ్ల జైలు

ఓబుళాపురం గనుల అక్రమ తవ్వకాల్లో గాలి జనార్దన్‌రెడ్డి దోషే

14 ఏళ్ల విచారణ తర్వాత సీబీఐ న్యాయస్థానం తీర్పు

మరో ముగ్గురికి ఆయనతో పాటు ఏడేళ్ల కారాగారం

నిర్దోషులుగా సబితా ఇంద్రారెడ్డి, మాజీ ఐఏఎస్ కృపానందం

తన ప్రజా సేవను గుర్తించి, తన వయస్సును పరిగణలోకి తీసుకొని శిక్షను తగ్గించాలని జడ్జిని అభ్యర్థించిన గాలి

ఆరోపణలు రుజువయ్యాయి.. మీకు యావజ్జీవం ఎందుకు విధించవద్దు?.. అని ప్రశ్నించిన న్యాయమూర్తి

తీర్పు వెలువడగానే చంచల్‌గూడకు గాలి తరలింపు

జైలు శిక్ష నేపథ్యంలో గాలి ఎమ్మెల్యే పదవికి గండం

'ఓబుళాపురం'తో అప్పట్లోనే ఖజానాకు 884 కోట్ల నష్టం

హైదరాబాద్, మే 6 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో సంచలనం సృష్టించిన ఓబుళాపురం ఇనుప ఖనిజం గనుల అక్రమ తవ్వకాల కేసులో మైనింగ్ మాఫియా డాన్, కర్ణాటక ఎమ్మెల్యే గాలి జనార్దన్‌రెడ్డిని సీబీఐ ప్రత్యేక న్యాయస్థానం దోషిగా నిర్ధారించింది. ఏడేళ్ల కారాగార శిక్ష విధించింది. ఆయనతోపాటు ఈ కేసులో నిందితులుగా ఉన్న మరో ముగ్గురికి కూడా ఏడేళ్ల కారాగార శిక్షను ఖరారు చేసింది. 14 ఏళ్ల సుదీర్ఘ విచారణానంతరం సీబీఐ ప్రత్యేక న్యాయస్థానం ప్రిన్సిపల్ స్పెషల్ జడ్జి టి.రఘురామ్ మంగళవారం తీర్పునిచ్చారు. ఆంధ్ర, కర్ణాటక సరిహద్దుల్లో అనంతపురం జిల్లా ఓబుళాపురంలో గాలి జనార్దన్‌రెడ్డికి చెందిన ఓబుళాపురం మైనింగ్ కంపెనీ 2007-09 మధ్యకాలంలో యధేచ్ఛగా అక్రమ తవ్వకాలకు పాల్పడిందని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కేసులు పెట్టింది. ఐపీసీ 120బి (నేరపూరిత కుట్ర), 420 (మోసం), 409, 468, 471 (ఫోర్జరీ), అవినీతి నిరోధక యాక్ట్‌లోని సెక్షన్లు 13 (2), 13 (1)(డి) సెక్షన్ల కింద 2009లో కేసు నమోదైంది. కేసును సీబీఐతో దర్యాప్తు చేయించాలని

మిగతా 13వ పేజీలో...



గాలిని పట్టుకునేందుకు మారువేషాల్లో వెళ్లాం

అక్రమ మైనింగ్ నిరూపించేందుకు శాటిలైట్ చిత్రాలు తెప్పించాం

అక్రమ గనుల తవ్వకాలు జరిపే వారికి ఈ తీర్పు ఒక గుణపాఠం

నాటి సీబీఐ జాయింట్ డైరెక్టర్ లక్ష్మీనారాయణ వెల్లడి 13

వైఎస్ అండతో గనుల మాఫియాగా..

ఫైనాన్స్, చిట్‌ఫండ్లతో ప్రారంభమై గనుల వ్యాపారాన్ని శాసించేస్థాయికి

ఇంట్లో బంగారు సింహాసనం, సొంత హెలికాప్టర్లో కర్ణాటక సెక్రటేరియట్‌కు

రూ.వేల కోట్ల విలువైన ఖనిజాల అక్రమ తవ్వకం 13

ఇతర్ల భూముల్లో చొరబడి మైనింగ్

బెయిల్ కోసం జడ్జికే లంచం ఇవ్వజూపిన గాలి జనార్దన్‌రెడ్డి


13

కన్నీళ్లతో కోర్టు మెట్లెక్కా.. న్యాయం గెలిచింది

సీబీఐ కోర్టు తీర్పుపై సబిత హర్షం


ఆర్అండ్‌బీ శాఖపై సమీక్ష నిర్వహిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, అధికారులు

50 ఏళ్ల అవసరాలకు తగినట్లుగా అలైన్‌మెంట్లు

ఆర్ఆర్ఆర్ దక్షిణభాగానికి తగిన జాగ్రత్తలు తీసుకోవాలి

రేడియల్ రోడ్ల పనుల ప్రక్రియను వేగవంతం చేయాలి

శాటిలైట్ టౌన్‌షిప్‌లు, పారిశ్రామిక పార్కుల.. ఏర్పాటుకు అనుగుణంగా రేడియల్ రోడ్లు ఉండాలి

ట్రాఫిక్ సిగ్నళ్లు లేకుండా రోడ్డు దాటే ఏర్పాట్లుండాలి

ఆర్అండ్‌బీ శాఖ సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, మే 6 (ఆంధ్రజ్యోతి): రీజినల్ రింగు రోడ్డు (ఆర్ఆర్ఆర్) దక్షిణభాగం అలైన్‌మెంట్ విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ పొరపాట్లకు తావివ్వొద్దని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ఈ మార్గంలో అటవీ ప్రాంతం, జల వనరులు, మండల కేంద్రాలు, గ్రామాల విషయంలో ముందుగానే లైడార్ సర్వే చేపట్టాలని అధికారులను ఆదేశించారు. వచ్చే 50 ఏళ్ల అవసరాలకు తగినట్లుగా ఆర్ఆర్ఆర్, రేడియల్ రోడ్లు, ఇతర రహదారుల నిర్మాణం, వాటికి సంబంధించి జంక్షన్లు, అనుసంధానం ఉండాలని సూచించారు. శాటిలైట్ టౌన్‌షిప్‌లు, పారిశ్రామిక పార్కుల ఏర్పాటుకు అనుగుణంగా రేడియల్

మిగతా 14వ పేజీలో...

కాంగ్రెస్‌ను వదిలేది లేదు

హామీల అమలులో రేవంత్ చేతులెత్తేశారు: సంజయ్

లక్ష కోట్ల బడ్జెట్ 3లక్షల కోట్లకు పెరిగింది

పాలన చేతగాక పేద రాష్ట్రమంటారా?: ఈటల



సమ్మె వాయిదా

మంత్రి పొన్నంతో ఆర్టీసీ జేఏసీ నేతల చర్చలు సఫలం

సమస్యలపై మంత్రి సానుకూల స్పందన

2019 సమ్మె నాటి కేసుల ఎత్తివేతకు.. పోలీసులకు ఆదేశాలిస్తామన్నారు: జేఏసీ

ఆర్టీసీ సమస్యలపై సీఎంతో చర్చించి నిర్ణయం: మంత్రి పొన్నం ప్రభాకర్

జూన్ 2లోగా పరిష్కరించకపోతే దశల వారీగా ఆందోళనలు: అశ్వత్థామరెడ్డి

హైదరాబాద్, మే 6 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రోడ్డు రవాణా సంస్థ (ఆర్టీసీ) ఉద్యోగులు తలపెట్టిన సమ్మె తాత్కాలికంగా వాయిదా పడింది. మంగళవారం రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌తో ఆర్టీసీ కార్మిక సంఘాల జేఏసీ నేతలు జరిపిన చర్చలు సఫలమయ్యాయి. దీంతో సమ్మెను వాయిదా వేస్తున్నట్లు జేఏసీ నేతలు ప్రకటించారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడంతోపాటు మొత్తం 21 సమస్యల పరిష్కారం కోరుతూ ఆర్టీసీ జేఏసీ బుధవారం నుంచి సమ్మెకు పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. అయితే సమ్మె వద్దని, చర్చలు జరిపి సమస్యలు పరిష్కరించుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొన్నం చేసిన విజ్ఞప్తికి జేఏసీ

మిగతా 3వ పేజీలో...

ఉద్యోగుల సమస్యలపై కమిటీ

నవీన్ మిత్తల్ నేతృత్వంలో ఏర్పాటు

సంఘాలతో చర్చించి తగిన సిఫారసులతో వారంలో నివేదిక ఇవ్వాలని ప్రభుత్వ ఆదేశం

నేడు ఉద్యోగ సంఘాలతో కమిటీ భేటీ 3

ఇళ్లు, డిపాజిట్లు, భూములు!

సుప్రీంకోర్టు న్యాయమూర్తుల ఆస్తుల వెల్లడి

33 మందిలో 21 మంది వివరాలు.. సుప్రీంకోర్టు వెబ్‌సైట్‌లో

రూ. 120 కోట్లతో శ్రీమంతుడు.. జస్టిస్ విశ్వనాథన్

సీజేఐ ఖన్నాకు రెండు ఇళ్లు, రూ.2.77 కోట్ల నగదు, స్విఫ్ట్ కారు

సుప్రీంకోర్టు, హైకోర్టు జడ్జిల నియామక వివరాలూ వెల్లడి

గత రెండున్నరేళ్లలో 14 మంది న్యాయమూర్తుల బంధువులకు చాన్స్

మొత్తం నియామకాల్లో అది 6 శాతమే

న్యూఢిల్లీ, మే 6: భారత సర్వోన్నత న్యాయస్థానం పారదర్శకతలో భాగంగా తన న్యాయమూర్తుల ఆస్తుల వివరాలను తన వెబ్‌సైట్లో పెట్టింది. ఇప్పటివరకు సుప్రీంకోర్టు న్యాయమూర్తులు 33 మందిలో 21 మంది తమ ఆస్తుల వివరాలను ప్రధాన న్యాయమూర్తికి అందజేశారు. వారిలో జస్టిస్ కేవీ విశ్వనాథన్‌కు అత్యధికంగా రూ.120 కోట్ల ఆస్తి ఢిల్లీ, కోయంబత్తూర్‌లలో ఉన్నట్లు వెల్లడైంది. ఆదాయ పన్ను లెక్కల్లో ఆయన రూ.91.47 కోట్ల ఆస్తిని చూపారు. పదవీ విరమణ చేయనున్న ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా ఆస్తుల విలువ కాకుండా వివరాలను ఇచ్చారు. అందులో 55.75 లక్షలు ఫిక్స్‌డ్ డిపాజిట్లు, దక్షిణ ఢిల్లీలో

మిగతా 10వ పేజీలో...



రిజర్వేషన్లు రైలు కంపార్టుమెంట్ లాంటివి

ముందు ఎక్కినవారు ఇతరులను అనుమతించరు: జస్టిస్ సూర్యకాంత్


జమ్మూలో ఓ పాఠశాలలో విద్యార్థుల మాక్‌డ్రిల్

లష్కరే.. మీ భూభాగంలోది కాదా?

ఉగ్రదాడిపై మీ ప్రమేయం లేదా?

మీ తప్పులు కప్పిపుచ్చుకోవద్దు!

పాకిస్థాన్ తీరుపై నిప్పులు చెరిగిన ఐరాస భద్రతా మండలి సభ్యులు

'పహల్గాం'పై ఉగ్రవాద దాడి సహా అణు, క్షిపణి హెచ్చరికలపై నిలదీత

భారత్‌పై దుష్ప్రచారం చేయబోయి చీవాట్లు తిన్న దాయాది దేశం 2

యుద్ధ సన్నద్ధతకు సైరన్

కేంద్ర హోం శాఖ ఆదేశాల మేరకు దేశవ్యాప్తంగా 244 జిల్లాల్లో మాక్ డ్రిల్ నిర్వహణకు రంగం సిద్ధం

తెలుగు రాష్ట్రాల్లో హైదరాబాద్, విశాఖ, బాపట్లలో!

ఎయిర్ రైడ్ సైరన్లు, క్రాష్ బ్లాకవుట్లు, పౌర శిక్షణ, తరలింపు చర్యలతో.. ప్రజల్లో అవగాహన పెంపు

యుద్ధం వస్తే ఎలా వ్యవహరించాలో నేర్పే ప్రక్రియ

1971 తర్వాత మాక్ డ్రిల్ నిర్వహించడం ఇదే!

హైదరాబాద్‌లో 'ఆపరేషన్ అభ్యాస్'

ఆర్మీ, ఎన్‌సీసీ ఆధ్వర్యంలో నేడు నగరంలో మాక్ డ్రిల్

సాయంత్రం 4 గంటల నుంచి 4.30 గంటల దాకా!

న్యూఢిల్లీ, మే 6: పహల్గాం ఉగ్రదాడి అనంతరం పాక్‌తో పెరుగుతున్న ఉద్రిక్తతల నేపథ్యంలో.. కేంద్ర ఆదేశాల మేరకు బుధవారం దేశవ్యాప్తంగా పౌరుల భద్రత సన్నద్ధతను పరీక్షించే మాక్‌డ్రిల్స్ నిర్వహణకు రంగం సిద్ధమైంది. యుద్ధమంటూ మొదలైతే.. 33 రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాల్లో.. దాడులకు గురయ్యే ప్రమాదం ఉన్న 244 జిల్లాల్లోని అత్యంత సున్నితమైన 259 ప్రాంతాల్లో వీటిని నిర్వహించనున్నారు. వాటిలో.. తెలంగాణలో హైదరాబాద్, ఏపీలో విశాఖ, బాపట్ల ఉన్నాయి. కేంద్ర హోం శాఖ కార్యదర్శి గోవింద్ మోహన్ నేతృత్వంలో.. ఈ మాక్ డ్రిల్ నిర్వహణకు సంబంధించి మంగళవారం అత్యున్నతస్థాయి సమావేశం జరిగింది. అత్యంత కీలకస్థానాల్లో విధులు నిర్వహిస్తున్న పలువురు ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు ఈ భేటీలో పాల్గొని చర్చించారు. 1971లో పాకిస్థాన్‌తో యుద్ధం జరిగేటప్పుడు

మిగతా 2వ పేజీలో...

భారత్‌తో పోరాటమా?

పాక్‌లో ఓ మతగురువు ప్రశ్నకు.. అక్కడి ప్రజల నుంచి మౌనమే సమాధానం 2


14

ఉపాధిహామీ సిబ్బందికి వేతనాల చెల్లింపు

రూ. 62 కోట్లు విడుదల.. నేటి నుంచి ఖాతాల్లో జమ

'సంధ్య కన్వెన్షన్' ఆక్రమణల కూల్చివేత

గచ్చిబౌలిలో దాదాపు అర ఎకరం కబ్జా 12

ప్లాట్ల యజమానుల ఫిర్యాదుతో రంగంలోకి హైడ్రా

రూ. 40 కోట్ల విలువైన స్థలంలో ఆక్రమణల తొలగింపు

గాజులరామారంలో 15 ఎకరాల సర్కారీ భూమి స్వాధీనం

అక్రమ నిర్మాణాలను తొలగించి.. ఫెన్సింగ్ వేసిన హైడ్రా

భారత్-యూకే స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం

ఇరు దేశాల మధ్య కస్టమ్స్ సుంకాల తగ్గింపు.. పదేళ్లలో వాణిజ్యం మరో 2.90 లక్షల కోట్లు పెరుగుతుందని అంచనా

ఒప్పందం చరిత్రాత్మకం.. దౌత్య, వ్యూహాత్మక భాగస్వామ్యం బలోపేతం అవుతుంది: ప్రధాని నరేంద్ర మోదీ 10

యూకేలో భారత ఉద్యోగులకు లబ్ధి కలిగేలా మరో ఒప్పందం

యుద్ధ సన్నద్ధతకు సైరన్!


జమ్మూలో బంకర్లను శుభ్రం చేస్తున్న స్థానికులు

ఒక్కో రాష్ట్రంలో ఒక్కో తరహా డ్రిల్

పహల్గాం దాడి, పాకిస్థాన్-ఇండియా మధ్య ఉద్రిక్తతలు పెరుగుతున్న నేపథ్యంలో.. దేశ రాజధాని ఢిల్లీలో పోలీసు దళాలు ఇప్పటికే నిఘాను తీవ్రతరం చేశాయి. కన్నాట్ ప్లేస్, ఇండియా గేట్, జన్‌పథ్ వంటి కీలకమైన, సున్నితమైన ప్రాంతాల్లో గస్తీ పెంచాయి. ఇక బుధవారం మాక్ డ్రిల్‌లో భాగంగా చండీగఢ్‌లో.. ఎంపిక చేసిన ప్రాంతాల్లో బుధవారం రాత్రి 7.30 గంటల సమయంలో 10 నిమిషాలపాటు బ్లాక్ అవుట్ డ్రిల్ నిర్వహించనున్నారు. రాత్రి 7.30 గంటల సమయంలో సైరన్ మోగించడం మొదలుపెడతామని.. అది 10 నిమిషాలపాటు మోగుతుందని.. అది మోగినంతసేపూ పౌరులందరూ తమ ఇళ్లు, దుకాణాలు, వ్యాపారసముదాయాల్లో విద్యుద్దీపాలను ఆపేయాలని.. ఎవరూ జనరేటర్లు, ఇన్వర్టర్లను వాడొద్దని అధికారులు విజ్ఞప్తి చేశారు. వీలైనంతవరకూ ఆ సమయంలో పౌరులందరూ ఇళ్లల్లోనే ఉండడానికి ప్రయత్నించాలని.. రోడ్లపై ప్రయాణిస్తున్నవారు తమ వాహనాలను ఒక పక్కగా పార్క్ చేసి హెడ్‌లైట్లను ఆపేయాలని సూచించారు. ఆస్పత్రులు, క్లినిక్‌లు, వైద్య సంస్థలకు మాత్రం ఈ డ్రిల్ నుంచి మినహాయింపునిచ్చారు. ఇది కేవలం మాక్ డ్రిల్ మాత్రమేనని.. ప్రజలు అనవసరంగా కంగారుపడి, ఆందోళనకు గురికావొద్దని.. పెట్రోల్, డీజిల్, ఆహారం వంటివాటిని పెద్ద ఎత్తున నిల్వ చేసుకోవద్దని సూచించారు. కాగా, అజ్మల్ కసబ్ అతడి సహచర ఉగ్రవాదులు 2008లో ముంబైలోకి ప్రవేశించింది సముద్రమార్గంలోనే. అందుకే మహారాష్ట్ర సర్కారు తీర ప్రాంతాల్లో భద్రత సన్నద్ధతపై దృష్టి సారించింది. సివిల్ డిఫెన్స్ అగ్నిమాపక, ఇతరత్రా అత్యవసర విభాగాల మధ్య సమన్వయాన్ని ఈ మాక్ డ్రిల్‌లో పరిశీలించనున్నారు. ఉత్తరప్రదేశ్ రాష్ట్రవ్యాప్తంగా మాక్ డ్రిల్ నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా ఫైర్ హ్యాండ్లింగ్ టెక్నిక్స్‌ను (అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకునే జాగ్రత్తలు), క్యాజువాలిటీ రెస్పాన్స్‌ను పరీక్షించనున్నట్టు ఆ రాష్ట్ర డీజీపీ తెలిపారు. జమ్ముకశ్మీర్‌లో పోలీసులు, విపత్తు స్పందన దళాలు, పర్యాటకుల భద్రతకు సంబంధించిన గస్తీ దళాలు దాల్ సరస్సుపై డ్రిల్స్ నిర్వహించనున్నారు. అలాగే, ఆ రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాలల్లోని విద్యార్థులకు.. సైరన్లు మోగినప్పుడు, వైమానిక దాడులకు సంబంధించిన సంకేతాలు వచ్చినప్పుడు ఎలా స్పందించాలో నేర్పిస్తారు. పంజాబ్‌లో మొత్తం 23 జిల్లాలుండగా.. వాటిలో 20 జిల్లాల్లో పౌర భద్రత విభాగాలు మాక్ డ్రిల్స్ నిర్వహించనున్నాయి. ఒడిశాలో మాక్ డ్రిల్‌లో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా బ్లాక్ అవుట్ సిమ్యులేషన్స్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కేమోఫ్లేజ్ వంటివి నిర్వహించనున్నారు. కర్ణాటకలో బెంగళూరు, కర్వార్ (ఉత్తర కర్ణాటక- అక్కడ కైగా న్యూక్లియర్ విద్యుత్ కేంద్రం ఉంది), రాయ్‌చూర్‌లో (అక్కడ థర్మల్ పవర్‌స్టేషన్ ఉంది) మాక్‌డ్రిల్ నిర్వహించనున్నారు.ఇలా అన్ని రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాలు మాక్ డ్రిల్స్ నిర్వహణకు చర్యలు చేపట్టినట్టు కేంద్ర వర్గాలు తెలిపాయి. పౌర భద్రత వలంటీర్లు ఈ డ్రిల్‌లో భాగమవుతారని ఆ వర్గాలు వెల్లడించాయి.


ప్రయాగ్‌రాజ్‌లో

(మొదటిపేజీ తరువాయి)

దేశంలో ఇలాగే మాక్ డ్రిల్ నిర్వహించారు. మళ్లీ 50 ఏళ్ల తర్వాత.. ఇప్పుడు అలాంటి కసరత్తే జరగనుంది. ఇంతకీ ఏమిటీ మాక్ డ్రిల్? ప్రభుత్వం వీటిని ఎందుకు నిర్వహిస్తోంది? అందులో పౌరుల పాత్ర ఏమిటి? అంటే.. యుద్ధ సమయంలో ప్రజలు, రక్షణ, విపత్తు స్పందన, ప్రభుత్వ సిబ్బంది ఎలా వ్యవహరించాలో శిక్షణ ఇవ్వడం ఇలా మాక్ డ్రిల్ నిర్వహిస్తారు. అందులో భాగంగా పలు చర్యలు చేపడతారు. అవేంటంటే..

ఎయిర్ రైడ్ సైరన్లు: వైమానిక దాడులు జరిగే ప్రమాదం ఉన్నప్పుడు ప్రజలను అప్రమత్తం చేసే సైరన్లు. ఆ సైరన్ మోగిందంటే ముప్పు ముంచుకొస్తున్నట్టే. ప్రజలు వెంటనే సురక్షిత ప్రదేశాల్లో తల దాచుకోవాలి. ఇంట్లోనే ఉండాలి.

క్రాష్ బ్లాకవుట్స్: యుద్ధ సమయాల్లో రాత్రి వేళల్లో వైమానిక దాడులు జరగకుండా.. విద్యుద్దీపాలన్నీ ఆర్పేసి కారుచీకట్లు కమ్ముకునేలా చేయడం. 1971లో జరిగిన బంగ్లాదేశ్ విమోచన యుద్ధంలో ఈ వ్యూహాన్ని విస్తృతంగా వినియోగించారు.

కేమోఫ్లేజ్ మెజర్స్: పాకిస్థాన్‌తో 1971లో యుద్ధం జరిగిన సమయంలో.. శత్రువుల విమానాలు మన తాజ్‌మహల్‌పై దాడులు చేయకుండా దాన్ని జనపనార తాళ్లతో కప్పి ఉంచారు. అలా కీలక, చారిత్రక కట్టడాలను, సైనిక కేంద్రాలు, సమాచార టవర్లు, విద్యుత్ కేంద్రాల వంటివాటిని శత్రువుల కంటపడకుండా చేసి, వాటిని కాపాడుకునే ప్రక్రియ ఇది.

తరలింపు చర్యలు: ఇది అందరికీ తెలిసిందే. వరదలు వచ్చినప్పుడు ముంపు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించినట్టుగా.. యుద్ధ సమయంలో పౌరులను హైరిస్క్ జోన్ల నుంచి సేఫ్ జోన్లకు తరలిస్తారు.

పౌర శిక్షణ: యుద్ధ సమయాల్లో ఎలా ప్రవర్తించాలో పౌరులకు శిక్షణ ఇస్తారు. ఇందుకోసం పాఠశాలు, కార్యాలయాలు, కమ్యూనిటీ సెంటర్లలో వర్క్‌షాప్‌లు నిర్వహిస్తారు. వారు ఉన్న చోట దాడి జరిగినప్పుడు తలభాగాన్ని ఎలా కాపాడుకుంటూ నేలపై కూర్చుండిపోవాలి, సమీపంలోని ప్రభుత్వ షెల్టర్లను ఎలా గుర్తించాలి?, ప్రాథమిక చికిత్స ఎలా చేయాలి? ఎలాంటి విపత్కర పరిస్థితులు ఎదురైనా ఒత్తిడికి, భయాందోళనలకు గురికాకుండా ఎలా ఉండాలి వంటి అంశాలను ఆ వర్క్‌షాపుల్లో బోధిస్తారు.


జమ్మూలో ఓ పాఠశాలలో మాక్ డ్రిల్

ఇలా మాక్ డ్రిల్ నిర్వహించడం వల్ల.. నిజంగా యుద్ధం వచ్చినప్పుడు ఎలా ప్రవర్తించాలో, ప్రాణాలు కాపాడుకోవాలో ప్రజలకు తెలుస్తుంది. ఈ శిక్షణతో గందరగోళానికి గురి కాకుండా, క్రమశిక్షణతో మెలగడం అలవడుతుంది. అదే సమయంలో అటు ప్రభుత్వ విభాగాలకు కూడా ఎక్కడెక్కడ ఏయే లోపాలున్నాయో తెలుసుకుని వాటిని సరిదిద్దుకునే వీలు కలుగుతుంది. ఎయిర్ రైడ్ వార్నింగ్ సిస్టమ్స్ (శత్రు దాడుల గురించి హెచ్చరించే వ్యవస్థలు) ఎంత సమర్థంగా పనిచేస్తున్నాయి? కంట్రోల్ రూములు, షాడో కంట్రోల్ రూముల పనితీరు ఎలా ఉంది? వంటి అంశాలపై ఒక స్పష్టత వస్తుంది. అందుకే కేంద్ర ప్రభుత్వం 'సివిల్ డిఫెన్స్ రూల్స్, 1968' ప్రకారం ఈ మాక్ డ్రిల్ నిర్వహణకు ఆదేశాలు జారీచేసింది. బుధవారం మాక్ డ్రిల్ నిర్వహించిన రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు.. తాము గమనించిన లోపాలు, వాటిని సరిదిద్దుకోవడానికి అవసరమైన సూచనలు, సిఫారసులతో కేంద్ర ప్రభుత్వానికి 'యాక్షన్ టేకెన్ రిపోర్టు'లు సమర్పిస్తాయి.

మోదీతో దోభాల్ భేటీ

పహల్గాం ఉగ్రదాడికి గట్టిగా బదులివ్వాలని భారత్ భావిస్తున్న తరుణంలో కీలక సమావేశాలు, చర్చలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా మంగళవారం ప్రధాని మోదీతో జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోభాల్ సమావేశమయ్యారు. వీరిద్దరి మధ్య భేటీ జరగడం 48 గంటల్లో ఇది రెండోసారి కావడం గమనార్హం. కాగా, మోదీ ఇప్పటికే రక్షణ మంత్రి రాజ్‌నాథ్, సీడీఎస్ జనరల్ అనిల్ చౌహాన్, త్రివిధ దళాధిపతులతో కూడా సమావేశమయ్యారు.

కొన్నిచోట్ల మంగళవారమే..

దేశవ్యాప్తంగా 244 జిల్లాల్లో బుధవారం మాక్ డ్రిల్స్ నిర్వహించాలని కేంద్రం ఆదేశించగా.. ముందు జాగ్రత్త చర్యగా కొన్ని రాష్ట్రాలు మంగళవారమే ఆ ప్రక్రియ చేపట్టి పౌరులను అప్రమత్తం చేశాయి. ఉదాహరణకు.. పంజాబ్‌లో ఇండో-పాక్ సరిహద్దుకు అత్యంత సమీపంగా ఉండే ఫిరోజ్‌పూర్ కంటోన్మెంట్‌లో ఆదివారం సాయంత్రమే 30 నిమిషాల బ్లాకవుట్ డ్రిల్ (విద్యుద్దీపాల ఆర్పివేత) నిర్వహించారు. మాక్ డ్రిల్ సమయంలో అధికారులకు ప్రజల సహకారం తప్పనిసరిగా ఉండాలి. అధికారుల సూచనలను తూచాతప్పకుండా పాటించాలి. వదంతులను నమ్మకూడదు. ప్రభుత్వం అధికారికంగా విడుదల చేసే సమాచారాన్ని మాత్రమే విశ్వసించాలి.

ఆ 244 జిల్లాలే ఎందుకు?

దేశభద్రతకు సంబంధించి వ్యూహాత్మక ప్రాముఖ్యం ఉన్న జిల్లాలు, దాడుల ప్రమాదం ఎక్కువగా ఉండే జిల్లాలను 'సివిల్ డిఫెన్స్ జిల్లా'లుగా వ్యవహరిస్తారు. అందులో రకరకాల కేటగిరీలు ఉంటాయి.

అంతర్జాతీయ సరిహద్దులకు దగ్గరగా ఉండే జిల్లాలు: పంజాబ్, రాజస్థాన్, గుజరాత్, జమ్ముకశ్మీర్ రాష్ట్రాల్లో ఇండో-పాక్ సరిహద్దులకు దగ్గరగా ఉండే జిల్లాలు.

కీలక వ్యవస్థలు ఉండే జిల్లాలు: సైనిక స్థావరాలు, విద్యుత్ గ్రిడ్లు, జలవిద్యుత్ కేంద్రాలు, చమురు శుద్ధి కర్మాగారాలు, ఓడరేవులు, కమ్యూనికేషన్ నెట్‌వర్క్‌లు ఉండే జిల్లాలు.

జనసాంద్రత ఎక్కువగా ఉండే పట్టణాలు: జనసాంద్రత ఎక్కువగా ఉండే పట్టణ ప్రాంతాలను శత్రుదేశాలు లక్ష్యంగా చేసుకునే ప్రమాదం ఉంటుంది కాబట్టి వాటిని కూడా ఈ జాబితాలో చేరుస్తారు. జనసాంద్రత ఎక్కువగా ఉండడం వల్ల ఆయా ప్రాంతాల్లో తరలింపు ప్రక్రియలు కొంత సంక్లిష్టంగా ఉంటాయి. కాబట్టి ఆమేరకు ముందుజాగ్రత్తచర్యలు తీసుకుంటారు.

తీరప్రాంత జిల్లాలు: శత్రుదేశాల నౌకాదళ దాడుల ముప్పు అధికంగా ఉండే తీర ప్రాంతాలను కూడా ఈ జాబితాలో చేర్చారు.

ఈ నాలుగు రకాల ప్రాంతాలనూ సివిల్ డిఫెన్స్ జిల్లాలుగా ప్రకటించిన ప్రభుత్వం యుద్ధసమయాల్లో ఆయా జిల్లాల్లో యుద్ధసన్నద్ధతకు సంబంధించిన కార్యక్రమాలు నిర్వహిస్తాయి.



మా నీళ్లు ఇక మాకే...!

» సింధు జలాలపై ప్రధాని మోదీ వ్యాఖ్య



న్యూఢిల్లీ, మే 6: ఇప్పటి వరకు ఇతరులకు ఇచ్చిన మన నీళ్లు ఇకపై మనకేనని ప్రధాని మోదీ అన్నారు. దేశ రాజధాని ఢిల్లీలో ఏబీపీ మీడియా గ్రూప్ మంగళవారం నిర్వహించిన కాంక్లేవ్‌లో మాట్లాడుతూ.. ఈమేరకు వ్యాఖ్యానించారు. భారత్, పాకిస్థాన్‌ల మధ్య ఉన్న సింధు నది జలాల ఒప్పందాన్ని ఉద్దేశించి ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. అయితే పొరుగు దేశం పేరు ఎత్తలేదు. "ఇక భారత జలాలు భారత్ కోసమే ప్రవహిస్తాయి... నిల్వ ఉంటాయి.. దేశ ప్రయోజనాలకే వినియోగమవుతాయి..." అని ప్రధాని మోదీ కాంక్లేవ్‌లో పేర్కొన్నారు. తద్వారా సింధు నది జలాల విషయంలో భారత్ అనుసరించనున్న వైఖరిని స్పష్టం చేశారు.

మాపై భారత్ దాడి చేస్తే... ప్రపంచంలో ఎవ్వరూ మిగలరు!

» పాక్ రక్షణ మంత్రి ఖవాజా వ్యాఖ్య



ఇస్లామాబాద్, మే 6: పాకిస్థాన్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ మరోసారి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. భారత్ కనుక పాకిస్థాన్‌పై దాడి చేసే సాహసానికి ఒడిగట్టి.. పాక్ ఉనికికి ముప్పు ఏర్పడితే.. ప్రపంచంలోనే ఎవ్వరూ మిగలరని అన్నారు. అంతేకాకుండా, ఇండియా, పాక్ మధ్య పరిస్థితిని గాజాపై ఇజ్రాయెల్ దాడితో పోల్చారు. ఇజ్రాయెల్ ప్రధాని బెంజిమిన్ నెతన్యాహూ స్నేహితుడు కూడా అదే మనస్తత్వం ప్రదర్శిస్తున్నారని ప్రధాని మోదీని ఉద్దేశించి విమర్శించారు. ఖవాజా ఓ టీవీ ఇంటర్వ్యూలో ఈ వ్యాఖ్యలు చేశారు.

లష్కరే.. మీ భూభాగంలోది కాదా?

ఉగ్రదాడిపై మీ ప్రమేయం లేదా?.. మీ తప్పులు కప్పిపుచ్చుకోవద్దు!

» పాకిస్థాన్ తీరుపై నిప్పులు చెరిగిన ఐరాస భద్రతా మండలి సభ్యులు

» ఐక్యరాజ్యసమితిలో ఏకాకైన పాకిస్థాన్

» మిత్ర దేశం చైనా సహా అన్నీ మౌనం

న్యూయార్క్, మే 6: ఐక్యరాజ్యసమితి(ఐరాస)కి చెందిన శక్తిమంతమైన భద్రతా మండలి సమావేశంలో భారత్‌ను దోషిగా చూపేందుకు, భారత్‌పై నిప్పులు చెరిగేందుకు ప్రయత్నించిన పాకిస్థాన్‌కు తగిన శాస్తి జరిగింది. భారత్‌పై లేనిపోని ఆరోపణలు చేసి.. ఐరాస దృష్టిలో విలన్‌ను చేయాలని అత్యుత్సాహం ప్రదర్శించిన పాకిస్థాన్ శాశ్వత ప్రతినిధి అసీం ఇఫ్తిఖార్ అహ్మద్‌కు భద్రతా మండలి తీవ్రస్థాయిలో చీవాట్లు పెట్టింది. "మీరు చేస్తున్నదేంటి? అసలు పహల్గాం ఉగ్రదాడిలో లష్కరే తాయిబా ప్రమేయంపై మీరేం చెబుతారు?. ఉగ్రసంస్థ మీ భూభాగంలోది కాదా? క్షిపణి దాడులు, అణ్వాయుధాల ప్రయోగం అంటూ మీరెందుకు రెచ్చగొడుతున్నారు?. ఇదేం విధానం?." అంటూ.. భద్రతా మండలి అసీంపై నిప్పులు చెరిగింది. దీంతో ఆయన సమాధానం చెప్పలేక, ఎదురు దాడి చేసేందుకు ప్రయత్నించి చతికిలపడ్డారు. ఈ క్రమంలో ఏ ఒక్కదేశానికి చెందిన ప్రతినిధి కూడా పాకిస్థాన్ తరఫున నోరు విప్పేందుకు సాహసించలేదు. అందరూ మౌనంగా ఉండిపోయారు. దీంతో కీలకమైన భద్రతా మండలిలో పాక్ ఏకాకి అయింది. అంతేకాదు.. పాకిస్థాన్ మిత్ర దేశం చైనా కూడా ఈ సమయంలో మౌనంగా ఉండిపోవడం గమనార్హం.



కాగా, ఇరు దేశాలు పరస్పర చర్చల ద్వారా ఉద్రిక్తతలను తగ్గించుకోవాలని మండలి సూచించింది.

పిలిచి మరీ తలంటించుకుని!

పాకిస్థాన్ ఏరికోరి సోమవారం ఐరాస భద్రతా మండలిలో 'తమ' విషయాన్ని చర్చించాలని పట్టుబట్టింది. దీంతో మండలి అధ్యక్షుడు సెకెరిస్ ప్రత్యేక భేటీ ఏర్పాటు చేసి.. పలు విషయాలు చర్చించాలని నిర్ణయించారు. అయితే.. ఈ సమావేశంలో పాక్ శాశ్వత ప్రతినిధి అసీం.. భారత్‌పై విద్వేషపూరిత వ్యాఖ్యలు చేసి భద్రతా మండలి దృష్టిని మళ్లించి, తమకు అనుకూలంగా మలుచుకునేందుకు ప్రయత్నించారు. అయితే, భద్రతా మండలి పాక్‌నే నిలదీసింది. పదునైన ప్రశ్నలతో పాక్ ప్రతినిధి అసీంను ఉక్కిరిబిక్కిరి చేసింది. భారత్‌పై అసీం చేసిన వ్యాఖ్యలను 'తప్పుడు అజెండా' అంటూ అసీం వాదనను సభ్యులు నిర్ద్వంద్వంగా కొట్టిపారేశారు. క్షిపణి పరీక్షలు, అణు దాడుల హెచ్చరికలపై భద్రతా మండలి ప్రశ్నల వర్షం కురిపించింది. "ఇదేం విధానం?. ఇవి హెచ్చరికలు కావా? బెదిరింపులు కావా?. వీటిని ఎలా సమర్థించుకుంటారు?." అని సభ్యులు నిలదీశారు. "పహల్గాం ఉగ్రదాడి ఘటన వెనుక లష్కరే తాయిబా ఉంది. ఇది మీ భూభాగం నుంచే కార్యకలాపాలు నిర్వహిస్తోంది. దీనిలో మీ పాత్ర లేదా?. మీరు తప్పులు కప్పిపుచ్చుకునే ప్రయత్నం చేయొద్దు." అని అసీంను భద్రతా మండలి సభ్యులు నిలదీశారు. కాగా.. ఈ సమావేశంలో పాకిస్థాన్‌కు అత్యంత ఆప్తమిత్ర దేశంగా ఉన్న చైనా కూడా మౌనం వహించింది.

ఫలించిన మోదీ మంత్రాంగం!

ఐరాసలో పాక్‌ను ఏకాకి చేయడంలో ప్రధాని మోదీ మంత్రాంగం ఫలించింది. పహల్గాం ఉగ్రదాడి అనంతరం ఆయన ఐరాస శాశ్వత సభ్యదేశాలైన అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్, రష్యాలతో స్వయంగా మాట్లాడిన మోదీ.. ఉగ్రవాదులకు పాక్ అండగా ఉంటున్న వైనాన్ని, పహల్గాం ఉగ్రదాడిని సమగ్రంగా వివరించారు. మరోవైపు శాశ్వత సభ్యత్వం లేని దేశాలతో విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ మాట్లాడి.. ఐరాసలో పాక్‌ను ఒంటరిని చేయడంలో విజయం సాధించారు. దీంతో చైనా సహా ఏ ఒక్కదేశం కూడా పాక్‌కు అనుకూలంగా నోరెత్తకపోవడం గమనార్హం.

భారత్‌తో పోరాటమా.. మౌనమే!

» పాక్‌లో ఓ మతగురువు ప్రశ్నకు.. అక్కడి ప్రజల నుంచి మౌనమే సమాధానం

» సోషల్ మీడియాలో వీడియోలు వైరల్

న్యూఢిల్లీ, మే 6: భారత్‌తో యుద్ధం విషయంలో పాకిస్థాన్ ప్రభుత్వానికి సొంత ప్రజల నుంచే మద్దతు లభించని పరిస్థితి కనిపిస్తోంది. పైగా బలూచిస్థాన్, ఖైబర్ పఖ్తుంఖ్వా ప్రాంతాల్లోని సొంత ప్రజలపైనే పాక్ సైన్యం దాడులు చేయడంపై వ్యతిరేకత కూడా వ్యక్తమవుతోంది. పాకిస్థాన్ రాజధాని ఇస్లామాబాద్‌లోని లాల్ మసీదు మతగురువు మౌలానా అబ్దుల్ అజీజ్ ఘాజీ.. మసీదుకు వచ్చిన ప్రజలు, విద్యార్థులతో మత గురువు మాట్లాడుతూ "మీ అందరికీ ఒక ప్రశ్న. ఒకవేళ భారత్‌తో పాకిస్థాన్ యుద్ధం చేస్తే.. మీలో ఎందరు మద్దతు ఇస్తారు? పాక్ తరఫున పోరాడుతారు?" అని ప్రశ్నించారు. అక్కడున్నవారిలో ఒక్కరు కూడా చేయి ఎత్తలేదు, ఏమీ మాట్లాడకుండా మౌనంగా ఉండిపోయారు. ఇది చూసిన మతగురువు అజీజ్ ఘాజీ.. ఈ మౌనం చూస్తే అంతా అర్థమైపోతోందని పేర్కొన్నారు. అంతేకాదు.. బలూచిస్థాన్, ఖైబర్ పఖ్తుంఖ్వా ప్రాంతాల్లో సొంత ప్రజలపైనే పాక్ సైన్యం బాంబులు వేస్తోందని మండిపడ్డారు. మరోవైపు ఖైబర్ పఖ్తుంఖ్వా ప్రాంతానికి చెందిన మత బోధకుడు ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ.. "ఒకవేళ పాకిస్థాన్‌పై భారత్ దాడి చేస్తే.. భారత సైన్యానికి పష్తూన్లు మద్దతు ఇస్తారు. ఖైబర్ పఖ్తుంఖ్వాలో పాక్ ఆర్మీ ఎన్నో అరాచకాలకు పాల్పడింది. మరి మనం పాకిస్థాన్ జిందాబాద్ అంటామా? అలా అనే ప్రసక్తే లేదు" అని పేర్కొన్నారు. ఈ రెండు ఘటనల వీడియోలు వైరల్‌గా మారాయి.

పాక్ సరిహద్దుల్లో వార్ గేమ్!

న్యూఢిల్లీ, మే 6: పాక్‌తో ఉద్రిక్తతలు ముదురుతున్న నేపథ్యంలో సరిహద్దుల్లో భారీ స్థాయిలో వార్ గేమ్‌కు భారత వాయుసేన సిద్ధమైంది. బుధ, గురువారాల్లో రెండు రోజులపాటు రాజస్థాన్‌లో అంతర్జాతీయ సరిహద్దులకు సమీపంలో డ్రిల్ నిర్వహించేందుకు సిద్ధమైంది. బుధవారం రాత్రి 9.30 గంటలకు ఈ విన్యాసాలు ప్రారంభమై శుక్రవారం తెల్లవారుజామున 3 గంటలకు ముగియనున్నాయి. భారత వైమానిక దళం యుద్ధ సన్నద్ధత పూర్తిస్థాయిలో పరీక్షించనున్నామని.. వేగంగా స్పందించడం, అత్యవసర పరిస్థితుల్లో సమన్వయం, రాత్రిపూట, పగటి సమయంలో ఎలా వ్యవహరించాలి వంటి అంశాలను పరిశీలించనున్నామని వాయుసేన వర్గాలు తెలిపాయి.

పాక్ ఆర్మీ వాహనంపై దాడి.. ఏడుగురి మృతి

ఇస్లామాబాద్, మే 6: బలూచిస్థాన్‌లో మంగళవారం జరిగిన ఉగ్రవాద దాడిలో ఏడుగురు పాకిస్థానీ సైనికులు మరణించారు. బలూచిస్థాన్ లిబరేషన్ ఆర్మీ(బీఎల్ఏ)కి చెందిన ఉగ్రవాదులు ఈ దాడికి పాల్పడ్డారని పాకిస్థాన్ ఆర్మీ అనుమానిస్తోంది. కచ్చి జిల్లాలోని మాచ్ ప్రాంతంలో భద్రతా దళాల వాహనాన్ని లక్ష్యంగా చేసుకున్న ఉగ్రవాదులు.. ఐఈడీతో వాహనాన్ని పేల్చారని పాకిస్థాన్ సైన్యం తెలిపింది.

సబ్‌మెరైన్లు, యుద్ధనౌకలు క్షణాల్లో తునాతునకలు

» 'మల్టీ ఇన్‌ఫ్లుయెన్స్ గ్రౌండ్ మైన్' పరీక్ష విజయవంతం

విశాఖపట్నం, మే 6 (ఆంధ్రజ్యోతి): సముద్రంలో సబ్‌మెరైన్లు, యుద్ధనౌకలను క్షణాల్లో పేల్చివేయడానికి ఉపయోగించే 'మల్టీ ఇన్‌ఫ్లుయెన్స్ గ్రౌండ్ మైన్' పరీక్షను భారత్ విజయవంతంగా పూర్తిచేసింది. డీఆర్‌డీవో సహకారంతో విశాఖపట్నంలోని నేవల్ సైన్స్ అండ్ టెక్నాలజీ లేబొరేటరీలో పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో దీన్ని రూపొందించారు. విశాఖ తీరంలోని బంగాళాఖాతంలో దీనికి నిర్వహించిన పరీక్ష విజయవంతమైనట్టు నేవీ వర్గాలు మంగళవారం తెలిపాయి.

పహల్గాం దాడిపై మోదీకి ముందే నిఘా సమాచారం

» దాంతోనే కశ్మీరు పర్యటన రద్దు

» రాంచీ సభలో ఖర్గే ధ్వజం



రాంచీ, మే 6: పహల్గాంలో ఉగ్రదాడికి సంబంధించి ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ దాడి గురించి ప్రధాని మోదీకి ముందే తెలుసన్నారు. మూడ్రోజుల ముందే నిఘా సమాచారం అందిందని.. దాంతో జమ్మూకశ్మీరు పర్యటనను ఆయన రద్దుచేసుకున్నారని తెలిపారు. మంగళవారం రాంచీలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో జరిగిన 'సంవిధాన్ బచావో' ర్యాలీలో ఖర్గే ప్రసంగించారు. 'పహల్గాం దాడికి మూడ్రోజుల ముందు మోదీకి నిఘా నివేదిక అందిందని.. దాంతో ఆయన జమ్మూకశ్మీరు పర్యటన రద్దుచేసుకున్నారని నాకు తెలియవచ్చింది" అని చెప్పారు. "ఈ సమయంలో జమ్ముకశ్మీర్‌లో పర్యటించడం మీ భద్రతకు మంచిది కాదు" అని నిఘా నివేదిక మోదీకి సూచించిందన్నారు. "అలాంటప్పుడు ప్రజలను రక్షించేలా పోలీసులకు ఎందుకు సమాచారం ఇవ్వలేదు. పర్యాటకులను రక్షించడానికి మరిన్ని బలగాలను ఎందుకు పంపలేదు" అని ఖర్గే నిలదీశారు. అయినా పాకిస్థాన్‌పై కేంద్రం ఏ చర్య తీసుకున్నా కాంగ్రెస్ సమర్థిస్తుందని స్పష్టం చేశారు. గత నెల 19న కాత్రా నుంచి శ్రీనగర్‌కు తొలి రైలును ప్రారంభించేందుకు ప్రధాని కశ్మీరు వెళ్లాల్సి ఉంది. అయితే ప్రతికూల వాతావరణం నెలకొన్న కారణంగా కార్యక్రమాన్ని వాయిదా వేసుకున్నారు.

పంజాబ్‌లో ఉగ్రదాడి కుట్ర భగ్నం..!

» భారీగా మందుగుండు సామగ్రి స్వాధీనం

అమృత్‌సర్/ జమ్ము, మే 6: భారత్‌లో మరో ఉగ్రదాడి కుట్రను పంజాబ్ పోలీసులు భగ్నం చేశారు. నవాన్‌సహర్ జిల్లాలోని టిబ్బానంగల్-కులార్ రోడ్‌కు సమీపంలోని అటవీ ప్రాంతంలో గ్రనేడ్లతోపాటు ఐఈడీలు, వైర్‌లెస్ సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. నిఘా వర్గాలకు అందిన సమాచారం మేరకు మంగళవారం కేంద్ర దర్యాప్తు సంస్థలతోపాటు అమృత్‌సర్‌లోని రాష్ట్ర ప్రత్యేక ఆపరేషనల్ సెల్ (ఎస్ఎస్ఓడీ) సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన తనిఖీల్లో ఈ మందుగుండు సామగ్రి బయటపడింది. రెండు రాకెట్ ప్రొపెల్డ్ గ్రనేడ్లు, రెండు ఐఈడీలు, ఐదు పీ-86 హ్యాండ్ గ్రనేడ్లు, ఒక వైర్‌లెస్ కమ్యూనికేషన్ సెట్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు పంజాబ్ డీజీపీ గౌరవ్ యాదవ్ 'ఎక్స్' ఖాతాలో పోస్టు చేశారు. పంజాబ్‌లోని తమ స్లీపర్ సెల్స్ పునరుద్ధరణకు పాక్ నిఘా సంస్థ ఐఎస్ఐ, దాని అనుబంధ ఉగ్రవాద సంస్థల సమన్వయంతో ఈ ఆయుధాలు సరఫరా చేసి ఉంటారని తమ ప్రాథమిక దర్యాప్తులో తేలిందని డీజీపీ తెలిపారు. మరోవైపు, జమ్మూకశ్మీర్‌లోని పూంచ్ జిల్లాలో చొరబాటుకు ప్రయత్నిస్తున్న పాకిస్థాన్ పౌరుడి(20)ని సైనిక బలగాలు అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నాయి.

డార్క్ షిప్‌లను గుర్తించే హాక్‌ఐ 360

భారత్‌కు నిఘా టెక్నాలజీ విక్రయానికి అమెరికా ఆమోదం

న్యూఢిల్లీ, మే 6: పహల్గాంలో ఉగ్రదాడి నేపథ్యంలో పాకిస్థాన్ సరిహద్దుల్లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న వేళ.. భారత నిఘా సామర్థ్యాన్ని పెంచేలా కీలక ముందడుగు పడింది. ఇండో-పసిఫిక్ ప్రాంతంలో సముద్ర నిఘాను పెంచేందుకు వీలుగా హాక్‌ఐ 360 అనే ఉపగ్రహ ఆధారిత నిఘా సాంకేతికతను భారత్‌కు విక్రయించడానికి అమెరికా ఆమోదం తెలిపింది. 'సీ విజన్ సాఫ్ట్‌వేర్‌తోపాటు ప్రాధాన్యత కలిగిన సాఫ్ట్‌వేర్ మెరుగుదల, సాంకేతిక సహాయ బృందం ద్వారా శిక్షణ, రిమోట్ సాఫ్ట్‌వేర్, డాక్యుమెంట్లు, ఇతర లాజిస్టిక్స్, ప్రోగ్రామ్ సపోర్ట్ కావాలని భారత్ కోరింది. ఈ ప్యాకేజీ మొత్తం అంచనా వ్యయం సుమారు రూ.11 వేల కోట్లు' అని అమెరికా డిఫెన్స్ సెక్యూరిటీ కోఆపరేషన్ ఏజెన్సీ తెలిపింది. హాక్ ఐ 360 అనేది అమెరికాకు చెందిన జియోస్పేషియల్ అనలిటిక్స్ కంపెనీ. ఇది తన సాంకేతికతతో తక్కువ భూ కక్ష్యలోని ఉపగ్రహాల సాయంతో రేడియో ఫ్రీక్వెన్సీ (ఆర్ఎఫ్) ఉద్గారాల ఆధారంగా ఆ సిగ్నల్ ఎక్కడి నుంచి వస్తుందో గుర్తిస్తుంది. నౌకలు, విమానాలతోపాటు తీర వ్యవస్థల నుంచి వచ్చే సంకేతాలను ట్రాక్ చేస్తుంది. ట్రాకింగ్ నుంచి తప్పించుకునేందుకు ఆటోమేటిక్ ఐడెంటిఫికేషన్ సిస్టమ్ (ఏఐఎస్)ను ఆఫ్ చేసుకుని తిరిగే 'డార్క్ షిప్'లను సైతం హాక్‌ఐ 360 టెక్నాలజీ గుర్తిస్తుంది. ఈ సాంకేతికత భారత్‌కు అందుబాటులోకి వస్తే హిందూ మహాసముద్ర ప్రాంతంలో అక్రమంగా చేపలు పట్టే వారిని, స్మగ్లింగ్ చేసే వారిని, డార్క్ షిప్‌లను సులువుగా గుర్తించవచ్చు. అలాగే సముద్ర ప్రాంతంపై గట్టి నిఘా పెట్టవచ్చు. ప్రస్తుతం భారత నౌకాదళం వ్యూహాత్మక ప్రదేశాలను పర్యవేక్షించడానికి, ఏఐఎస్‌ను ఆఫ్ చేసుకుని తిరిగే డార్క్ షిప్‌లను గుర్తించడానికి పీ 8 ఐ నిఘా విమానాలు, సీ గార్డియన్ డ్రోన్లను వినియోగిస్తోంది. అయితే హాక్‌ఐ 360 టెక్నాలజీతో భారత్ తన ఎకనామిక్ జోన్ అంతటా నిఘా పెట్టడానికి అవకాశం ఉంటుంది.

వనరులిస్తాం.. ఉగ్రవాదంపై పోరాడండి

వాషింగ్టన్, మే 6: ఉగ్రవాదంపై పోరులో భారతదేశానికి శక్తిని, వనరులను అందిస్తామని అమెరికా కాంగ్రెస్ ప్రతినిధుల సభ స్పీకర్ మైక్ జాన్సన్ ప్రకటించారు. సోమవారం క్యాపిటల్ హిల్‌లో ఆయన మాట్లాడుతూ పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిని ఖండించారు. ఉగ్రవాదంపై పోరులో భారత్‌కు అన్ని విధాలా మద్దతును అమెరికా అందిస్తుందని చెప్పారు. 'భారత్‌తో సంబంధాల ప్రాముఖ్యతను ట్రంప్ యంత్రాంగం గుర్తించింది. అలాగే, ఉగ్రవాదం నుంచి పొంచి ఉన్న ముప్పును కూడా ట్రంప్ యంత్రాంగం గుర్తించింది. భారత్‌కు ఇప్పుడు మరింత శక్తిని, వనరులను అందించాల్సిన సమయం ఆసన్నమైంది' అన్నారు.



విమర్శలకూ ఓ హద్దుండాలి

- ప్రధానిని మోసగాడంటే మీరు భరిస్తారా?
- మీరు సీఎంను తిడితే.. మేం మోదీని తిట్టలేమా?
- మేం నోరు విప్పితే మీరు నిలబడగలరా?
- కానీ, ప్రధాని మోదీని మేము గౌరవిస్తాం
- రాహుల్.. మాకు ఆ పద్ధతిని నేర్పించారు
- సత్తా లేనిదే.. ఏకకాలంలో రుణమాఫీ చేశామా?
- హరీశ్ పుణ్యమా అని గెలిచినవ్.. మళ్లీ గెలవలేవు
- బీజేపీ ఎంపీ రఘునందన్‌పై తూర్పు జగ్గారెడ్డి ధ్వజం

హైదరాబాద్, మే 6 (ఆంధ్రజ్యోతి): "మా సీఎం రేవంత్‌రెడ్డిని నువ్వు తిడితే.. మీ ప్రధాని మోదీని మేము తిట్టలేమా? ప్రధానిని పట్టుకుని మోసగాళ్లకు మోసగాడని మేమంటే మీరు భరిస్తారా? విమర్శలకూ ఓ హద్దుండాలి. బూతులు మాట్లాడితే ఎట్లా? మేం నోరు విప్పితే మీరు నిలబడగలరా?" అని బీజేపీ ఎంపీ రఘునందన్‌ను ఉద్దేశించి టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు తూర్పు జగ్గారెడ్డి ధ్వజమెత్తారు. సీఎల్పీ ఆవరణలో మంగళవారంఆయన మీడియాతో మాట్లాడారు. ప్రధాని మోదీని ఉద్దేశించి తాము మాట్లాడే పరిస్థితి తీసుకొచ్చింది రఘునందన్ రావేనని మండిపడ్డారు. సీఎం రేవంత్‌రెడ్డి సత్తా గురించి ఆయన మాట్లాడుతున్నారని, సత్తా లేనిదే ఏకకాలంలో రైతులకు రూ. 22 వేల కోట్ల మేర రుణమాఫీ చేశారా? అని ప్రశ్నించారు. సత్తా లేకుండానే ఏడాదిలో 55 వేల ఉద్యోగాలు భర్తీ చేశారా?.. మహిళలకు ఉచిత బస్సు పథకం అమలు చేశారా? అని నిలదీశారు. ప్రతి పేదవాడి బ్యాంకు ఖాతాలో రూ.15 లక్షల చొప్పున వేస్తామంటూ గతంలో మోదీ హామీ ఇచ్చారని, దాన్ని ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నించారు. ఏటా 2 కోట్ల ఉద్యోగాలు భర్తీ చేస్తామన్నారని, ఈ 11 ఏళ్ల పాలనలో 22 కోట్ల ఉద్యోగాలు ఎవరికి ఇచ్చారో చెప్పాలని అన్నారు. ఈ అంశాలను ప్రస్తావిస్తూ మోసగాళ్లకు మోసగాడు మోదీ అంటే రఘునందన్ తట్టుకోగలరా? అని నిలదీశారు. కానీ, తాము ప్రధాని మోదీని గౌరవిస్తామని, తమ నాయకుడు రాహుల్‌గాంధీ తమకు నేర్పిన పద్ధతి అదని వ్యాఖ్యానించారు. తెలంగాణలో బీజేపీకి దిక్కే లేదన్నారు. ఏదో హరీశ్‌రావు పుణ్యమా అని రఘునందన్‌రావు గెలిచాడని, మళ్లీ గెలిచేదీ లేదని అన్నారు. పదేళ్ల పాటు బీజేపీ, బీఆర్ఎస్ కలిసి సంసారం చేశాయని, కేసీఆర్ సర్కారుకు అప్పులు ఇప్పించిందే కేంద్రంలోని బీజేపీ అని ఆరోపించారు. నాలుకలు చీరడం కేటీఆర్ వల్ల కాదని, సినిమా స్క్రిప్టును ఆయన చదువుతున్నారని ఎద్దేవా చేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సురేఖ, చిత్రంలో మంత్రి దుద్దిళ్ల

15 నుంచి సరస్వతి పుష్కరాలు

- ఏర్పాట్లపై మంత్రులు కొండా సురేఖ, శ్రీధర్‌బాబు సమీక్ష
- సీఎం రేవంత్‌రెడ్డికి మంత్రి సురేఖ ఆహ్వానం

హైదరాబాద్, మే 6 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి జిల్లా కాళేశ్వరం త్రివేణి సంగమం వద్ద 'అంతర్వాహిని'గా ప్రవహించే సరస్వతి నది పుష్కరాల నిర్వహణకు పటిష్ఠ ఏర్పాట్లు చేయాలని అధికారులను మంత్రులు కొండా సురేఖ, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఆదేశించారు. ఈ నెల 15 నుంచి ప్రారంభమయ్యే పుష్కరాలపై మంగళవారం సచివాలయంలో ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ నెల 14 రాత్రి 10.35 గంటలకు మిధున రాశిలోకి బృహస్పతి ప్రవేశించడంతో పుష్కర కాలం ప్రారంభమవుతున్నందున.. అప్పటికే ఏర్పాట్లు పూర్తి కావాలని అధికారులను ఆదేశించారు. ఈ నెల 15 ఉదయం నుంచి నుంచి 12 రోజుల వరకూ భక్తులు పుణ్యస్నానాలు చేస్తారని సురేఖ, శ్రీధర్‌బాబు చెప్పారు. భక్తులకు పుష్కర ఏర్పాట్ల సమగ్ర సమాచారం తెలిపేందుకు ప్రారంభించి సరస్వతి పుష్కరాల వెబ్ పోర్టల్, మొబైల్ యాప్‌ల్లో పూర్తి వివరాలు అందజేయాలని తెలిపారు. ఎండ తీవ్రత దృష్ట్యా భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా పెద్ద ఎత్తున చలువ పందిళ్లు, టెంట్లు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. భక్తుల రద్దీకి తగినట్లు రాష్ట్రంలోని కీలక ప్రాంతాల నుంచి కాళేశ్వరానికి బస్సులు నడపాలని ఆర్టీసీ అధికారులకు కొండా సురేఖ, శ్రీధర్‌బాబు సూచించారు. ఈ నెల 15, 16 తేదీల్లో మెదక్‌లోని రంగంపేట శ్రీగురుమదనానంద సరస్వతి స్వాములు పుష్కరాలను ప్రారంభిస్తారని తెలిపారు. సరస్వతి పుష్కరాల సమయంలో రోజుకో పీఠాధిపతి పుష్కర స్నానం చేస్తారన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు, డీజీపీ జితేందర్, దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజారామయ్యర్, ఆర్అండ్‌బీ శాఖ ముఖ్య కార్యదర్శి వికాస్ రాజ్, సెర్ప్ సీఈఓ దివ్యా దేవరాజన్, దేవాదాయ శాఖ డైరెక్టర్ వెంకటరావు, అడిషనల్ కమిషనర్ కృష్ణవేణి, భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తదితరులు పాల్గొన్నారు. కాగా, ఈ నెల 15న ప్రారంభమయ్యే సరస్వతి నది పుష్కరాలకు రావాలని సీఎం రేవంత్‌రెడ్డిని మంత్రి కొండా సురేఖ ఆహ్వానించారు. జుబ్లీహిల్స్‌లోని సీఎం నివాసానికి వెళ్లి రేవంత్‌రెడ్డికి ఆహ్వాన పత్రిక అందజేశారు. అక్కడే ఉన్న మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, ఏఐసీసీ కార్యదర్శి విష్ణునాథ్‌లకూ ఆహ్వాన పత్రికలు అందించారు.

లక్ష సౌర పంపు సెట్లు కేటాయించండి

- పీఎం కుసుమ్ కింద 2 లక్షల పంపు సెట్లు ఇవ్వండి
- కేంద్ర మంత్రికి ఉప ముఖ్యమంత్రి భట్టి వినతి

న్యూఢిల్లీ, మే 6 (ఆంధ్రజ్యోతి): తెలంగాణకు సౌర పంపు సెట్లను భారీగా కేటాయించాలని కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషీని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కోరారు. దేశంలోనే అత్యంత వేగంగా పురోగవిస్తూ, అన్ని రంగాల్లో సత్తా చాటుతున్న రాష్ట్రానికి సహకరించాలని కోరారు. మంగళవారం ఢిల్లీలో కేంద్ర మంత్రిని ఆయన నివాసంలో కలిసిన భట్టి.. మూడు వినతిపత్రాలు సమర్పించారు. కేంద్ర నూతన, పునరుత్పాదక ఇంధన వనరుల శాఖ (ఎంఎన్ఆర్ఈ) ముందే నిర్ణయించినట్లుగా పీఎం కుసుమ్ కాంపొనెంట్(ఎ) కింద 500 కిలోవాట్ల నుంచి 2 మెగావాట్ల సామర్థ్యం కలిగిన మొత్తం 4 వేల మెగావాట్ల సౌర విద్యుత్తు ప్లాంట్లను రాష్ట్రానికి కేటాయించాలని కేంద్ర మంత్రిని కోరారు. ఎంఎన్ఆర్ఈ ఈవోఐ పీరియడ్ ప్రకారం పునఃసమీక్ష అనంతరం కేటాయింపులను 4000 నుంచి 1000 మెగావాట్లకు తగ్గించి ఇవ్వాలని సమాచారం అందిందని కేంద్రమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. దీనివల్ల రాష్ట్రం నిర్ధారించుకున్న లక్ష్యాలపై తీవ్ర ప్రభావం పడే ప్రమాదముందని చెప్పారు. పునరుత్పాదక ఇంధన రంగంలో తెలంగాణ సాధిస్తున్న ఫలితాలను దృష్టిలో పెట్టుకుని కేటాయింపులు చేయాలని విజ్ఞప్తి చేశారు. సాగునీటి కల్పనకు శాశ్వత పరిష్కారంగా సౌర పంపు సెట్లు ఏర్పాటు చేయాలని రాష్ట్రం భావిస్తోందని, ఈ నేపథ్యంలో పీఎం కుసుమ్ కాంపొనెంట్(బి) కింద లక్ష సౌర పంపు సెట్లను కేటాయించాలని కేంద్ర మంత్రిని కోరారు. ఇప్పటికే ఈ ప్రాజెక్టుకు సంబంధించిన డీపీఆర్‌ను టీజీ రెడ్‌కో ద్వారా కేంద్ర ప్రభుత్వానికి సమర్పించామని తెలిపారు. రాష్ట్ర వాటా నిధులు కేటాయించడానికి సిద్ధంగా ఉన్నట్లు వివరించారు. గిరిజనుల సాగు భూముల్లో విద్యుత్తు లైన్ల స్థాపనకు అటవీ చట్టాల నుంచి ఆటంకం లేకుండా సహకరించాలని కోరారు. పీఎం కుసుమ్ కాంపొనెంట్(సి) కింద తెలంగాణకు రెండు లక్షల పంపు సెట్లను కేటాయించాలని భట్టి కోరారు.

సహోద్యోగి నుంచి లంచం డిమాండ్

- రూ.25 వేలు తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన ఇద్దరు ములుగు జడ్పీ ఉద్యోగులు



పట్టుబడిన ఉద్యోగులు సుధాకర్, సౌమ్యారెడ్డి

ములుగు, మే 6 (ఆంధ్రజ్యోతి): ములుగు జడ్పీ సీఈఓ కార్యాలయంలో సహోద్యోగిగా పని చేస్తున్న జూనియర్ అసిస్టెంట్ మెడికల్ లీవ్ సెటిల్‌మెంట్‌కూ లంచం డిమాండ్ చేసిన ఇద్దరు జడ్పీ ఉద్యోగులు ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. జడ్పీ సీఈఓ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న నేరళ్లపల్లి వెంకటేశ్వర్లు.. 2023-24లో అనారోగ్యంతో పలుమార్లు మెడికల్ లీవ్ పెట్టారు. గత జనవరి నుంచి రెగ్యులర్‌గా విధులకు హాజరవుతున్న వెంకటేశ్వర్లు.. తన మెడికల్ లీవ్స్ సెటిల్‌మెంట్ రికార్డును ట్రెజరీకి పంపాలని జడ్పీ సూపరింటెండెంట్ గాధగోని సుధాకర్, ఎస్టాబ్లిష్‌మెంట్ సెక్షన్ జూనియర్ అసిస్టెంట్ సౌమ్యారెడ్డిలను కోరారు. అందుకు రూ.60 వేలు ఇవ్వాలని సుధాకర్, సౌమ్యారెడ్డి డిమాండ్ చేశారు. తొలుత రూ.25 వేలు ఇచ్చి.. మిగతా సొమ్ము బిల్లులు క్రెడిట్ అయ్యాక ఇవ్వాలని ప్రతిపాదించారు. దీంతో వెంకటేశ్వర్లు.. ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. వారి సూచన మేరకు మంగళవారం సుధాకర్, సౌమ్యారెడ్డి అడిగిన రూ.25 వేల నగదు ఇవ్వడానికి ఆఫీసుకెళ్లాడు. సౌమ్యారెడ్డి సూచన మేరకు ఆ డబ్బును సుధాకర్‌కు ఇస్తుండగా.. సుధాకర్, సౌమ్యారెడ్డిలను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నట్లు ఏసీబీ డీఎస్పీ సాంబయ్య తెలిపారు.

ఉద్యోగుల సమస్యలపై కమిటీ

నవీన్ మిత్తల్ నేతృత్వంలో ఏర్పాటు చేసిన ప్రభుత్వం

- ఉద్యోగసంఘాలతో చర్చించి సిఫారసులతో వారంలోగా నివేదిక ఇవ్వాలని ఆదేశం
- నేడు ఉద్యోగ సంఘాలతో కమిటీ భేటీ



కమిటీ చైర్మన్ నవీన్ మిత్తల్‌ను కలిసిన ఉద్యోగుల జేఏసీ ప్రతినిధులు మారం జగదీశ్వర్ తదితరులు

హైదరాబాద్, మే 6 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికిగాను సర్కారు కీలక నిర్ణయం తీసుకుంది. ఉద్యోగుల సమస్యలు, సంక్షేమంపై చర్చించేందుకు ఉన్నతస్థాయి అధికారులతో కమిటీని ఏర్పాటు చేసింది. రెవెన్యూ శాఖ ముఖ్యకార్యదర్శి నవీన్ మిత్తల్ చైర్మన్‌గా, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కార్యదర్శి లోకేశ్‌కుమార్, ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్క ప్రత్యేక కార్యదర్శి కృష్ణభాస్కర్ సభ్యులుగా అధికారుల కమిటీని ఏర్పాటు చేసింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు మంగళవారం ఉత్తర్వులు (జీవో 572) జారీ చేశారు. అన్ని విభాగాల ఉద్యోగ సంఘాల నాయకులతో చర్చించి.. వారి సమస్యలను ప్రభుత్వానికి నివేదించేలా ఈ కమిటీకి ప్రభుత్వం బాధ్యతలు అప్పగించింది. ఆదేశాలిచ్చిన రోజు నుంచి వారం వ్యవధిలో నివేదికను ప్రభుత్వానికి అందించాలని పేర్కొంది. ప్రభుత్వ పథకాల అమలులో ఉద్యోగుల పాత్ర కీలకమని, పెండింగ్ సమస్యలపై ఇప్పటికే పలు ప్రతిపాదనలు ఉన్నందున వాటితోపాటు ఉద్యోగుల సంక్షేమంపై చర్చించి, తగిన సిఫారసులు చేసేందుకు కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపింది. కాగా, అధికారుల కమిటీ.. గుర్తింపు పొందిన ఉద్యోగ సంఘాల ప్రతినిధులతో ఉద్యోగుల సమస్యలు, సంక్షేమంపై చర్చించనుంది. ఉద్యోగులు లేవనెత్తిన సమస్యలపై ప్రభుత్వానికి నివేదిక ఇవ్వనుంది.

నేడు ఉద్యోగుల జేఏసీతో సమావేశం

ప్రభుత్వం అధికారుల కమిటీని ఏర్పాటు చేయడాన్ని స్వాగతిస్తున్నామని ఉద్యోగుల జేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి ఏలూరి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం వారు కమిటీ చైర్మన్ నవీన్ మిత్తల్‌ను కలిసి ఉద్యోగ సమస్యలను వివరించారు. పూర్తిస్థాయిలో చర్చించేందుకు సచివాలయంలో బుధవారం సాయంత్రం 4 గంటలకు సమావేశం కావాలని నిర్ణయించారు. ఉద్యోగుల జేఏసీ తరఫున సమావేశంలో పాల్గొనే ప్రతినిధుల వివరాలను మిత్తల్‌కు అందజేశారు. జేఏసీ నుంచి అధ్యక్ష, కార్యదర్శులతోపాటు వివిధ సంఘాల ప్రతినిధులు 15 మంది హాజరవుతున్నట్లు తెలిపారు. కాగా, ప్రభుత్వం అధికారుల కమిటీని నియమించడంపై సీఎం రేవంత్‌రెడ్డికి ఉద్యోగుల మరో జేఏసీ చైర్మన్ వి.లచ్చిరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ఉద్యోగుల సమస్యలపై చర్చించేందుకు బుధవారం సాయంత్రం 5 గంటలకు తమ జేఏసీ ప్రతినిధులతో అధికారుల కమిటీ సమావేశం కానుందని లచ్చిరెడ్డి తెలిపారు. ఉద్యోగుల సమస్యలను కమిటీ దృష్టికి తీసుకెళ్లి.. త్వరగా పరిష్కారమయ్యేలా కృషి చేస్తామన్నారు.

సమ్మె వాయిదా

(మొదటి పేజీ తరువాయి)

స్పందించింది. ఈ మేరకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు నేతృత్వంలో ఆర్టీసీ జేఏసీ నేతలు మంత్రి పొన్నంతో సచివాలయంలో మంగళవారం సమావేశమయ్యారు. ఎమ్మెల్సీ కోదండరాం తదితరుల సమక్షంలో జరిగిన ఈ సమావేశంలో కార్మికుల సమస్యలు, డిమాండ్లపై చర్చించారు. సుదీర్ఘంగా సాగిన ఈ చర్చల్లో తమ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం నుంచి సానుకూల నిర్ణయం రావడంతో సమ్మెను వాయిదా వేస్తున్నట్లు జేఏసీ నేతలు ప్రకటించారు. మంత్రితో చర్చల అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ.. ఆర్టీసీ ఉద్యోగుల్ని ప్రభుత్వంలో విలీనం చేసే అంశంపై మంత్రి సానుకూలంగా స్పందించారని తెలిపారు. అయితే సమస్యల పరిష్కారానికి కొంత సమయం అవసరమవుతుందని, సీఎం రేవంత్‌రెడ్డితో మాట్లాడి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని చెప్పారు. సింగరేణి కాలరీస్ తరహాలో ఆర్టీసీ కార్మికులకు రెగ్యులర్ టైమ్ స్కేల్ ఇచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారని పేర్కొన్నారు. విద్యుత్తు బస్సుల్ని ఆర్టీసీకి సబ్సిడీపై నేరుగా ఇచ్చేందుకు కేంద్ర ప్రభుత్వానికి నోట్ పంపించారని తెలిపారు. దీంతోపాటు 2019 సమ్మె కాలంలో నమోదు చేసిన కేసుల ఎత్తివేతకు పోలీస్ శాఖకు ఆదేశాలు జారీ చేసేందుకు మంత్రి సానుకూలంగా స్పందించారని జేఏసీ నేతలు వెల్లడించారు. ముఖ్యమంత్రిపై, మంత్రిపై నమ్మకం ఉంచి సమ్మెను తాత్కాలికంగా వాయిదా వేస్తున్నామని అన్నారు. అంతేకాకుండా.. ప్రస్తుతం దేశంలో నెలకొన్న పరిస్థితుల దృష్ట్యా కూడా ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. హామీ మేరకు సమస్యల్ని పరిష్కరించకపోతే మరోసారి సమ్మెకు వెళ్తామని మంత్రికి స్పష్టం చేశామని తెలిపారు.

సీఎంతో మాట్లాడి సమస్యల పరిష్కారం..

ఆర్టీసీ సమస్యలపై సీఎం రేవంత్‌రెడ్డితో మాట్లాడి, క్యాబినెట్‌లో చర్చించి నిర్ణయం తీసుకుంటామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. జేఏసీ నేతలతో చర్చల అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. గత పదేళ్లుగా పరిస్కారానికి నోచుకోని ఎన్నో సమస్యలను తమ ప్రభుత్వం పరిష్కరించిందని తెలిపారు. కొత్త బస్సుల కొనుగోలు చేపట్టామని, ఖాళీల భర్తీకి త్వరలో నోటిఫికేషన్ జారీ చేస్తున్నామని చెప్పారు. ఆర్టీసీ కార్మికుల సమస్యల్ని ప్రభుత్వం దృష్టికి తెచ్చేందుకు పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి, శాట్ చైర్మన్ శివసేనారెడ్డి తదితరులు చొరవ తీసుకున్నారని మంత్రి పేర్కొన్నారు. కాగా, ఆర్టీసీలో నెలకొన్న సమస్యల్ని జూన్ 2వ తేదీలోగా పరిష్కరించకపోతే దశలవారీగా ఆందోళనలు చేపడతామని టీఎంయూ చైర్మన్ అశ్వత్థామరెడ్డి తెలిపారు. అన్ని సంఘాలు, కార్మికుల మద్దతు కూడగట్టి సమస్యల పరిష్కారానికి ఆందోళనలు చేపడతామన్నారు. అవసరమైతే సమ్మె చేపట్టేందుకు వెనకాడబోమన్నారు. ప్రస్తుత జేఏసీ సమ్మెకు పిలుపునిచ్చి ఏం సాధించిందని ప్రశ్నించారు.

ప్రేమ పేరిట ఇంటర్ విద్యార్థి వేధింపులు..

తొమ్మిదో తరగతి బాలిక ఆత్మహత్య!

హయత్‌నగర్, మే 6 (ఆంధ్రజ్యోతి): ప్రేమ పేరిట ఓ ఇంటర్ విద్యార్థి చేస్తున్న వేధింపులు తాళలేక ఓ తొమ్మిదో తరగతి విద్యార్థిని ఆత్మహత్య చేసుకుంది. తన ఇంట్లోనే ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. హైదరాబాద్, హయత్‌నగర్‌లో ఈ ఘటన జరగ్గా.. సదరు ఇంటర్ విద్యార్థితోపాటు అతడి తమ్ముడిపై చర్యలు తీసుకోవాలని బాధిత కుటుంబం పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు, బాలిక తండ్రి కథనం ప్రకారం.. నల్లగొండ జిల్లాకు చెందిన కనిగిరి విజయ్ హయత్‌నగర్‌లోని ఓ కాలనీలో పదేళ్లుగా కిరాణా దుకాణం నిర్వహిస్తున్నాడు. స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న విజయ్ రెండో కుమార్తె మీనాక్షి(14)ని తమ కాలనీకే చెందిన ఇంటర్ ఫస్టియర్ విద్యార్థి పానుబోతు రోహిత్ (19) ఆరు నెలలుగా ప్రేమ పేరిట వేధిస్తున్నాడు. మీనాక్షి ద్వారా విషయం తెలుసుకున్న విజయ్.. రోహిత్ కుటుంబాన్ని కలిసి వారికి ఫిర్యాదు చేశాడు. అయితే, రోహిత్ తన తమ్ముడు నూతన్ ఇన్‌స్టాగ్రామ్ ఖాతా నుంచి మీనాక్షికి శనివారం ప్రేమ సందేశాలు పంపాడు. ఈ విషయం తెలిసి ఇదేమని ప్రశ్నించగా.. రోహిత్ తండ్రి నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడంతో విజయ్ ఆదివారం హయత్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అయితే, బావమరది మరణించడంతో విజయ్, తన భార్యతో కలిసి సోమవారం ఉదయం మహబూబ్‌నగర్ జిల్లా మానాజీపేట్ వెళ్లి రాత్రి 11 గంటలకు తిరిగి ఇంటికి చేరుకున్నాడు. సోమవారం సాయంత్రం రోహిత్ ఇంటికి వచ్చి ప్రేమించాలని తనని బెదిరించాడని మీనాక్షి తల్లిదండ్రులకు చెప్పి కంటతడి పెట్టుకుంది. ఉదయాన్నే మాట్లాడదామని విజయ్ నచ్చచెప్పగా అందరూ నిద్రించారు. అయితే, విజయ్ భార్య మంగళవారం ఉదయం నిద్ర లేచి చూసేసరికి మీనాక్షి.. ఇంట్లో ఉరి వేసుకుని కనిపించింది. రోహిత్ వేధింపుల వల్లే తన కుమార్తె ఆత్మహత్య చేసుకుందని, రోహిత్, అతని సోదరుడు నూతన్‌పై చర్యలు తీసుకోవాలని విజయ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. మీనాక్షి మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించిన పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

క్లిష్టంగా మారిన కర్రెగుట్టలు

వర్షాలతో మళ్లీ దట్టంగా అడవి.. గుట్టల మధ్యన చిత్తడి నేలలు

- 250 బాంబులను నిర్వీర్యం చేసిన బలగాలు



ఇటీవలి వర్షాలతో చిగురించిన కర్రెగుట్టల్లోని అడవులు

చర్ల/దుమ్ముగూడెం/కొత్తగూడెం, మే 6 (ఆంధ్రజ్యోతి): ఎండాకాలం.. ఆకులు రాలి.. కర్రెగుట్టల్లో నక్కిన మావోయిస్టులను గుర్తించాలనే పోలీసుల ఆలోచనలకు అకాల వర్షాలు అడ్డంకిగా మారాయి. మొన్నటి వరకు ఉక్కబోతతో మండే కొలిమిని తలపించిన కర్రెగుట్టలు.. రెండు వర్షాలకే మళ్లీ పచ్చటి, దట్టమైన అడవిగా.. గంభీరంగా మారిపోయాయి. వాగులు, వంకలు పొంగిపొర్లుతుండగా.. గుట్టల పైనుంచి జలపాతాల్లోంచి నీళ్లు జాలువారుతున్నాయి. వర్షాల కారణంగా గుట్టల మధ్య దారులు చిత్తడిగా మారిపోయాయి. మధ్యాహ్నం 2 గంటల సమయానికే చీకటిపడుతూ.. ఆపరేషన్‌లో ఉన్న జవాన్లకు ఇబ్బందిగా మారుతోంది. పైగా.. చిత్తడి దారుల్లో విష కీటకాలతో ప్రమాదం పొంచి ఉంది. దీంతో.. 'ఆపరేషన్ కర్రెగుట్టలు' బలగాల పాలిట మరింత కఠినంగా మారాయి. మావోయిస్టుల గాలింపు క్లిష్టంగా మారుతోంది. అటు మావోయిస్టులు తెలంగాణలోని పూసుగుప్ప వైపు వచ్చినట్లు కేంద్ర బలగాలు అనుమానిస్తూ.. ఆ ప్రాంతాన్ని చుట్టుముట్టాయి.

అడుగడుగునా ప్రమాదం?

మావోయిస్టులు కర్రెగుట్టల నుంచి వెళ్లే ముందు ఎక్కడికక్కడ మందుపాతరలు, ప్రెజర్ బాంబులను అమర్చారు. డ్రోన్ కెమెరాలకు మావోయిస్టుల కదలికలు చిక్కినా.. ఆ ప్రాంతాలకు బలగాలు చేరుకోవడం కత్తిమీద సాముగా మారుతోంది. మంగళవారం ఒక్కరోజే జవాన్లు 250 బాంబులను గుర్తించి, నిర్వీర్యం చేశారు. ఈ క్రమంలో రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారి ఒకరు ఓ జవాన్‌ను కాపాడబోయి.. ప్రెజర్ బాంబుపై కాలు వేశారు. ఈ ఘటనలో ఆ అధికారి కాలు తెగిపడినట్లు సమాచారం. మంగళవారం బలగాలకు మావోయిస్టులు తారసపడగా.. ఇరువైపులా భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. ఘటనాస్థలి నుంచి ఓ మహిళా నక్సలైట్ మృతదేహం, 303-రైఫిల్‌ను స్వాధీనం చేసుకున్నట్లు బస్తర్ రేంజ్ ఐజీ సుందర్‌రాజ్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ ఎన్‌కౌంటర్‌లో చాలా మంది నక్సల్స్ మృతిచెంది ఉంటారని ఆ ప్రెస్‌నోట్‌లో అనుమానం వ్యక్తం చేశారు. మృతుల్లో మావోయిస్టు పార్టీ ముఖ్య నాయకులు కూడా ఉండి ఉంటారని అభిప్రాయపడ్డారు. ఇప్పటి వరకు నలుగురు మహిళా నక్సలైట్లు చనిపోయారని, వందల సంఖ్యలో మావోయిస్టుల స్థావరాలు, బంకర్లను ధ్వంసం చేశామన్నారు. కాగా, ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లా తర్లగూడెం పంచాయతీ ఉపసర్పంచ్ ముచకి రామను మావోయిస్టులు హత్య చేశారు.

14 మంది లొంగుబాటు

తెలంగాణ పోలీసులు చేపట్టిన 'ఆపరేషన్ చేయూత'కు భారీ స్పందన వస్తోందని భద్రాద్రి-కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్‌రాజ్ అన్నారు. మంగళవారం 14 మంది మావోయిస్టులు ఆయన ఎదుట లొంగిపోయారు. వీరిలో ముగ్గురు మహిళా నక్సలైట్లు ఉన్నారు. తెలంగాణ పోలీసులు 'ఆపరేషన్ చేయూత'ను ప్రకటించినప్పటి నుంచి 227 మంది మావోయిస్టులు లొంగిపోయినట్లు వివరించారు.

పూసుగుప్పలో నక్సల్స్?

మావోయిస్టుల్లో కొందరు తెలంగాణలోని భద్రాద్రి-కొత్తగూడెం జిల్లా చర్ల మండల పరిధిలోని పూసుగుప్ప వైపు వచ్చినట్లు కేంద్ర బలగాలు అనుమానిస్తున్నాయి. దీంతో.. ములుగు, వెంకటాపురం వైపు నుంచి 'ఆపరేషన్ కర్రెగుట్టలు'లో పాలుపంచుకుంటున్న సుమారు వెయ్యి మంది జవాన్లు మంగళవారం రాత్రికి పూసుగుప్పను చుట్టు ముట్టినట్లు తెలిసింది. అర్ధరాత్రి ఈ ప్రాంతంలో ఎన్‌కౌంటర్ జరగవచ్చని స్థానికులు భయభ్రాంతులకు గురవుతున్నారు.



ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

ఆగని మానవహననం

గాజాపట్టీ మొత్తాన్ని ఆక్రమించుకొని, ఐక్యరాజ్యసమితి, తదితర స్వచ్ఛంద సంస్థల అధీనంలో ఉన్న ఆహారసరఫరాలను తన గుప్పిట్లోకి తెచ్చుకోవాలని ఇజ్రాయెల్ నిర్ణయించుకుంది. అదనంగా ముప్పైవేలమంది సైనికబలగాలు, మారణాయుధాలతో సాగబోయే ఈ కొత్త ఊచకోత ఇంకెంతమందిని బలితీసుకుంటుందో తెలియదు కానీ, ఆకలిని ఆయుధంగా వాడి నిరవధిక యుద్ధం చేయబోతున్నామన్నది నెతన్యాహూ ప్రసంగం సారాంశం. ఇప్పటికే రెండునెలలుగా నిలిచిపోయిన ఆహారసరఫరాలతో ఆఫ్రికాదేశాల తరహా ఆకలి సమస్యను ఎదుర్కొంటున్న ఈ దురదృష్టకర గడ్డపై, సమీపకాలంలోనే మరిన్ని భయానకమైన దృశ్యాలను చూడబోతున్నాం.

హమాస్‌ను పూర్తిగా తుదముట్టించడం, దానివద్ద బందీలుగా మిగిలిపోయినవారిని విడిపించుకోవడం వంటి అవే పాతలక్ష్యాలతో ఇజ్రాయెల్ ఈ కొత్తప్రణాళిక అమలు చేయబోతోంది. హమాస్‌మీద ఇంత యుద్ధం చేసినా, అది ఒప్పందంలో భాగంగా తనకు తానుగా బందీలను అప్పగించడం వినా, ఇజ్రాయెల్ సైనికులు ఎవరినీ విడిపించుకున్నదేమీ లేదు. హమాస్ దుంపనాశనం, బందీలను రక్షించుకోవడం అనే లక్ష్యాలు ఇంతవరకూ నెరవేరనేలేదు కానీ, 90శాతం మంది గాజావాసులను నిరాశ్రయులను చేసి, యాభైవేల మందిని ఊచకోతకోయడం మాత్రం జరిగిపోయింది. స్వల్ప విరామం తరువాత ఇప్పుడు మళ్ళీ కొత్త అంకానికి తెరదీసి, గాజాను పూర్తిగా కబ్జా చేసి నిరవధికంగా, నిరంతరాయంగా దశాబ్దాల తరబడి తన అధీనంలో ఉంచుకోవడానికి ఇజ్రాయెల్ ఎత్తులు వేస్తోంది. ట్రంప్ మహాశయుడు వచ్చే వారం పశ్చిమాసియాలో పర్యటించి, బుజ్జగింపులు, హెచ్చరికలతో వాతావరణాన్ని సానుకూలం చేసిపోగానే, పాలస్తీనా భూభాగంలో ఇజ్రాయెల్ ఈ భీకరస్థాయి సైనికచర్య ఆరంభిస్తుంది. గాజామీద పట్టు సాధించి, అత్యధికులను తరిమికొట్టి, ఆయుధాలతో, ఆకలిచావులతో మిగిలినవారిని హతం చేసి, అంతిమంగా ఆ పట్టీని పళ్ళెంలో పెట్టి ట్రంప్‌కు అప్పగించే కార్యక్రమం దిశగా అడుగులు పడుతున్నాయి. గాజాను అత్యద్భుతమైన టూరిస్టు రిసార్టుగా మార్చాలన్న ట్రంప్ కల నెరవేర్చి, ఆయన కళ్ళలో ఆనందాన్ని చూడాలనుకుంటున్నారు ఆప్తమిత్రుడైన నెతన్యాహూ. జనాన్ని దక్షిణ గాజాకు తరలించడం అన్నది మాయమాటే తప్ప, ఒకసారి మానవహననం మొదలైతే పాలస్తీనియన్లు పారిపోక తప్పదు, హద్దులు గీసుకొని కూర్చున్న పొరుగుదేశాల మనసులు కరగకా తప్పదు.

రెండునెలలుగా అంతర్జాతీయ సాయాన్ని పట్టీలోకి ప్రవేశించకుండా అడ్డుతున్న ఇజ్రాయెల్ ఇప్పటికే దయనీయమైన పరిస్థితులకు కారణమైంది. ఆహారసరఫరాలు నిలిచిపోయిన కారణంగా ఒక వ్యక్తికి మూడురోజులకు ఒకసారి మాత్రమే తినడానికి ఏదైనా దొరుకుతోందని వార్తలు వస్తున్నాయి. మూడులక్షలమంది పిల్లలు చావు అంచున ఉన్నారు. ఆహారం, మందులు, ఇంధనం లేకుండా చేయడం ద్వారా పాలస్తీనియన్లను మాడ్చేస్తున్న ఇజ్రాయెల్ ఇకపై ఆకలిచావులను కూడా ఆయుధంగా వాడబోతోంది. జనవరిలో కాల్పుల విరమణ ఒప్పందం అమలులోకి వచ్చినప్పటికీ, ఆహారసరఫరాలు ఇంకా జోరందుకోకముందే ఆ ముచ్చటా ముగిసిపోయింది. కాల్పుల విరమణ ఒప్పందం కొనసాగింపు గురించి హమాస్–ఇజ్రాయెల్ మరో ఇరవై నాలుగు గంటల్లో ఒక నిర్ణయానికి రావాల్సి ఉండగా, ఇజ్రాయెల్ మార్చి 18 తెల్లవారు జామున గాజామీద విరుచుకుపడి ఐదువందలమందిని ఊచకోతకోసింది. ఈ ఘటనలో వందలాదిమంది తీవ్రంగా గాయపడ్డారు. ఎఫ్–16, ఎఫ్–35 వంటి యుద్ధవిమానాలతో పాటు, హెలికాప్టర్లు, డ్రోన్లు కూడా ఆకాశంనుంచి అమాయకజనంమీద నిప్పులు కురిపించాయి. పరుగులు తీస్తున్నవారిని సైతం ఇజ్రాయెల్ సైనికులు కాల్చిపారేశారు. గాజా యుద్ధంలో ఒకేరోజున అత్యధికసంఖ్యలో జనహననం జరిగిన సందర్భం అది. కాల్పుల విరమణ అమలైన ఆ స్వల్పకాలంలో గాజాకు తిరిగివచ్చిన పాలస్తీనియన్ల సంఖ్య ఓ ఐదు లక్షలవరకూ ఉంది. వారిని భయోత్పాతంలో ముంచెత్తి, వెనక్కు పంపివేసి, గాజాను ఖాళీచేయించే ప్రయత్నాలు అప్పటినుంచే మొదలైనాయి. స్వస్థలాన్ని వీడిపోవడానికి ససేమిరా అంటున్న మిగతా పాలస్తీనియన్లమీద ఒత్తిడిపెంచేందుకు ఇప్పుడు ఇజ్రాయెల్ మరో దమనకాండకు ఉపక్రమిస్తోంది. ఈ కొత్త యుద్ధం హమాస్ చేతుల్లో ఉన్న బందీలను విడిపించేందుకు వీసమెత్తు ఉపకరించదని నెతన్యాహూకు తెలుసు. కానీ, ఆ పేరిట గాజాలో ఊహకు అందనంత విధ్వంసానికి పాల్పడి, అంతిమంగా రిసార్టు కల నెరవేర్చుకోవడం అమెరికా–ఇజ్రాయెల్ పాలకులకు ముఖ్యం.

'ప్రభుత్వ' విద్యార్థి భవిష్యత్తుకు భరోసా కావాలి

ప్రభుత్వ బడుల పనితీరుపై ఈ మధ్యకాలంలో సీఎం నుంచి సామాన్య పౌరుడి వరకు చాలా విస్తృతంగా చర్చ నడుస్తోంది. ఇదొక శుభపరిణామం. ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివించాలని కొందరు డిమాండ్ చేస్తుండగా.. ఐఏఎస్ ఐపీఎస్ అధికారులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు వారి పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపితే తాము కూడా తమ పిల్లలను పంపేందుకు సిద్ధమన్నది ఆయా ఉపాధ్యాయులు చెప్పే మాట. ప్రభుత్వ విద్యలో నాణ్యతా ప్రమాణాలు, విద్యార్థుల సంఖ్యను పెంచడానికి చేపట్టాల్సిన చర్యల కోసం ఇటీవల ఉపాధ్యాయ సంఘాలతో విద్యాశాఖ సమావేశాన్ని ఏర్పాటు చేసింది. ఈ సమావేశం చివరకు వాగ్వివాదాలతో ముగిసింది.

రాజ్యాంగంలోని ఆర్టికల్ 21ఏ ప్రకారం 14 సంవత్సరాల లోపు బాల బాలికలకు అంతరాలు లేని నిర్బంధ ఉచిత విద్యను అందించే బాధ్యత ప్రభుత్వాల విధి. అయినా పేద పిల్లలకు నాణ్యమైన విద్య ఒక అందని ద్రాక్షగానే మిగిలిపోతున్నది. ఈ నేపథ్యంలో, రోజు రోజుకూ సమాజంలో సామాజిక, ఆర్థిక అంతరాలు పెరుగుతున్నాయి. ధనవంతులు మరింత ధనవంతులుగా పేదవారు మరింత పేదవారుగా మారుతున్నారు. ఈ విషవలయాన్ని ఛేదించేది ఒక్క చదువు మాత్రమేనని డా. బీఆర్ అంబేడ్కర్ చెప్పారు.



ప్రభుత్వం ఎంత ఖర్చు పెట్టినా ఫలితాలు మాత్రం ఆశించిన స్థాయిలో ఉండడం లేదు. ఒకప్పుడు దాదాపు తొంభై ఐదు శాతానికి పైగా విద్యార్థులకు విద్యనందించిన ప్రభుత్వ పాఠశాలలు నేడు విద్యార్థులు లేక వెలవెలబోతున్నాయి. ప్రైవేటు పాఠశాలల్లో 2014–15లో 57.19 శాతం మంది విద్యార్థులు ఉండగా 2024–25 నాటికి 73.50 శాతానికి పెరిగింది. ప్రభుత్వ పాఠశాలల్లో మాత్రం 42.81 శాతం నుంచి 26.50 శాతానికి పడిపోయింది. ఇప్పటికే ప్రభుత్వ పాఠశాలల్లో తగినంత విద్యార్థుల సంఖ్య లేదని చెబుతూ 2009, 2011, 2015 సంవత్సరాల్లో రేషనలైజేషన్ పేరుతో వేలాది గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలను మూసివేశారు.

2020 జాతీయ విద్యావిధానం ప్రకారం విద్యార్థి, ఉపాధ్యాయుల నిష్పత్తి 35:1గా ఉండాలి. కానీ దేశంలోనే అత్యంత కనిష్ఠంగా మన యూపీఎస్ పాఠశాలల్లో ఈ నిష్పత్తి 13:1 ఉండగా ఉన్నత పాఠశాలల్లో 9:1గా ఉంది. అయినా మరో డీఎస్సీ నిర్వహణ ప్రభుత్వ పరిశీలనలో ఉంది!

ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లు పెంచడానికి బడిబాట, మన ఊరు మన బడి, అమ్మ ఆదర్శ పాఠశాల లాంటి కార్యక్రమాలు ఎన్ని చేపట్టినా అడ్మిషన్లు తగ్గుతూనే వస్తున్నాయి. అర్హతలేని వ్యక్తులతో బోధన చేయిస్తున్నా, ఫీజులు భారమైనప్పటికీ తక్కువ స్థాయి, మధ్య తరగతి నుంచి సంపన్నవర్గ తల్లిదండ్రుల వరకు తమ పిల్లలను ప్రైవేటు పాఠశాలలకే పంపుతున్నారు. తమ పిల్లలను ఇంటర్మీడియట్ వరకు ప్రైవేటు విద్యాసంస్థల్లో చదివించిన తల్లిదండ్రులు.. వృత్తి విద్యలైన మెడిసిన్, ఇంజనీరింగ్ కోర్సుల్లో మాత్రం ప్రభుత్వ విద్యా సంస్థల్లో అడ్మిషన్ కోసం చూస్తున్నారు. సహజంగానే ప్రైవేటు విద్యా సంస్థల్లో చదివిన విద్యార్థులతో ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదివిన విద్యార్థులు పోటీపడలేక, వృత్తి విద్య కోర్సుల్లో, ఉద్యోగాల్లో అవకాశాలు రావడం లేదు. ఫలితంగా పేదవారు ఉన్నత విద్యకు, ఉపాధికి దూరమవుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం వాస్తవాన్ని గ్రహించాలి.

అడ్మిషన్ల లేమితో ప్రాభవం కోల్పోతున్న ప్రభుత్వ పాఠశాలలకు ఉద్దీపన చర్యలు చేపట్టాలి. ప్రభుత్వ బడిలో చదివే పిల్లలకు కళ్లు చెదిరే రంగులతో ఆధునిక భవనాలు కాదు వృత్తివిద్య ఉద్యోగ భరోసా కావాలి. ఒకటి నుంచి పన్నెండో తరగతి వరకు ప్రభుత్వ విద్యా సంస్థల్లో చదివిన విద్యార్థులకు ప్రభుత్వ వృత్తి విద్యా, ప్రభుత్వ ఉద్యోగాల్లో, స్థానిక సంస్థల ఎన్నికల్లో 50 శాతం ప్రత్యేక రిజర్వేషన్ కోటా కల్పించాలి. ఫలితంగా ప్రభుత్వ పాఠశాలల్లో ఎలాంటి ప్రచారం లేకున్నా ఊహకు అందనన్ని అడ్మిషన్లు పెరుగుతాయి. క్రమంగా పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన, బాధ్యతాయుతమైన బోధన, మూల్యాంకనం జరిగి ఒక నూతన సమాజ నిర్మాణానికి బాటలు ఏర్పడతాయి. రాజకీయ పార్టీల మేనిఫెస్టోల్లో ప్రధాన అంశంగా చోటు దక్కి, ప్రభుత్వ పాఠశాలలకు పూర్వ వైభవం వస్తుంది.

ప్రభుత్వ పాఠశాలలు సమాజ విశ్వాసం కోల్పోతున్న సందర్భంలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వ పాఠశాలలను పటిష్ఠం చేయాలనే ప్రగతిశీల ప్రకటన చేశారు. ఈ నేపథ్యంలో, టీచర్ల నియమకాలతో పాటుగా ప్రభుత్వ బడిలో చదివే పిల్లలకు ప్రభుత్వ వృత్తివిద్య కాలేజీల ప్రవేశాల్లో, ప్రభుత్వ ఉద్యోగాల్లో, స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లు కల్పించే చట్టం చేయడానికి పూనుకోవాలి. అలా కాపాడగలిగితే ప్రభుత్వ విద్యా పరిరక్షణ పితామహుడిగా రేవంత్‌రెడ్డి చరిత్రలో నిలవడం ఖాయం.

• మామిడి నారాయణ
సెంటర్ ఫర్ బెటర్ ఇండియా రీసెర్చ్ ఫౌండేషన్

పాకిస్థాన్‌కు గుణపాఠం ఎలా?



■ ఎ. కృష్ణారావు
ఇండియాగేట్

భారత్, పాకిస్థాన్‌ల మధ్య మరోసారి యుద్ధ మేఘాలు కమ్ముకుంటున్నాయి. ఈ సారి భారతదేశం నిర్ణయాత్మకంగా వ్యవహరిస్తోందని, పాకిస్థాన్‌కు గట్టి బుద్ధి చెప్పి తీరుతుందనే విషయమై స్పష్టమైన సంకేతాలు లభిస్తున్నాయి. దేశ విభజన కాలం నుంచీ పాకిస్థాన్ భారతదేశం పట్ల ఎన్నో దురాగతాలకు పాల్పడింది. మరెన్నోసార్లు భారత్ చేతుల్లో దెబ్బతిన్నది. అయినా ఆ దేశం వైఖరి మారడం లేదు. మత రాజ్యంగా మారడమే పాకిస్థాన్‌కు ప్రాణాంతకంగా మారుతోందా? ఆ దేశ పాలకులు తొలినాటి నుంచీ అనుసరిస్తున్న విధానాలు ఏ గుణపాఠాలు నేర్పుతున్నాయి?

'నీవు కనుక నా స్నేహితుడువి కాకపోతే ఈ పాటికి నేను నిన్ను చంపేసి ఉండేవాడిని..' అని ఒక సాయంత్రం ప్రముఖ ఉర్దూ రచయిత సాదత్ హసన్ మంటోతో ఒక హిందూ మిత్రుడు యథాలాపంగా అన్నాడట. దేశ విభజన సమయంలో భారతదేశంలోనే ఉండిపోవాలని నిర్ణయించిన మంటో ఆ మరుసటి రోజే పాకిస్థాన్ వెళ్లిపోయారు. అక్కడ కూడా పెచ్చరిల్లుతున్న ఉన్మాద పరిస్థితులను, అసహనాన్ని చూసి ఆయన తట్టుకోలేకపోయారు. దేశ విభజనను తీవ్రంగా వ్యతిరేకించిన సాదత్ హసన్ మంటో ఈ విభజనను ఒక బీభత్స విషాదంగా, రాజకీయ సామాజిక ఉన్మాదంగా అభివర్ణించారు. ఈ అర్థరహిత మతోన్మాదాన్ని ఆయన ప్రతీకగా తీసుకుని 'తోబాటేక్ సింగ్' అనే కథను రచించారు. దేశ విభజన వల్ల జరిగిన దుష్పరిణామాలను వివరిస్తూ ఆర్ఎస్ఎస్ మేధావి రాంమాధవ్ కూడా తన పుస్తకం 'The Hindutva Paradigm'లో సాదత్ హసన్ మంటో రచనలను ఉటంకించారు. పాకిస్థాన్ ఒక స్వీయ విచ్ఛిన్నకర శక్తిగా మారే పరిణామం గురించి మంటో ఆనాడే ఊహించారు. 'మీరు పాకిస్థాన్‌కు సైనిక సహాయం చేస్తున్నారంటే మా ముల్లాలను సాయుధం చేస్తున్నారన్నమాట' అని ఆయన 1950లలో 'లెటర్స్ టు అంకుల్ శామ్' పేరిట వరుసగా రాసిన వ్యాసాల్లో వ్యాఖ్యానించారు. సంగీతం, కళలు, సాహిత్యం కవిత్వంపై నిషేధం విధించే రోజులు వస్తాయని ఆయన 'అల్లా దయతో' అన్న శీర్షికతో రాసిన వ్యాసంలో ఆనాడే ఊహించారు. 'మా నాన్న ఊహించినట్లే పాకిస్థాన్‌లో అసహనం తీవ్రంగా పెచ్చరిల్లిపోయింది.. ఎందరో ప్రచురణకర్తలు, జర్నలిస్టులను మతోన్మాదులు హత్య చేశారు..' అని మంటో కుమార్తె నస్రత్ వాపోయారు.

'ఇస్లామిస్టులు వేరు, ముస్లింలు వేరు..' అని ప్రముఖ రచయిత Tarek Fatah ఇలాతారిక్ ఫతే తన 'Chasing a Mirage : The tragic Illusion of an Islamic state' పుస్తకంలో రాశారు. ఇస్లామిస్టులు మతరాజ్యాన్ని కోరుకుంటే, ముస్లింలు ఆధ్యాత్మికతను కోరుకుంటారని ఆయన పేర్కొన్నారు. ముస్లింలు ప్రపంచవ్యాప్తంగా వలస పాలనలో కునారిల్లుతున్న పరిస్థితుల్లో ప్రభవించిన పాకిస్థాన్ ముస్లిం ఉదారవాదులకు, వారిలో ఉన్న సూఫీ తత్వానికి, ప్రజాస్వామ్యానికి, బహుళ మతస్తులకు వేదికగా మారుతుందని అనేక మంది కలలు కన్నారు. అయితే విషాదకరంగా ఆ దేశం ఒక మత రాజ్యంగా మారిపోయింది. భారత్ నడిచిన దారిలో సాగలేదు. భవిష్యత్తులో హిందువులు హిందువులుగా, ముస్లింలు ముస్లింలుగా ఉండరని, మతం వారి వ్యక్తిగత విశ్వాసంగానే ఉన్నప్పటికీ వారు ఈ దేశ పౌరులుగా ఉండిపోతారని ప్రకటించిన పాకిస్థాన్ వ్యవస్థాపకుడు జిన్నా ఆ తర్వాత తన మాటలకు కట్టుబడకుండా తన దేశాన్ని మత రాజ్యంగా మార్చారు. దళితుల రాజకీయ హక్కులకోసం పోరాడుతూ జిన్నాకు సన్నిహితుడైన జోగేంద్రనాథ్ మండల్ దేశ విభజన తర్వాత పాకిస్థాన్ తొలి న్యాయ శాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించారు. 1948లో భారత పాక్ యుద్ధం, మత కల్లోలాల తర్వాత ఆయనకు కీలకమైన ఫైళ్లు ఇవ్వడం నిరాకరించారు. ఇస్లాంను పాకిస్థాన్ అధికార మతంగా ఆ దేశ తొలి ప్రధాని లియాఖత్ అలీఖాన్ ప్రకటించిన తర్వాత మండల్‌పై దూషణలు, దాడులు పెరిగిపోయాయి. 1950 అక్టోబర్‌లో జోగేంద్రనాథ్ మండల్ కలకత్తాకు పారిపోయి రావాల్సి వచ్చింది. పాకిస్థాన్‌లో మైనారిటీలపై జరుగుతున్న దాడులను ఆయన తన రాజీనామా లేఖలో ప్రస్తావించారు.

1965లో దేశాధ్యక్ష పదవిని నిలబెట్టుకునేందుకు ఎన్నికలను రిగ్ చేసి గెలిచిన అయూబ్ ఖాన్ తనపై ప్రజా వ్యతిరేకతను ఎదుర్కొనేందుకు 'ఆపరేషన్ జిబ్రాల్టర్' పేరిట వేలాది పాక్ సైనికులను సివిల్ దుస్తులతో కశ్మీర్‌లోకి పంపారు. ఆపరేషన్ జిబ్రాల్టర్ మాత్రమే కాదు, భారత సరఫరాలను అడ్డుకునేందుకు జమ్మూ–కశ్మీర్‌లో అఖ్నూర్ వంతెనను స్వాధీనం చేసుకునే లక్ష్యంతో నిర్వహించిన ఆపరేషన్ గ్రాండ్ స్లామ్ కూడా విఫలమైంది. అయినప్పటికీ ఆయనను విమర్శించిన వారిని దేశ ద్రోహులుగా చిత్రించారు. పాకిస్థాన్ సంరక్షకుడుగా సుప్రసిద్ధుడైన అయూబ్ ఖాన్ మరో దశాబ్దం పాటు అధికారంలో కొనసాగగలరని చాలా మంది భావించారు. నాలుగేళ్లలోనే ప్రజాగ్రహం ఆయనకు వ్యతిరేకంగా పెల్లుబుకింది. లక్షమందిని నిర్బంధించినా, వందల మందిని హతమార్చినా ఆయన గద్దె దిగాల్సి వచ్చింది. 50లక్షల మంది కశ్మీరీలకోసం పది కోట్ల మంది పాకిస్థానీయుల ప్రాణాలను పణంగా పెట్టలేమని ఆయన చెంపలేసుకున్నారు.

కశ్మీర్‌తో భారత్‌కు పురాతన కాలం నుంచీ ఉన్న అవినాభావ సంబంధం గురించి తెలిసినా పాకిస్థాన్ పాలకులు తమ మనుగడకోసం, రాజకీయాలకోసం మతాన్ని, కశ్మీర్‌ను ఉపయోగించుకుంటూనే ఉన్నారు. భారతదేశాన్ని శత్రువుగా, ముస్లింల వ్యతిరేకిగా చిత్రిస్తూ పబ్బం గడుపుకుంటూనే ఉన్నారు. పాకిస్థాన్‌లో పనిచేసిన అనేకమంది విదేశీ జర్నలిస్టులు ఈ వాస్తవాన్ని తమ వ్యాసాల్లో, పుస్తకాల్లో చిత్రించారు. కశ్మీర్ అనేది పాక్ వ్యూహాత్మక సంస్కృతిపై ఆధిపత్యం చలాయిస్తోందని 'ద టైమ్స్' విలేఖరి అనాటో లెవియన్ తన పుస్తకం 'పాకిస్థాన్– ఏ హార్డ్ కంట్రీ'లో వ్యాఖ్యానించారు. ఇదే పాకిస్థాన్‌కు తీరని నష్టం చేసిందని, దీనివల్ల ఆ దేశం పూర్తిగా విచ్ఛిన్నమయ్యే అవకాశాలు లేకపోలేదని ఆయన పదేళ్ల క్రితమే రాశారు. భారతదేశం తమకు శత్రువని, అది పైకి కనపడినంత బలమైన దేశం కాదని, ఆ దేశంలో లుకలుకల్ని తాము ఉపయోగించుకుంటామని పాక్ సైనికాధికారులు తనకు చెప్పినట్లు ఆయన రాశారు. భారత వ్యతిరేకతే జాతీయ వాదంగా ప్రజల్ని ప్రభావితం చేసేందుకు పాక్ ప్రభుత్వాలు, సైన్యం, ఇంటలిజెన్స్ సంస్థలూ నిరంతరం ప్రయత్నిస్తూనే ఉన్నాయని, ప్రమాదకర ఉగ్రవాద శక్తుల్ని పోషిస్తున్నాయని కూడా ఆయన స్పష్టంగా చెప్పారు. 2011లో ప్రముఖ జర్నలిస్టు కుల్దీప్ నయ్యర్ నేతృత్వంలో శాంతి బృందంలో భాగంగా పాకిస్థాన్‌ను సందర్శించినప్పుడు లాహోర్‌లో ధ్వంసమైన ఒక దేవాలయాన్ని, ముస్లింలు ఆక్రమించిన చరిత్రాత్మక గురుద్వారాను స్వయంగా చూశాను. బహుళమత సంస్కృతిని ధ్వంసం చేసిన పాకిస్థాన్ ఏం సాధించింది?



> **1948లో ఐక్యరాజ్యసమితి కాల్పుల విరమణను ప్రకటించిన తర్వాత వేలాది ప్రజల ప్రాణాలు పోయినప్పటికీ వేల కోట్ల నిధులు వృథా అయినప్పటికీ నియంత్రణ రేఖ ఒక అంగుళమైనా మారలేదు. పాక్ బడ్జెట్‌లో 30 శాతానికి పైగా సైన్యానికి ఖర్చుపెడుతున్నా, విద్య, ఆరోగ్యం, సంక్షేమ రంగాల్లో నిధులు తగ్గిపోయినా, ఆర్థిక ప్రగతి కునారిల్లినా, ఆ దేశ పాలకులు, సైన్యం తమ మనుగడకోసం మతాన్ని ఆయుధంగా వాడుకుంటున్నారు. భారత్‌లో హింసాత్మక చర్యలకు పాల్పడడం మానడం లేదు.**

1971లో బంగ్లాదేశ్ ఆవిర్భావంతో తన జనాభాలో 54 శాతం కోల్పోయి అవమానాల పాలైనా, 1999లో కార్గిల్‌లో చొరబాటుకు పాల్పడి దెబ్బతిన్నా పాకిస్థాన్ పాలకుల మనస్తత్వం మారలేదు. జియా ఉల్ హఖ్ ఏలుబడిలో పాకిస్థాన్‌కు, ఆ దేశంలోని మదర్సాలు ఉగ్రవాదాన్ని పెంచి పోషించేందుకు సహాయపడిన అమెరికా సెప్టెంబర్ 11 దాడుల తర్వాత తన వైఖరిని మార్చుకుంది. ముషారఫ్‌పై ఒత్తిడి చేసి ఉగ్రవాద కార్యకలాపాలకు మద్దతును తగ్గించేందుకు తోడ్పడింది. అబోటాబాద్‌లో అమెరికన్ దళాలు ఒసామా బిన్ లాడెన్‌ను హతమార్చిన తర్వాత పాక్ సైన్యం నైతిక స్థైర్యం కోల్పోయింది. కాబూల్‌లో అమెరికన్ రాయబార కార్యాలయంపై దాడి చేసిన హక్కానీ నెట్‌వర్క్ వెనుక పాక్ సైనికాధికారుల హస్తం ఉన్నదని న్యూయార్క్ టైమ్స్ జర్నలిస్టు కర్లోట్టా గాల్ తన పుస్తకం 'ద రాంగ్ ఎనిమీ'లో రాశారు. పొరుగుదేశాల్లో హింసాత్మక చర్యలను ప్రోత్సహించడం ద్వారా పాకిస్థాన్ తన అంతర్గత భద్రతకే ముప్పు తెచ్చుకుంటుందని, అంతర్జాతీయంగా విశ్వసనీయతను కోల్పోతోందని ఆమె రాశారు. క్రమంగా ఉగ్రవాదంపై పోరులో పాకిస్థాన్ తన మిత్రపక్షం కాలేదని అమెరికా గ్రహించింది. 2001 నుంచి 2003 మధ్య న్యూఢిల్లీలో అమెరికా రాయబారిగా ఉన్న రాబర్ట్ డి బ్లాక్‌విల్ భారత్‌కు పూర్తి మద్దతు నీయాలని సూచించిన తర్వాత అమెరికా విదేశాంగ విధానంలో మార్పు ప్రారంభమైంది.

1948లో ఐక్యరాజ్యసమితి కాల్పుల విరమణను ప్రకటించిన తర్వాత వేలాది ప్రజల ప్రాణాలు పోయినప్పటికీ వేల కోట్ల నిధులు వృథా అయినప్పటికీ నియంత్రణ రేఖ ఒక అంగుళమైనా మారలేదు. పాక్ బడ్జెట్‌లో 30శాతానికి పైగా సైన్యానికి ఖర్చుపెడుతున్నా, విద్య, ఆరోగ్యం, సంక్షేమ రంగాల్లో నిధులు తగ్గిపోయినా, ఆర్థిక ప్రగతి కునారిల్లినా, ఆసియాలోనే అత్యంత ఎక్కువ స్థాయిలో పెరుగుతున్న జనాభాలో దాదాపు 41 శాతం పేదరికంలో మగ్గుతున్నా ఆ దేశ పాలకులు, సైన్యం తమ మనుగడకోసం మతాన్ని ఆయుధంగా వాడుకుని భారత్‌లో హింసాత్మక చర్యలకు పాల్పడడం మానడం లేదు.


'వసుధైక కుటుంబకం' అన్న భావనను ఆదర్శంగా తీసుకునే భారతదేశం మాత్రం ఎప్పుడూ పాకిస్థాన్ దిశన పయనించకపోవడమే ఈ పురానవ దేశ ప్రజల విజయ రహస్యం. భారత ఉపరాష్ట్రపతిగా ఎంపికైన తర్వాత బీజేపీ మాజీ అధ్యక్షుడు వెంకయ్యనాయుడు తన జిల్లాలోని కసుమూరు మస్తాన్ వలీ దర్గాకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఆయన మామగారి పేరే మస్తానయ్య నాయుడు. కాంగ్రెస్ సీనియర్ నేత జానారెడ్డికి ఆ పేరు నల్గొండలోని జాన్‌పహాడ్ దర్గా వల్ల వచ్చింది. అనంతపురంలో గుగుడు (గుహుడు) అనే గ్రామంలో ముస్లింలు రాముడు ఒక ముస్లిం పీర్‌గా తమ గ్రామానికి వచ్చారన్న నమ్మకంతో ఆయనను కుల్లాయప్ప పేరుతో మొహర్రం సందర్భంగా పూజిస్తారని, వారు ఆ పక్కనే హనుమంతుడి ఆలయాన్ని కూడా స్థాపించారని ప్రముఖ కవి అఫ్సర్ 'ద ఫెస్టివల్ ఆఫ్ పీర్స్' అన్న పుస్తకంలో రాశారు. భారత్ పాక్ మార్గంలోనో, అయూబ్ ఖాన్ పంథాలోనో పయనించడం జరగదనేది, మంటో పడిన వేదన మన రచయితలకు ఎదురు కాబోదనేది నిజమవ్వాలి.

(ఆంధ్రజ్యోతి ఢిల్లీ ప్రతినిధి)

దేశవ్యాప్త కులగణనకు తెలంగాణ దిక్సూచి!

'ఇవాళ బెంగాల్ ఏం ఆలోచిస్తుందో... రేపు భారత దేశం అది ఆలోచిస్తుంది' అనేది నిన్నటి ముచ్చట. తెలంగాణ ఆచరణను దేశం అనుసరిస్తుందనేది నేటి మాట. కుల గణన ఇందుకు ప్రత్యక్ష ఉదాహరణ. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా కుల గణన చేపట్టాలని నిర్ణయించినప్పుడు విపక్షాలైన బీజేపీ, బీఆర్ఎస్ పెదవి విరిచాయి. కానీ అదే బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం రానున్న జన గణనలో కుల గణన కూడా చేపడతామని తాజాగా ప్రకటించింది.

భారత్ జోడో యాత్రలో దేశ ప్రజల ఆకాంక్షలను, ఆవేదనను ప్రత్యక్షంగా తెలుసుకున్న రాహుల్‌గాంధీ తాము అధికారంలోకి వస్తే దేశవ్యాప్తంగా కుల గణన చేపడతామని హామీ ఇచ్చారు. జోడో యాత్ర అనంతరం తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది. రేవంత్‌రెడ్డి నేతృత్వంలో ప్రజా ప్రభుత్వం కొలువుదీరింది. రాహుల్‌గాంధీ వాగ్దానం మేరకు తెలంగాణలో కుల గణన చేపట్టాలని 2024 ఫిబ్రవరి 24న రాష్ట్ర శాసనసభ తీర్మానం చేసింది. ప్రతి దశలోనూ పకడ్బందీగా వ్యవహరిస్తూ రాష్ట్ర ప్రభుత్వం సర్వే పూర్తి చేసింది. రాష్ట్రంలోని 97.10 శాతం ఇళ్ల సర్వేలో మొత్తం తెలంగాణ జనాభా 3,55,50,759గా తేలింది.



సర్వేలో వెల్లడైన గణాంకాల ప్రాతిపదికన ఎస్సీ వర్గీకరణతో పాటు బీసీ రిజర్వేషన్లు పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం శాసనసభలో తీర్మానాలు చేసింది. ప్రభుత్వం కుల గణన ఫలితాలను విధానపరమైన నిర్ణయాలకు ప్రాతిపదిక చేసుకుంటుండడంతో తెలంగాణ ప్రజల నుంచి సానుకూలత వెల్లువెత్తడం మొదలైంది. దీంతో అప్పటిదాకా విమర్శలు గుప్పించిన వర్గాలు నెమ్మదిగా మౌనం వహించడం ప్రారంభించాయి. కుల గణన విషయంలో తెలంగాణ ప్రభుత్వం చొరవ, గణాంకాల ఆధారంగా తీసుకుంటున్న నిర్ణయాలు దేశవ్యాప్తంగా చర్చకు దారి తీశాయి. దేశవ్యాప్తంగా కుల గణన చేపట్టాలంటూ ఢిల్లీ జంతర్‌మంతర్‌లో సైతం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నినదించారు. ఈ దీక్షకు బీజేపీ, దాని మిత్రపక్షాలు మినహా దేశవ్యాప్తంగా ఉన్న విపక్షాలు, వివిధ ప్రజా సంఘాలు, బీసీ సంఘాలు తమ మద్దతు ప్రకటించాయి. దీంతో కేంద్ర ప్రభుత్వంలో సైతం కదలిక వచ్చింది. ఫలితంగానే తాజా నిర్ణయం.

2021లో జనాభా లెక్కలు సేకరించాల్సి ఉన్నా బీజేపీ ప్రభుత్వం కరోనా వైరస్‌ను సాకుగా చూపి వాటిని పక్కనపెట్టింది. కానీ కరోనా వైరస్ ప్రభావం తీవ్రంగా ఉన్న సమయంలోనే 2020లో బిహార్, 2021లో తమిళనాడు, పశ్చిమ బెంగాల్, కేరళ, అస్సాం, పుదుచ్చేరి శాసనసభలకు ఎన్నికలు నిర్వహించారు. అంతటి క్లిష్ట పరిస్థితుల్లోనూ ఎన్నికల ప్రయోజనాలకే బీజేపీ పెద్దపీట వేసింది. కానీ దేశంలో ప్రణాళికల రూపకల్పన, నిధుల కేటాయింపు వంటి కీలకాంశాలకు మూలమైన జన గణనపై పూర్తిగా నిర్లక్ష్యం వహించింది. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం తెలంగాణలో కుల గణన చేపట్టిన తర్వాత ఆ ప్రభావం ఇతర రాష్ట్రాలపైన పడడం... ఈ ఏడాది బిహార్, వచ్చే ఏడాది కీలకమైన పశ్చిమ బెంగాల్, తమిళనాడు, కేరళ, అస్సాం, పుదుచ్చేరి శాసనసభ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో అకస్మాత్తుగా కుల గణన చేపడతామని ప్రకటించింది.

రాజకీయ విభేదాలకు అతీతంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతించారు. ఈ ప్రక్రియలో తెలంగాణ ప్రభుత్వం చేసిన కసరత్తును, అనుసరించిన విధానాలను పాటించాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వానికి నిజంగా చిత్తశుద్ధి ఉంటే ఈ అంశంలో తెలంగాణ మోడల్‌ను అధ్యయనం చేయాలి. "గొప్ప ఆలోచనలు అన్ని వైపులా నుంచి రానివ్వాలి" అని చెబుతోంది రుగ్వేదం!

○ దూదిపాళ్ల విజయకుమార్
ముఖ్యమంత్రి పీఆర్వో

అవినీతి స్మారకంగా అలా వదిలేయాల్సిందే!

కేసీఆర్ 2014లో ముఖ్యమంత్రి అయ్యాక నీరు లేదనే సాకుతో తుమ్మిడిహెట్టి ప్రాజెక్టును రద్దు చేశారు. రీ–ఇంజనీరింగ్, రీ–డిజైనింగ్ పేరిట దాన్ని మేడిగడ్డకు మార్చారు. అన్నారం, సుందిళ్ళ బ్యారేజీలు నిర్మించారు. బడ్జెట్‌ను లక్ష కోట్లకు చేర్చారు. 2016లో కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం మొదలుపెట్టి, 2019లో దానిని ప్రారంభించారు. నాలుగేళ్ళ లోపే, అక్టోబర్ 21, 2023న ఏడవ బ్లాకులోని పియర్లు (piers) ఐదు అడుగుల లోతుకు పైగా కుంగిపోయాయి.

కుంగిన మేడిగడ్డను జాతీయ డ్యామ్ రక్షణ అథారిటీ (నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ – ఎన్‌డీఎస్ఏ) పరిశీలించింది. ఈ సంస్థ ఇంజనీర్ల బృందం ఇక్కడ నీటి నిలవ ప్రమాదమని గ్రహించి, నాటి ముఖ్యమంత్రి కేసీఆర్‌ను ఆదేశించి, అన్ని బ్యారేజీలలో పూర్తి నీటిని అత్యవసరంగా ఖాళీ చేయించింది. కాళేశ్వరం ప్రాజెక్టుపై తన పూర్తి స్థాయి నివేదికలో ఏడవ బ్లాకులోని 11 పియర్లు మొత్తం కూల్చి, నిర్మించడం తప్ప గత్యంతరం లేదని పేర్కొంది. కాళేశ్వరం మూడు బ్యారేజీల నిర్మాణంలో కేసీఆర్ ప్రభుత్వం చేసిన ఘోరమైన తప్పులను నిగ్గు తేల్చింది. ఇంజనీరింగ్ ప్రమాణాల ప్రకారం పునాదులకు సంబంధించిన భూగర్భ పరీక్షలు చేయలేదని, బలహీనమైన ఇసుక పునాదులపై బ్యారేజీలు నిర్మించారని వెల్లడించింది.

బ్యారేజీలలో వచ్చిన నీరు వచ్చినట్టు కాలువకు వెళ్లాలి, ఎక్కువైన నీరు నదిలోకి వెళ్లాలి. కానీ బలహీన పునాదులపై నిర్మించిన ఈ మూడు బ్యారేజీల్లో ప్రాజెక్టుల లాగ భారీ ఎత్తున నీటిని నిలువ చేశారు. బ్యారేజీలను డ్యాముల్లా నిర్వహించారు. ఆ భారీ నీటి నిలువ ఒత్తిడికి పునాదులు దెబ్బతిన్నాయి. దోపిడీయే లక్ష్యంగా ఆగమేఘాల మీద సాగిన ఈ నిర్మాణం వల్ల నిరంతరంగా ఇసుక కొట్టుకుపోతున్నది. స్పిల్‌వే నిట్టనిలువుగా మూడు అడుగుల వెడల్పుతో చీలిపోయి రెండు చెక్కలైంది. భూమిలో ఐదు అడుగులు కుంగిపోయింది. మేడిగడ్డ, అన్నారం, సుందిల్ల బ్యారేజీలు ఇప్పుడు ఉన్నవి ఉన్నట్లుగా అసలే పనికిరావని ఎన్‌డీఎస్ఏ తన నివేదికలో పేర్కొన్నది. ఏడవ బ్లాక్‌లోని పియర్లు భూమిలో కుంగడానికి నిర్మాణ, నాణ్యత లోపాలే ప్రధాన కారణమని ఎన్‌డీఎస్ఏ స్పష్టం చేసింది. సీకెంట్ పైల్స్ అమరిక సరిగా లేకనే పునాదిలో ఇసుక జారిందనీ పేర్కొంది. దీన్నిబట్టి విశ్లేషిస్తే మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలను పునరుద్ధరించడం కూడా అసాధ్యం. పునరుద్ధరించినా మరికొన్ని బ్లాకులు, పియర్లు కుంగవన్న గ్యారెంటీ ఏమీ లేదు. ఈ మూడు బ్యారేజీలను కేసీఆర్ అవినీతికి స్మారక చిహ్నంగా పురావస్తు శాఖకు అప్పగించటమే ఎవరైనా చేయగలిగింది!

ఇప్పటిదాకా జరిగిన నష్టం ఇక్కడితో ఆగదని, నీటి ఒత్తిడి ఎక్కువైతే మొత్తం బ్యారేజీలకి ప్రమాదం జరుగుతుందని ఎన్‌డీఎస్ఏ నివేదిక పేర్కొంది. మూడు బ్యారేజీలలో ప్రతి ఒక్కటీ ప్రమాదపుటంచులలో ఉన్నాయని తెలిపింది. సమగ్ర పునర్నిర్మాణ డిజైన్ చేయాలని, జియో ఫిజికల్ పరీక్షలు, జియో సాంకేతిక పరీక్షలు చేసి, ఆధునిక హైడ్రాలిక్ నమూనాలను (నీటి ప్రవాహ ఒత్తిడికి సంబంధించిన నమూనాలను) ఉపయోగించి పునర్నిర్మాణ రీడిజైన్ చేయాలని ఎన్‌డీఎస్ఏ చెప్పింది. ఘోరమైన ఇంజనీరింగ్ ప్రమాణాల ఉల్లంఘన వల్ల బ్యారేజీలు తీవ్ర ప్రమాదంలో పడ్డాయి. తేలియాడే నిర్మాణాలుగా ఉండవలసినవి, రిజిడ్ స్ట్రక్చర్స్‌గా మారాయి.

> **జాతీయ డ్యామ్ రక్షణ అథారిటీ నివేదికను బట్టి విశ్లేషిస్తే మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలను పునరుద్ధరించడం కూడా అసాధ్యం. పునరుద్ధరించినా మరికొన్ని బ్లాకులు, పియర్లు కుంగవన్న గ్యారెంటీ ఏమీ లేదు. ఇక ఈ మూడు బ్యారేజీలను కేసీఆర్ అవినీతికి స్మారక చిహ్నంగా పురావస్తు శాఖకు అప్పగించటమే ఎవరైనా చేయగలిగింది!**



మేడిగడ్డ బ్యారేజీలో 20, 21 పియర్స్ దగ్గర, దిగువ భాగంలో ఏడవ పియర్ దగ్గర భారీ రంధ్రాలు పడ్డాయి. బ్యారేజీ కట్ ఆఫ్ గోడల్లో ఇంకా కనిపించని రంధ్రాలు ఉండి ఉండవచ్చు. ఒకసారి నీళ్లతో నిండితే అవన్నీ బైటపడతాయి. బ్యారేజీలోని అన్ని బ్లాకులూ ప్రమాదంలో పడే అవకాశం ఉంటుంది. భారీ జల ప్రవాహ శక్తి ముందు అవినీతితో నాణ్యత కొరవడిన నిర్మాణం నిలవగలదా? ఇంత ప్రమాదకర స్థితిలో వీటిని పునరుద్ధరించడం ఎందుకు? ఒక బ్లాక్‌ను కూల్చి పునర్నిర్మాణం చేస్తే, మరొకటి మళ్లీ కుంగితే, అది కూడా కూల్చవలసిన పరిస్థితి వస్తే, ఇక పునర్నిర్మాణం చేసుడెందుకు? మూడు బ్యారేజీలకు చెందిన రూ.30 వేల కోట్లు గంగలో కలిసినట్టే! మళ్లీ భారీ వృథా ఖర్చు ఎందుకు?

సెంట్రల్ వాటర్ కమిషన్ (సిడబ్ల్యూసి) అనుమతి తీసుకున్నాకే మేడిగడ్డలో ఏడో బ్లాకు నిరుపయోగంగా మారింది. ఇవే సమస్యలు మిగిలిన బ్లాకుల్లోనూ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల్లో కూడా ఉన్నాయి. ఈ బ్యారేజీల పునరుద్ధరణ కోసం ప్రత్యేక ప్రణాళికను సిద్ధం చేసి, సిడబ్ల్యూసి అనుమతులు తీసుకొని, ఎన్‌డీఎస్ఏ అన్న దాని ప్రకారం పునర్నిర్మాణం చేసినా– మూడు బ్యారేజీలకు సుస్థిరత చేకూరుతుందని, చెక్కుచెదరకుండా ఉంటాయన్న గ్యారెంటీ లేదు. అలాంటప్పుడు పునరుద్ధరణ ఎందుకు? రూ.30వేల కోట్ల ఖర్చుతో చేసిన భారీ మౌలిక సదుపాయం కదా అని పునర్నిర్మాణం చేసినా అది మూడు నాళ్ళ ముచ్చటే కావచ్చు.

నాటి ప్రభుత్వం బ్యారేజీలో పియర్లు కుంగిపోయే వరకు మెయింటెనెన్స్ పనులు చేపట్టలేదు. భారీ ప్రాజెక్టుల నిర్మాణాలకు థర్డ్ పార్టీతో ఆడిట్ చేయించాలన్న నిబంధన కూడా అమలు కాలేదు. 2019 నుంచి అన్నారం సుందిళ్ల బ్యారేజీల దిగువ భాగంలో సిమెంట్ కాంక్రీట్ బ్లాకులన్నీ చెల్లాచెదురు అవుతున్నాయి. 20, 21 పియర్లలో సీపేజీ కట్టడికి తాత్కాలికంగా చర్యలు తీసుకున్నా ఫలితం లేదు. సీపేజీలకు శాశ్వత పరిష్కారం చెప్పకుండా తాత్కాలిక చర్యలు తీసుకోవడం విచారకరం అని ఎన్‌డీఎస్ఏ పేర్కొంది. ఎన్ని ఉల్లంఘనలు! ఎంత విధ్వంసం! కాళేశ్వరం ప్రాజెక్టు ఒక అవినీతి దుర్గంగా, దోచుకున్న వారికి దోచుకున్నంత స్వర్గంగా నడిచింది.

ఈ నేపథ్యంలో మేడిగడ్డ పునరుద్ధరణ ఇప్పటికిప్పుడు సాధ్యమయ్యే పరిస్థితులు లేవు. అధునాతన పరీక్షల అనంతరమే అన్నారం, సుందిళ్ల బ్యారేజీల వినియోగంపై నిర్ణయం తీసుకోవాలనీ ఎన్‌డీఎస్ఏ సూచించింది. మూడు బ్యారేజీలూ విపత్తులో ఉన్నాయని, పునరుద్ధరణ సాధ్యమయ్యే పరిస్థితులు లేవని ఎన్‌డీఎస్ఏనే చెబుతుంది. మేడిగడ్డ ఇక ముగిసిన అధ్యాయం. తుమ్మిడిహెట్టి ప్రాణహిత ప్రాజెక్టు మాత్రమే దీనికి నిజమైన ప్రత్యామ్నాయం.

■ నైనాల గోవర్ధన్



దేవన్నపేట దేవాదుల పంప్‌హౌస్ వద్ద ఓ ప్రభుత్వ అధికారి కారులో డీజిల్ నింపుతున్న ప్రైవేటు కంపెనీ సిబ్బంది

నీళ్లశాఖలో అవినీతి తిమింగలాలు!

కాళేశ్వరం, దేవాదుల ప్రాజెక్టుల్లో అక్రమార్కుల చేతివాటం

- ఈఎన్‌సీ హరిరామ్‌పై ఏసీబీ కేసుతో మరికొందరు ఇంజనీర్లలో గుబులు
- దేవాదుల ప్రాజెక్టుల్లోనూ తెరపైకి వస్తున్న 'కాళేశ్వరం హరిరామ్'లు
- బిల్లుల చెల్లింపులు, బదిలీలు, పదోన్నతుల్లో చక్రం తిప్పుతున్న వైనం
- చివరికి కాంట్రాక్టు కంపెనీల నుంచి డీజిల్‌ని కూడా వదలని కేటుగాళ్లు
- అక్రమంగా వందల కోట్ల ఆస్తులు కూడబెట్టుకున్నారనే ప్రచారం
- నీటిపారుదల శాఖలో చర్చనీయాంశంగా పైఅధికారుల తీరు

నీటిపారుదలశాఖలోని అవినీతి తిమింగలాలు ఒక్కొక్కటిగా బయటకు వస్తున్నాయి. అక్రమాస్తుల కేసులో కాళేశ్వరం ప్రాజెక్టు ఈఎన్‌సీ హరిరామ్‌ను ఇటీవల అరెస్టు చేసిన అవినీతి నిరోధక శాఖ.. ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నారన్న అనుమానాలతో మరికొందరు ఇంజనీర్లపై కూడా అంతర్గతంగా విచారణ జరుపుతోంది. మరోవైపు దేవాదుల ప్రాజెక్టులో హరిరామ్‌ను మించి అవినీతి చేసిన ఘనులున్నారనే ప్రచారం జరుగుతోంది. ములుగు ఏజెన్సీలో ఏళ్లతరబడి తిష్టవేసిన ఓ అధికారి బదిలీలు, పదోన్నతులతో పాటు ప్రతీ పనిలో పర్సంటేజీలతో కోట్లు కొల్లకొట్టారనే ప్రచారం జరుగుతోంది. చివరికి దేవాదుల ప్రాజెక్టు పనుల్లో కాంట్రాక్టు కంపెనీ నుంచి డీజిల్‌ని కూడా వదలని అక్రమార్కుల తీరు ఇరిగేషన్‌శాఖలో హాట్‌టాపిక్‌గా మారింది.



(ఆంధ్రజ్యోతి ప్రతినిధి - వరంగల్)

కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో అవినీతి పర్వం క్రమంగా వెలుగులోకి వస్తోంది. 2023 అక్టోబరులో మేడిగడ్డ బ్యారేజీలోని 7వ బ్లాక్‌లో నాలుగు పిల్లర్లకు పగుళ్లు రావటంతో పాటు ప్రాజెక్టే పనికి రాదనే చర్చ జరుగుతున్న క్రమంలో ఈ ప్రాజెక్టులో భాగస్వామ్యమైన అధికారుల అక్రమ సంపాదనపైన ప్రభుత్వం నజర్ వేసింది. దీంతో కాళేశ్వరం ఈఎన్‌సీ హరిరామ్ ఆదాయానికి మించిన ఆస్తులు కలిగి ఉన్నట్టుగా గుర్తించిన అవినీతి నిరోధక శాఖ అధికారులు ఏప్రిల్ 26వ తేదీన దాడులు చేశారు. ఈ క్రమంలో సుమారు రూ.200కోట్ల విలువైన అక్రమ ఆస్తులు కలిగి ఉన్నట్టు గుర్తించి.. ముమ్మర విచారణ చేస్తున్నారు. అయితే హరిరామ్‌తో పాటు భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని మేడిగడ్డ, అన్నారం బ్యారేజీలు, కాళేశ్వరంలోని పంప్‌హౌస్‌ల్లో విధులు నిర్వహించిన ఇంజనీరింగ్ అధికారులపైనా దృష్టి పెట్టిన ఏసీబీ అధికారులు.. వారి ఆస్తుల విషయంపైనా అంతర్గతంగా విచారణ జరుపుతున్నారు. ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టులో అక్రమాలు చోటు చేసుకున్నాయని గుర్తించి విజిలెన్స్ విచారణ చేపట్టింది. ఆ తరువాత జస్టిస్ పీసీ ఘోష్ నేతృత్వంలో ఓ కమిటిని నియమించింది. ఈ కమిటీల నివేదికల ఆధారంగా కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలోని 17మందిపై క్రిమినల్ కేసులు, 30మందిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి సిఫార్సు చేసింది. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్సుమెంట్ అధికారులు సిఫార్సు చేసిన వారిలో కాళేశ్వరం మాజీ ఈఎన్‌సీ నల్లా వెంకటేశ్వర్లుతో పాటు ఎస్‌ఈగా పని చేసిన రమణారెడ్డి, ఈఈ తిరుపతిరావు తదితర సీనియర్ ఇంజనీర్లు కూడా ఉన్నారు. ఒకవైపు విజిలెన్స్, జస్టిస్ పీసీ. ఘోష్ కమిటీ సిఫార్సులతో విచారణను ఎదుర్కొంటున్న ఇంజనీర్లకు ఈఎన్‌సీ హరిరామ్ అక్రమాస్తుల కేసులో అరెస్ట్ కావటం కాళేశ్వరం ఇంజనీర్లలో గుబులు రేపుతోంది. హరిరామ్‌తో పాటు కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో కీలకంగా పని చేసిన ఇతర ఇంజనీర్ల ఆస్తుల చిట్టాను ఏసీబీ అధికారులు విప్పుతున్నారనే చర్చ జరుగుతోంది. దీంతో కాళేశ్వరం ఇంజనీర్లలో ఆందోళన వ్యక్తమవుతోంది. హరిరామ్ తరువాత ఎవరో అనే చర్చ జరుగుతోంది.

దేవాదుల ప్రాజెక్టులో కాళేశ్వరం హరిరామ్‌లు..

కాళేశ్వరం తరువాత అతిపెద్ద సాగునీటి ప్రాజెక్టు దేవా దుల. 2003లో అప్పటి టీడీపీ ప్రభుత్వం చేపట్టగా, 2004 లో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం పనులకు శ్రీకారం చుట్టింది. సుమారు 21ఏళ్లకు పైగా దేవాదుల పనులు పూర్తి కాకపోవటానికి గత ప్రభుత్వాల నిర్లక్ష్యంతో పాటు కొంతమంది ఇంజనీర్ల పనితీరు కూడా కారణమనే చర్చ జరుగుతోంది. కమీషన్ల కోసం కక్కుర్తి పడి దేవాదుల ప్రాజెక్టు పనులు ముందుకు సాగకుండా అడ్డు పడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. 'కాళేశ్వరం హరిహమ్'కు మించిన అక్రమాల ఘనులు దేవాదుల ప్రాజెక్టులో తిష్టవేశారనే చర్చ జరుగుతోంది. ములుగు జిల్లా ఏజెన్సీలో దేవాదుల ప్రాజెక్టు



మిగతా 7వ పేజీలో...

సీఎం రేవంత్‌రెడ్డికి ఆహ్వానం అందజేస్తున్న మంత్రులు కొండా సురేఖ, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, తదితరులు



సరస్వతీ పుష్కరాలకు రండి..

సీఎం రేవంత్‌రెడ్డికి మంత్రుల ఆహ్వానం

మహదేవపూర్, మే 6 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 15 నుంచి మహదేవపూర్ మండలం కాళేశ్వరంలో జరిగే సరస్వతీ పుష్కరాలకు రావాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని మంత్రులు కొండా సురేఖ, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, తదితరులు ఆహ్వానించారు. ఈ మేరకు మంగళవారం హైదరాబాద్‌లో వారు సీఎంను మర్యాద పూర్వకంగా కలిసి పుష్కరాల ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా కాళేశ్వరాలయ అర్చకులు సీఎం రేవంత్‌రెడ్డికి ఆశీర్వచనం అందజేసి స్వామివారి తీర్థ ప్రసాదాలు ఇచ్చారు. ఈ క్రమంలో తాను తప్పకుండా పుష్కరాలకు వస్తానని సీఎం మాట ఇచ్చారని ఆలయ అధికారులు, అర్చకులు తెలిపారు.

అంగన్వాడీ కేంద్రాల్లో పనులు పూర్తి చేయాలి

హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య



హనుమకొండ కలెక్టరేట్‌లో జరిగిన సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య

హనుమకొండ కలెక్టరేట్, మే6(ఆంధ్రజ్యోతి): హనుమకొండ జిల్లాలోని అంగన్వాడీ కేంద్రాల్లో వివిధ వసతుల కల్పనకు చేపట్టిన అభివృద్ధి పనులను నెలాఖరులోగా పూర్తి చేయాలని కలెక్టర్ పి.ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్‌హాల్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లాలోని అంగన్వాడీ కేంద్రాల్లో చేపట్టిన అభివృద్ధి పనుల పురోగతిపై ఈ సందర్భంగా అధికారులు కలెక్టర్‌కు వివరించారు.

అనంతరం కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ.. అంగన్వాడీ కేంద్రాల్లో చేపట్టిన విద్యుత్, తాగు నీరు, టాయిలెట్స్ పనులు నాణ్యతతో చేయాలన్నారు. ఈజీఎస్ ద్వారా చేపట్టిన కిచెన్ షెడ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలన్నారు. అభివృద్ధి పనుల్లో వేగం పెంచి నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా సంక్షేమ అధికారి జయంతి, జిల్లా విద్యాశాఖ అధికారి వాసంతి, ముఖ్య ప్రణాళికాధికారి సత్యనారాయణరెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాల నియంత్రణపై దృష్టిసారించాలి

- రౌడీషీటర్ల ఇళ్లను నిత్యం సందర్శిస్తూ ఆరా తీయాలి
- వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్



గీసుగొండ పోలీస్‌స్టేషన్‌లో అధికారుల చాంబర్‌లను పరిశీలిస్తున్న సన్‌ప్రీత్ సింగ్

వరంగల్ క్రైం, మే 6 (ఆంధ్రజ్యోతి): మత్తు పదార్థాల క్రయ విక్రయాలపై పోలీస్‌స్టేషన్‌ల అధికారులు దృష్టి సారించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్‌సింగ్ సూచించారు. మామునూర్ డివిజన్ పరిధిలోని గీసుగొండ, మామునూర్, ఏనుమాముల పోలీస్‌స్టేషన్‌లను సీపీ మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా పోలీస్‌స్టేషన్ పరిసరాలు, సీసీ కెమెరాల పనితీరు, స్టేషన్ పరిధిలో విధులు నిర్వర్తిస్తున్న అధికారులు, సిబ్బంది వివరాలు, స్టేషన్‌ల పరిధిలో అత్యధికంగా ఎలాంటి నేరాలు నమోదవుతున్నాయి..? సెక్టార్‌ల వారీగా ఎస్సైల పనితీరుతో పాటు వారి పరిధిలోని రౌడీషీటర్ల స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రతీస్టేషన్ అధికారి తమ పరిధిలోని రౌడీషీటర్ల ఇళ్లను సందర్శిస్తూ వారి స్థితిగతులపై ఆరా తీయాల న్నారు. ఆర్థిక నేరాలల్లో సైబర్ కేసు నమోదు వరకే పరిమితం కాకుండా నిందితులను కనిపెట్టి అరెస్టు చేయాలన్నారు. నేరాల నియంత్రణకు విజుబుల్ పోలీసింగ్ అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో ఈస్ట్‌జోన్ డీసీపీ అంకిత్‌కుమార్, మామునూర్ ఏసీపీ తిరుపతి, ఇన్స్‌పెక్టర్లు రాఘవేందర్, మహేందర్, రమేశ్ పాల్గొన్నారు.

వైభవంగా సాగుతున్న బ్రహ్మోత్సవాలు

- విశేష పూజలందుకుంటున్న భద్రకాళి అమ్మవారు
- ఏడో రోజు దాతలుగా నాయీ బ్రాహ్మణులు



అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న నాయీ బ్రాహ్మణులు

వరంగల్ కల్చరల్, మే 6 (ఆంధ్రజ్యోతి): చారిత్రక ఓరుగల్లు నగరంలో ప్రసిద్ధిగాంచిన భద్రకాళి అమ్మవారి దేవస్థానంలో భద్రకాళి - భద్రేశ్వరుల కల్యాణ బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి. ఏడో రోజు మంగళవారం ఉదయం 4గంటలకు నిత్య పూజతో పూజా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. అమ్మవారికి చతుష్కానార్చన, హోమాలు, పారాయణాలు, అర్చనలు నిర్వహించారు. ఉభయ సేవా దాతలుగా నాయీ బ్రాహ్మణులు అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించి పట్టు వస్త్రాలు, పూలు, పండ్లు సమర్పించారు. నాయీ బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు నాగవెల్లి సురేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో దాదాపు 2 వేల మంది భక్తులు పాల్గొన్నారు. పూజ అనంతరం అన్నదానం నిర్వహించారు. పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డితో పాటు సూర్యపల్లి శ్రీనివాస్, బండారి జగదీష్‌బాబు, తూముల సాంబయ్య, డాక్టర్ జీవనాథ్, కురిమిల్ల రమేష్, శ్రీరాముల రమేష్, శ్రీరాముల నరేందర్, జగన్, సురేష్, శివ, సతీష్, మధుసూదన్ తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు. సాయంత్రం దేవాలయంలో రథ సేవ నిర్వహించారు.



ధర్మసాగర్ మండల కేంద్రంలో రేకుల షెడ్ కూలడంతో మృతి చెందిన మేకలు

నట్టేట ముంచిన అకాల వర్షం

- విరిగిన చెట్లు, నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు
- కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యం
- నేలరాలిన మామిడి, లేచిపోయిన ఇళ్ల రేకులు
- నష్టపోయిన రైతులు, ప్రజలు



పరకాల వ్యవసాయ మార్కెట్‌లో తడిసిన ధాన్యం

మడికొండ, మే 6 (ఆంధ్రజ్యోతి): అకాల వర్షం, గాలి వాన బీభత్సం సృష్టించడంతో హనుమకొండ జిల్లాలో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. సోమవారం రాత్రి వర్షంతో పాటు వీచిన ఈదురు గాలులకు పలు చోట్ల చెట్లు విరిగాయి. చెట్లువిరిగి పడడంతో విద్యుత్ తీగలు తెగిపోయి విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. మామిడితోటల్లో కాయలు నేల రాలి రైతన్నలకు నష్టాన్ని కలిగించాయి. నగరంలోని మడికొండలోని వైన్స్ షాప్ వద్ద, ధర్మసాగర్ రోడ్డులో పెద్ద వృక్షాలు విరిగిపోయి రోడ్డుకు అడ్డంగా పడిపోవడంతో ట్రాఫిక్ జామైంది. వెంటనే స్పందించిన స్థానిక ఇన్‌స్పెక్టర్ పుల్యాల కిషన్, ఎస్సై పెగడ రాజ్‌కుమార్ పోలీస్ సిబ్బంది, స్థానికుల సహకారంతో రోడ్డుపై పడిన చెట్లను తొలగించి వాహనాల రాకపోకలకు అంతరాయం లేకుండా చూశారు. అలాగే విద్యుత్ సిబ్బంది తక్షణం స్పందించి అర్ధరాత్రి వరకు విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. ఈ సందర్భంగా పోలీసులు, విద్యుత్ సిబ్బందితో పాటు సహకరించిన స్థానిక యువకులను ప్రజలు అభినందించారు.

దండేపల్లిలో తడిసిన ధాన్యం

ఎల్కతుర్తి: ఎల్కతుర్తి మండల పరిధిలో మంగళవారం ఉదయం భారీ ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. ఈదురు గాలులకు చెట్టు విరిగి పడ్డాయి. రాత్రి సమయంలో విద్యుత్‌కు అంతరాయం ఏర్పడింది. కల్లాల వద్ద, కొనుగోలు కేంద్రాల్లో ఉన్న వరి ధాన్యం తడిసింది. తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలని రైతులు డిమాండ్ చేశారు.

నేలకొరిగిన స్తంభాలు

వేలేరు : వేలేరు మండల పరిధిలో సోమవారం అర్ధరాత్రి ఈదురు గాలులతో కూడిన అకాల వర్షం కురిసింది. దీంతో మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు నెలకొరిగాయి. కల్లాల వద్ద ధాన్యం తడిసిపోయింది. బలమైన గాలులకు ఇళ్ల రేకులు లేచిపోయాయి. చెట్లు నెలకొరిగి పలు రహదారు ల్లో రాకపోకలకు అంతరాయం ఏర్ప డింది. అలాగే గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయి అంధకారంలో ఉన్నాయి. మల్లికుదుర్ల గ్రామానికి చెందిన బొల్లేపల్లి శ్రీనివాస్‌కు చెందిన రెకుల షెడ్డు గాలికి ఎగిరిపోయింది. వర్షానికి ఇంటిలోని సామగ్రి తడిసి ముద్దయింది. బట్టు సాయికి చెందిన హోటర్ రేకులు ఎగిరిపోయాయి.



ఈదురు గాలులకు ధర్మసాగర్ వెళ్లే రోడ్డుపై అడ్డంగా పడిన చెట్టు

రేకుల షెడ్ కూలి 50 మేకలు మృతి

గాలి, అకాల వర్షం కురవడంతో ధర్మసాగర్ మండలంలో ఓ రైతుకు చెందిన రేకుల షెడ్ కూలి

మిగతా 8వ పేజీలో...

కేయూ కామర్స్ బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగం డీన్‌గా రాజేందర్

కేయూ క్యాంపస్ మే 6, (ఆంధ్రజ్యోతి): కేయూ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగం నూతన డీన్‌గా ప్రొఫెసర్ కట్ల రాజేందర్ నియమితులయ్యారు. ఈ మేరకు మంగళవారం కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం ఉత్తర్వులు జారీ చేయగా వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి రాజేందర్‌కు ఉత్తర్వులను అందచేశారు. డీన్‌గా నియమితులైన రాజేందర్‌ను పలువురు అభినందించారు.

కె-హబ్ డైరెక్టర్‌గా సవితాజ్యోత్స్న

కేయూ కె.హబ్ డైరెక్టర్‌గా కెమిస్ట్రీ విభాగం ప్రొఫెసర్ టి.సవితాజ్యోత్స్నను నియమిస్తూ మంగళవారం కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం ఉత్తర్వులు జారీ చేశారు. ఉత్తర్వులను సవితాజ్యోత్స్నకు వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి అందచేసి అభినందించారు. ఏడాది కాలం డైరెక్టర్‌గా కొనసాగుతారు. వర్సిటీ రుసా, నోడ్ ఆఫీసర్ సమన్వయంతో పనిచేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అలాగే కె-హబ్‌లోని ఇంటర్‌ప్రెన్యూర్‌షిప్, ఎంప్లాయిబులిటీ అండ్ ఇన్నోవేషన్ హబ్‌కు ఇన్‌చార్జి కోఆర్డినేటర్‌గా ఇంజనీరింగ్‌విభాగం కాంట్రాక్టు అధ్యాపకుడు సిద్ధార్థను నియమించారు.

అప్పుల బాధతో యువకుడి ఆత్మహత్య



దిలీప్ (ఫైల్)

భీమదేవరపల్లి, మే 6 (ఆంధ్రజ్యోతి): భీమదేవరపల్లి మండలం రత్నగిరి గ్రామంలో అప్పుల బాధతో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామ స్థులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం. కరట్లపల్లి వెంకటేశ్వర్లుకు ఇద్దరు కుమారులున్నారు. పెద్దకుమారుడు దినేష్ పాల వ్యాపారం చేస్తు న్నాడు. చిన్న కుమారుడు దిలీప్ (29) ఇంటర్ వరకు చదువుకొని నూతన గృహాల్లో కరెంటు వైరింగ్ పనిచేస్తున్నాడు. కాగా, దిలీప్ ఇటీవల కొత్తగా ఇల్లు నిర్మించుకున్నారు. విద్యుత్ వైరింగ్ పరికరాల కోసం రూ. 2 లక్షల అప్పు చేశాడు. అలాగే రూ. 1.50 లక్షలతో పల్సర్ ద్విచక్ర వాహనాన్ని కొనుగోలు చేశాడు. దిలీప్‌కు ఇంకా వివాహం కాలేదు. అప్పులు తీర్చేందుకు ఇంటిపై సుమారు రూ. 7లక్షల వరకు గృహ రుణం దిలీప్ తీసుకున్నాడు. ప్రస్తుతం ఇంటిపై తీసుకున్న రణం చెల్లించలేక ఇబ్బంది పడుతూ మధన పడేవాడు. అప్పుల బాధ భరించలేక సోమవారం సాయంత్రం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసుకున్నాడు. ముల్కనూర్‌లో ప్రాథమిక చికిత్స అనంతరం వరంగల్ ఎంజీఎంకు తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. మృతుడి తండ్రి వెంకటేశ్వర్లు వంగర పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాడు.

బల్దియా ఆర్‌ఐల బదిలీకి రంగం సిద్ధం

వరంగల్ కార్పొరేషన్, మే 6 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ పరిధిలో పనిచేస్తున్న ఆర్‌ఐ (రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు) బదిలీలకు రంగం సిద్ధమైనట్లు తెలుస్తోంది. చాలాకాలంగా ఒకే చోట పనిచేస్తున్న వారికి బదిలీ వేటు తప్పదని తెలుస్తోంది. ఒకటి, రెండు రోజుల్లో ఉత్తర్వులు వెల్లడించేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నట్టు తెలుస్తోంది. అయితే బదిలీ ఇష్టం లేని కొందరు ఆర్‌ఐలు గాడ్‌ఫాదర్ల చుట్టూ తిరుగుతున్నట్టు విశ్వసనీయ సమాచారం. అయితే చాలాకాలంగా ఒకే చోట పాతుకుపోయిన వారికి బదిలీ వేటు తప్పదనే వాదనలు వినిపిస్తున్నారు. కాగా, కొందరు ఆర్‌ఐలు ముందస్తుగా తమకు అనుకూలమైన ప్రాంతానికి బదిలీ చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. కాగా, బల్దియా పరిధిలోని నాలుగు ప్రాంతాలలో ఆర్‌ఐలుగా పని చేసేందుకు పలువురి నుంచి తీవ్ర పోటీ నెలకొంది. కోరుకున్న స్థానం కోసం రూ.3నుంచి రూ.5లక్షలు ముట్టజెప్పేందుకు సిద్ధమయ్యారు. ముందస్తుగా అక్కడ పని చేస్తున్న ఆర్‌ఐలను బదిలీ చేయించి ఆ స్థానాల్లో పోస్టింగ్ పొందేందుకు పావులు కదుపుతున్నట్టు తెలుస్తోంది.

వడదెబ్బతో మహిళ మృతి

మహబూబాబాద్ రూరల్, మే 6 (ఆంధ్రజ్యోతి): మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని లెనిన్‌నగర్‌కు చెందిన తునికి అమరావతి(40) అనే మహిళ వడదెబ్బతో సోమవారం అర్ధరాత్రి మృతి చెందింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... లెనిన్‌నగర్‌కు చెందిన తునికి అమరావతి కొద్ది రోజులుగా అనారోగ్యానికి గురై ఇంటి వద్దనే ఉంటుంది. ఇటీవల తీవ్ర ఎండ వేడిమి, వడగాల్పులతో ఎండదెబ్బ తగిలి ఆమె అస్వస్థతకు గురైంది. ఈ క్రమంలో సోమవారం అర్ధరాత్రి ఇంటి వద్దనే మృతి చెందింది. ఆమెకు భర్త సుధాకర్, కుమార్తె శ్రీలత ఉన్నారు.



కాజీపేట రైల్వేస్టేషన్‌లో నిరసన తెలుపుతున్న సీఐటీయూ నాయకులు



వరంగల్ రైల్వేస్టేషన్ ఎదుట ధర్నా చేస్తున్న సీఐటీయూ నాయకులు

రైల్వేలో ప్రైవేటీకరణను నిలిపివేయాలి

● సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాగుల రమేశ్ ● కాజీపేటలో సీఐటీయూ నిరసన

కాజీపేట, మే 6 (ఆంధ్రజ్యోతి): రైల్వేలో ప్రైవేటీకరణ నిలిపివేయాలని, సేఫ్టీ విభాగంలో పని చేసే వారికి తగిన ప్రాధాన్యం ఇచ్చి ప్రమాదాలను అరికట్టాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాగుల రమేశ్ డిమాండ్ చేశారు. కాజీపేట రైల్వేస్టేషన్ ఎదుట మంగళవారం సీఐటీయూ జిల్లా కమిటీ ధర్నా చేపట్టింది. ఈ ధర్నాను ఉద్దేశించి సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాగుల రమేశ్, జిల్లా ఉపాధ్యక్షుడు బొట్ల చక్రపాణిలు మాట్లాడారు. దేశంలో ఇటీవల వరుస రైలు ప్రమాదాలు జరుగుతున్నాయని, ఈ ప్రమాదంలో వందలాది మంది ప్రయాణికులు మరణిస్తున్నా బీజేపీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని అన్నారు. కీలకమైన రైల్వే రంగంలో ప్రమాదాల నివారణకు సమర్థవంతమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని రైల్వే ఉద్యోగులను బాధ్యులను చేయడాన్ని సహించేది లేదని అన్నారు. రైల్వేలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని, ఎక్స్‌ప్రెస్ రైళ్లలో జనరల్ బోగీల సంఖ్యను పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు కారు ఉపేందర్, ఓరుగంటి సాంబయ్య, జంపాల రమేశ్, కోటీతోపాటు కార్మికులు పాల్గొన్నారు.

రైల్వేను ప్రైవేటు పరం చేయొద్దు

గిర్మాజీపేట: రైల్వే ప్రైవేటీకరణను కేంద్ర ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని సీపీఎం అనుబంధ సెంట్రల్ ఇండియన్ ట్రేడ్ యూనియన్ (సీఐటీయూ) నాయకులు మంగళవారం వరంగల్ రైల్వేస్టేషన్ ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా యూనియన్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు ముక్కెర రామస్వామి, కార్యదర్శి ఎం.సాగర్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం దశలవారీగా రైల్వేసంస్థను ప్రైవేటీకరణ చేస్తోందని ఆరోపించారు. పెరుగుతున్న ప్రయాణికుల సంఖ్యకు అనుగుణంగా జనరల్ కోచ్‌లను పెంచడంలేదని, ఫలితంగా సామాన్య ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రైళ్లలో జనరల్ కోచ్‌లు, భద్రత పెంచాలని, ప్రయివేటీకరణను నిలిపివేయాలని నినాదాలు చేశారు. ఈ నిరసనలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎం.డి.మహబూబ్ పాషా, నాయకులు ఎం.రవిందర్, అశోక్, శ్రీశైలం, నరసయ్య, వెంకటేశ్వర్లు, రమేష్, రాజు, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఏసీబీ వలలో ఇద్దరు జడ్పీ ఉద్యోగులు

రూ. 25వేలు తీసుకుంటుండగా పట్టుకున్న అధికారులు



జడ్పీ కార్యాలయంలో సుధాకర్‌ను విచారిస్తున్న ఏసీబీ అధికారులు

ములుగు, మే 6(ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా కేంద్రంలోని జడ్పీ సీఈవో కార్యాలయంలో ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించారు. మెడికల్ లీవ్ సెటిల్‌మెంట్ రికార్డును ట్రెజరీకి పంపే విషయంలో తమ కార్యాలయ ఉద్యోగి నుంచి లంచం తీసుకుంటూ ములుగు జడ్పీ సీఈవో కార్యాలయంలో పనిచేస్తున్న ఇద్దరు ఉద్యోగులు మంగళవారం ఏసీబీకి పట్టుబడ్డారు. దీనికి సంబంధించి ఏసీబీ డీఎస్పీ సాంబయ్య తెలిపిన వివరాలివీ.. జడ్పీ సీఈవో కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న నేరళ్లపల్లి వెంకటేశ్వర్లు 2023-24 సంవత్సరంలో అనారోగ్యం కారణంగా పలుమార్లు మెడికల్ లీవ్ పెట్టారు. ఈ ఏడాది జనవరి నుంచి రెగ్యులర్‌గా విధులకు హాజరవుతున్నారు. ఈ క్రమంలో తన మెడికల్ లీవ్స్‌ను సెటిల్‌మెంట్ చేసి ఆ రికార్డును ట్రెజరీకి పంపాలని వెంకటేశ్వర్లు జడ్పీ సూపరింటెండెంట్ గాధగోని సుధాకర్, ఎస్టాబ్లిష్ మెంట్ సెక్షన్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న సౌమ్యారెడ్డిలను కోరారు. అయితే ఆ పని చేసి పెట్టేందుకుగాను రూ.60వేలు ఇవ్వాలని, తొలుత రూ.25వేలు ఇవ్వాలని, మిగతా సొమ్ము బిల్స్ క్రెడిట్ అయ్యాక ఇవ్వాలని డిమాండ్ చేశారు. కానీ వారికి ఆ డబ్బులు ఇవ్వడం ఇష్టంలేక వెంకటేశ్వర్లు హనుమకొండలోని ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. ఆతర్వాత పథకం ప్రకారం వెంకటేశ్వర్లు మంగళవారం వారడిగిన రూ.25వేలు ఇచ్చేందుకు కార్యాలయానికి వెళ్లాడు. తన డబ్బును కూడా సుధాకర్‌కే ఇవ్వాలని సౌమ్యారెడ్డి సూచించడంతో ఆ డబ్బును వెంకటేశ్వర్లు సుధాకర్‌కు ఇస్తుండగా.. రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుని అరెస్టు చేశామని ఏసీబీ డీఎస్పీ తెలిపారు. వీరిరువురిని బుధవారం ఏసీబీ కోర్టులో హాజరు పరుస్తామని అన్నారు. ఏ ప్రభుత్వ ఉద్యోగి చట్టపరంగా చేయాల్సిన పనులు చేయకుండా డబ్బులు డిమాండ్ చేస్తే ఏసీబీ కార్యాలయంలో ఫిర్యాదుచేయాలని కోరారు. సెల్‌నెంబర్ 9154388912, టోల్ ఫ్రీ నంబర్ 1064లను సంప్రదించవచ్చని అన్నారు. ఈ దాడుల్లో ఇన్‌స్పెక్టర్లు ఎస్.రాజు, ఎల్ రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి టౌన్‌స్టేషన్‌లో సింగరేణి రైలు హాల్టింగ్

కాజీపేట, మే 6 (ఆంధ్రజ్యోతి): మూడో రైల్వేలైన్ పనుల కారణంగా కొన్ని నెలలుగా కాజీపేట టౌన్‌స్టేషన్‌లో హాల్టింగ్ ఎత్తివేసిన సింగరేణి రైలుకు బుధవారం నుంచి తిరిగి హాల్టింగ్ సౌకర్యం కల్పిస్తున్నారు. భద్రాచలం రోడ్ నుంచి సిర్పూర్ కాగజ్‌నగర్ వైపు వెళ్లే ఈరైలు కాజీపేట టౌన్‌స్టేషన్‌లో ఉదయం 09.08 నిమిషాలకు హాల్టింగ్ ఉంటుంది. తిరిగి సిర్పూర్ నుంచి భద్రాచలం రోడ్ వైపు ప్రయాణించే ఈ రైలు కాజీపేట టౌన్ స్టేషన్‌లో మధ్యాహ్నం 03.25 నిమిషాలకు హాల్టింగ్ సౌకర్యం ఉంటుందని, ప్రయాణికులు ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవాలని రైల్వే అధికారులు తెలిపారు. ఇదిలాఉండగా కొన్ని రోజులుగా నిలిచిపోయిన కాజీపేట నుంచి డోర్నకల్ వెళ్లు డోర్నకల్ ప్యాసింజర్, కాజీ పేట నుంచి బల్లార్షా వెళ్లు రామగిరి ప్యాసింజర్ రైళ్లు బుధవారం నుంచి యథావిధిగా నడుస్తాయని రైల్వే అధికారులు తెలిపారు.

సౌత్ ఏషియా మాస్టర్స్ అథ్లెటిక్స్‌లో శ్రీధర్‌రెడ్డి సత్తా



వరంగల్ స్పోర్ట్స్, మే 6(ఆంధ్రజ్యోతి): మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 4నుంచి 6వ తేదీ వరకు నేపాల్ దేశంలోని పోఖరా నగరంలో నిర్వహించిన సౌత్‌ఏషియన్ మాస్టర్స్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో హనుమకొండకు చెందిన లక్కిరెడ్డి శ్రీధర్‌రెడ్డి అత్యుత్తమ ప్రతిభ కనబర్చి 2స్వర్ణాలు, రజత పతకం సాధించాడు. వివిధ దేశాల నుంచి వచ్చిన వెటరన్స్ అథ్లెట్ల పోటీతత్వాన్ని శ్రీధర్‌రెడ్డి ఎదుర్కొంటూ గెలుపే లక్ష్యంగా విజయదుందుభి మోగించాడు. మెన్ 50ప్లస్ 5, 10వేల మీటర్ల పరుగు పందెంలో ప్రథమ స్థానంలో నిలిచి రెండు స్వర్ణాలు పతకాలతో పాటు 1500 మీటర్ల పరుగు పందెంలో రజత పతకాన్ని కొల్లగొట్టాడు. ఈ మేరకు శ్రీధర్‌రెడ్డిని తెలంగాణ మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు లక్ష్మారెడ్డి, బాబురావులు అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

ప్రతిభావంతులకు మోషన్ కళాశాలలో ఉచిత విద్య

రాంనగర్, మే 6 (ఆంధ్రజ్యోతి): పదో తరగతిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నయీంనగర్ మోషన్ కళాశాలలో ఉచిత విద్యను అందించనున్నట్లు కళాశాల చైర్మన్ వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. 560 పైగా మార్కులు సాధించిన వారి ఫీజులో 100 శాతం రాయితీ, 540 నుంచి 560 మధ్యలో వచ్చిన వారికి 60 శాతం, 500 నుంచి 520 మధ్యలో వస్తే 25 శాతం రాయితీ ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ఐఐటీ, మెడికల్ సీట్లు సాధించడమే లక్ష్యంగా కోటా రాజస్థాన్‌కు చెందిన మోషన్ కళాశాల అత్యుత్తమైన అధ్యాపకులతో బోధిస్తున్నామన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ట్రాక్టర్ కిందపడి బాలుడి దుర్మరణం

మహదేవపూర్ రూరల్, మే 6(ఆంధ్రజ్యోతి) : చెత్తసేకరించే ట్రాక్టర్ కిందపడి రెండేండ్ల బాలుడు మృతి చెందిన ఘటన భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని పెద్దంపేట గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పెద్దంపేట గ్రామానికి చెందిన జనగామ శ్రావణ్ కుమారుడు శాన్విక్(2) ఆటాడుకుంటూ రోడ్డుపైకి వచ్చాడు. ఈ క్రమంలోనే చెత్త సేకరణకు ఆ వీధిలోకి వచ్చిన ట్రాక్టర్ బాలుడిపైకి ఎక్కడంతో తీవ్రగాయాలై రక్తస్రామయింది. గమనించిన కుటుంబసభ్యులు బాలుడిని మహదేవపూర్ ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు చెప్పారు. విధి నిర్వహ ణలో నిర్లక్ష్యం వహిస్తూ, అతివేగంగా ట్రాక్టర్ నడిపి తన కొడుకు మృతికి కారణమైన ట్రాక్టర్ డ్రైవర్‌పై చర్యలు తీసుకోవాలంటూ బాలుడి తండ్రి శ్రావణ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ట్రాక్టర్ డ్రైవర్ కురుసం రామకృష్ణపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు ఎస్సై పవన్‌కుమార్ తెలిపారు.

జాతీయ రహదారిపై మొక్కజొన్న రైతుల రాస్తారోకో

పాల్గొన్న 500 మందికిపైగా అన్నదాతలు ● గంటన్నరపాటు పూసూరు-ముళ్లెకట్ట వంతెనపై నిలిచిన రాకపోకలు



భూపాలపట్నం - హైదరాబాద్ జాతీయ రహదారిపై రాస్తారోకో చేస్తున్న రైతులు

వాజేడు, మే 6(ఆంధ్రజ్యోతి): నకిలీ మొక్కజొన్న విత్తనాలతో నష్టపోయిన రైతులు ఆందోళనకు నడుం బిగించారు. తమకు న్యాయం చేయాలంటూ జాతీయ రహదారిని నిర్బంధించి రాస్తారోకో చేపట్టారు. భూపాలపట్నం-హైదరాబాద్ 163వ జాతీయ రహదారి పూసూరు-ముళ్లెకట్ట వంతెన వద్ద మంగళవారం రాస్తారోకో నిర్వహించి రోడ్డుపై బైఠాయించారు. గంటన్నర పాటు మండుటెండలో సుమారు 500 మందికి నిరసన తెలిపారు. నకిలీ మొక్కజొన్న విత్తనాలతో పంటను సాగుచేసి నష్టపోయిన ఇద్దరు రైతులు ఆత్మహత్యలు చేసుకున్న వారి ఫోటోలు పట్టుకొని బాధిత కుటుం బాలకు, పంటను సాగు నష్టపోయిన రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. గత రెండు నెలల కాలం నుంచి నకిలీ విత్తనాలతో నష్టపోయిన రైతులు పలు ఆందోళన కార్యక్రమాలను నిర్వహించారు. ఈ క్రమంలో గత నెలలో జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు, జిల్లా కలెక్టర్, రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ సభ్యులు, రైతులతో మాట్లాడారు. బహుళ జాతి కంపెనీలకు చెందిన ఆర్గనైజర్లతో జిల్లా కలెక్టర్ పలు దశలలో చర్చలు జరిపి నష్టపరిహారం ఇచ్చేందుకు సిద్ధమయ్యారు. ఆర్గనైజర్లు తర్వాత వివిధ రకాల కొర్రీలు పెట్టడంతో రైతులు మళ్లీ ఆందోళన చేపట్టారు. రెండు మండలాలకు చెందిన రైతులు జాతీయ రహదారిపై బైఠాయించి ప్రభుత్వంకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఏజెన్సీ ప్రాంతంలో ఇంత జరుగుతున్న ముఖ్యమంత్రి, మంత్రులు, ఎమ్మెల్యే పట్టించుకోవడం లేదంటూ మండిపడ్డారు. ఆదివాసీ నవనిర్మాణ సేన రాష్ట్ర అధ్యక్షుడు కొర్సా నర్సింహ మూర్తి మాట్లాడుతూ.. రైతులకు న్యాయం జరిగే వరకు తమ పోరాటం ఆపేది లేదని, అవసరమైతే ప్రజాభవన్‌ను సైతం ముట్టడిస్తామని అన్నారు. ఐటీడీఏ పీవో చిత్రామిశ్రా రావాలని ఆయన డిమాండ్ చేశారు. జాతీయ రహదారిపై సుమారు గంటన్నర పాటు రాస్తారోకో నిర్వహిస్తున్న రైతులతో భద్రాచలం ఎమ్మెల్యే ఫోన్‌లో మాట్లాడారు. రైతులు అధైర్యపడొద్దని, నష్టపోయిన రైతులకు న్యాయం జరిగే వరకు తాను అండగా ఉంటానని రైతులకు తెలిపారు. ఈ విషయంపై ముఖ్యమంత్రి, మంత్రుల దృష్టికి తీసుకెళ్లి సంబంధిత ఆర్గనైజర్ల పై చర్యలు తీసుకునే విధంగా కృషి చేస్తానని ఆయన రైతులకు తెలిపారు. దీంతో శాంతించిన రైతులు ఆందోళన విరమించారు. ఇది ఇలా ఉండగా జాతీయ రహదారిపై రైతుల ఆందోళనతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సుమారు గంటన్నరపాటు సాగిన ఈ ఆందోళనతో పూసూరు-ముళ్లకట్ట వంతెనకు ఇరు వైపుల వందలాది వాహనాలు నిలిచిపోయాయి. చిన్నారులు, వృద్ధులు, దూరప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు మండుటెంటలో ఇబ్బందులు పడ్డారు. వెంకటాపురం సీఐ కుమార్, వాజేడు, వెంకటాపురం, మంగపేట ఎస్సైలు రాజ్‌కుమార్, తిరుపతిరావు, సూరిలు సంఘటన స్థలానికి చేరుకొని ఆందోళన చేస్తున్న రైతులకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు.



రాస్తారోకోతో నిలిచిపోయిన రహదారిపై భారీగా ట్రాఫిక్



కేటీఆర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు, గండ్ర, పెద్ది, నాయకులు

కేటీఆర్‌ను కలిసిన బీఆర్ఎస్ నేతలు

హనుమకొండ టౌన్, మే 6 (ఆంధ్రజ్యోతి): ఏప్రిల్ 27న ఎల్కతుర్తిలో నిర్వహించిన బీఆర్ఎస్ 25 ఏళ్ల రజతోత్సవ సభ విజయవంతం కావడంతో మంగళవారం ఉమ్మడి వరంగల్ జిల్లా బీఆర్ఎస్ నాయకులు మాజీ మంత్రి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను హైదరాబాద్‌లో కలిశారు. ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు పెద్ది సుదర్శన్‌రెడ్డి, గండ్ర వెంకటరమణారెడ్డి, మాజీ కార్పొరేషన్ చైర్మన్ వాసుదేవరెడ్డిలు కేటీఆర్‌కు పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. రజతోత్సవ సభ విజయవంతంలో ముఖ్యపాత్ర పోషించిన నాయకులకు కేటీఆర్ అభినందనలు తెలిపారు.

రైతుల ఆవేదనకు ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణం

ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు



శనిగపురంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శిస్తున్న ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు

మహబూబాబాద్ టౌన్, మే 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రైతుల ఆవేదనకు కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు అన్నారు. మహబూబాబాద్ మండలం శనిగపురం, ముడుపుగల్ గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను మంగళవారం సందర్శించి అక్కడి రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ రవీందర్‌రావు మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో రైతులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా ధాన్యం కొనుగోళ్లు చేశామని, కాంగ్రెస్ పాలనలో రైతులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. సీఎం రేవంత్‌రెడ్డి పాలనలో తెలంగాణకు అన్ని రకాలుగా అన్యాయం జరుగుతుందన్నారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన 16 నెలల కాలంలోనే కాంగ్రెస్ సర్కార్ విఫలమైందన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ మాజీ చైర్మన్ పాల్వాయి రాంమోహన్‌రెడ్డి, మాజీ వైస్ చైర్మన్ మార్నేని వెంకన్న, మంగళంపల్లి కన్న, జెరిపోతుల వెంకన్న, కందుకూరి వెంకటాద్రి, రాజు, శివ, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి సమ్మర్ క్రికెట్ క్యాంపు ప్రారంభం

క్రికెట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు అజయ్‌సారథిరెడ్డి

మహబూబాబాద్ టౌన్, మే 6 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్(హెచ్‌సీఏ) ఆధ్వర్యంలో వరంగల్ జిల్లా క్రికెట్ అసోసియేషన్(డబ్ల్యూడీసీఏ) సహకారంతో మే 8న సాయంత్రం 4 గంటలకు జిల్లా కేంద్రంలోని కృష్ణవేణి కిడ్స్ స్కూల్ పక్కన గల క్రీడా మైదానంలో క్రికెట్ సమ్మర్ కోచింగ్ క్యాంపు ప్రారంభిస్తున్నట్లు మహబూబాబాద్ క్రికెట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బి.అజయ్‌సారథిరెడ్డి తెలిపారు. మహబూబాబాద్‌లో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అండర్-14, అండర్-16, అండర్-19 వయస్సు గ్రూపునకు సంబంధించిన క్రికెట్ క్రీడాకారులు క్యాంపులో పాల్గొనేందుకు అర్హులని చెప్పారు. హెచ్‌సీఏలో ఆన్‌లైన్ చేసుకున్న క్రీడాకారులు మాత్రమే క్యాంపునకు హాజరు కావాలని సూచించారు. ఇతర వివరాలకు 98664 79666, 98852 67524 నంబర్లను సంప్రదించాలన్నారు. ఈ సమావేశంలో ప్రధాన కోచ్ మెతుకు కుమార్, సహాయ కోచ్ తోట వినయ్, రావుల నవీన్‌రెడ్డి, క్రీడాకారులు అనిర్వేశ్, ధర్మచరణ్‌రెడ్డి, జయనీల్, హర్ష పాల్గొన్నారు.

అన్నీ ఉన్నా..

సరస్వతీ పుష్కరాల పనులకు గ్రహణం

- నిధులు మంజూరైనా ఫలితం శూన్యం
- ఇంకా పెండింగ్‌లోనే ప్రధాన పనులు
- ఈనెల 15న కాళేశ్వరంలో ప్రారంభం కానున్న పుష్కరాలు

మహదేవపూర్, మే 6 (ఆంధ్రజ్యోతి): 'అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని' అన్న చందాన ఉంది సరస్వతీ పుష్కరాల పనుల పరిస్థితి. రాష్ట్రంలో కాళేశ్వరం వద్ద మాత్రమే జరిగే ఈ పుష్కరాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలని ఆదేశించిన ప్రభుత్వం రూ.25 కోట్లు మంజూరు చేసింది. కానీ అధికారుల అలసత్వం.. సరైన ప్రణాళిక లేకపోవడం, శాఖల మధ్య సమన్వయ లోపం కారణంగా అభివృద్ధి పనులు ఒక అడుగు ముందుకు నాలుగు అడుగులు వెనకకు అన్నట్లుగా సాగుతున్నాయి. పలుమార్లు మంత్రి శ్రీధర్‌బాబు స్వయంగా పనులను పరిశీలించినా అధికారుల్లో ఏ మాత్రం చలనం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. 15వతేదీ నుంచి పుష్కరాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో పెండింగ్‌లో ఉన్న పనులపై సర్వత్రా చర్చ జరుగుతోంది.



పూర్తి కాని ఆర్చి పనులు

పుష్కరఘాట్ వద్ద ఏర్పాటు చేసిన ఆర్చి పనులు ఇంకా పూర్తి కాలేదు.. అంతేగాకుండా ఆర్చి నిర్మాణం కోసం ఏర్పాటు చేసిన సెంట్రింగ్ కర్ర రహదారికి అడ్డంగా ఉండడంతో భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. రూ.40 లక్షలతో ఏర్పాటు చేస్తున్న ఆర్చి నిర్మాణం ఇంకా పూర్తి కాకపోవడంపై పలు విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

రూ.40 లక్షలతో నిర్మాణంలో ఉన్న ఆర్చి



పూర్తికాని వంద గదుల వసతి గృహం

అసంపూర్తిగా వంద గదుల వసతి గృహం

కాళేశ్వరానికి వచ్చే భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఉండేందుకు గాను వంద గదుల వసతి గృహం పనులను నాలుగేళ్ల క్రితం ప్రారంభించారు. ఆ పనులు నత్తనడకన సాగుతున్నాయి. బిల్డింగ్ పూర్తయినా ఇంకా లోపల పనులు అసంపూర్తిగా ఉండడంతో బిల్డింగ్ అక్కరకు రాకుండాపోతోంది.

క్యూరింగ్‌కు నోచుకోని సీసీ రోడ్డు

ఆలయం ఆవరణ, ఆలయం చుట్టు పక్కల పరిసరాల్లో రోడ్డును వేసి వదిలేశారు. క్యూరింగ్ చేయకపోవడంతో వేసిన కొద్దిరోజులకే రోడ్డు అధ్వానంగా తయారవుతోంది. ఇప్పటికైనా క్యూరింగ్ చేయాలని స్థానికులు కోరుతున్నారు.



క్యూరింగ్ చేయకుండా వదిలేసిన సీసీ రోడ్డు



కాళేశ్వరాలయం ముందు ఉన్న మట్టి, రాళ్లకుప్పలు

ఆలయం ఎదుట మట్టి, రాళ్ల కుప్పలు..

కాళేశ్వరం ఆలయం ఎదుట రహదారి సీసీ పోసే క్రమంలో మట్టి, రాళ్లను తొలగించి కుప్పలుగా పోశారు. ఇంతవరకు వాటిని తొలగించలేదు. భక్తుల రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయి.

పూర్తవని వాటర్ ట్యాంకు పనులు

కాళేశ్వరానికి వచ్చే భక్తులకు తాగునీటి ఇబ్బందులు లేకుండా ఉండేందుకు గాను వాటర్ ట్యాంక్‌ను ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ఆ పనులు ఇంతవరకూ పూర్తికాలేదు. అసంపూర్తిగానే మిగిలి పోయాయి.



మధ్యలోనే ఆగిన వాటర్ ట్యాంకు పనులు



సిద్ధం కాని స్వామీజీల విడిది గృహం..

పుష్కరాలకు వచ్చే స్వామీజీలు ఉండేందుకు గాను త్రివేణి వసతి గృహాన్ని సిద్ధం చేస్తున్నారు. కొన్ని మరమ్మతు పనులు ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయి. గదుల్లో అపరిశుభ్రంగానే ఉన్నాయి. స్వామీజీలు వచ్చే వరకైనా పనులు పూర్తి చేయాల్సి ఉంది.

స్వామీజీలు ఉండే త్రివేణి వసతి గృహం

రాజమండ్రి నుంచి పారిశుధ్య కార్మికులు

పుష్కరాల నిర్వహణకు గాను ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం రాజమండ్రి నుంచి 200 మందికి పైగా కార్మికులు రానున్నారు. ప్రస్తుతం 50మంది కార్మికులు విధుల్లో చేరారు. ఎప్పటికప్పుడు చెత్తను తొలగిస్తూ రహదారులను శుభ్రం చేస్తున్నారు.



రాజమండ్రి నుండి వచ్చిన పారిశుధ్య కార్మికులు



మంత్రులను సన్మానిస్తున్న కాళేశ్వరాలయ అర్చకులు నాగేశ్వర్‌శర్మ

సరస్వతీ పుష్కరాలకు పటిష్ఠ ఏర్పాట్లు చేయండి

- భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగొద్దు
- అధికారులకు మంత్రులు కొండా సురేఖ, శ్రీధర్‌బాబు ఆదేశాలు
- పుష్కరాల నిర్వహణపై సచివాలయంలో సమీక్ష

మహదేవపూర్, మే 6 (ఆంధ్రజ్యోతి) : కాళేశ్వరం త్రివేణి సంగమం వద్ద ప్రవహించే అంతర్వాహిని సరస్వతీ నదీ పుష్కరాలకు పటిష్ఠ ఏర్పాట్లు చేయాలని, పుష్కరాలకు వచ్చే లక్షలాది భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగనీయొద్దని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు జిల్లా అధికారులను ఆదేశించారు. కాళేశ్వరంలో సరస్వతీ పుష్కరాలకు జరుగుతున్న ఏర్పాట్లు, నిర్వహణపై మంత్రి సురేఖ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలోని ఆమె కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. మంత్రులు సురేఖ, శ్రీధర్‌బాబు మాట్లాడుతూ ఈ నెల 15వతేదీ నుంచి 12రోజుల పాటు జరిగే త్రివేణి సంగమ పుష్కరాలకు లక్షలాది మంది భక్తులు తరలిరానున్నారని, తెలంగాణ స్వరాష్ట్రంగా ఏర్పడిన తరువాత తొలిసారి పుష్కరాలు వచ్చాయన్నారు. మే 14 రాత్రి 10.35 గంటలకు బృహస్పతి మిథున రాశిలోకి ప్రవేశించే సమయంలో పుష్కరాలు ప్రారంభమవుతాయని, ఈ సందర్భంగా ప్రతీ రోజు ఒక పీఠాధిపతి పుణ్య స్నానం చేయనున్నట్లు తెలిపారు. పుష్కర ప్రారంభం మే 15న తేదీన శ్రీ గురుమదనాంద సరస్వతి పీఠం, మెదక్ నుంచి శ్రీ మాధవనాంద సరస్వతి పుష్కరాలను ప్రారంభిస్తారని తెలిపారు. పుష్కరాల పనుల్లో అలసత్వం వహించొద్దని, ఏమాత్రం నిర్లక్ష్యం వహించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆర్‌డబ్ల్యూఎస్, విద్యుత్‌శాఖ, పంచాయతీరాజ్, దేవాదాయశాఖ, ఇరిగేషన్, పోలీసు శాఖ, రెవెన్యూ, వైద్యం తదితర శాఖల అధికారులంతా సమన్వయంతో పనిచేయాలన్నారు. శారద మండపం, వీఐపీ ఘాట్, అమ్మవారి విగ్రహాన్ని పెట్టే స్థలాన్ని తాత్కాలిక రోడ్డు, ప్రధాన ఘాట్ పనుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. మరుగుదొడ్లు, స్నానపు గదులు పూర్తి కాకపో వడంపై ప్రశ్నించారు. సమయం చాలా తక్కువగా ఉందని, ఆశించిన స్థాయిలో పనులు జరగలేదని, పెండింగ్ పనులను వెంటనే అధికారులు గుర్తించి పక్కా కార్యాచరణతో, నాణ్యతతో మే 10లోపు అభివృద్ధి పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. పనుల్లో వేగం పెంచాలని, రేయింబవళ్లు పనులు చేయించాలన్నారు. బస్టాండ్ నుంచి పుష్కరఘాట్, దేవాలయం, ఇతర ప్రాంతాలకు ట్రాఫిక్ విధానంపై ఎస్పీ కిరణ్‌ఖరేతో మంత్రి చర్చించారు. ఈ సమీక్ష సమావేశంలో భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, సీఎస్ రామకృష్ణారావు, డీజీపీ జితేందర్, దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యార్, ఆర్ అండ్‌బీ ప్రిన్సిపల్ సెక్రటరి వికాస్‌రాజ్, పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ సెక్రటరీ లోకేష్, భూపాలపల్లి కలెక్టర్ రాహుల్‌శర్మ, జిల్లా ఎస్పీ కిరణ్‌ఖరే ఆలయ ఈవో మహేష్, ఆలయ అర్చకులు పాల్గొన్నారు



సమీక్షలో మాట్లాడుతున్న మంత్రులు సురేఖ, శ్రీధర్‌బాబు

నీళ్లశాఖలో.. అవినీతి తిమింగలాలు!

(5వ పేజీ తరువాయి)

పనులను పర్యవేక్షించే ఓ అధికారి కమీషన్లకు కక్కుర్తి పడి కాంట్రాక్టు ఏజెన్సీలనే తన బుట్టలో వేసుకున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. నీటిపారుదల శాఖలో తనకున్న పలుకుబడిని వినియోగించుకుని తన అనుచరులకు వివిధ పాయింట్లలో పోస్టింగ్‌లు ఇప్పించుకున్నట్టు సమాచారం. వీరితో కాంట్రాక్టు ఏజెన్సీల నుంచి భారీ మొత్తంలో వసూళ్లకు పాల్పడ్డారనే ఆరోపణలున్నాయి. పనులు పూర్తికాకున్నా ఎంబీ రికార్డు తయారు చేసి ఇవ్వటం, అంచనాలు ఎక్కువగా వేయటంతో పాటు ఇతర అక్రమ మార్గాల్లో వందల కోట్లు కూడకట్టుకున్నారనే ప్రచారం జరుగుతోంది. ములుగు జిల్లాలో పని చేయాల్సిన సదరు అధికారి హనుమకొండ, హైదరాబాద్‌లో అనధికారికంగా కార్యాలయాలు నిర్వహిస్తున్నారని, కుటుంబ సభ్యులు, బినామీ పేర్లతో భారీగా వెనుకేసుకున్నారనే చర్చ జరుగుతోంది. అవినీతి నిరోధక శాఖ అధికారులు దేవాదుల ప్రాజెక్టులోని అక్రమార్కులపై దృష్టిపెడితే చాలామంది హరిరామ్‌లు వెలుగు లోకి వస్తారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

డీజిల్‌ని కూడా వదలని అక్రమార్కులు

దేవాదుల ప్రాజెక్టులో మరో అక్రమ అధికారి లీలలు ఇవి. గత శనివారం హనుమకొండ జిల్లా దేవన్నపేటలోని దేవాదుల ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన పంప్‌హౌస్‌ను మంత్రులు, ఎమ్మెల్యేలు సందర్శించారు. అధికారయంత్రాంగం మొత్తం పంప్‌హౌస్ పరిశీలనలో నిమగ్నమవ్వగా, కాంట్రాక్టు కంపెనీకి చెందిన డీజిల్ ట్యాంకర్ నుంచి డీజిల్‌ను దేవాదుల ప్రాజెక్టులో ఓ కీలక అధికారి కారులో నింపారు. తమకు బిల్లులు చేసే అధికారి కాబట్టి వచ్చిన ప్రతిసారి సదరు సార్ కారులో డీజిల్ నింపటం సాధారణమేనని సదరు ఉద్యోగులు పేర్కొంటున్నారు. అయితే అది ప్రభుత్వ వాహనమే కాగా.. అందులో డీజిల్ కూడా ప్రభుత్వమే భరిస్తుంది. అలాంటప్పుడు కాంట్రాక్టు కంపెనీ డీజిల్‌ను నొక్కేసి, పెట్రోల్ బంకులో నకిలీ బిల్లు తీసుకుని సొమ్ము చేసుకునే ప్రయత్నమే అనే చర్చ జరుగుతోంది. ఇది ఆ ఒక్క కీలక అధికారే కాదు.. మరికొంతమంది అధికారులు సదరు కాంట్రాక్టు కంపెనీ నుంచి డీజిల్‌ను తీసుకోవటం కామన్ అనే చర్చ జరుగుతోంది. అంతేకాకుండా కొన్నాళ్లుగా నిధులు లేక దేవాదుల మూడో విడత పనులు ముందుకు సాగలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత దేవాదుల మూడో విడత పనులకు నిధులు కేటాయించింది. పనులు త్వరగా పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేస్తుంటే.. చేసిన పనులకు బిల్లుల కావాలంటే.. అంటూ ఓ అధికారి చిలక్కొట్టుడు కొడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దేవాదుల ప్రాజెక్టులో వరంగల్, ములుగు సర్కిల్ పరిధిలో పని చేస్తున్న కొంతమంది అధికారులపై ఏసీబీ అధికారులు నిఘా పెడితే.. దేవాదుల ప్రాజెక్టులోనూ కాళేశ్వరం హరిరామ్‌లు వెలుగులోకి వస్తారనే చర్చ జరుగుతోంది.

విద్యుత్ ప్రమాదాలను నివారిద్దాం..

- నడుంబిగించిన ఎన్‌పీడీసీఎల్ సిబ్బంది
- భద్రతా సూత్రాలు తెలియజేసేలా వాల్‌పోస్టర్లు
- విద్యుత్ ఉద్యోగులు, వినియోగదారులకు అవగాహన సదస్సులు
- నేటితో ముగియనున్న కార్యక్రమాలు

రాంనగర్, మే 6 (ఆంధ్రజ్యోతి) : ప్రతీ ఏడాది కరెంట్ షాక్‌తో ఏదో ఒక ప్రాంతంలో మనుషులతో పాటు మూగజీవాలు ప్రాణాలు కోల్పోతున్నాయి. ఆ ప్రమాదాల్లో జరిగే మరణాలను నివారించేందుకు, వినియోగదారులు, విద్యుత్ సిబ్బందికి కరెంట్ షాక్‌పై అవగాహన కల్పిస్తున్నారు. టీజీ ఎన్పీడీసీఎల్ ఆధ్వర్యంలో ఈ నెల 1న ప్రారంభమైన కార్యక్రమాలు బుధవారంతో ముగియనున్నాయి. అయితే వారోత్సవాలకు సంబంధించి ఏప్రిల్ 30న సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి కార్పొరేట్ కార్యాలయంలోని తన చాంబర్‌లో ఇన్‌చార్జ్ డైరెక్టర్‌లతో కలిసి కరపత్రాలు, వాల్‌పోస్టర్స్ ఆవిష్కరించారు. ఎన్పీడీసీఎల్ పరిధిలోని 16 సర్కిల్స్‌లో విస్తృతంగా విద్యుత్ ప్రమాదాలపై అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు.

సర్కిళ్లకు సామగ్రి

వినియోగదారులు, సిబ్బందికి అవగాహన కల్పించడంలో భాగంగా విద్యుత్‌షాక్‌కు గురికాకుండా ఏ విధంగా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి అనే అంశంపై 'విద్యుత్ ప్రమాదాల నుంచి రక్షించుకుందాం.. భద్రత సూచనలు పాటిద్దాం' అని ముద్రించిన కరపత్రాలు, వాల్‌పోస్టర్స్ మే 1కంటే ముందే ఎన్పీడీసీఎల్ పరిధిలోకి వచ్చే ఉమ్మడి జిల్లాలైన వరంగల్, ఖమ్మం, కరీంగనర్, నిజామాబాద్, అదిలాబాద్‌లోని 16 సర్కిళ్ల అధికారులకు కార్పొరేట్ కార్యాలయం నుంచి అందజేశారు. డివిజన్ల వారీగా ఓఅండ్ఎం సిబ్బందికి ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి అనే దానిపై అవగాహన కల్పిస్తున్నారు. ప్రజలకు అవగాహన కలిగే విధంగా రద్దీ ప్రాంతాల్లో భద్రతా సూత్రాలు తెలియజేసే కరపత్రాలు పంపిణీ చేయడంతో పాటు వాల్‌పోస్టర్స్‌ను అతికిస్తున్నారు.



భద్రత సూత్రాలు పాటిస్తామని ప్రతిజ్ఞ చేస్తున్న విద్యుత్ సిబ్బంది (ఫైల్)

విద్యుత్ షాక్‌కు గురవకుండా పాటించే సూత్రాలు

- తెగిపడిన, వేలాడుతున్న, వదులుగా మరియు తక్కువ ఎత్తులో ఉన్న విద్యుత్ తీగలను తాకొద్దు. గమనించిన వెంటనే సంబంధిత విద్యుత్ సిబ్బందికి తెలియజేయాలి
- బట్టలు ఆరేసే దండెం వైర్ల నుంచి విద్యుత్ వైర్లు వెళ్లడం వలన విద్యుత్ వైర్లలో ఇన్సులేషన్ సరిగ్గా లేకపోవడం వలన విద్యుత్ సరఫరా వచ్చి షాక్‌కు గురయ్యే ప్రమాదం ఉంది. కనుక ప్లాస్టిక్ దండెంలను ఉపయోగించాలి
- విద్యుత్ సరఫరా వైర్లను ఎట్టిపరిస్థితుల్లో దండెంలకు, రేకులకు తగలకుండా జాగ్రత్త వహించాలి.
- పశువులను మేతకు తీసుకెళ్లేటప్పుడు ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ స్తంభాల దగ్గరికి కాపరి వాళ్ల జాగ్రత్త వహించాలి.
- సెల్‌ఫోన్ చార్జింగ్ పెట్టి తడిచేతులతో తాకి మాట్లాడటం వలన షాక్‌కు గురవుతారు. చార్జింగ్ బంద్ పెట్టి మాట్లాడాలి.
- వేసవికాలంలో ఇనుప కూలర్లు వినియోగించే సమయంలో అత్యంత జాగ్రత్త వహించాలి. చిన్నపిల్లలు దగ్గరికి వెళ్లకుండా జాగ్రత్తగా చూడాలి.
- కూలర్లలో వైరింగ్ సరిగ్గా ఉండేలా ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలి. ప్లాస్టిక్ కూలర్లు వాడటం మేలు. ఎవరికైనా కరెంట్ షాక్ సంభవిస్తే తాకరాదు. షాక్‌కు గురైన వ్యక్తిని కర్ర లేదా ప్లాస్టిక్ వస్తువులను ఉపయోగించడం సరైన పరిష్కారం.
- గృహాల్లో నాణ్యమైన వైరింగ్, నాసిరకం విద్యుత్ పరికరాలను వాడటం వలన రైతులు స్విచ్‌బోర్డులు, మోటార్ స్టార్టర్‌ల దగ్గర ప్రమాణాలు పాటించకపోవడం వలన విద్యుత్ ప్రమాదాలు తరుచుగా జరుగుతున్నాయి.
- వ్యవసాయ పంపుసెట్లను వినియోగించినప్పుడు కరెంట్ మోటార్లు, ఫుట్‌వాల్వ్‌లు, సర్వీసు వైర్లకు ఇన్సులేషన్ సరిగ్గా లేకపోవడంతో విద్యుత్ సరఫరా జరిగి ప్రమాదాలు జరుగుతున్నాయి. అందుకే ఫుట్‌వాల్వ్‌లను, సర్వీస్ వైర్లను తాకొద్దు. రైతులు స్వతహాగా మరమ్మతులను చేయొద్దు.
- విద్యుత్ కంచెల వలన ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ఏవరైనా విద్యుత్ కంచెలను ఏర్పాటు చేస్తే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలి. కంచెల ఏర్పాటు చట్టరీత్యా నేరం.
- ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద అనధికారికంగా ఫ్యూజులు మార్చడం, రిపేరు చేయడం, ఏబీ స్విచ్‌లు ఆపరేట్ చేయడం, కాలిన తీగలను సరిచేయడం ప్రమాదకరం. విద్యుత్ సిబ్బందికి తెలియజేసి మరమ్మతులు చేయించుకోవాలి.
- వ్యవసాయ మోటార్లు, గృహాల్లో అతుకులు లేని సర్వీసు వైర్లను మాత్రమే ఉపయోగించాలి
- విద్యుత్ సమస్యలు తలెత్తితే 1912 టోల్‌ఫ్రీ నెంబర్‌ను సంప్రదించాలి.

సాగు ఇక బాగు

- రైతులతో శాస్త్రవేత్తల ముఖాముఖి
- ఆరు అంశాలపై అవగాహన
- మొదటిసారిగా ఐనవోలులో ప్రారంభం
- ఈనెల 13వ తేదీ వరకు నిర్వహణ

హనుమకొండ, మే 6 (ఆంధ్రజ్యోతి): రైతులకు వ్యవసాయంలో మెళకువలు నేర్పడానికి, సాగులో అనుసరించాల్సిన పద్ధతుల గురించి అవగాహన కల్పించడానికి ప్రభుత్వం మొదటి సారిగా 'రైతు ముంగిట్లోకి శాస్త్రవేత్తలు' పేరుతో కొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో నిర్వహించే ఈ కార్యక్రమం సోమవారం హనుమకొండ జిల్లా ఐనవోలులో ప్రారంభమైంది. ఈనెల 13వ తేదీ వరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఈనెల 13 వరకు గ్రామాల్లో అన్నదాతల వద్దకు వెళ్లి అవగాహన సదస్సులు పెడతారు. వ్యవసాయ శాఖ సహకారంతో ఎంపిక చేసిన గ్రామాల్లో ములుగు రోడ్డులోని వ్యవసాయ పరిశోధనా స్థానం శాస్త్రవేత్తల బృందం పర్యటిస్తుంది. ఈ ముఖాముఖీ కార్యక్రమంలో పంటల వారీగా రైతులకు సూచనలు, సలహాలు ఇవ్వనున్నది. వరంగల్ జిల్లాతో పాటు మధ్య తెలంగాణ మండలి పరిధిలోని ఉమ్మడి ఖమ్మం, మెదక్ జిల్లాల్లోనూ ఈ అవగాహన సదస్సులను నిర్వహిస్తారు. ఇందుకోసం ప్రత్యేకంగా 50 నుంచి 70 వరకు శాస్త్రవేత్తల బృందాలను ఏర్పాటు చేశారు. ప్రతీ బృందంలో ఇద్దరు శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ అధికారులు, వ్యవసాయ విద్యార్థులు, ఇతర స్థానిక ప్రభుత్వ శాఖల సిబ్బంది, అభ్యుదయ రైతులు ఉంటారు. ఒక్కో బృందం రోజువారి కార్యక్రమాన్ని నిర్వహించడంతో పాటు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఎంపిక చేసుకున్న గ్రామాల రైతులకు అవగాహన సదస్సులు నిర్వహిస్తారు.



ఐనవోలు రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమం

సాగుపైనే దృష్టి

ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఈ కార్యక్రమాన్ని అనుభవజ్ఞులైన శాస్త్రవేత్తల బృందంతో ఈ పని చేయించేందుకు ముందుకు వచ్చింది. పరిమితికి లోబడి రసాయన ఎరువుల వినియోగం, ముఖ్యంగా యూరియా అవసరం మేరకే వినియోగించడం, సాగునీటి ఆదా చేస్తూ సద్వినియోగం చేసుకోవడం, భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకొని నీటి నిల్వలు పెంపొందించకోవడం, దశాబ్దాల తరబడి ఒకే రకమైన పంటలు పండిస్తే నేలకు కలిగే నష్టాలు, పంట మార్పిడి వల్ల కలిగే ప్రయోజనాలు, పంట నష్టపోయినప్పుడు కలిగే ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని ఎరువులు, విత్తనాలు, పురుగుమందు కొనుగోళ్లలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, రశీదులు తప్పనిసరిగా తీసుకోవాల్సిన ఆవశ్యకత, సుస్థిర వ్యవసాయం, పర్యావరణ పరిరక్షణ తదితర అంశాలపై ఈ సదస్సుల్లో అవగాహన కల్పిస్తారు. ఒక్కో అంశానికి సంబంధించి నిపుణులతో రైతుల సందేహాలను నివృత్తి చేస్తారు.

రైతులు సద్వినియోగం చేసుకోవాలి

రైతు ముంగిట శాస్త్రవేత్తలు కార్యక్రమం వినూత్నమైంది. రైతులు సద్వినియోగం చేసుకోవాలి. ఈ కార్యక్రమం ద్వారా రైతులు ఎదుర్కొంటున్న అనేక సవాళ్లకు సలహాలతో పాటు వ్యవసాయంలో రోజు రోజుకూ పెరుగుతున్న ఖర్చులను తగ్గించుకోవడానికి అవసరమైన సూచనలు, సలహాలు ఇస్తారు. యాంత్రీకరణ, సుస్థిర వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పిస్తారు. ఈ కార్యక్రమంలో రైతులు పెద్దసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలి.

- ఆర్.ఉమారెడ్డి, వ్యవసాయ శాస్త్రవేత్త, ఏడీఆర్, ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం

సుందరీమణుల కోసం రక్షణ చర్యలు

- రామప్పలో వేటి నుంచీ హాని జరగకుండా జాగ్రత్తలు
- కోతులు, పాములు, తేనెటీగలు లేకుండా చేస్తున్న అటవీ సిబ్బంది

వెంకటాపూర్, మే 6, (ఆంధ్రజ్యోతి) : విఎస్‌వరల్డ్ పోటీదారులు ఈనెల 14న రామప్పను సందర్శించనున్న నేపథ్యంలో ఆ సుందరీమణుల కోసం పటిష్ఠ రక్షణ చర్యలు తీసుకుంటున్నారు. వారికి ఏ రకంగానూ ఎలాంటి హాని ఎదురవకుండా ములుగు అటవీశాఖ అధికారులు చర్యలు చేపడుతున్నారు. మంగళవారం వెంకటాపూర్ మండలంలోని పాలంపేటలో గల రామప్ప దేవాలయ ఆవరణతో పాటు పాలంపేట సమీపంలోని కేన్ ప్రాంతం, హరిత హోటల్ సమీపంలో, సరస్సుకు ఇరువైపులా ఉన్న ప్రాంతాల్లోని కోతులను బోన్లలో బంధించారు.

ఇక బుధవారం పాములు ఉండేందుకు అవకాశం ఉన్న ప్రాంతాలు తేనెతెట్టెలు ఉన్న వృక్షాలను గుర్తించనున్నారు. అయితే తాము పట్టిన కోతులు, పాములను తాడ్వాయి అటవీ ప్రాంతంలో వదిలేస్తామని, అలాగే తేనెతుట్టెలను కూడా తొలగిస్తామని ములుగు జిల్లా ఫారెస్ట్ రేంజర్ డోలి శంకర్ తెలిపారు. అదే విధంగా జంగాళపల్లి నుంచి రామప్ప దేవాలయం వరకు రోడ్డుకిరువైపుల సూమారు మూడు మీటర్ల ఎత్తు చెట్లతో రహదారి వెంట పచ్చదనాన్ని నింపుతామన్నారు. ఆయన వెంట డీఆర్‌వో మధుబాబు, బేస్‌క్యాంపు సిబ్బంది శంకర్, రమేష్, రాజేష్, రాంరెడ్డి తదితరులున్నారు.



రామప్ప దేవాలయం ఆవరణలోని కోతులను బోనులో బంధించిన దృశ్యం

కాజీపేట బస్టాండ్ నిర్మాణానికి మార్గం సుగమం

కాజీపేట, మే 6 (ఆంధ్రజ్యోతి): కాజీపేట నూతన బస్టాండ్ ఏర్పాటుకు వేగంగా అడుగులు పడుతున్నాయి. ఈ మేరకు బస్టాండ్ నిర్మాణం కోసం స్థల కేటాయింపు విషయంలో త్వరితగతిన నిర్ణయం తీసుకోవాలని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్‌ను వరంగల్ ఎంపీ కడియం కావ్య కోరారు. ఈ మేరకు కాజీపేట బస్టాండ్ నిర్మాణం కోసం కేటాయించిన స్థలానికి ప్రత్యామ్నాయంగా అంతే విలువైన భూమిని కేటాయించాలని రైల్వే జీఎం కోరారు. దీంతో మడికొండలోని ప్రభుత్వ భూమిని కేటాయించారని ఎంపీ తెలిపారు. కాజీపేటలోని ఫాతిమా బ్రిడ్జి నిర్మాణ పనులను వేగంగా పూర్తి చేయాలని కోరడంతో కొనసాగుతున్నాయని ఎంపీ కావ్య వివరించారు.

వేసవిలో రక్షణ చర్యలు పాటించాలి

మడికొండ, మే 6 (ఆంధ్రజ్యోతి): వేసవిలో ప్రజలు రక్షణ చర్యలు పాటించాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ విజయ్‌కుమార్ సూచించారు. మంగళవారం కాజీపేట మండలం కడిపికొండ పీహెచ్‌సీ పరిధిలోని కుమ్మరిగూడాన్ని ఆయన సందర్శించి ప్రజలతో మాట్లాడారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే నాణ్యమైన వైద్యం అందుతుందని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఆయన వెంట డెమో అశోక్‌రెడ్డి తోపాటు ఆశ వర్కర్లు ఉన్నారు.



ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న డాక్టర్ కాజీపేట తిరుమలయ్య, డాక్టర్ ఎన్ఎస్ఆర్ మూర్తి

జాతీయ నాటిక పోటీలను జయప్రదం చేయాలి

వడ్డెపల్లి, మే 6 (ఆంధ్రజ్యోతి): వరంగల్ పోతన విజ్ఞాన పీఠంలో ఈ నెల 13 నుంచి 15 వరకు ప్రదర్శించే జాతీయ స్థాయి తెలుగు నాటిక పోటీలను జయప్రదం చేయాలని వరంగల్ రంగస్థల కళాకారుల ఐక్య వేదిక జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కాజీపేట తిరుమలయ్య, ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎన్ఎస్ఆర్ మూర్తి తెలిపారు. మంగళవారం హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లా డారు. ప్రతీ రోజు సాయంత్రం 7 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు నాటిక ప్రదర్శనలు ఉంటాయని పేర్కొన్నారు. వరంగల్ ఉమ్మడి జిల్లాలోని కవులు, కళాకారులు, సాహితీ ప్రియుల అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని వారు కోరారు. సమావేశంలో ఐక్య వేదిక ఉపాధ్యక్షుడు వేముల ప్రభాకర్, బిటవరం శ్రీధరస్వామి, సంయుక్త కార్యదర్శులు కుసుమ సుధాకర్, కుడికాల జనార్థన్, కోశాధికారి సాదుల సురేష్, మాలి విజయ్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

రాంనగర్, మే 6 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ టవర్ లైన్ పనుల దృష్ట్యా బాలసముద్రం సబ్‌స్టేషన్ పరిధిలోని హనుమకొండ చౌరస్తా, న్యూబస్ స్టేషన్, ప్రెస్‌క్లబ్, కుడా కాంప్లెక్స్, కాకాజీకాలనీ, గాంధీనగర్, కాంగ్రెస్‌భవన్, అశోక హోటల్, సీపీరెడ్డి కాంప్లెక్స్, జీవన్‌లాల్ కాంప్లెక్స్, హనుమకొండ పీఎస్ పరిసరాల్లో ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా జరగదని హనుమకొండ టౌన్ డీఈ జి. సాంబరెడ్డి తెలిపారు.

మాతో మాట్లాడి హామీలు ఇచ్చారా..?

సీఎం రేవంత్‌రెడ్డిని ప్రశ్నించిన ట్రెంగ రాష్ట్ర అధ్యక్షుడు రవి

రాంనగర్, మే 6 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల హామీలను ఉద్యోగ సంఘ నాయకులతో మాట్లాడి ప్రకటించారా...? అని సీఎం రేవంత్‌రెడ్డిని తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయిస్ నాన్‌గెజిటెడ్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కొండమల్ల రవి ఒక ప్రకటనలో ప్రశ్నించారు. రాష్ట్రంలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు అవసరం లేదా..? వారికి కుటుంబసభ్యులు ఉంటారనే విషయాన్ని మరిచి నోరు మూయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి ఉద్యోగుల పట్ల పునరాలోచన చేసి పెండింగ్ బిల్లులు, డీఏలను వెంటనే విడుదల చేయాలని కోరారు.

మాతృ మరణాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి



మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ డాక్టర్ అప్పయ్య

వరంగల్ మెడికల్, మే 6 (ఆంధ్రజ్యోతి): మాతృ మరణాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని హనుమ కొండ డీఎంహెచ్ఓ డాక్టర్ అప్పయ్య అన్నారు. మంగళవారం డీఎంహెచ్ఓ కార్యాలయలో 2024-25 సంవత్సరంలో జిల్లాలో సంభవించిన రెండు మాతృమరణాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. సోమిడి, శాయంపేట పరిధిలోని గట్లకానిపర్తిలో జరిగిన మాతృ మరణాలకు గల కారణాలను సమీక్షించారు. ఇక ముందు ఇలాంటి జరగకుండా ఎలాంటి చర్యలు తీసుకోవాలి, గుర్తించిన లోపాలను సరిదిద్దడం లాంటి చర్యలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో జీఎంహెచ్ ప్రొఫెసర్ డాక్టర్ రాజేశ్వరి, సీకేఎం డాక్టర్ స్వప్న, డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ విజయ్ కుమార్, డాక్టర్ ఏ.మహేందర్, డాక్టర్ మంజుల, డాక్టర్ ఆశాలత, డాక్టర్ నిఖిల, డాక్టర్ సాయికృష్ణ, డాక్టర్ అనిత, ప్రసన్న కుమార్, విజయలక్ష్మీ, అశోక్‌రెడ్డి, సురేఖ, సుప్రియ తదితరులు పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలి..

హనుమకొండ చౌరస్తా, మే 6 (ఆంధ్రజ్యోతి) : దేశంలోని జాతీయ కార్మిక సంఘాలు, ప్రభుత్వ ఉద్యోగ, ప్రైవేట్ సంఘాల ఆధ్వర్యంలో ఈ నెల 20న బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిర్వహించతలపెట్టిన దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు సారంగపాణి పిలుపునిచ్చారు. మంగళవారం హనుమకొండ చౌరస్తాలోని షాపింగ్‌మాల్స్ యాజమానులకు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సమ్మె నోటీసులను అందజేశారు. ఈ మేరకు హనుమకొండ చౌరస్తాలోని బట్టలషాపుల్లో పని చేస్తున్న కార్మికులు సార్వత్రిక సమ్మెలో పాల్గొనే విధంగా బట్టలషాపు యాజమానులకు సమ్మె నోటీసులను అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో సత్యం, వీరేశం, శ్రీనివాస్, రమేష్, టి. కుమార్, డి.కారుణ్య, కవిత, అనిత, హేమ, స్వాతి తదితరులు పాల్గొన్నారు.

● కేయూ క్యాంపస్ : ఈనెల 20న దేశ వ్యాప్తంగా చేపట్టిన ఉద్యోగుల సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ నేతలు పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం కేయూలో తెలంగాణ యూనివర్సిటీ ఎంప్లాయీస్ వర్కర్స్ యూనియన్ సీఐటీయూ బాధ్యులతో కలిసి జిల్లా సెక్రటరీ రాగుల రమేశ్ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రంకు సమ్మె నోటీస్‌ను అందచేశారు. ఈ కార్యక్రమంలో ఆఫీస్ బేరర్లు రవికుమార్, శోభన్‌కుమార్, రణధీర్, కృష్ణ, రాజు, శోభ తదితరులు పాల్గొన్నారు.

శ్వేతార్కలో ముగిసిన వసంతోత్సవాలు

కాజీపేట, మే 6 (ఆన్‌లైన్): కాజీపేట శ్వేతార్క మూలగణపతి దేవాలయంలో నిర్వహిస్తున్న 27వ వసంతోత్సవాలు మంగళవారం సత్యనారాయణ వ్రతంతో ముగిశాయి. మంగళవారం చివరిరోజు రమ సహిత సత్యనారాయణ స్వామి శాంతి వ్రతం నిర్వహించారు. దేవాలయ పరిపాలన నిర్వాహకులు ఐనవోలు సాయిక్రిష్ణ శర్మ కళ్యాణి దంపతులు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. కందికొండ శ్రీనివాస శర్మతోపాటు భక్తులు, ఆలయ సిబ్బంది పూజ ఫలితాన్ని పొందినట్లు దేవాలయ చైర్మన్ ఐనవోలు వెంకటేశ్వర శర్మ తెలిపారు.

కేయూకు ఇన్ఫోసిస్ సంస్థ కంప్యూటర్ల వితరణ

కేయూ క్యాంపస్ మే 6,(ఆంధ్రజ్యోతి): కేయూకు ఇన్ఫోసిస్ సంస్థ బహూకరించిన కంప్యూటర్లను మంగళవారం వర్సిటీ అధికారులకు సంస్థ ప్రతినిధులు అందచేశారు. గతంలో కొన్ని ఇవ్వగా, తాజాగా మంగళవారం రెండో దఫాగా మరో 60 కంప్యూటర్లను అందచేసినట్లు కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం తెలిపారు. ఈ సందర్భంగా కంప్యూటర్లను కేయూ ప్రొఫెసర్ల మల్లారెడ్డి, ఎల్‌పీరాజ్‌కుమార్, రమ అందుకున్నారు.

ఎన్పీడీసీఎల్ స్టోర్ ఏడీఈకి సమ్మె నోటీసు

రాంనగర్, మే 6 (ఆంధ్రజ్యోతి): సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని ఈనెల 20న దేశవ్యాప్త సమ్మెలో భాగంగా యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ సీఐటీయూ ఆధ్వర్యంలో ఎన్పీ డీసీఎల్ స్టోర్ ఏడీఈ కుమారస్వామికి మంగవారం సమ్మె నోటీసు అందజేశారు. ఉద్యోగ భద్రత కల్పించాలని, అప్పటి వరకు కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వంతీసుకొచ్చిన 4లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కంపెనీ పరిధిలో పనిచేసే కార్మికులను క్రమబద్ధీకరించాలని కోరారు. ఖాళీ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని సీఐటీయూ హనుమకొండ జిల్లా కార్యదర్శి రాగుల రమేశ్, యుఈఈయు గౌరవాధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. నాయకులు కత్తెర్ల నాగేశ్వర్‌రావు, రాజు, కసబోయిన విజయ్, కుమార్ పాల్గొన్నారు.

ముందస్తు శానిటేషన్ చర్యలు చేపట్టండి..

- గాలివాన బీభత్సానికి గురైన కాలనీలలో మేయర్ గుండు సుధారాణి పర్యవేక్షణ
- వేసవి క్రీడా శిక్షణా శిబిరాల సందర్శన

వరంగల్ కార్పొరేషన్, మే 6 (ఆంధ్రజ్యోతి): రానున్న వర్షాలను దృష్టిలో ఉంచుకుని ముందస్తుగా శానిటేషన్ పనులు చేపట్టాని మేయర్ గుండు సుధారాణి అధికారులకు సూచించారు. మంగళవారం గ్రేటర్ పరిధిలోని 29వ డివిజన్ రఘునాథ్‌కాలనీతో పాటు వర్ష బీభత్సానికి గురైన పలు కాలనీలను మేయర్‌తోపాటు సిబ్బంది సందర్శించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. ప్రధానంగా డ్రైనేజీలు శుభ్రంగా ఉంచాలని, వరద ముంపునకు కాలనీలు గురికాకుండా లోతట్టు ప్రాంతాలపై దృష్టి సారించాలని అన్నారు. ఇంజనీరింగ్ అధికారులు డిసిల్టేషన్ పనులు త్వరితగతిని పూర్తిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఎంహెచ్‌వో డాక్టర్ రాజిరెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ నరేందర్, విద్యుత్‌శాఖ ఏఈ రవీందర్, లైన్‌మెన్ సాంబయ్య, వర్క్ ఇన్‌స్పెక్టర్ కంటేశ్వర్ పాల్గొన్నారు.

క్రీడలకు ముఖ్యమంత్రి పెద్దపీట

రాష్ట్రంలో క్రీడాకారులకు, క్రీడలకు ముఖ్యమంత్రి పెద్దపీట వేస్తున్నారని, ఈ అవకాశాలను వర్ధమాన క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని మేయర్ గుండు సుధారాణి పిలుపునిచ్చారు. బల్దియా ఆధ్వర్యంలో జరుగుతున్న వేసవి క్రీడా శిక్షణా శిబిరాలను మంగళవారం బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడేతో కలిసి బల్దియా ఇండోర్ స్టేడియంలో క్షేత్రస్థాయిలో పరిశీలించారు. శిక్షణ పొందుతున్న క్రీడాకారులకు కోడిగుడ్లు, పండ్లను పంపిణీ చేశారు. అక్కడి పిల్లలతో కాసేపు బ్యాడ్మిం టన్ ఆడి సేద తీరారు. ఈ సందర్భంగా సుధారాణి మాట్లాడుతూ.. మే 1 నుంచి 31 వరకు సమ్మర్ క్యాంపులు జరుగుతున్నారని, బ్యాడ్మింటన్, క్యారం, చెస్, టేబుల్ టెన్నిస్, జూడో, యోగా క్రీడలలో శిక్షణ ఇస్తున్నారని అన్నారు. సమ్మర్ క్యాంపులో శిక్షణ పొందుతున్న క్రీడాకారులకు గుడ్లు, పండ్లు అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో డీఎఫ్‌వో శంకర్‌లింగం, కోచ్‌లతో పాటు క్రీడాకారులు పాల్గొన్నారు.



రఘునాథ్ కాలనీలో పర్యవేక్షిస్తున్న మేయర్ సుధారాణి

సమగ్ర నివేదికను సిద్ధం చేయండి

అండర్ గ్రౌండ్ డ్రైనేజీ (యూజీడీ)పై సమగ్ర ప్రాజెక్ట్ నివేదిక డీపీఆర్‌లను సిద్ధం చేయాలని మేయర్ గుండు సుధారాణి కోరారు. మంగళవారం బల్దియా ప్రధాన కార్యాలయంలోని మేయర్ చాంబర్‌లో బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడేతోపాటు ఇంజనీరింగ్ ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. యూజీడీ రూపకల్పనపై జోన్లవారిగా సమగ్ర అధ్యయనం జరిపి సాంకేతిక పరిశీలనను దృష్టిలో ఉంచుకుని డీపీఆర్‌లో తయారు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎస్ఈ శ్రీనివాస్, ఈఈలు రవికుమార్, సంతోష్‌బాబు, యాదవిలత పాల్గొన్నారు.

వంద రోజుల కార్యాచరణ

ప్రణాళిక అమలు చేయండి

- రాష్ట్ర సీడీఎంఏ డాక్టర్ శ్రీదేవి
- మున్సిపల్ అధికారులతో విడియో కాన్ఫిరెన్స్

వరంగల్ కార్పొరేషన్, మే 6 (ఆంధ్రజ్యోతి): వంద రోజుల కార్యా చరణ ప్రణాళికను పక్కాగా అమలు చేయాలని రాష్ట్ర సీడీఎంఏ డాక్టర్ శ్రీదేవి ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ అధికారులతో మంగళవారం హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి మార్గదర్శకాలు చేశారు. బల్దియా తరపున వరంగల్ బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీడీఎంఏ మాట్లాడుతూ.. రాబోవు వంద రోజులలో చేపట్టవలసిన కార్యక్రమాలను పక్కాగా అమలు చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. ఆచరణలో పెట్టి జరిగిన పురోగతిని రిపోర్టు రూపంలో అందించాలన్నారు. రెవెన్యూ విభాగం పన్ను వసూళ్ల ప్రక్రియ, మెప్మా, శానిటేషన్‌ల పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. ఈ కాన్ఫరెన్స్‌లో సీఎంహెచ్‌వో డాక్టర్ రాజారెడ్డి, ఇన్‌చార్జ్ సీపీ రవీందర్, డీఈ రంగారావులు పాల్గొన్నారు.



విడియో కాన్ఫిరెన్స్‌లో పాల్గొన్న కమిషనర్ అశ్విని

జల్ హీ అమృత్‌పై వీడియో కాన్ఫరెన్స్

జల్ హీ అమృత్ పథకంపై ఢిల్లీ నుంచి మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఇందులో కమిషనర్ అశ్విని తానాజీ వాకడేతో పాటు ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు. వరంగల్ నగరంలో జల్‌హీ అమృత్ పథకం కింద మలిన జల కేంద్రాల శుద్ధీకరణ, ప్రోత్సాహక నిధులపై ఢిల్లీ అధికారులు వివరణ కోరగా కమిషనర్ సమాధానం ఇచ్చారు.

బయోసాలిడ్స్, సర్కులర్ మేనేజ్‌మెంట్‌లను సమర్థవంతంగా నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో డిప్యూటీ కమిషనర్లు ప్రసన్నరాణి, రాజేశ్వర్, సెక్రెటరీ అలివేలుతో పాటు ఐటీ అధికారి రమేష్‌లు పాల్గొన్నారు.



మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావును సన్మానిస్తున్న గౌడ సంఘం కుల పెద్దలు

ఘనంగా రేణుకా ఎల్లమ్మ బోనాలు

బోనమెత్తిన మాజీ మంత్రి ఎర్రబెల్లి

హసన్‌పర్తి, మే 6 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 66వ డివిజన్ కేంద్రం హసన్‌పర్తిలో రేణుకా ఎల్లమ్మ బోనాల పండుగ మంగళవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా గౌడ కులస్తులు ప్రతీ ఇంటి నుంచి బోనం ఎత్తుకొని రేణుకా ఎల్లమ్మ తల్లి దేవాలయానికి చేరుకుని మొక్కులు చెల్లించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి ఎర్రెబెల్లి దయాకర్‌రావు మహిళలతో కలిసి బోనం ఎత్తుకొని ఎల్లమ్మ తల్లి దేవాలయానికి చేరుకొని మొక్కులు సమర్పించారు. ఆలయానికి చేరుకున్న ఎర్రబెల్లికి ఆలయ పూజారులు పూర్ణకుంభంతో స్వాగతం పలుకగా గౌడ కుల సంఘం పెద్దలు శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి వెంట బీఆర్ఎస్ నాయకులు కందుకూరి చంద్రమోహన్, పావుశెట్టి శ్రీధర్, బండి రజనీకుమార్, వల్లాల యుగంధర్, వల్లాల యాదగిరి, గౌడ సంఘం నాయకులు వల్లాల రాజేందర్, జనగాని సంపత్, రఘు ఉన్నారు.

రైతులకు అందుబాటులోనే వ్యవసాయ సబ్సిడీలు

జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ అధికారి జి.సంగీతలక్ష్మీ



సంగీతలక్ష్మీ జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ అధికారి

హనుమకొండ టౌన్, మే 6 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం రైతుల సంక్షేమ దృష్టిలో పెట్టుకొని ఉద్యానశాఖ ద్వారా రైతులకు సమీకృత ఉద్యాన అభివృద్ధి మిషన్, రాష్ట్రయ కృషి వికాస్ యోజన, నేషనల్ మిషన్ అఫ్ ఎడిబల్ అయిల్స్ జాతీయ వెదురు మిషన్ ద్వారా అందించే పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని హనుమకొండ జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ అధికారి జి.సంగీతలక్ష్మీ మంగళవారం తెలిపారు. హనుమకొండ జిల్లాకు సమీకృత ఉద్యాన అభివృద్ధి మిషన్‌లో కొత్త పండ్ల తోటలకు 40 నుంచి 50 శాతం వరకు రాయితీ ఉందన్నారు. 153 యూనిట్‌లు రూ.58లక్షలు, కూరగాయలు సాగుకు 40 శాతం 15 యూనిట్స్ రూ.3లక్ష 50 వేలు, పూలతోటలు 40శాతం 31 యూనిట్స్ రూ.6.2లక్షలు, మల్చింగ్ 50 శాతం, 123 యూనిట్స్‌లు, రూ.25లక్షలు, పాత తోటల పునరుద్ధరణ 40శాతం 2 యూనిట్స్, రూ.60వేలు, నీటి కుంటలు 50శాతం 2యూనిట్స్ రూ.63వేలు, ప్యాక్ హౌజెస్ శాతం 50, 4యూనిట్స్, రూ.8లక్షలు, పంట అనంతర స్టోరేజీలు 30 నుంచి 50శాతం 1యూనిట్, రూ.17లక్ష 25 వేలు, ఉద్యాన యాంత్రీకరణ 40 నుంచి 50 శాతం 11 యూనిట్స్ రూ.3లక్ష 12500, ఫ్రూట్‌కవర్స్ 50శాతం 80 యూనిట్స్ రూ.20లక్షలు, వర్మికంపోస్ట్ యూనిట్ 50 శాతం, 0.25 యూనిట్స్ రూ.12500లు, వర్మిబెడ్స్ 50శాతం 20.04 యూనిట్స్ రూ.1.6500లు అందుతాయన్నారు. అలాగే రాష్ట్రీయ కృషి వికాస్ యోజన పథకంలో సూక్ష్మసేద్యం 80 నుంచి 100 శాతం వరకు రాయితీతో 700 ఎకరాలకు రూ.265.80లక్షలు, తుంపర్ల సేద్యంకు 75 శాతం ఎకరాలు, రూ.15.18లక్షలు, శాశ్వత పందిరి నిర్మాణం కూరగాయల సాగుకు 50 శాతం రాయితీ 75 యూనిట్స్‌లు, రూ.37.5లు ప్రకటించారు. అలాగే ఆయిల్‌పామ్ తోటల పెంపకం రాయితీ 1 మొక్కకు రూ.193 తోటల సంరక్షణకు రూ.2100 ఎకరానికి 4సంవత్సరాలు, అంతర పంటలకు రూ.2100 ఎకరానికి 4 సంవత్సరాలు, 4000 యూనిట్స్, జాతీయ వెదురు మిషన్ పొలం సరిహద్దులపై వెదురు మొక్కల పెంపకం 50శాతం రూ.150 ప్రతీ మొక్కకు 1000 మొక్కలకు అందిస్తుందన్నారు. రూ.0.90లక్షలు ప్రభుత్వం అందిస్తుందని జిల్లా ఉద్యానవనశాఖ అధికారి జి.సంగీతలక్ష్మీ తెలిపారు. ఆసక్తి గల రైతులు పట్టాదారు పాసుపుస్తకాల జిరాక్స్, ఆధార్‌కార్డు, బ్యాంకు అకౌంట్స్ జిరాక్స్‌లను ఫారంతో జతపరచి ఈనెల 30లోపు సంబంధిత ఉద్యాన అధికారులను అందజేయాలని తెలిపారు. అలాగే పరకాల డివిజన్‌లోని ఆత్మకూరు, దామెర, పరకాల, నడికూడ, శాయంపేట, కమలాపూర్ మండలాలకు చెందిన రైతులు పరకాల హెచ్‌వోపీ మధులిక సెల్ నంబరు 8977714069, హనుమకొండ డివిజన్‌లోని భీమదేవరపల్లి, ఎల్కతుర్తి, హసన్‌పర్తి, ధర్మసాగర్, వేలేరు, కాజీపేట, ఐనవోలు, హనుమకొండ మండలాల రైతులు హనుమకొండ హెచ్‌వో బి.సుష్మితాసేన్ సెల్ 8977714068 ఫోన్ నంబర్లకు రైతులు తగిన సూచనలు, సలహాలు తీసుకోవాలని కోరారు.

నట్టేట ముంచిన అకాల వర్షం

5వ పేజీ తరువాయి

అందులో ఉన్న 50 మేకలు అక్కడికక్కమే మృతి చెందాయి, ఈ ఘటన సోమవారం రాత్రి జరిగింది. ధర్మసాగర్ మండల కేంద్రానికి చెందిన ఎనుగుల శ్రీనివాస్ యాదవ్‌కు చెందిన రేకుల షెడ్ అకాల వర్షానికి కూలింది. దీంతో అందులో ఉన్న 50 మేకలు అక్కడికక్కడే మృతి చెందాయి. వీటి విలువ సుమారు రూ.6 లక్షల వరకు ఉంటుందని తెలిపారు. అలాగే ధర్మసాగర్ మండలం నారా యణగిరి ప్రభుత్వపాఠశాలకు చెందిన వరండాలో వేసిన రేకులు కొట్టుకుపోయాయి. వీటి విలువ సుమారు రూ.2లక్షల వరకు ఉంటుంది. అకస్మాత్తుగా వచ్చిన అకాల వర్షానికి మండలంలోని పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. 277 ఎకరాలలో మామిడి తోటల్లో పండ్లు మొత్తం రాలి రైతుకు తీవ్ర నష్టం వాటిల్లింది. అదే విధంగా వంద ఎకరాలలో వరి పంటకు నష్టం జరిగినట్టు అధికారులు జిల్లా అధికారులకు నివేదికను అంద జేశారు. నష్టం జరిగిన బాధితులను ప్రభుత్వ పరంగా ఆదుకోవాలని రైతులు కోరారు.

తడిసిన ధాన్యం

పరకాల: ఒక్కసారిగా సోమవారం రాత్రి కురిసిన వర్షానికి పరకాల వ్యవసాయ మార్కెట్‌లో అమ్మకానికి తెచ్చిన వరిధాన్యం వర్షపు నీటితో మునిగింది. దీంతో రైతులకు పెద్ద ఎత్తున నష్టం వాటిల్లుతోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతన్నలను అన్ని రకాలుగా ఆదుకోవాలని ప్రతిపక్ష నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

కాలువ కబ్జాపై కదలిన యంత్రాంగం

- ఫీడర్ చానల్ ప్రాంతాన్ని పరిశీలించిన ఐబీ ఏఈ శ్రీనివాస్

హసన్‌పర్తి, మే 6 (ఆంధ్రజ్యోతి) : 'అనంతసాగర్ మాటు చెరువు కాలువ కబ్జా' అనే ఆంధ్రజ్యోతి కథనంపై ఇరిగేషన్ ఏఈ శ్రీనివాస్ స్పందించారు. మంగళవారం అనంతసాగర్ మాటు చెరువు కాలువ కట్ట (ఫీడర్ చానల్)ను సందర్శించి పరిస్థితిని అంచనా వేశారు. చెరువు కట్టను ధ్వంసం చేసిన వారి వివరాలను అడిగి తెలుసుకున్నారు. అంతేకాకుండా ఫీడర్ చానల్‌ను పరిశీలించేందుకు వచ్చిన లష్కర్‌తో గొడవ పడి దాడి జరిగిన ఘటనపై ఆరా తీశారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

వీధి వ్యాపారుల గొడవకు కాంగ్రెస్‌కు సంబంధం లేదు

జీడబ్ల్యూఎంసీ ఫ్లోర్ లీడర్ తోట వెంకటేశ్వర్లు

హనుమకొండ చౌరస్తా, మే 6 (ఆంధ్రజ్యోతి): ఇటీవల హనుమకొండ పబ్లిక్‌గార్డెన్ వద్ద చిరు వ్యాపారులపై ఎమ్మెల్యే నాయిని అనుచరులు దౌర్జన్యానికి దిగారని సోషల్ మీడియాలో వచ్చిన కథనాలు అవాస్తవం అని 10వ డివిజన్ కార్పొరేటర్, జీడబ్ల్యూఎంసీ ఫ్లోర్ లీడర్ తోట వెంకటేశ్వర్లు కొట్టిపారేశారు. వీధి వ్యాపారులపై జరిగిన దాడికి ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డికి, కాంగ్రెస్ కార్యకర్తలకు ఎలాంటి సంబంధం లేదన్నారు. మంగళవారం హనుమకొండ చౌరస్తా సమీపంలోని ఓ ప్రైవేట్ హోటల్లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో వెంకటేశ్వర్లు పాల్గొని మాట్లాడారు. అక్కడ జరిగిన గొడవలపై పోలీసులు విచారణ చేపట్టి తప్పు చేసిన వారిని శిక్షిస్తారని తెలిపారు. మాజీ కార్పొరేటర్ బోడ అనయ్ మాట్లాడుతూ.. ఎమ్మెల్యే నాయిని నియోజకవర్గంలో చేస్తున్న అభివృద్ధిని సహించలేని కొందరు నాయకులు, కొన్ని దినపత్రికలు పనికట్టుకుని అసత్య ఆరోపణలు చేస్తున్నాయని ధ్వజమెత్తారు. గొడవలో బాధిత చిరు వ్యాపారి ఆవునూరి శ్యాంసుందర్ మాట్లాడుతూ.. గతంలో పబ్లిక్‌గార్డెన్ వద్ద చిన్నపాటి హోటల్ నడుపుకుంటూ జీవించేవాళ్లమని, ఆ సమయంలో తమ పక్కనే ఉన్న మరో హోటల్ నిర్వాహకులు తమ హోటల్‌ను తొలగించారన్నారు. మళ్లీ ఈ నెల 22న పబ్లిక్‌గార్డెన్ వద్ద గతంలో నిర్వహించిన స్థలంలోనే హోటల్‌ను ప్రారంభించే క్రమంలో అక్కడ గతంలో హోటల్ నిర్వహిస్తున్న కొందరు వ్యక్తులు తమ వద్దకు వచ్చి మాపై దాడికి దిగారన్నారు. దీంతో అటుగా వెళుతున్న కొందరు వ్యక్తులు గొడవను ఆపే ప్రయత్నం చేశారే తప్ప.. ఎమ్మెల్యే అనుచరులుగానీ, కాంగ్రెస్ పార్టీ నాయకులు గానీ ఈ గొడవలో లేరని తెలిపారు. తమపై దాడి చేసిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని ఆయన పోలీసులను కోరారు. 5వ డివిజన్ కార్పొరేటర్ శ్రీమాన్, మహిళ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు బంక సరళ, కాంగ్రెస్ నాయకులు చీకటి ఆనంద్, నెక్కొండ కిషన్, విద్యాసాగర్, కార్తిక్, సంపత్ పాల్గొన్నారు.



హనుమకొండ ఓ హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న జీడబ్ల్యూఎంసీ ఫ్లోర్ లీడర్ తోట వెంకటేశ్వర్లు



ప్రెస్ క్లబ్‌లో మాట్లాడుతున్న ఠాకూర్ రణభీర్ సింగ్

9న మహారాణా ప్రతాప్‌సింగ్ జయంతి

వడ్డెపల్లి, మే 6 (ఆంధ్రజ్యోతి): రాజ్‌పుత్ వీరుడు, దేశ భక్తుడు మహారాణా ప్రతాప్‌సింగ్ జయంతిని ఈ నెల 9న ఉదయం 9 గంటలకు నిర్వహించనున్నట్లు బొందిలి సంక్షేమ సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు ఠాకూర్ రణభీర్ సింగ్ తెలిపారు. మంగళవారం హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయనతోపాటు ప్రధాన కార్యదర్శి ఠాకూర్ మోతీ సింగ్ మాట్లాడారు. హనుమకొండ పద్మాక్షి దేవాలయం ప్రాంతంలోని రాధాస్వామి దేవాలయం వద్ద ఉదయం 9 గంటలకు పతాకావిష్కరణ చేస్తామని తెలిపారు. అనంతరం సాయంత్రం 6 గంటలకు బైక్ ర్యాలీ హనుమకొండ చౌరస్తా, పబ్లిక్ గార్డెన్, అంబేద్కర్ విగ్రహం, నక్కలగుట్ట ఎస్‌బీహెచ్ మీదుగా బాలసముద్రం నుంచి రాధాస్వామి దేవాలయం వరకు చేరుకుంటుందని పేర్కొన్నారు. వరంగల్ ఉమ్మడి జిల్లాలోని బొందిలి కులస్థులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు. సమావేశంలో ఉత్సవ కమిటీ చైర్మన్ నరేష్‌కుమార్ సింగ్, ఆడిటర్ ఠాకూర్ రూప్ సింగ్ పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి
బుధవారం • 7 మే 2025

నవ్య
కుటుంబ కదంబం

ఫ్యాషన్



ఫ్లవర్ పవర్

తెల్ల డ్రస్సు మీద రంగురంగుల ఆకర్షణీయమైన పూల డిజైన్లు మహిళలను ఇట్టే ఆకర్షించేస్తూ ఉంటాయి. అవి చీరలైనా, ఫ్రాకులైనా, కుర్తీలైనా మనోహరంగా కనిపిస్తాయి కాబట్టి మహిళలు వీటి పట్ల ప్రత్యేక ఆసక్తి కనబరుస్తూ ఉంటారు. మరీ ముఖ్యంగా వేసవిలో సాయంకాలాలు ఆహ్లాదరకంగా గడపాలనుకునేవాళ్లు, బీచ్ వేర్, ఈవినింగ్ వేర్‌గా కూడా ఈ రకమైన దుస్తులను ఎంచుకుంటూ ఉంటారు. అయితే పూల దుస్తులు రెట్టింపు ఆకర్షణీయంగా కనిపించడం కోసం వాటికి కొన్ని అదనపు హంగులు జోడిస్తూ ఉండాలి. అవేంటంటే...

పూల డ్రస్సు ఆకర్షణీయం గానే కాదు, ఆహ్లాదకరంగా కూడా కనిపిస్తుంది. కాబట్టే ప్రత్యేకించి వేసవిలో ఇలాంటి గౌన్లు, ఫ్రాకులకు డిమాండ్ పెరుగుతూ ఉంటుంది. అలాంటి కొన్ని పూల డ్రస్సులు మీకోసం...



శాండిల్స్, హైహీల్స్ ఏవైనా పూల డ్రస్సులకు చక్కగా నప్పుతాయి. అయితే మోకాళ్ల వరకూ పొడవుండే పొట్టి ఫ్రాక్ ఎంచుకున్నప్పుడు హైహీల్స్‌కూ, పొడవాటి గౌన్ ఎంచుకున్నప్పుడు శాండిల్స్‌కూ ప్రాధాన్యం ఇవ్వాలి

భారీ ఆభరణాలకు ఈ డ్రస్సులకు నప్పకపోయినా, పూల డిజైన్లు కలిగిన ఘాగ్రా చోళీ ఎంచుకున్నప్పుడు తప్పనిసరిగా భారీ ఆభరణాలతో మ్యాచ్ చేయాలి. పొడవాటి ఝుంకాలు, హారాలు కూడా వేసుకోవచ్చు

సౌకర్యానికి ప్రాధాన్యం ఇచ్చేవారు శాటిన్, లెనిన్, రయాన్ వస్త్రాలతో తయారైన పూల దుస్తులను ఎంచుకోవాలి. హుందాగా కనిపించాలనుకుంటే కాటన్‌కు పెద్ద పీట వేయాలి



ఆడ పులులు

సంకల్పం

కొద్ది రోజుల కిందట... అడవిలో తప్పిపోయిన నిర్మల్ జిల్లా కప్పనపల్లి మహిళా కూలీలను వెతికి పట్టుకువచ్చింది 'టీమ్ శివంగి'. చిమ్మచీకటిలో... దట్టమైన అరణ్యంలో... కూంబింగ్ నిర్వహించిన ఆ కమాండో బృందం అంతటా ప్రశంసలు అందుకుంది. ఇరవై మంది మహిళా కానిస్టేబుళ్లతో ఏర్పాటైన 'టీమ్ శివంగి'... నిర్మల్ జిల్లా ఎస్పీ జానకీ షర్మిల మానస పుత్రిక. పోలీసు వ్యవస్థలో మహిళలను శివంగుల్లా తీర్చిదిద్దడానికి... మగవారికి దీటుగా నిలబెట్టడానికి... తీసుకువచ్చిన ఈ 'టీమ్' విశేషాలు 'నవ్య' పాఠకుల కోసం.



"మహిళా పోలీసులు ఎందులోనూ తక్కువకాదు. అవకాశం కల్పిస్తే మగ పోలీసులతో సమానంగా సేవలు అందించగలరు. అది నిరూపించడానికే 'టీమ్ శివంగి' ఫోర్స్‌ను ఏర్పాటు చేశాను. ఇప్పటికే జిల్లాలో మహిళా పోలీసులకు అనేక కీలక బాధ్యతలు అప్పగించాం. వారిలో దాగివున్న ప్రతిభ, నైపుణ్యాలను గుర్తించి ప్రోత్సహిస్తున్నాం. అంతేకాదు... వారిలో మనోధైర్యాన్ని పెంపొందించడమే లక్ష్యంగా పెట్టుకున్నాం. ఈ నేపథ్యంలోనే దేశంలో ఎక్కడా లేని విధంగా 'టీమ్ శివంగి' పేరుతో కమాండో బృందాన్ని ఏర్పాటు చేశాం. ఈ బృందం సభ్యులు నిర్మల్ జిల్లా కప్పనపల్లి గ్రామంలోని దట్టమైన అడవుల్లో తప్పిపోయిన నలుగురు మహిళా కూలీలను వెతికి తేవడం అందరూ చూశారు. ఎంతో సాహసంతో రాత్రింబవళ్లూ కూంబింగ్ చేసి వారిని సురక్షితంగా ఇళ్లకు చేర్చారు"... అంటారు నిర్మల్ జిల్లా ఎస్పీ జానకి షర్మిల. రాబోయే రోజుల్లో ఈ కమాండోస్‌కు ఆమె మరిన్ని కీలక బాధ్యతలు అప్పగించబోతున్నట్టు ఆమె చెప్పారు.

ఇలాంటివెన్నో...

ప్రయోగాత్మకంగా జానకి చేపట్టిన అనేక ప్రాజెక్టుల్లో 'టీమ్ శివంగి' ఒకటి. మహిళా సమస్యల పరిష్కారానికి, సైబర్ నేరాల అదుపునకు శాఖలోని చురుకైన మహిళా కానిస్టేబుళ్లను గుర్తించి, పురుష పోలీసులతో సమానంగా బాధ్యతలు అప్పగిస్తున్నారు. ఇప్పటికే పెట్రోలింగ్, వెహికిల్ చెకింగ్ వంటి క్లిష్టమైన పనులను వారికి కేటాయిస్తున్నారు. 'కేజీబీవీ'ల్లో చదువుతున్న విద్యార్థినులకు అండగా 'పోలీసు అక్క' పేరిట చేపట్టిన కార్యక్రమానికి అంతటా ప్రశంసలు అందుతున్నాయి. ఇలా ఎన్నో. ఈ క్రమంలోనే 'టీమ్ శివంగి' రూపు దాల్చింది.

ఎందులోనూ తక్కువ కాదు...

జిల్లా పోలీసు శాఖలోని 20 మంది మహిళా కానిస్టేబుళ్లతో ఏర్పాటైన 'టీమ్ శివంగి'కి జాతీయ స్థాయిలో ప్రశంసలు అందుతున్నాయి. మునుపెన్నడూ లేని విధంగా వీరం



దరూ 45 రోజులపాటు హైదరాబాద్‌లో కమాండోస్ శిక్షణ తీసుకున్నారు. శివంగి అంటే ఆడ పులి. మహిళలను అంత శౌర్యవంతులుగా తయారుచేయడమే ఈ 'టీమ్' ఏర్పాటు లక్ష్యం. జాతీయ స్థాయిలో ఎన్ఎస్‌జీ, రాష్ట్ర స్థాయిలో గ్రేహౌండ్స్ దళాలకు దీటుగా 'శివంగి' కమాండోస్ అన్నింటా తర్ఫీదు పొందారు.

> ఇప్పటికే జిల్లాలో మహిళా పోలీసులకు అనేక కీలక బాధ్యతలు అప్పగించాం. వారిలో దాగివున్న ప్రతిభ, నైపుణ్యాలను గుర్తించి ప్రోత్సహిస్తున్నాం. అంతేకాదు... వారిలో మనోధైర్యాన్ని పెంపొందించడమే లక్ష్యంగా పెట్టుకున్నాం. ఈ నేపథ్యంలోనే దేశంలో ఎక్కడా లేని విధంగా 'టీమ్ శివంగి' పేరుతో కమాండో బృందాన్ని ఏర్పాటు చేశాం.

శారీరక దారుఢ్యం, పరుగు పందేలు, వెర్టికల్ రోప్ క్లైంబింగ్, పోరాట నైపుణ్యాలు, పేలుడు పదార్థాల నిర్వహణలో శిక్షణ, ఆధునిక ఆయుధాల వినియోగం, వెపన్ హ్యాండ్లింగ్, ఫీల్డ్ సిగ్నల్స్, మ్యాప్ రీడింగ్, మ్యాప్ లేకుండా నేవిగేషన్, శత్రువుల కదలికలు, అడవిలో సంకేతాలను చదవడం, నిఘా పద్ధతులు, ఆకస్మిక దాడి, ఎదురుదాడి కసరత్తులు, రహస్య స్థావరాలపై దాడులు చేయడం వంటి అంశాలతో కూడిన కఠినమైన శిక్షణ కార్యక్రమంతో వీళ్లు రాటుదేలారు.

సాహసోపేతంగా...

ఆ మధ్య నిర్మల్ జిల్లాలోని మామడ మండలం కప్పనపల్లి గ్రామానికి చెందిన నలుగురు తునికాకు మహిళ కూలీలు దట్టమైన అడవుల్లో తప్పిపోయారు. గ్రామస్థుల నుంచి ఫిర్యాదు అందుకున్న ఎస్పీ జానకీ షర్మిల... వెంటనే 'టీమ్ శివంగి' కమాండోలను రంగంలోకి దింపారు. ఎస్పీ నేతృత్వంలోని ఈ టీమ్... దట్టమైన అడవిలో రాత్రంతా కూంబింగ్ నిర్వహించింది. ఎంతో ధైర్యసాహసాలతో అడవిని వడపోసి... తప్పిపోయిన నలుగురు మహిళా కూలీలనూ సురక్షితంగా తీసుకువచ్చింది. తమ సత్తా ఏమిటో ప్రపంచానికి చాటిచెప్పింది. పురుష కమాండోస్‌కు దీటుగా... దట్టమైన అడవిలో, చిమ్మ చీకటిని లెక్క చేయకుండా కూంబింగ్ నిర్వహించిన తీరు ప్రశంసలు అందుకుంది.

• కొండూరి రవీందర్, నిర్మల్

ఏ కలా పెద్దది కాదు

పేదరికం, సామాజికమైన ఆంక్షలు, వరుస వైఫల్యాలు... ఏ పరిస్థితులు ఎదురైనా చెక్కుచెదరని సంకల్పంతో లక్ష్యాన్ని సాధించారు అదిబా అనమ్. ఆటో డ్రైవర్ కుమార్తె అయిన ఆమె సివిల్స్‌లో ఎంపికై, మహారాష్ట్రలో తొలి ముస్లిం మహిళా ఐఏఎస్‌గా బాధ్యతలు చేపట్టబోతున్నారు. 'పేదలకు సేవ చేయాలనే నా ఆశయంలో ఇది తొలి అడుగు' అంటున్న అదిబా స్ఫూర్తిదాయకమైన ప్రయాణం ఇది.



"డాక్టర్ కాబోయి యాక్టర్ అయ్యాననే మాట ఇదివరకు బాగా వినిపించేది కదా! నా విషయంలోనూ అలాగే జరిగింది. నేను డాక్టర్ అవ్వాలనుకున్నా... ఐఎఎస్‌నయ్యాను. చిన్న వయసు నుంచీ వైద్యురాలు కావాలనేది నా కల. అయితే పదోతరగతికి వచ్చేసరికి... అది సాధ్యమయ్యే పని కాదని అర్థమయింది. కారణం మా ఆర్థిక పరిస్థితులు. దేశంలోనే రైతుల ఆత్మహత్యలు ఎక్కువగా ఉండే రాష్ట్రం మహారాష్ట్ర అయితే... అందులో అత్యధిక శాతం చోటు చేసుకున్నది మా యవత్మాల్ జిల్లాలోనే. గత 24 ఏళ్లలో 6,200 మందికి పైగా రైతులు మా జిల్లాలో బలవన్మరణాలపాలయ్యారని ఈ నెల మొదటివారంలో విడుదలైన అధికారిక నివేదిక చెబుతోంది. కానీ ఆ సంఖ్య ఇంకా ఎన్నో రెట్లు ఉంటుంది. ఈ నేపథ్యంలో... వ్యవసాయ పనులు వదిలేసి ఇతర వృత్తులను చేపట్టిన వేలాది మందిలో మా నాన్న అష్ఫక్ షేక్ ఒకరు. బాగా చదువుకోవాలని నాన్నకు ఎంతో ఆశ. కానీ ఆయన పదో తరగతి మధ్యలోనే ఆపేయాల్సి వచ్చింది. తొలి సంతానమైన నా ద్వారా తన కల తీర్చుకుందామని అనుకున్నారు.



ఎంతో ఒత్తిడి ఎదుర్కొన్నాం...

అమ్మా నాన్నా, నేను, ఇద్దరు తమ్ముళ్ళు... ఇదీ మా కుటుంబం. నాన్న అద్దె ఆటో నడిపి తెచ్చే సంపాదనతోనే కుటుంబం గడవాలి, మా చదువులు కొనసాగాలి. ఉండేది అద్దె ఇల్లే అయినా, ఎలాంటి ఆస్తులూ లేకపోయినా... ఏనాడూ మా తల్లితండ్రులు అధైర్యపడలేదు. పదో తరగతిలో 98 శాతం, ఇంటర్‌లో 97 శాతం మార్కులు తెచ్చుకున్నా. అప్పుడే యుపిఎస్‌సికి ప్రిపేర్ కావాలనే ఆలోచన వచ్చింది. దానికి కారణం పుణేలో ఉన్న మా మామయ్య. అతను 'సేవా ఎన్జీవో' అనే సంస్థలో కార్యదర్శిగా పని చేస్తారు. ఆ సంస్థ కార్యక్రమాలకు హాజరయ్యే ఐఎఎస్ అధికారులకు నన్ను పరిచయం చేశారు. ఎంబీబీఎస్ ఆశ వదులుకున్న నాకు... ఐఎఎస్ కొత్త లక్ష్యంగా మారింది. పుణేలోనే డిగ్రీలో చేరాను. గణితంలో గ్రాడ్యుయేషన్ చేస్తూ... సివిల్స్ కోసం సన్నద్ధం కావడం మొదలుపెట్టాను. ఆ సమయంలో నేను, నా కుటుంబం ఎంతో ఒత్తిడిని ఎదుర్కోవాల్సి వచ్చింది.

అందుకోసం కృషి చేస్తా...

సమాజానికి సేవ చెయ్యడానికి ఇది మొదటి అడుగుగా భావిస్తున్నాను. పేదల శ్రేయస్సుకు, ముఖ్యంగా బాలికల చదువు కోసం నా వంతు కృషి చేస్తాను. విద్య, వైద్యం... ఈ రెండూ ఎవరికైనా చాలా ముఖ్యం. అట్టడుగు వర్గాలకు అవి అందేలా చూడాలనుకుంటున్నాను. నేను చాలా సాధారణమైన కుటుంబం నుంచి వచ్చాను. పెద్ద నగరాల్లో చదవలేదు. స్థిరమైన ఆదాయం ఉన్న కుటుంబం కాదు. కానీ ఒక లక్ష్యం నిర్దేశించుకున్నాను. ఆ దిశగా కృషి చేశాను. ఏ కలా మరీ పెద్దది కాదు. ఏ లక్ష్యమూ మరీ దూరం కాదు. కావలసిందల్లా మన మీద మనకు విశ్వాసం. చిత్తశుద్ధితో ప్రయత్నించడం. నాలాంటి అమ్మాయిలు నన్ను ప్రేరణగా తీసుకొని... ఉన్నత లక్ష్యాల వైపు అడుగులు వేస్తారనే నమ్మకం నాకుంది.

ఎందరో సలహాలిచ్చారు...

మా ముగ్గుర్ని చదివించడం కోసం నాన్న ఆర్థికంగా పడుతున్న సమస్యలకు తోడు కమ్యూనిటీపరంగానూ ఇబ్బందులు ఎదురయ్యాయి. "ఆడపిల్లకు పెద్ద చదువులు ఎందుకు? ఎక్కడో ఉంచి చదివించడం ఏమిటి? నీ స్థోమత తెలిసే చేస్తున్నావా? పెళ్ళి చేసి పంపెయ్. ఇంకా ఇద్దరు మగ పిల్లలున్నారు నీకు" అంటూ నాన్నకు ఎందరో సలహాలు ఇచ్చారు. కానీ నా తల్లితండ్రులు నా మీద నమ్మకం ఉంచారు. "సమాజం గురించి నువ్వు పట్టించుకోకు. నీ లక్ష్యం మీదే ఏకాగ్రత పెట్టు" అని చెప్పారు. నా మీద సామాజికమైన ఒత్తిడి ఎన్నడూ పడనివ్వలేదు. కానీ పరిస్థితి ఏమిటనేది నాకు తెలుసు. అందుకే ఎంతో కష్టపడి ప్రిపేర్ అయ్యాను. పరీక్ష రాశాను. ఒకసారి ఫెయిల్ అయ్యాను. రెండోసారి కూడా దగ్గరగా వచ్చినా వైఫల్యం ఎదురయింది. దాంతో నా పట్టుదల మరింత పెరిగింది. మూడోసారి ఇంటర్వ్యూ వరకూ వెళ్ళాను. కానీ అప్పుడు కూడా ఆశాభంగం తప్పలేదు. "ఇక ఇవన్నీ ఆపెయ్, ఏదైనా ఉద్యోగం చూసుకో. పెళ్ళి చేసుకో. ఇక నీ వల్ల కాదు" అనే సలహాలు బంధువులు, మిత్రుల నుంచి కూడా వినిపించాయి. కానీ "నువ్వు సాధించగలవు. మరింత గట్టిగా ప్రయత్నించు" అంటూ నా కుటుంబం నా వెనుక నిలిచింది. 'ఇప్పటివరకూ నేను చేసిన పొరపాట్లేమిటి?' అని మరోసారి విశ్లేషించుకున్నాను. 'ఓటములు జీవితంలో భాగం. వాటి నుంచి పాఠాలు నేర్చుకొని, కొత్త అడుగులను స్థిరంగా, సక్రమంగా వేయాలి. అప్పుడే మరింత బలంగా తయారవుతాం' అని నమ్మాను. నాలుగోసారి నా గురి తప్పలేదు. ఈసారి ఇంటర్వ్యూ కూడా బాగా చేశాను. ఫలితాల్లో నాకు 142వ ర్యాంక్ వచ్చింది. మహారాష్ట్రలో తొలి ముస్లిం మహిళా ఐఎఎస్‌ను నేనేనని అప్పటివరకూ నాకు తెలీదు. అది గొప్ప విషయంగా కూడా అనుకోవడం లేదు."

విరేచనాలు అవుతూ ఉంటే...

వాతావరణ మార్పులు, తినే ఆహార పదార్థాలు కలుషితం కావడం, జీర్ణ సమస్యల వల్ల విరేచనాలు అవుతూ ఉంటాయి. ఇలాంటప్పుడు చిన్న చిట్కాలు పాటించి ఉపశమనం పొందవచ్చు.

- నీళ్ల విరేచనాలు అవుతుంటే కొబ్బరి నీళ్లు తాగడం ఉత్తమం. దీనివల్ల శరీరం కోల్పోయిన నీటి శాతం భర్తీ అవుతుంది. కొబ్బరి నీళ్లలోని మినరల్స్, ఎలక్ట్రోలైట్స్ శరీరానికి సత్తువను అందిస్తాయి.
- ఒక గ్లాసు మంచినీళ్లలో చిటికెడు ఉప్పు, ఒక చెంచా పంచదార కలుపుకుని తాగితే... విరేచనాల వల్ల కలిగే అలసట, నీరసం తగ్గుతాయి.
- అల్లం రసం లేదా అల్లం టీ తాగడం వల్ల కూడా ప్రయోజనం ఉంటుంది. అల్లంలోని యాంటీ మైక్రోబియల్ గుణాలు జీర్ణ సమస్యలను నివారిస్తాయి.
- పెరుగులో ఆరోగ్యకరమైన బ్యాక్టీరియాలు ఉంటాయి. ఇవి ప్రేవులను శుభ్రం చేస్తాయి. అర గ్లాసు పెరుగులో ఒక చెంచా మెంతులు కలుపుకుని తీసుకుంటే వెంటనే విరేచనాలు తగ్గుతాయి.
- ఒక గ్లాసు నీటిలో ఒక చెంచా జీలకర్ర వేసి బాగా మరగించి గోరువెచ్చగా చల్లార్చి తాగితే కడుపులో సమస్యలు తగ్గి విరేచనాలు ఆగుతాయి.



- నాలుగు పుదీనా ఆకులను నమిలినా... పుదీనా టీ తాగినా... సమస్య తీరుతుంది. ఒక చెంచా గ్రీక్ యోగర్ట్ తింటే వెంటనే ఫలితం కనిపిస్తుంది.
- ఒక కప్పు గోరువెచ్చని నీటిలో రెండు చెంచాల యాపిల్ సైడర్ వెనిగర్ కలుపుకుని తాగితే విరేచనాలు తగ్గుతాయి.
- ఒక గ్లాసు గోరువెచ్చని పాలలో చిటికెడు పసుపు వేసుకుని తాగితే ప్రయోజనం కనిపిస్తుంది.
- స్టవ్ మీద గిన్నె పెట్టి అందులో అర గ్లాసు నీళ్లు, మూడు చెంచాల పటిక బెల్లం వేసి బాగా మరగించాలి. నీళ్లు కొద్దిగా పాకంలా మారాక స్టవ్ మీద నుంచి దించాలి. ఈ పాకాన్ని చెంచాతో తీసుకుంటూ మెల్లగా తాగాలి. పావు గంటలో విరేచనాలు తగ్గుతాయి.



మెరిసే సింక్ కోసం...

ప్రస్తుతం ప్రతీ ఇంట్లో సింక్‌లు ఉంటున్నాయి. వంటగదిలో, బాత్‌రూమ్‌లో, ఇంటి వెనక తప్పనిసరిగా సింక్‌లు ఏర్పాటు చేసుకుంటున్నారు. సాధారణంగా వీటిని స్టీల్, పింగాణీ, గ్రానైట్, సిమెంట్‌లతో రూపొందిస్తూ ఉంటారు. వాడుతున్న కొద్దీ అవి మరకలతో నిండి పాతబడుతూ ఉంటాయి. అలాంటి వాటిని ఎటువంటి రసాయనాలు ఉపయోగించకుండా చిన్న చిట్కాలతో కొత్తవాటిలా మెరిపించవచ్చు. ఆ చిట్కాల గురించి తెలుసుకుందాం..!

- ఒక గిన్నెలోకి కొద్దిగా శనగపిండిని తీసుకోవాలి. ఒక స్క్రబ్బర్‌ను నీళ్లతో తడిపి దానితో శనగపిండిని అద్దుకుంటూ సింక్‌ను తోమాలి. స్టీల్, గ్రానైట్ ఇలా ఏ రకం సింక్‌నైనా శనగపిండి పూర్తిగా శుభ్రపరుస్తుంది. సింక్‌లో ఏర్పడే టూత్‌పేస్టు, సబ్బు, డిటర్జెంట్, నూనె తదితర మరకలను పోగొడుతుంది. ఈ చిట్కాతో సింక్ నుండి వెలువడే వాసనలు కూడా తొలగిపోతాయి.
- ఒక గిన్నెలో రెండు చెంచాల శనగపిండి, ఒక చెంచా వైట్ వెనిగర్ వేసి బాగా కలిపి పేస్టులా చేయాలి. సింక్‌లోని మరకలమీద ఈ మిశ్రమాన్ని పూసి పావుగంటసేపు ఆరనివ్వాలి. తరవాత నీళ్లు చల్లుతూ స్క్రబ్బర్‌తో రుద్దితే మరకలన్నీ పోయి సింక్ కొత్తదానిలా మెరుస్తుంది. ఈ చిట్కాతో స్టీల్ సింక్ మీద పేరుకున్న నీటి మరకలు పూర్తిగా పోతాయి. పాలరాతి సింక్‌లను శుభ్రం చేయడానికి వెనిగర్ ఉపయోగించకూడదు.
- ఒక గిన్నెలో రెండు చెంచాల శనగపిండి, మూడు చెంచాల నిమ్మరసం వేసి బాగా కలిపి పేస్టులా చేయాలి. ఈ మిశ్రమాన్ని సింక్ మొత్తానికి పట్టించి అరగంటసేపు ఉంచాలి. తరవాత నీళ్లు చల్లుకుంటూ స్క్రబ్బర్‌తో తోవితే సింక్ మీద మరకలన్నీ తొలగిపోతాయి. ఈ చిట్కాని ఏ రకం సింక్‌కైనా ఉపయోగించవచ్చు.
- నిమ్మ తొక్క లోపలి భాగంలో కొద్దిగా ఉప్పు చల్లి దానితో సింక్ మొత్తాన్ని రుద్దాలి. పావుగంటసేపు ఆరిన తరవాత గోరువెచ్చని నీళ్లతో కడిగితే సింక్ తాజాగా మెరుస్తుంది. నిమ్మ తొక్కలను పడేయకుండా తరచూ ఇలా చేస్తూ ఉంటే సింక్ ఎప్పటికీ కొత్తగానే ఉంటుంది.

మూడు పదులు నిండితే...

వయసు పెరుగుతున్న కొద్దీ చర్మం, కండరాలు, శిరోజాలు బలహీనమవుతూ ఉంటాయి. ప్రతిరోజూ యోగా, వ్యాయామం చేస్తూ మంచి పోషకాహారం తీసుకుంటూ ఉంటే ముప్పై ఏళ్లు నిండినా కూడా అందంగా ఆరోగ్యంగా ఉండవచ్చు అంటున్నారు నిపుణులు. ఇలా ఆరోగ్యాన్ని అందిస్తూ అందాన్ని పెంచే ఆహార పదార్థాల గురించి తెలుసుకుందాం...

- ప్రతిరోజు ఒక కప్పు బొప్పాయి ముక్కలు తినడం అలవాటు చేసుకోవాలి. ఈ పండులోని యాంటీ ఆక్సిడెంట్లు, విటమిన్లు చర్మం పొడిబారకుండా, ముడుతలు రాకుండా చేస్తాయి. రక్తాన్ని శుద్ధి చేస్తాయి. జీర్ణక్రియ సజావుగా జరిగేలా తోడ్పడతాయి.
- వారానికి రెండు రోజులు పాలకూరని ఆహారంలో చేర్చుకోవాలి. పాలకూరలో ఐరన్, ఫోలేట్ పుష్కలంగా ఉంటాయి. ఇవి మెదడు పనితీరుని చురుకుగా మారుస్తాయి. జ్ఞాపకశక్తిని పెంచుతాయి. శిరోజాలకు ఆరోగ్యాన్ని అందిస్తాయి.
- తరచూ అవకాడో తినడం మంచిది. దీనిలో ఇ విటమిన్ ఎక్కువగా ఉంటుంది. ఇది చర్మాన్ని తేమగా ఉంచడంతోపాటు అకాల వార్ధక్యాన్ని నివారిస్తుంది.
- ప్రతిరోజూ సాయంత్రంపూట బాదం, పిస్తా, జీడిపప్పు, మొలకలు, గుమ్మడి గింజలు లాంటివి తీసుకుంటూ ఉండాలి. వీటిలో ఒమేగా 3 ఫ్యాటీ యాసిడ్లు, జింక్ ఎక్కువగా ఉంటాయి. ఇవి వయసు పెరిగే కొద్దీ శరీరంలో ఏర్పడే ఇన్‌ఫ్లమేషన్ సమస్యలను నివారిస్తాయి.
- తరచూ గ్రీన్ టీ తాగుతూ ఉంటే శరీరంలో పేరుకునే విషపదార్థాలు విసర్జితమవుతాయి. మెదడు, గుండె ఆరోగ్యంగా పనిచేస్తాయి. చర్మం కాంతివంతంగా మారుతుంది. శరీర బరువు నియంత్రణలో ఉంటుంది. పొట్ట పెరగకుండా ఉంటుంది.
- ప్రతిరోజూ కనీసం ఒక కప్పు పెరుగు తీసుకోవడం మంచిది. దీనిలోని బ్యాక్టీరియా జీర్ణాశయాన్ని ఆరోగ్యంగా ఉంచుతుంది. రోగనిరోధక శక్తి పెరుగుతుంది. ఎముకలు బలోపేతమవుతాయి. ఒత్తిడి, ఆందోళన తగ్గి మంచి నిద్ర పడుతుంది.
- తరచూ డార్క్ చాక్లెట్ తింటూ ఉంటే మెదడు ఉత్తేజితమవుతుంది. నీరసం, అలసట తగ్గుతాయి.



తెలంగాణ మోడల్‌లో కులగణన చేయండి

» ప్రధాని మోదీకి కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే లేఖ

న్యూఢిల్లీ, మే 6: తెలంగాణ మోడల్‌లో దేశవ్యాప్తంగా కులగణన నిర్వహించాలని కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే ప్రధాని మోదీని కోరారు. కులగణన అంశంపై సాధ్యమైనంత త్వరగా అన్ని రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించి అభిప్రాయాలు తీసుకోవాలన్నారు. ఈ మేరకు ప్రధాని మోదీకి సోమవారం ఆయన లేఖ రాశారు. కులగణనకు సంబంధించిన ప్రశ్నావళిలో.. కేవలం ఏ కులం వారు ఎంత మంది ఉన్నారన్నదానికే పరిమితం కాకుండా, ఆయా కులాల ఆర్థిక, సామాజిక స్థితిగతుల మీద కూడా ప్రశ్నలు రూపొందించి వివరాలు సేకరించాలన్నారు. తెలంగాణలో కూడా ఇదే విధంగా కులగణన నిర్వహించారని తెలిపారు. తెలంగాణ కులగణన ప్రశ్నావళిని కేంద్ర హోంశాఖ పరిశీలించాలని సూచించారు. కులగణనతో పాటు రిజర్వేషన్లలో ప్రస్తుతం ఉన్న 50% పరిమితిని తొలగించాలని, ఇందుకోసం రాజ్యాంగ సవరణ చేయాలని ప్రధాని మోదీని ఖర్గే కోరారు.

మానవాభివృద్ధి సూచీలో భారత్ పురోగతి

న్యూఢిల్లీ, మే 6: మానవ అభివృద్ధి సూచీ(హెచ్‌డీఐ) ర్యాంకుల్లో భారత్ పురోగతి సాధించింది. మంగళవారం ఐరాస అభివృద్ధి కార్యక్రమం (యూఎన్‌డీపీ) 2025 మానవ అభివృద్ధి నివేదిక (హెచ్‌డీఆర్)ను విడుదల చేసింది. ఆ నివేదికలో 193 దేశాలకు సంబంధించి వెల్లడించిన హెచ్‌డీఐ ర్యాంకుల్లో భారత్ 130వ స్థానం సాధించింది. 2022, 2023 మధ్య భారత్ తన స్థానాన్ని మెరుగుపరుచుకుని 133 నుంచి 130కి ఎగబాకింది. ఇక హెచ్‌డీఐ విలువ 2022లో 0.676 ఉండగా, 2023లో అది 0.685కు పెరిగింది. భారత్‌లో ఆరోగ్యం, విద్యలో అసమానతలు కొంత తొలగినా, ఆదాయం, లింగ వ్యత్యాసాలు ఇంకా ఎక్కువగా కొనసాగుతున్నాయని ఈ నివేదిక స్పష్టం చేసింది. ఇక ప్రజల ఆయుర్దాయం 71.7 సంవత్సరాల నుంచి 72 సంవత్సరాలకు చేరింది. ఇప్పటి వరకు రికార్డయినదానిలో ఇదే అత్యధికం కావడం విశేషం. ప్రపంచ ఏఐ వ్యవస్థలో భారత్ లీడర్‌గా ఉందని ఈ నివేదిక పేర్కొనడం విశేషం.

వెయ్యి డాలర్లు ఇస్తాం.. వెళ్లిపోండి!

» అక్రమ వలసదారులకు ట్రంప్ ఆఫర్

వాషింగ్టన్, మే 6: అమెరికాలో నివసిస్తున్న అక్రమ వలసదారులకు దేశాధ్యక్షుడు ట్రంప్ మరోసారి ఆఫర్ ప్రకటించారు. స్వచ్ఛందంగా తమ స్వదేశానికి తిరిగి వెళ్లేవారికి 1,000 డాలర్లు చెల్లిస్తామని వైట్‌హౌస్ సోమవారం పేర్కొంది. స్వీయ బహిష్కరణకు సంబంధించి 'సీబీపీ హోం' యాప్ ద్వారా సమాచారం ఇచ్చేవారికి ప్రయాణ ఖర్చులు కూడా చెల్లిస్తామని డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ (డీహెచ్‌ఎస్) తెలిపింది. ఇటువంటి వారిని ఇమిగ్రేషన్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం నిర్బంధించకుండా, బలవంతంగా తరలించకుండా చర్యలు తీసుకుంటామని వెల్లడించింది. అక్రమ వలసదారులు అరెస్టు కాకుండా ఉండటానికి స్వీయ బహిష్కరణే అత్యుత్తమమైన, చౌకయిన మార్గమని స్పష్టం చేసింది.

100కు పైగా డ్రోన్లతో రష్యాపై ఉక్రెయిన్ దాడులు

● విక్టరీ డే ముంగిట రష్యాకు ఊహించని పరిణామం

మాస్కో/కీవ్, మే 6: రష్యా విక్టరీ డే వేడుకల ముంగిట రష్యాకు ఉక్రెయిన్ పెద్ద షాకిచ్చింది. సోమవారం రాత్రి నుంచి వందకు పైగా డ్రోన్లను రష్యాపై ప్రయోగించింది. డజనుకు పైగా ప్రాంతాలను లక్ష్యంగా చేసుకుని, ఈ దాడులు చేసింది. వాటిని తాము సమర్థంగా కూల్చేశామని రష్యా ప్రకటించింది. ఎలాంటి ఆస్తి, ప్రాణనష్టం నమోదు కాలేదని తెలిపింది. అయితే..మాస్కోలో ఉన్న నాలుగు విమానాశ్రయాలను కొన్ని గంటల పాటు తాత్కాలికంగా మూసివేయాల్సి వచ్చినట్లు తెలిపింది. మాస్కో చుట్టుపక్కల ఉన్న పలు రీజియన్లలోనూ విమానాశ్రయాలను మూసివేసినట్లు తెలిపింది రష్యా విక్టరీ డే పరేడ్‌కు వెళ్లే దేశాధినేతల భద్రతపై తాము హామీ ఇవ్వలేమని ఉక్రెయిన్ ఇటీవల ప్రకటించింది.

సుప్రీం జడ్జిల ఆస్తుల వెల్లడి

(మొదటిపేజీ తరువాయి)

మూడు బెడ్రూమ్‌ల ఇల్లు, కామన్‌వెల్త్ గేమ్స్ విలేజ్‌లో నాలుగు బెడ్రూముల ఇల్లు ఉన్నాయి. కాబోయే ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్‌కు బ్యాంకు ఖాతాల్లో 19.63 లక్షలు ఉన్నాయి. మహారాష్ట్రలోని అమరావతిలో వారసత్వంగా వచ్చిన ఇల్లు, ముంబైలోని బాంద్రాలో, ఢిల్లీలోని డిఫెన్స్ కాలనీలో అపార్ట్‌మెంట్ ఫ్లాట్లు, అమరావతి, నాగపూర్‌లలో వ్యవసాయ భూమి ఉన్నాయి. ఏప్రిల్ 1న జరిగిన న్యాయమూర్తుల సమావేశంలో న్యాయమూర్తుల ఆస్తుల వివరాలను పెట్టాలని నిర్ణయం తీసుకున్నారు. వెబ్‌సైట్లో పెట్టిన సమాచారం ప్రకారం చూస్తే వారంలో దిగిపోతున్న ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఖన్నాకు గురుగ్రామ్‌లో 4 బెడ్రూముల ఇంట్లో 56 శాతం వాటా, హిమాచల్ ప్రదేశ్‌లోని డల్‌హౌసీలో ఇంటి వాటా ఉన్నాయి. పీపీఎఫ్‌లో కోటి, జీపీఎఫ్‌లో కోటీ 77 లక్షలు, 25 తులాల బంగారం, రెండు కిలోల వెండి, 2015లో కొన్న మారుతి స్విఫ్ట్ కారు ఉన్నాయి. జస్టిస్ గవాయ్‌కు రూ.5 లక్షల బంగారం, ఆయన భార్యకు 29 లక్షల బంగారం ఉన్నాయి. ఈ ఏడాది చివర్లో ప్రధాన న్యాయమూర్తి కాబోతున్న జస్టిస్ సూర్యకాంత్‌కు చండీగఢ్‌లో ఇల్లు, పంచకులలో 13 ఎకరాల వ్యవసాయ భూమి, గురుగావ్‌లో 300 గజాల ప్లాట్ ఉన్నాయి. రూ.4.11 కోట్ల డిపాజిట్లు ఉన్నాయి. బీజీ లాయర్ నుంచి సుప్రీంకోర్టు జడ్జిగా ఎదిగిన జస్టిస్ విశ్వనాథన్ అత్యధిక ఆస్తులను చూపించారు.

న్యాయమూర్తుల ఆస్తుల వివరాలను అప్‌లోడ్ చేయడమే కాకుండా గత రెండున్నరేళ్లుగా సుప్రీం



కోర్టు, హైకోర్టు న్యాయమూర్తుల నియామకం జరిగిన విధానాన్ని కూడా సుప్రీంకోర్టు వెబ్‌సైట్‌లో పెట్టారు. గత రెండున్నరేళ్లలో నియామకానికి పరిశీలించిన పేర్లలో కేవలం 6 శాతం మంది మాత్రమే న్యాయమూర్తుల కుటుంబాలకు చెందిన వారు. మొత్తం 221 మంది పేర్లను జడ్జిలుగా సిఫార్సు చేస్తే అందులో 14 మంది న్యాయమూర్తుల కుటుంబాలకు చెందిన వారని తేలింది. వారిలో ఒకరి (పంజాబ్ హైకోర్టుకు చెందిన న్యాయవాది రోహిత్ కుమార్) పేరును మాత్రమే కేంద్ర ప్రభుత్వం ఇంకా ఆమోదించాల్సి ఉంది. రెండున్నరేళ్లలో 221 పేర్లను సుప్రీంకోర్టు సిఫార్సు చేయగా, 29 పేర్లు ఇంకా కేంద్రం పరిశీలనలో ఉన్నాయి. జస్టిస్ చంద్రచూడ్ ప్రధాన న్యాయమూర్తిగా ఉండగా హైకోర్టు కొలీజియాల నుంచి 303 ప్రతిపాదనలు వచ్చాయి. అందులో 170 మంది(56 శాతం) పేర్లను జస్టిస్ చంద్రచూడ్ నేతృత్వంలోని సుప్రీంకోర్టు కొలీజియం ఆమోదించింది. అందులో ఏడు శాతం మంది(12) న్యాయమూర్తుల కుటుంబాలకు చెందిన వారు. జస్టిస్ సంజీవ్ ఖన్నా ప్రధాన న్యాయమూర్తి అయ్యాక రాష్ట్రాల కొలీజియాల నుంచి 103 ప్రతిపాదనలు రాగా వాటిలో 51 మందిని ఆయన ఆమోదించారు. అందులో ఇద్దరు న్యాయమూర్తుల కుటుంబాలకు చెందిన వారు. ఛత్తీస్‌గఢ్ హైకోర్టు జడ్జిగా ఎంపికైన జస్టిస్ బిబూ దత్త గురు సుప్రీంకోర్టు జడ్జి జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రాకు బావ/బావమరిది. జస్టిస్ దత్తగురు ఎంపిక అయినపుడు జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా కొలీజియంలో లేరు.

జస్టిస్ వర్మ ఇంట్లో నోట్ల కట్టలు.. సీజేఐకి త్రిసభ్య కమిటీ నివేదిక

న్యూఢిల్లీ, మే 6: జస్టిస్ యశ్వంత్ వర్మ అధికారిక నివాసంలో నోట్ల కట్టల వ్యవహారంపై దర్యాప్తు జరిపిన త్రిసభ్య కమిటీ.. తన నివేదికను సీజేఐకి సమర్పించింది. మార్చి 14న ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి (ఆ సమయంలో) జస్టిస్ యశ్వంత్ వర్మ నివాసంలో అగ్నిప్రమాదం జరగ్గా.. మంటలు ఆర్పేందుకు వెళ్లిన అగ్నిమాపక సిబ్బంది, పోలీసులకు సగం కాలిన నోట్ల కట్టలు దొరికాయన్న వార్తలు దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. ఈ అంశంపై దర్యాప్తు జరిపేందుకు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి(సీజేఐ) జస్టిస్ సంజీవ్ ఖన్నా మార్చి 22న ముగ్గురు న్యాయమూర్తులతో కమిటీ ఏర్పాటు చేశారు.

రిజర్వేషన్లు రైలు కంపార్టుమెంట్ లాంటివి

» ముందు ఎక్కినవారు ఇతరులను అనుమతించరు.. సుప్రీం కీలక వ్యాఖ్యలు

న్యూఢిల్లీ, మే 6: కుల ఆధారిత రిజర్వేషన్లు రైలు కంపార్ట్‌మెంట్ లాంటివని, ముందుగా కంపార్ట్‌మెంట్‌లోకి ఎక్కినవారు ఇతరులను లోపలకు రానీయరంటూ సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. మహారాష్ట్రలో స్థానిక ఎన్నికల్లో ఓబీసీ రిజర్వేషన్ల అమలుకు సంబంధించిన కేసు విచారణ సందర్భంగా న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ ఈ వ్యాఖ్యలు చేశారు. మహారాష్ట్రలోని స్థానిక సంస్థలకు చివరిసారిగా 2016-17లో ఎన్నికలు నిర్వహించారు. ఓబీసీ రిజర్వేషన్ల అమలు విషయంలో జరుగుతున్న న్యాయపోరాటం కారణంగా అక్కడ ఎన్నికలు ఆలస్యం అవుతున్నాయి. ఈ నేపథ్యంలో జనాభా లెక్కల సమయంలో సేకరించిన ఓబీసీల వివరాలు ప్రభుత్వం వద్ద ఉన్నాయని, వాటిని ఉపయోగించుకొని స్థానిక ఎన్నికలు నిర్వహించేలా ఆదేశాలివ్వాలని పిటిషన్ దాఖలైంది. అయితే, రిజర్వేషన్ల అమలుకు ముందుగా ఓబీసీల్లోని రాజకీయంగా, సామాజికంగా వెనుకబడినవారిని గుర్తించడం అవసరమని ప్రభుత్వం తరఫు న్యాయవాది గోపాల్ శంకరనారాయణన్ తెలిపారు. ఈ సమయంలో జస్టిస్ సూర్యకాంత్ జోక్యం చేసుకుంటూ... రైలు కంపార్ట్‌మెంట్‌ను ఉదహరిస్తూ కీలక వ్యాఖ్యలు చేశారు. కొన్ని కుటుంబాలు, కొన్ని బృందాలే రిజర్వేషన్ ఫలాలను అనుభవిస్తున్నాయని ఆయన వ్యాఖ్యానించారు. "సమ్మిళిత సూత్రంపై ఆధారపడి రిజర్వేషన్ల అమలు ఉంటుంది. వాటి పరిధిలోకి రాగల మరిన్ని సమూహాలను గుర్తించడం ప్రభుత్వాల విధి" అని వ్యాఖ్యానించారు. తదుపరి విచారణను బుధవారానికి వాయిదా వేశారు.

రోడ్డు ప్రమాద బాధితులకు 1.50 లక్షల వరకూ ఉచిత వైద్యం

న్యూఢిల్లీ, మే 6: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వారికి రూ.1.50 లక్షల వరకూ నగదు రహిత ఉచిత చికిత్సను అందించడానికి వీలుకల్పిస్తూ కేంద్ర ప్రభుత్వం గెజిట్‌ను జారీ చేసింది. సోమవారం నుంచే ఇది అమలులోకి వచ్చిందని పేర్కొంది. ప్రమాదం జరిగిన ఏడు రోజుల్లోగా ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవచ్చు. నిర్దేశిత ప్రమాణాలు కలిగి, నమోదైన ఏ ఆసుపత్రిలోనైనా చికిత్స పొందవచ్చు. పోలీసులు, ఆసుపత్రులు, స్టేట్ హెల్త్ ఏజెన్సీల సహకారంతో 'రోడ్డు ప్రమాద బాధితులకు నగదు రహిత చికిత్స పథకం 2025'ను జాతీయ ఆరోగ్య సంస్థ (ఎన్‌హెచ్‌ఏ) అమలు చేస్తుంది. రాష్ట్రాల్లో, కేంద్రపాలిత ప్రాంతాల్లో ఈ పథకాన్ని అమలు చేయడానికి రాష్ట్ర రోడ్డు భద్రతా మండలి నోడల్ ఏజెన్సీగా వ్యవహరిస్తుంది. పథకం అమలు, ఆసుపత్రులను పథకంలో చేర్చడం, బాధితులకు చికిత్స, ఆసుపత్రులకు చెల్లింపులు తదితర అన్ని విషయాలను ఎన్‌హెచ్‌ఏతో సమన్వయం చేసుకొనే బాధ్యత ఈ నోడల్ ఏజెన్సీదే. పథకం అమలు తీరుతెన్నులను పరిశీలించడానికి స్టీరింగ్ కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు కేంద్రం ప్రకటించింది.

భారత్, యూకే మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం

ఇరు దేశాల మధ్య కస్టమ్స్ సుంకాల తగ్గింపు.. ఒప్పందం చరిత్రాత్మకమని అభివర్ణించిన ప్రధాని మోదీ



న్యూఢిల్లీ, మే 6: భారత్, యునైటెడ్ కింగ్‌డమ్ (యూకే) మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టీఏ) కుదిరింది. ఇరు దేశాల మధ్య వాణిజ్యాన్ని గణనీయంగా పెంచడంతోపాటు ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేయడానికి ఈ ఒప్పందం తోడ్పడుతుంది. యూకే ప్రధాన మంత్రి కెయిర్ స్టార్మర్‌తో చర్చల అనంతరం ప్రధాని మోదీ స్వయంగా ఈ విషయాన్ని ప్రకటించారు. "యూకే ప్రధానితో మాట్లాడాను. భారత్, యూకే మధ్య ఇరుదేశాలకు ఎంతో ప్రయోజనం కలిగించే ప్రతిష్ఠాత్మక స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కుదిరింది. ఇది చరిత్రాత్మకం. ఇరుదేశాల వాణిజ్యం, పెట్టుబడులు, అభివృద్ధి, ఉద్యోగాల కల్పన, సృజనాత్మక ఆవిష్కరణలకు ఈ ఒప్పందం ఊతమిస్తుంది" అని మోదీ వెల్లడించారు. అనంతరం ఈ అంశంపై ప్రధాని కార్యాలయం, యూకే ప్రభుత్వం వేర్వేరుగా ప్రకటనలు విడుదల చేశాయి. భారత్‌తో ఒప్పందం ఇరుదేశాల సంబంధాల్లో ఓ మైలురాయి అని స్టార్మర్ పేర్కొన్నారు.

భారీగా సుంకాల తగ్గింపు

స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం ప్రకారం.. భారత్, యూకేల మధ్య దిగుమతి సుంకాలు భారీగా తగ్గనున్నాయి. పదేళ్లలో సుంకాలు సున్నా స్థాయికి చేరుతాయని యూకే ప్రభుత్వం ఆశాభావం వ్యక్తం చేసింది. యూకే నుంచి మద్యం దిగుమతులపై 150శాతం నుంచి 40 శాతానికి, వాహనాలపై 100శాతం నుంచి 10 శాతానికి సుంకాలు తగ్గుతాయని పేర్కొంది. ఇరుదేశాల మధ్య వాణిజ్యం ప్రస్తుతం రూ.4.80 లక్షలకోట్లుకాగా.. పదేళ్లలో మరో రూ.2.90 లక్షల కోట్ల మేర పెరుగుతుందని అంచనా వేసింది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అడ్డగోలు సుంకాలతో ప్రపంచవ్యాప్తంగా వాణిజ్యం అంశంలో ఏర్పడిన గందరగోళ పరిస్థితి నుంచి భారత్, యూకేలకు ఈ ఒప్పందం ఉపశమనం కలిగిస్తుందని వాణిజ్యవర్గాలు పేర్కొంటున్నాయి.

భారతీయ ఉద్యోగులకు మేలు కలిగేలా..

యూకేలో పనిచేసే భారతీయ ఉద్యోగులకు సంబంధించి 'డబుల్ కంట్రిబ్యూషన్ కన్వెన్షన్' ఒప్పందం కూడా కుదిరింది. యూకేలో ఉద్యోగులు జాతీయ ఆరోగ్య బీమా కోసం ఏటా తప్పనిసరిగా 500 పౌండ్లు(సుమారు రూ.56 వేలు) చెల్లించాల్సి ఉంటుంది. అయితే, యూకేలో పనిచేసే భారతీయ ఉద్యోగులు..ఆ బీమా సొమ్ము కట్టాల్సిన అవసరం లేకుండా తాజాగా ఒప్పందం కుదిరింది. ఆ ఉద్యోగులు మన దేశంలోనే ఈపీఎఫ్‌ఓ ఆధ్వర్యంలోని సామాజిక భద్రత పథకాల్లో కొనసాగవచ్చు.

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

'వీరమల్లు' వస్తున్నాడు




పవన్ కల్యాణ్ హీరోగా జ్యోతికృష్ణ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న 'హరిహర వీరమల్లు' తొలి భాగం షూటింగ్ మంగళవారంతో పూర్తయింది. ఈ విషయాన్ని సోషల్ మీడియా వేదికగా తెలియజేస్తూ నిర్మాత ఏ.ఎం.రత్నం ఆనందం వ్యక్తం చేశారు. 'చిత్రీకరణ పూర్తయింది. ఇక థియేటర్లలో విడుదల కావడమే తరువాయి. బ్లాక్‌బస్టర్ సాంగ్స్, అదిరిపోయే ట్రైలర్ త్వరలో విడుదలవుతాయి' అని ఏ.ఎం.రత్నం తెలిపారు. ఈ చిత్రంలో పవన్ కల్యాణ్ చారిత్రక యోధుడిగా నటిస్తున్నారు. నిధి అగర్వాల్ కథానాయిక. బాబీ డియోల్, అనుపమఖేర్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రాన్ని మే 9న విడుదల చేయనున్నట్లు గతంలో మేకర్స్ ప్రకటించారు. అయితే కొంత షూటింగ్ మిగిలి ఉండడంతో వాయిదా పడింది. ఇప్పుడు మొత్తం చిత్రీకరణ పూర్తయినందున విడుదల తేదీని త్వరలో ప్రకటించనున్నట్లు చిత్రబృందం పేర్కొంది.

మెగా ఫ్యామిలీలో మరో ఆనందం



వరుణ్ తేజ్- లావణ్య త్రిపాఠి దంపతులు శుభవార్త చెప్పారు. తాము తల్లిదండ్రులు కాబోతున్నట్లు సోషల్ మీడియా వేదికగా వెల్లడించారు. ఇద్దరు చేతులు పట్టుకొని చిన్నపిల్లల షూతో ఉన్న ఫొటోను షేర్ చేసారు. 'జీవితంలో అత్యంత అందమైన పాత్ర పోషించనున్నాను. కమింగ్ సూన్' అని వరుణ్ తేజ్ క్యాప్షన్ పెట్టారు. ప్రస్తుతం ఈ పోస్టు వైరల్ అవుతోంది. పలువురు సినీ ప్రముఖులు వరుణ్ తేజ్- లావణ్య త్రిపాఠి దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు. సమంత, రకుల్ ప్రీత్ సింగ్, అల్లు స్నేహ తదితరులు కంగ్రాట్స్ అంటూ కామెంట్స్ పెట్టారు. కాగా, 2017లో విడుదలైన 'మిస్టర్' సినిమాలో వరుణ్ - లావణ్య తొలిసారి కలసి నటించారు.

నేటి రాజకీయాల నేపథ్యంలో..



ఇంద్రజ, అజయ్ ప్రధాన పాత్రల్లో గడ్డం రమణారెడ్డి దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'సీఎం పెళ్లాం'. బొల్ల రామకృష్ణారెడ్డి నిర్మించారు. ఈ శుక్రవారం విడుదలవుతున్న సందర్భంగా చిత్రబృందం మీడియాతో మాట్లాడింది. చిత్ర దర్శకుడు రమణారెడ్డి మాట్లాడుతూ 'ఎమ్మెల్యే బిజీగా ఉండి బయట తిరుగుతున్న సమయంలో.. తమ సమస్యలు పరిష్కరించాలంటూ వచ్చిన ప్రజలను ఆ ఎమ్మెల్యే పెళ్లాం కలసి మాట్లాడితే వ్యవస్థలో చాలా మార్పులు వస్తాయని నమ్మాను. అదే ఈ సినిమాలో చూపించాను. రాజకీయ నాయకులు బూతులు మాట్లాడొద్దన్న పాయింట్‌నూ చూపించాను' అని చెప్పారు. అజయ్ మాట్లాడుతూ 'మహిళా సాధికారత గురించి వివరించిన ఈ చిత్రంలో నటించడం ఆనందంగా ఉంది' అని అన్నారు. చిత్ర నిర్మాత రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ 'రాజకీయ నాయకుల కుటుంబ సభ్యులు బయటకు వచ్చి ప్రజలకు సేవ చేస్తే ఎలా ఉంటుంది? రాష్ట్రం ఏవిధంగా బాగుపడుతుంది అనే కోణంలో చిత్రాన్ని అద్భుతంగా తెరకెక్కించాం' అని తెలిపారు.

క్లాసిక్ లుక్‌లో...



'మిస్టర్ బచ్చన్' సినిమాతో టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చి.. తన అందం, అభినయంతో అందర్నీ ఆకట్టుకున్నారు హీరోయిన్ భాగ్యశ్రీ బోర్సే. ప్రస్తుతం దుల్కర్ సల్మాన్‌తో 'కాంత', విజయ్ దేవరకొండతో 'కింగడమ్', రామ్ పోతినేనితో 'రాపో 22' (వర్కింగ్ టైటిల్) వంటి వరుస ప్రాజెక్టులతో దూసుకుపోతున్నారీ బ్యూటీ. మంగళవారం ఆమె పుట్టినరోజు సందర్భంగా 'కాంత' సినిమా నుంచి భాగ్యశ్రీ లుక్‌ను విడుదల చేసి శుభాకాంక్షలు తెలిపారు మేకర్స్. ఓ వింటేజ్ కారులో కూర్చుని మెరిసిపోతున్న ఆమె క్లాసిక్ లుక్ ప్రస్తుతం అందరినీ ఆకట్టుకుంటోంది. సెల్వమణి సెల్వరాజ్ తెరకెక్కిస్తున్న ఈ చిత్రాన్ని రానా దగ్గుబాటి, దుల్కర్ సల్మాన్, ప్రశాంత్ పోట్లూరి, జోమ్ వర్గీస్ నిర్మిస్తున్నారు.

నా అహం కంటే మీపై ప్రేమే ఎక్కువ

సోనూ నిగమ్



ఇటీవల జరిగిన ఓ కాన్సర్ట్‌లో గాయకుడు సోనూ నిగమ్ చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదం కావడం, దాని వల్ల ఏర్పడిన పరిణామాలు అందరికీ తెలిసిందే. దీంతో ఈ వ్యవహారంపై సోనూ నిగమ్ స్పందించారు. ఆ కాన్సర్ట్‌లో తను చేసిన వ్యాఖ్యలపై వివరణ ఇచ్చి, క్షమాపణలు తెలిపారు. 'సారీ కర్ణాటక. నా అహం కంటే మీపై నాకున్న ప్రేమే ఎక్కువ' అని సోషల్‌మీడియా వేదికగా పేర్కొన్నారు. కాగా, ఆ కాన్సర్ట్‌లో ఆయన చేసిన వ్యాఖ్యలపై 'కర్ణాటక రక్షణ వేదిక' బెంగుళూరు సిటీ యూనిట్ అధ్యక్షుడు ధర్మరాజ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆయనపై పోలీసులు కేసు నమోదు చేశారు. వారం రోజుల్లోపు విచారణలో పాల్గొనాలని పోలీసులు ఆయనకు నోటీసులిచ్చారు. అలాగే, ఈ వ్యాఖ్యలపై ఆగ్రహించిన 'కర్ణాటక ఫిల్మ్ ఛాంబర్'.. ఓ సమావేశం ఏర్పాటు చేసి ఆయనను కన్నడ సినిమాల నుంచి బ్యాన్ చేయాలనే నిర్ణయం తీసుకున్నారు.

తెరచాప సందేశం



నూతన నటీనటులతో తెరకెక్కుతోన్న సందేశాత్మక చిత్రం 'తెరచాప'. జోయల్ జార్జ్ దర్శకత్వంలో కైలాశ్ దుర్గం నిర్మిస్తున్నారు. నవీన్ రాజు, పూజ సుహాసిని జంటగా నటిస్తున్నారు. మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో చిత్రబృందం టీజర్‌ను విడుదల చేసింది. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ ప్రేక్షకులను మెప్పించేలా 'తెరచాప' చిత్రాన్ని తీశాను. కథానుసారం తమిళనాడు నేపథ్యంలో వచ్చే సన్నివేశాలు ప్రత్యేకాకర్షణగా నిలుస్తాయి' అని చెప్పారు. 'ఈ సినిమా నాకు నిర్మాతగా తొలి చిత్రమే అయినా కథపైన గట్టి నమ్మకంతో నిర్మించాను. ప్రేక్షకులను ఆకట్టుకునే అంశాలన్నీ ఈ చిత్రంలో ఉన్నాయి' అని కైలాశ్ దుర్గం తెలిపారు.

కాలం నాలో చాలా మార్పులు తెచ్చింది

సమంత



'ఒక నటిగా, మనిషిగా కాలం నాలో చాలా మార్పులు తెచ్చింది. ఇటీవల నా జీవితంలో జరిగిన విషయాలను బట్టి ఒక్కటి మాత్రం నాకు బాగా అర్థమైంది... వ్యక్తిగత జీవితాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ బహిరంగంగా చర్చనీయాంశం చేయకూడదని. ఇకపై నా పర్సనల్ లైఫ్ గురించి బయటెక్కడా స్పందించను' అని సమంత అన్నారు. స్వీయ నిర్మాణంలో ఆమె అతిథి పాత్రను పోషించిన చిత్రం 'శుభం'. ప్రవీణ్ కండ్రేగుల దర్శకుడు. ఈ నెల 9న విడుదలవుతున్న సందర్భంగా సమంత సినిమా విశేషాలను మీడియాతో పంచుకున్నారు.

● ఒక సినిమా విడుదలవరకూ వచ్చిందంటే దాని వెనుక ఎంత కష్టం ఉంటుందో తొలిసారి తెలిసొచ్చింది. నా చిత్రబృందంపైన మరింత గౌరవం పెరిగింది. వాళ్లంతా వారం రోజులుగా నిద్రపోకుండా పనిచేస్తున్నారు. ఇదంతా చూశాకే సినిమా తీయడం ఎంత కష్టమో నాకు అర్థమైంది. వాళ్లను చూస్తుంటే నా కెరీర్ తొలినాళ్లు గుర్తుకు వచ్చాయి. 'ఏం మాయ చేశావే' సినిమా వచ్చి పదిహేనేళ్లవుతోంది. ఇన్నేళ్లలో నా జీవితంలో చాలా జరిగాయి. ఈ సినిమా మరోసారి నా మూలాలను నాకు గుర్తు చేసింది.

మంచి సినిమా ఇవ్వాలని ప్రయత్నించాం

● నటిగా నాకు మంచి పేరు ప్రఖ్యాతలు వచ్చాయి. అభిమాన గణం ఏర్పడింది. నా జీవితాంతం నటిగానే కొనసాగుతాను అనుకున్నాను. అయితే అనారోగ్యంతో సినిమాలకు దూరమవ్వాల్సి వచ్చింది. నేను నటిగా మళ్లీ సెట్‌లోకి అడుగుపెడతానో లేదో కూడా అప్పుడు తెలియదు. బాగా దిగులుపడ్డాను. అప్పుడు నాలో ఒక ఆశారేఖను వెతుక్కోవాల్సి వచ్చింది. నా అంతరాత్మ చెప్పిన మాట విన్నాను. చేయాల్సింది చాలా ఉంది అనిపించింది. అలా నిర్మాతగా మారాను. 'బ్రౌన్ గర్ల్ ఇన్ ద రెయిన్' అని నా చిన్నప్పుడు ఒక కవిత ఉండేది. దాని స్ఫూర్తితో ట్రాలాలా మూవింగ్ పిక్చర్స్ అని మా బేనర్‌కు పేరు పెట్టాం. నేను ఇండస్ట్రీలోకి వచ్చి 15 ఏళ్లు అయింది. చాలా తెలుసుకున్నాను, నేర్చుకున్నాను. ఆ అనుభవంతో ఎనిమిది నెలల్లో ఒక సినిమాను షూట్ చేసి విడుదలకు సిద్ధం చేశాం. షూటింగ్ పూర్తి చేసేంతవరకూ బయటకు చెప్పలేదు. ఎక్కువగా మాట్లాడకుండా పనిచేసి, మంచి సినిమా ఇద్దామని ప్రయత్నించాం. ఇదొక సింపుల్ హారర్ కామెడీ అని చెప్పవచ్చు.

> హీరోయిన్‌గా చేసినప్పుడూ ఫలితంపై టెన్షన్ ఉండేది కానీ నిర్మాతగా అనే సరికి ఇంకొంచెం ఎక్కువగా ఉంది. ప్రివ్యూలకు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన వచ్చింది. కథ బాగా వచ్చింది కాబట్టి మంచి సినిమాగా నిలుస్తుందనే నమ్మకం ఉంది.

సినిమా చూస్తే తెలుస్తుంది

● దర్శకుడు గౌతమ్‌మీనన్ గారు 'ఏం మాయ చేశావే' చిత్రంతో నాకు నటిగా అవకాశం ఇచ్చారు. ఆయన అడిగితే అప్పట్లో పెద్ద హీరోయిన్లు ఆ సినిమాలో చేసేందుకు సిద్ధంగా ఉన్నారు. కానీ కొత్తవాళ్లకు అవకాశమిచ్చి ఆయన రిస్క్ చేశారు. కొత్త కథలు చెప్పడంతో పాటు కొత్త వాళ్లకు అవకాశమివ్వడం నా బాధ్యత అనిపించింది. నా సొంత చిత్రాల్లో నటించకూడదు అనే నియమం పెట్టుకున్నాను. సినిమాలో నేనే లీడ్‌రోల్ చేయవచ్చు. కానీ అందరికీ అవకాశాలు రావాలి. అందుకే నా తొలి సినిమాలో నేను నటించకూడదు అనుకున్నాను. కానీ ఇందులో నేను అతిథి పాత్ర చేయాల్సి వచ్చింది. తొలుత ఎవ్వరినైనా అడుగుదామనుకున్నాను. తొలి సినిమాకే సాయం చేయమని అడగడానికి నాకు మనసురాలేదు. నేను చేస్తానని కూడా ఎవ్వరూ ఊహించలేదు. పాత్ర చిన్నదే అయినా చాలా ప్రభావం ఉంటుంది.

● నిర్మాతగా తొలి చిత్రమే అయినా నాకు చాలా నేర్పింది. నేను గతంలో నిర్మాతల పట్ల మరింత బాధ్యతతో ఉండి ఉండాల్సిందేమోనని అనిపించింది. వారిపై గౌరవం పెరిగింది. సమయం వృథా కావడం వల్ల నిర్మాతకు చాలా నష్టం జరుగుతుంది. ఈ సినిమాకు ఎక్కువ తక్కువ అని కాకుండా సినిమా డిమాండ్ చేసినంతమేర ఖర్చు చేశాం. ముందనుకున్న బడ్జెట్ కన్నా కొంచెం ఎక్కువ అయింది తప్ప పూర్తిగా అదుపు తప్పలేదు.

> నా దృష్టిలో హీరో అయినా హీరోయిన్ అయినా ఒక్కటే. పారితోషికాల్లో లింగవివక్ష చూపడం మొదట్నుంచి నాకు ఇష్టం లేదు. ఒకే స్థాయి అనుభవం, నైపుణ్యాలు ఉన్న వ్యక్తులకు ఒకే స్థాయి పారితోషికం అనేదాన్ని నేను సమర్థిస్తాను. అది నిజమైతే చూడాలని ఆశపడ్డా. ఈ సినిమాతో దాన్ని నిజం చేశాను. మా బృందంలోని మహిళా టెక్నీషియన్లకు కూడా సమానంగా పారితోషికం ఇచ్చాను. ఈ సినిమాకు అలా కుదిరింది. అయితే అన్ని సినిమాలకు అలా కుదురుతుందా అంటే కష్టమే.

> నిర్మాతగా తొలి సినిమాకే సమంత శుభం కార్డు వేశారంటూ చాలా మీమ్స్ వస్తున్నాయి. ఈ కథ కూడా సుదీర్ఘంగా సాగే సీరియల్ నేపథ్యంలో ఉండడంతో శుభం కార్డుకు ప్రాధాన్యం ఉంది. మామూలుగా 'శుభం' అనే టైటిల్ కార్డు సినిమాకు ముగింపులో వేస్తారు. కానీ దాన్ని ఈ సినిమాకే టైటిల్‌గా ఎందుకు పెట్టాం అనేది సినిమా చూస్తే ప్రేక్షకులకు తెలుస్తుంది.

నటిగా నా ప్రయాణాన్ని ఆస్వాదిస్తున్నాను

కేతిక శర్మ



'హీరోయిన్‌గా నా కెరీర్ గురించి పూర్తి సంతృప్తితో ఉన్నాను. జయాపజయాలు మన చేతిలో ఉండవు. ఫలితం గురించి ఆలోచించకుండా పని చేయడంపైనే నా దృష్టంతా. నటిగా నా ప్రయాణాన్ని ఆస్వాదిస్తున్నాను' అని హీరోయిన్ కేతిక శర్మ అన్నారు. కార్తీక్ రాజు దర్శకత్వంలో శ్రీవిష్ణు కథానాయకుడిగా నటించిన 'సింగిల్' చిత్రంలో ఆమె కథానాయికగా నటించారు. ఈ నెల 9న ఈ చిత్రం విడుదలవుతోంది. ఈ సందర్భంగా కేతిక శర్మ మీడియాతో మాట్లాడారు. 'అల్లు అరవింద్ సమర్పణలో ఓ సినిమా వస్తోందంటే అందులో విషయం ఉంటుంది. గీతా ఆర్ట్స్ సంస్థలో సినిమా చేయాలనేది ఎప్పటినుంచో నాకున్న కోరిక. అది 'సింగిల్' సినిమాతో నెరవేరింది. ప్రేక్షకులకు మంచి వినోదం అందిస్తుంది. ఈ సినిమాలో పూర్వా అనే పాత్రలో కనిపిస్తాను. స్వతంత్ర భావాలున్న యువతి. ఈ తరం అమ్మాయిల ఆలోచనలకు దగ్గరగా ఉంటుంది. కథను మలుపు తిప్పే పాత్ర నాది' అని తెలిపారు.

ఇంకా నగదే రారాజు

డిజిటల్ యుగంలోనూ తగ్గని కరెన్సీ జోరు

2024-25లో సగటున ఒక్కో ఏటీఎం నుంచి రూ.1.3 కోట్ల విత్‌డ్రాయల్స్

టాప్‌లో ఉత్తర భారతం..

సీఎంఎస్ ఇన్ఫో సిస్టమ్స్ నివేదిక వెల్లడి



న్యూఢిల్లీ: డిజిటల్ చెల్లింపులు ఎంతగా పుంజుకున్నా మన దేశ ఆర్థిక వ్యవస్థలో ఇంకా నగదు హవా కొనసాగుతోంది. గత పదేళ్లలో, చలామణిలో ఉన్న కరెన్సీ నోట్ల (నగదు) పరిమాణం 157 శాతం, ఏటీఎంల సంఖ్య 32 శాతం, బ్యాంకు శాఖల సంఖ్య 36 శాతం పెరగడం ఇందుకు ఉదాహరణ. బ్యాంకులు, ఆర్థిక సంస్థలకు నగదు నిర్వహణ సేవలు అందించే సీఎంఎస్ ఇన్ఫో సిస్టమ్స్ ఒక నివేదికలో ఈ విషయాలు వెల్లడించింది. గత ఆర్థిక సంవత్సరం (2024-25)లో దేశంలోని ఒక్కో ఏటీఎం నుంచి సగటున రూ.1.3 కోట్ల నగదు ఉపసంహరణలు (విత్‌డ్రాయల్స్) నమోదయ్యాయి. 2016-17 ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే ఇది రూ.28 లక్షలు ఎక్కువ. గత ఏడాది మార్చి నాటికి చూసినా మన దేశ వినియోగదారుల చెల్లింపుల లావాదేవీల్లో 60 శాతం నగదు ద్వారానే జరిగాయి.

దక్షిణాదిలో కనిష్ఠం

దక్షిణ భారత్‌తో పోలిస్తే ఉత్తర భారత్‌లో నగదు హవా మరింత ఎక్కువగా ఉంది. నిజానికి దక్షిణ భారత్‌లో గత ఆర్థిక సంవత్సరం (2024-25) ఏటీఎంల నుంచి విత్‌డ్రా చేసే నగదు పరిమాణం వృద్ధి రేటు తగ్గింది. తమిళనాడు, తెలంగాణల్లో జీరో వృద్ధి రేటు నమోదు కాగా, ఆంధ్రప్రదేశ్‌లో మైనస్ ఒక శాతం, కేరళలో మైనస్ 14 శాతం, కర్ణాటకలో మైనస్ రెండు శాతం నమోదైంది. ఇదే సమయంలో బిహార్‌లో 8 శాతం, ఢిల్లీ, ఉత్తరప్రదేశ్‌ల్లో 4 శాతం, ఛత్తీస్‌గఢ్, హిమాచల్ ప్రదేశ్‌ల్లో 2 నుంచి 3 శాతం నగదు విత్‌డ్రాయల్స్ పెరిగినట్టు సీఎంఎస్ ఇన్ఫో నివేదిక వెల్లడించింది.

సగటు విత్‌డ్రాయల్స్ రూ.5,658

గత ఆర్థిక సంవత్సరం ఒక్కో వ్యక్తి ఏటీఎం నుంచి విత్‌డ్రా చేసిన సగటు నగదు మొత్తం రూ.5,658కు చేరింది. అంతకు ముందు సంవత్సరం (2023-24)తో పోలిస్తే ఇది 3 శాతం ఎక్కువ. గత ఏడాది అక్టోబరు నుంచి ఈ సంవత్సరం మార్చి వరకు చూస్తే కొన్ని నెలల్లో నగదు ఉపసంహరణలు 4 నుంచి 6 శాతం పెరిగాయి. ఇదే సమయంలో సగటు డిజిటల్ చెల్లింపులు తగ్గాయి. 2023 ప్రథమార్థంలో రూ.1,603గా ఉన్న యూపీఐ చెల్లింపుల సగటు.. గత ఏడాది తొలి ఆరు నెలల్లో రూ.1,478కు తగ్గింది. ఇదే సమయంలో పర్సన్-2-మర్చంట్ (పీ2ఎం) చెల్లింపులూ రూ.667 నుంచి రూ.643కు తగ్గినట్టు సీఎంఎస్ నివేదిక తెలిపింది.

టీసీఎస్‌లో సీనియర్ ఉద్యోగులకు వేరియబుల్ చెల్లింపుల్లో కోత!

న్యూఢిల్లీ: దేశంలో అతిపెద్ద ఐటీ కంపెనీ టీసీఎస్ తన సీనియర్ ఉద్యోగులకు జనవరి-మార్చి త్రైమాసికానికి చెల్లించాల్సిన 'వేరియబుల్ పే'లో కోత విధించింది. వీరికి వేరియబుల్ పే తగ్గించడం వరుసగా ఇది మూడో త్రైమాసికమని ఓ ఆంగ్ల మీడియా కథనం పేర్కొంది. టీసీఎస్ సీనియర్ ఉద్యోగుల సీటీసీ (కాస్ట్ టు కంపెనీ)లో వేరియబుల్ పే 15-20 శాతంగా ఉంది. కాగా, టీసీఎస్ దీన్ని తోసిపుచ్చింది. కాగా ఈ మార్చి త్రైమాసికంలో 70 శాతానికి పైగా ఉద్యోగులకు 100 శాతం వేరియబుల్ పే చెల్లించినట్లు ఒక ప్రకటనలో పేర్కొంది. ఉద్యోగి విధులు నిర్వహిస్తున్న బిజినెస్ యూనిట్ పనితీరు ఆధారంగా ఈ చెల్లింపులను నిర్ణయించడం జరుగుతుందని కంపెనీ స్పష్టం చేసింది. ప్రస్తుతం టీసీఎస్‌లో 6 లక్షలకు పైగా ఉద్యోగులున్నారు.

వృద్ధి రేటు అంచనాను కుదించిన మూడీస్

న్యూఢిల్లీ: అమెరికా విధానాల్లో అస్థిరతలు, వాణిజ్య పరిమితుల కారణంగా ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక వ్యవస్థలన్నీ మాంద్యంలోకి జారుకునే ప్రమాదం ఉన్నదని, ఈ పరిస్థితుల్లో భారత వృద్ధి రేటు ఈ ఏడాది 6.3 శాతానికే పరిమితం కావచ్చని మూడీస్ రేటింగ్స్ తాజా అంచనాలో తెలిపింది. గతంలో తాను ప్రకటించిన 6.5 శాతం అంచనాను 0.20 శాతం మేరకు కుదించింది. భారత్, పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు కూడా వృద్ధికి సవాలుగా నిలుస్తాయని పేర్కొంది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



7వ తేదీ			
హైదరాబాద్	480	విజయవాడ	500
వరంగల్	482	గోదావరి	495
చిత్తూరు	553	విశాఖపట్నం	500
		డజను గుడ్లు రూ. 66	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	145	విజయవాడ	144
వరంగల్	145	గుంటూరు	142
కరీంనగర్	145	ఒంగోలు	142
మహబూబ్‌నగర్	145	చిత్తూరు	115
కర్నూలు	145	నెల్లూరు	120
విశాఖపట్నం	141	అనంతపురం	120
గోదావరి	144		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	98,460 ▲	90,250 ▲	1,07,900 ▼
విజయవాడ	98,500 ▲	92,500 ▲	98,500 ▲
విశాఖపట్నం	1,00,360 ▲	90,250 ▲	1,07,900 ▼
రాజమండ్రి	99,450 ▲	90,250 ▲	98,400 ▲
ప్రొద్దుటూరు	98,100 ▲	90,250 ▲	98,500 ▲
ముంబై	96,888 ▲	88,749 ▲	95,854 ▲

రూ.6 లక్షల కోట్లు ఆవిరి

భారత్-పాక్ మధ్య ఉద్రిక్తతల నేపథ్యంలో 155 పాయింట్లు నష్టపోయిన సెన్సెక్స్

ముంబై: భారత-పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతల నేపథ్యంలో మదుపరులు బ్యాంకింగ్, ఆయిల్ సహా పలు రంగ షేర్లలో లాభాల స్వీకరణకు దిగారు. దాంతో ప్రామాణిక సూచీలు మంగళవారం నష్టాల్లో పయనించాయి. సెన్సెక్స్ ఒక దశలో 315 పాయింట్లు క్షీణించినప్పటికీ, మళ్లీ కాస్త తేరుకుంది. చివరికి 155.77 పాయింట్ల నష్టంతో 80,641.07 వద్ద ముగిసింది. నిఫ్టీ 81.55 పాయింట్లు కోల్పోయి 24,379.60 వద్ద స్థిరపడింది. సెన్సెక్స్‌లోని 30 నమోదిత కంపెనీల్లో 16 నష్టపోయాయి. ఎటర్నల్ స్టాక్ 3.08 శాతం నష్టంతో సూచీ టాప్ లూజర్‌గా మిగిలింది. టాటా మోటార్స్, ఎస్‌బీఐ రెండు శాతానికి పైగా తగ్గాయి. బుధవారం నాడు అమెరికా ఫెడ్ రిజర్వ్ ప్రామాణిక వడ్డీ రేట్లపై నిర్ణయాన్ని ప్రకటించనుండటంతోపాటు యూఎస్-చైనా మధ్య వాణిజ్య చర్చల నేపథ్యంలో ట్రేడర్లు వేచి చూసే ధోరణిలో ఉన్నారని, దాంతో ప్రధాన సూచీలు పరిమిత శ్రేణిలో కదలాడాయని మార్కెట్ విశ్లేషకులు పేర్కొన్నారు. ఈక్విటీ మదుపరుల సంపదగా పరిగణించే బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ దాదాపు రూ.6 లక్షల కోట్లు తగ్గి రూ.421.31 లక్షల కోట్లకు (4.98 లక్షల కోట్ల డాలర్లు) పడిపోయింది.

● గత వారం ఐపీఓకు వచ్చిన విద్యుత్ ద్విచక్ర వాహనాల తయారీ కంపెనీ ఏథర్ ఎనర్జీ తన షేర్లను మంగళవారం స్టాక్ ఎక్స్ఛేంజీల్లో నమోదు చేసింది. ఐపీఓ ధర రూ.321తో పోలిస్తే, బీఎస్ఈలో తొలి రోజు ట్రేడింగ్ పూర్తయ్యే సరికి కంపెనీ షేరు 5.76 శాతం క్షీణించి రూ.302.50 వద్దకు జారుకుంది.

5 ఐపీఓలకు సెబీ ఆమోదం: వెరిటాస్ ఫైనాన్స్, లక్ష్మీ ఇండియా ఫైనాన్స్ సహా 5 కంపెనీల తొలి పబ్లిక్ ఆఫరింగ్ (ఐపీఓ) ప్రతిపాదనలకు సెబీ ఆమోదం లభించింది. జాజూ రష్మీ రీఫ్రాక్టరీస్, రిగాల్ రీసోర్సెస్, అజయ్ పోలీ కూడా ఈ జాబితాలో ఉన్నాయి.

మళ్లీ రూ.లక్ష చేరువలో బంగారం

ఢిల్లీలో ఒకే రోజు రూ.2,400 పెరుగుదల

వరుసగా మూడో రోజు ఎగబాకిన పసిడి మళ్లీ లక్ష రూపాయలకు చేరువైంది. మంగళవారం ఢిల్లీలో 10 గ్రాముల మేలిమి (99.9 శాతం స్వచ్ఛత) బంగారం ధర ఒకే రోజు రూ.2,400 పెరిగి రూ.99,750కి చేరింది. కిలో వెండి రూ.1,800 పెరుగుదలతో రూ.98,500 ధర పలికింది. ట్రంప్ తాజా సుంకాలతో పాటు అమెరికా ఫెడ్ రిజర్వ్ ప్రామాణిక వడ్డీ రేట్లను మరింత తగ్గించవచ్చన్న అంచనాల నేపథ్యంలో అంతర్జాతీయంగా వీటి ధరలు మళ్లీ పెరగడమే ఇందుకు కారణం. ఇంటర్నేషనల్ మార్కెట్లో ఔన్స్ (31.10 గ్రాములు) గోల్డ్ ఒక దశలో 1.37 శాతం పెరిగి 3,379 డాలర్లకు చేరగా.. సిల్వర్ 33 డాలర్ల స్థాయిలో ట్రేడైంది.

పీఎస్‌యూల డీలిస్టింగ్‌కు ప్రత్యేక విధానం!

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ సంస్థల (పీఎస్‌యూ) స్వచ్ఛంద డీలిస్టింగ్‌ను సులభతరం చేయాలని మార్కెట్ నియంత్రణ మండలి సెబీ యోచిస్తోంది. ఇందుకోసం అనుసరించాల్సిన విధి విధానాలతో ఒక చర్చా పత్రం విడుదల చేసింది. ఈ చర్చా పత్రంపై మార్కెట్ వర్గాలు ఈనెల 26లోగా తమ స్పందన తెలియజేయాలని కోరింది.

చర్చా పత్రం ముఖ్యాంశాలు

- మొత్తం ఈక్విటీలో ప్రమోటర్, ప్రమోటర్ గ్రూప్, ఇతర పీఎస్‌యూలు 90 శాతానికి పైగా వాటా కలిగి ఉండాలి
- ఇలాంటి పీఎస్‌యూల ఈక్విటీలో కనీస పబ్లిక్ వాటా లేకపోయినా డీలిస్ట్ కావచ్చు
- పీఎస్‌యూలు ఒక నిర్ణీత ధర వద్ద కూడా తమ షేర్లను డీలిస్ట్ చేయవచ్చు
- షేర్ల ట్రేడింగ్ ఫ్రీక్వెన్సీతో సంబంధం లేకుండా డీలిస్టింగ్ షేర్ల కనీస ధరపై 15 శాతం ప్రీమియం ఉండాలి
- మూడింట రెండు వంతుల మంది వాటాదారుల ఆమోదం నిబంధన పీఎస్‌యూల డీలిస్టింగ్‌కు వర్తించదు.

జెన్‌సోల్, బ్లూస్మార్ట్‌పై కార్పొరేట్ శాఖ దర్యాప్తు

న్యూఢిల్లీ: కంపెనీల చట్టం ఉల్లంఘనల ఆరోపణలకు సంబంధించి జెన్‌సోల్ ఇంజనీరింగ్, బ్లూస్మార్ట్ మొబిలిటీపై దర్యాప్తునకు కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆదేశించింది. ప్రమోటర్లు పెద్దఎత్తున నిధుల దుర్వినియోగానికి పాల్పడటంతో ఈ రెండు కంపెనీలూ ఆర్థిక సంక్షోభంలోకి జారుకున్నాయి. నిధుల మళ్లింపుతో పాటు కార్పొరేట్ పాలన ప్రమాణాలను అతిక్రమించినందుకు గాను జెన్‌సోల్ ఇంజనీరింగ్, బ్లూస్మార్ట్ ప్రమోటర్లైన అన్‌మోల్ సింగ్ జగ్గీ, పునీత్ సింగ్ జగ్గీ సోదరులను సెబీ ఇప్పటికే సెక్యూరిటీస్ మార్కెట్ నుంచి నిషేధించింది. కాగా, ఈ రెండు కంపెనీల పద్దులు, ఆర్థిక పత్రాలను ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసీఏఐ) సమీక్షిస్తోంది. ఆ ప్రక్రియ ఆరు నెలల్లో పూర్తయ్యే అవకాశం ఉంది. అంతేకాదు, జెన్‌సోల్‌పై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కూడా దర్యాప్తు జరుపుతోంది.

ఐదేళ్లలో రూ.8.5 లక్షల కోట్ల వాణిజ్యం

• పెట్టుబడులు, జీడీపీ వృద్ధికి ఊతం • భారత్-యూకే వాణిజ్య ఒప్పందంపై ఇండియా ఇంక్

లండన్: భారత-బ్రిటన్ మధ్య కుదిరిన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టీఏ)పై సర్వత్రా హర్షం వ్యక్తం అవుతోంది. ఈ ఎఫ్‌టీఏతో యూకే మార్కెట్లో భారతీయ ఎగుమతిదారులకు మరింత లబ్ధి చేకూరనుందని పారిశ్రామిక సంఘాలు తెలిపాయి. ప్రస్తుతం అంతర్జాతీయంగా నెలకొన్న అనిశ్చిత వాతావరణంలో ఈ ఎఫ్‌టీఏతో ఎఫ్ఎంసీజీ, హెల్త్‌కేర్, ఇన్నోవేషన్ ఆధారిత పరిశ్రమలకు లాభం చేకూరనుందని ఫిక్కీ ప్రెసిడెంట్ హర్ష వర్ధన్ అగర్వాల్ అన్నారు. అంతేకాకుండా 2030 నాటికి భారత్-యూకే ద్వైపాక్షిక వాణిజ్యాన్ని 10,000 కోట్ల డాలర్ల (రూ.8.5 లక్షల కోట్లు)కు చేర్చే అవకాశం లభించనుందని భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ) జాతీయ అధ్యక్షుడు సంజీవ్ పురి ఆశాభావం వ్యక్తం చేశారు. సుంకాల యుద్ధం నేపథ్యంలో రెండు దేశాల మధ్య కుదిరిన ఈ ఎఫ్‌టీఏ మరింత ప్రాధాన్యత సంతరించుకుందని సీఐఐ యూకే-ఇండియా బిజినెస్ ఫోరం చైర్మన్ కేశవ్ మురుగేశ్ అన్నారు. ఈ ఒప్పందంతో రెండు దేశాల మధ్య వాణిజ్య, పెట్టుబడులకు ఉన్న ఆటంకాలూ తొలగిపోతాయని యూకే-ఇండియా బిజినెస్ కౌన్సిల్ (యూకేఐబీసీ) పేర్కొంది. ఈ ఎఫ్‌టీఏ రెండు దేశాల ఆర్థిక వృద్ధితో పాటు ఉద్యోగాలు, నవకల్పనలకూ దోహదం చేస్తుందని యూకేఐబీసీ చైర్మన్ రిచర్డ్ హీల్డ్ చెప్పారు.

'ఈయూ నుంచి బయటికి వచ్చిన తర్వాత బ్రిటన్ కుదుర్చుకున్న అతిపెద్ద ఎఫ్‌టీఏ ఇదే. భారత్ ప్రస్తుతం అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ. బ్రిటన్‌కు 11వ అతిపెద్ద వాణిజ్య భాగస్వామి. వచ్చే ఐదేళ్లలో ద్వైపాక్షిక వాణిజ్యం 8,000 కోట్ల పౌండ్లకు పైగా పెరిగేందుకు ఈ ఎఫ్‌టీఏ ప్రేరకం కానుంది' అని ఇంటర్నేషనల్ చాంబర్ ఆఫ్ కామర్స్ (ఐసీసీ) యూకే చాప్టర్ చైర్మన్ లార్డ్ కరన్ బిల్లీమోరియా చెప్పారు.

మరోవైపు ఈ ఒప్పందాన్ని నాస్కామ్ కూడా స్వాగతించింది. భారత టెక్నాలజీ కంపెనీలు దీర్ఘకాలంగా ఎదుర్కొంటున్న డబుల్ కంట్రిబ్యూషన్ భారం వంటివి తొలగిపోనున్నాయని, ఇది ఈ రంగానికి ఎంతగానో మేలు చేకూర్చనుందని పేర్కొంది. ఏఐ, సైబర్ సెక్యూరిటీ వంటి ఎమర్జింగ్ రంగాల్లో మరిన్ని ఒప్పందాలు కుదుర్చుకునే అవకాశం ఎఫ్‌టీఏతో లభించనుందని నాస్కామ్ వెల్లడించింది.

దక్షిణాదిలో అతిపెద్ద మహీంద్రా షోరూమ్

విజయవాడలో ఏర్పాటు

విజయవాడ (ఆంధ్రజ్యోతి): ఆటోమొబైల్ రిటైల్ సంస్థ ఆటోమోటివ్ మానుఫ్యాక్చరర్స్ ప్రైవేట్ లిమిటెడ్ (ఏఎంపీఎల్) దక్షిణ భారత్‌లోనే అతిపెద్ద మహీంద్రా డీలర్‌షిప్ షోరూమ్‌ను ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడలో ఏర్పాటు చేసింది. విజయవాడలోని ఎనికేపాడులో రూ.15 కోట్లతో 1.03 లక్షల చదరపు అడుగుల్లో ఈ షోరూమ్‌ను నెలకొల్పినట్లు ఏఎంపీఎల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రాజీవ్ సంఘ్వీ తెలిపారు. అత్యాధునిక 3ఎస్ (సేల్స్, సర్వీస్, స్పేర్స్) సేవలు ఇక్కడ అందుబాటులో ఉంటాయన్నారు.

తెలుగు స్విమ్మర్ల పతకాల పంట

ఖేలో ఇండియా యువజన క్రీడలు



వర్షిత్ సుహాస్ శ్రీనిత్య

పట్నా/న్యూఢిల్లీ: ఖేలో ఇండియా యువజన క్రీడల్లో మంగళవారం తెలుగు స్విమ్మర్లు పతకాల పంట పండించారు. తెలంగాణకు చెందిన వర్షిత్ (బాలుర 400 మీటర్ల వ్యక్తిగత మెడ్లే), సుహాస్ ప్రీతమ్ (బాలుర 100 మీటర్ల బ్యాక్‌స్ట్రోక్), శ్రీనిత్య సాగి (బాలికల 100 మీ. బ్యాక్‌స్ట్రోక్) తమ విభాగాల్లో విజేతలుగా నిలిచి రాష్ట్రానికి మూడు స్వర్ణాలు అందించారు. ఇక, ఒక కిలోమీటర్ సైక్లింగ్ ట్రాక్ ఈవెంట్‌లో సాయిచరణ్ యాదవ్ కాంస్యం నెగ్గి తెలంగాణ ఖాతాలో నాలుగో పతకాన్ని చేర్చాడు. స్విమ్మింగ్ 1500 మీటర్ల ఫ్రీస్టయిల్ ఈవెంట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన సంపత్‌కుమార్ యాదవ్, తీర్థు సామదేవ్ వరుసగా స్వర్ణ, కాంస్యాలు దక్కించుకున్నారు. ఇక, 400 మీ. వ్యక్తిగత మెడ్లేలోనూ సత్తా చాటుతూ తీర్థు సామదేవ్ రజతం గెలిచాడు.

ఫేవరెట్ గుకేష్

నేటి నుంచి సూపర్‌బెట్ క్లాసిక్



బుకారెస్ట్ (రుమేనియా): సూపర్‌బెట్ క్లాసిక్ చెస్ టోర్నీలో వరల్డ్ చాంపియన్ గుకేష్ దొమ్మరాజు ఫేవరెట్‌గా బరిలోకి దిగనున్నాడు. గ్రాండ్ చెస్ టూర్‌లో భాగంగా బుధవారం నుంచి జరగనున్న ఈ ఈవెంట్‌లో మొత్తం 10 మంది గ్రాండ్ మాస్టర్లు తలపడనున్నారు. కాగా, తొలి రౌండ్‌లో సహచర జీఎం ప్రజ్ఞానందతో గుకేష్ ఆడనున్నాడు. గత జనవరిలో టాటా స్టీల్ చెస్‌లో రెండో స్థానంలో నిలిచిన గుకేష్.. 3 నెలల విరామం తర్వాత బరిలోకి దిగుతున్నాడు.

కెప్టెన్సీ.. మోయలేని భారంగా!

సారథ్యాన్ని వదులుకోవడంపై కోహ్లీ



బెంగళూరు: కెప్టెన్సీ భారంతో పాటు తన బ్యాటింగ్‌పై నిరంతర సమీక్షలను తట్టుకోలేకపోయినట్టు విరాట్ కోహ్లీ చెప్పాడు. ఒత్తిడిలేకుండా ఆటపైనే దృష్టిసారించాలన్న ఆలోచనతోనే ఐపీఎల్‌లో సారథ్య బాధ్యతల నుంచి తప్పుకొన్నట్టు 'ఆర్‌సీబీ బోల్డ్ డైరీస్' పాడ్‌కాస్ట్‌లో కోహ్లీ బయటపెట్టాడు. 2021 టీ20 వరల్డ్‌కప్ తర్వాత పొట్టి ఫార్మాట్ కెప్టెన్సీని వదులుకొన్న విరాట్..అనంతరం ఆర్‌సీబీ నాయకత్వానికి గుడ్‌బై చెప్పాడు. తర్వాతి ఏడాది దక్షిణాఫ్రికా చేతిలో ఓటమితో టెస్టు పగ్గాలను వదిలేశాడు. 'ఏడెనిమిదేళ్ల టీమిండియాకు, తొమ్మిదేళ్ల బెంగళూరుకు సారథ్యం వహించా. ప్రతిసారీ నాపైనే భారీ అంచనాలుండేవి. రాన్రాను పరిస్థితులు భారంగా మారాయి.. అదీ మోయలేనంతగా. అందుకే కెప్టెన్సీ వదిలి, ఆటను ఆస్వాదించాలన్న నిర్ణయానికి వచ్చా' అని విరాట్ తెలిపాడు.

భారత క్రికెట్.. ఎవరి సొత్తూ కాదు!

విమర్శకులకు గంభీర్ ఘాటు కౌంటర్



న్యూఢిల్లీ: 'భారత క్రికెట్ ఎవడబ్బ సొత్తూ కాద'ని టీమిండియా చీఫ్ కోచ్ గౌతమ్ గంభీర్ అన్నాడు. తన కోచింగ్‌పై విమర్శలు చేస్తున్న మాజీ ఆటగాళ్లకు ఘాటుగా బదులిచ్చాడు. 'కోచ్‌గా బాధ్యతలు చేపట్టినప్పుడే.. ఒడిదుడుకులు ఎదుర్కోవాల్సి ఉంటుందని తెలుసు. దేశం గర్వపడేలా చేయడమే నా పని. అంతేకానీ ఏసీ గదుల్లో కూర్చొని కామెంట్రీ పేరుతో ఏదో మాట్లాడే వారిని ప్రసన్నం చేసుకోవడం కాదు' అని కౌంటర్ ఇచ్చాడు. కొందరు మాజీలు భారత క్రికెట్‌ను సొంత ఆస్తిలా భావిస్తున్నారన్నాడు. 'కొందరు 25 ఏళ్లుగా కామెంట్రీ బాక్స్‌లో తిష్టవేసుకొని కూర్చొన్నారు. భారత క్రికెట్ ఏదో వారి కుటుంబ ఆస్తి అని అనుకొంటున్నారు. కానీ, ఇదంతా భారత ప్రజలది అనే వాస్తవాన్ని గుర్తించాలి' అని గౌతీ అన్నాడు. ఇక, ఇంగ్లండ్ టూర్‌కు భారత జట్టు ఎంపికలో తన జోక్యం ఏమీలేదన్నాడు. రోహిత్, కోహ్లీ మెరుగైన ప్రదర్శన చేస్తున్నంత కాలం జట్టులో కొనసాగే అర్హత ఉంటుందని చెప్పాడు. జట్టు ఎంపికలో తన పాత్ర లేదని.. అంతా సెలెక్టర్లదేనని గంభీర్ తెలిపాడు.

పాక్‌తో ఎక్కడా ఆడొద్దు

పహల్గాం దాడి నేపథ్యంలో.. సీమాంతర ఉగ్రవాదానికి ముగింపు పలకనంత వరకు పాకిస్థాన్‌తో క్రికెట్ సంబంధాలను పూర్తిగా తెంచుకోవాలని గంభీర్ డిమాండ్ చేశాడు. ఆసియాకప్, ఐసీసీ ఈవెంట్లలో కూడా పాక్‌తో ఆడకూడదనేది తన వ్యక్తిగత అభిప్రాయమన్నాడు.

హెచ్‌సీఏలో వెంకటేష్ ప్రసాద్ నియామకం చెల్లదు: హైకోర్టు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి): క్రికెట్ ఆపరేషన్స్ అండ్ గేమ్ డెవలప్‌మెంట్ కన్సల్టెంట్‌గా మాజీ క్రికెటర్ బీకే వెంకటేశ్ ప్రసాద్ నియామకం చెల్లదని హైకోర్టు స్పష్టం చేసింది. అలాగే సిబ్బంది సహా కోచ్‌ల నియామకాన్ని కూడా పక్కకు పెట్టాలని హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ)ను ఆదేశించింది. హైదరాబాద్ క్రికెట్ అకాడమీ ఆఫ్ ఎక్సలెన్స్‌లో కోచ్‌లు, డైరెక్టర్ల నియామకాలు నిబంధనలకు విరుద్ధంగా జరిగాయని హెచ్‌సీఏ ఉపాధ్యక్షుడు సర్దార్ దల్జీత్‌సింగ్, జాయింట్ సెక్రటరీ బసవరాజు కోర్టులో పిటిషన్ వేశారు. అపెక్స్ కౌన్సిల్ ఆమోదం లేకుండానే నియామకాలు చేపట్టారని, ప్రసాద్‌కు ఏటా రూ.75 లక్షల వేతనం ఇచ్చేలా ఒప్పందం చేసుకున్నారని తమ పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ పిటిషన్‌ను విచారించిన ధర్మాసనం.. వెంకటేశ్ ప్రసాద్, హిమానీ యాదవ్, మమత, అర్జున్, రాజశేఖర్ తదితరులకు హెచ్‌సీఏ నుంచి చెల్లించిన గౌరవ వేతనాన్ని రికవరీ చేయాలని స్పష్టం చేసింది.

భారత్ X దక్షిణాఫ్రికా

నేడు మహిళల ముక్కోణపు వన్డే సిరీస్

ఉదయం. 10 గం. నుంచి

స్పోర్ట్స్

నేటి మ్యాచ్

కోల్‌కతా x చెన్నై — వేదిక కోల్‌కతా — రా.7.30 నుంచి

పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ఫ.తే	పా	నె.రరే
గుజరాత్	11	8	3	0	16	0.793
బెంగళూరు	11	8	3	0	16	0.482
పంజాబ్	11	7	3	1	15	0.376
ముంబై	12	7	5	0	14	1.156
ఢిల్లీ	11	6	4	1	13	0.362
కోల్‌కతా	11	5	5	1	11	0.249
లఖ్‌నవూ	11	5	6	0	10	-0.469
హైదరాబాద్	11	3	7	1	7	-1.192
రాజస్థాన్	12	3	9	0	6	-0.718
చెన్నై	11	2	9	0	4	-1.117

గమనిక: ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; ఫ.తే: ఫలితం తేలనివి; పా: పాయింట్లు; నె.రరే: నెట్ రన్‌రేట్

స్కోరుబోర్డు

ముంబై: రికెల్టన్ (సి) సుదర్శన్ (బి) సిరాజ్ 2, రోహిత్ (సి) ప్రసిద్ధ్ (బి) అర్షద్ 7, విల్ జాక్స్ (సి) సుదర్శన్ (బి) రషీద్ 53, సూర్యకుమార్ (సి) షారుక్ (బి) సాయి కిషోర్ 35, తిలక్ (సి) గిల్ (బి) కొట్జీ 7, హార్దిక్ (సి) గిల్ (బి) సాయి కిషోర్ 1, నమన్ (సి) గిల్ (బి) ప్రసిద్ధ్ 7, కార్బిన్ బాష్ (రనౌట్) 27, దీపక్ చాహర్ (నాటౌట్) 8, కర్ణ్ శర్మ (నాటౌట్) 1, **ఎక్స్‌ట్రాలు: 7; మొత్తం: 20 ఓవర్లలో 155/8; వికెట్ల పతనం:** 1-2, 2-26, 3-97, 4-103, 5-106, 6-113, 7-123, 8-150; **బౌలింగ్:** సిరాజ్ 3-0-29-1, అర్షద్ 3-0-18-1, ప్రసిద్ధ్ 4-0-37-1, సాయి కిషోర్ 4-0-34-2, రషీద్ 4-0-21-1, కొట్జీ 2-0-10-1.

గుజరాత్: సాయి సుదర్శన్ (సి) రికెల్టన్ (బి) బౌల్ట్ 5, గిల్ (బి) బుమ్రా 43, బట్లర్ (సి) రికెల్టన్ (బి) అశ్వని 30, రూథర్‌ఫర్డ్ (ఎల్బీ) బౌల్ట్ 28, షారుక్ (బి) బుమ్రా 6, తెవాటియా (నాటౌట్) 11, రషీద్ (ఎల్బీ) అశ్వని 2, కొట్జీ (సి) నమన్ (బి) చాహర్ 12, అర్షద్ (నాటౌట్) 1, **ఎక్స్‌ట్రాలు: 9; మొత్తం: 19 ఓవర్లలో 147/7; వికెట్ల పతనం:** 1-6, 2-78, 3-113, 4-115, 5-123, 6-126, 7-146; **బౌలింగ్:** దీపక్ చాహర్ 3-0-32-1, బౌల్ట్ 4-0-22-2, బుమ్రా 4-0-19-2, హార్దిక్ 1-0-18-0, కర్ణ్ శర్మ 2-0-13-0, అశ్వని కుమార్ 4-0-28-2, విల్ జాక్స్ 1-0-15-0.

గుజరాత్ గట్టెక్కింది

ఆఖరి బంతికి ముంబైపై విజయం

టాప్‌లోకి గిల్ సేన



గిల్ (43)

ముంబై: తాజా సీజన్‌లో హైలైట్ అనదగ్గ మ్యాచ్ అంటే ఇదేనేమో. గుజరాత్ టైటాన్స్ ముందు కేవలం 156 పరుగుల ఛేదనే అయినా ఎన్ని మలుపులో.. ముంబై ఇండియన్స్ బౌలర్ల విజృంభణతో మ్యాచ్ ఇరువైపులా మొగ్గుచూపింది. దీనికితోడు రెండుసార్లు వరుణుడితో ఇబ్బంది. సవరించిన ఛేదన ప్రకారం ఆఖరి ఓవర్లో 15 పరుగులు కావాల్సిన వేళ మరింత హైడ్రామా నెలకొంది. అయినా ఎలాగోలా ఆఖరి బంతికి సింగిల్‌తో టైటాన్స్ ఊపిరిపీల్చుకుంది. దీంతో మంగళవారం జరిగిన ఈ ఉత్కంఠభరిత మ్యాచ్‌లో 3 వికెట్ల తేడాతో డక్‌వర్త్ లూయిస్ పద్ధతిన గుజరాత్ నెగ్గింది. అలాగే 16 పాయింట్లతో టాప్‌లోకి చేరింది. అటు ముంబై వరుస ఆరు విజయాలకు బ్రేక్ పడింది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన ముంబై 20 ఓవర్లలో 8 వికెట్లకు 155 పరుగులు చేసింది. విల్ జాక్స్ (35 బంతుల్లో 5 ఫోర్లు, 3 సిక్సర్లతో 53), సూర్యకుమార్ (24 బంతుల్లో 5 ఫోర్లతో 35), బాష్ (27) మాత్రమే రెండంకెల స్కోర్లు సాధించారు. సాయికిశోర్‌కు రెండు వికెట్లు దక్కాయి. ఆ తర్వాత ఛేదనలో వర్షం కారణంగా గుజరాత్ లక్ష్యాన్ని 19 ఓవర్లలో 147 పరుగులకు కుదించారు. అయితే, గుజరాత్ సరిగ్గా అన్నే ఓవర్లలో 147 రన్స్ చేసి గెలిచింది. గిల్ (43), బట్లర్ (30), రూథర్‌ఫోర్డ్ (28) పోరాడారు. బుమ్రా, బౌల్ట్, అశ్వనిలకు రెండేసి వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా గిల్ నిలిచాడు.

వణికించిన బౌలర్లు: స్వల్ప ఛేదనలో గుజరాత్ ఇన్నింగ్స్ సజావుగా ఏమీ సాగలేదు. పేసర్లు దీపక్, బౌల్ట్, బుమ్రా కట్టుదిట్టమైన బంతులకు పరుగులు రావడమే కష్టమైంది. గిల్, బట్లర్, రూథర్‌ఫోర్డ్ మినహా మరెవరూ దీటుగా నిలబడలేదు. ఈ సీజన్‌లో నిలకడగా రాణిస్తున్న ఓపెనర్ సాయి సుదర్శన్ (5)ను రెండో ఓవర్‌లోనే బౌల్ట్ అవుట్ చేశాడు. బంతి బ్యాట్ మీదికి రాకపోవడంతో ఆ తర్వాత గిల్, బట్లర్ నిదానం కనబర్చారు. దీంతో పవర్‌ప్లేలో 29/1 స్కోరు మాత్రమే సాధించింది. అయితే హార్దిక్ తన ఓవర్‌లో మూడు వైడ్లు, రెండు నోబ్స్, 4,6తో 18 పరుగులు సమర్పించుకున్నాడు. 12వ ఓవర్‌లో గిల్ సులువైన క్యాచ్‌ను తిలక్ వదిలేయగా.. తర్వాతి బంతికే బట్లర్‌ను అశ్వని అవుట్ చేశాడు. దీంతో రెండో వికెట్‌కు 72 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. అయితే ఆచితూచి సాగుతున్న ఇన్నింగ్స్‌కు రూథర్‌ఫోర్డ్ కదలిక తెచ్చాడు. 13వ ఓవర్‌లో అతడి 4,4,6తో 15 రన్స్ వచ్చాయి. 14వ ఓవర్ ముగిశాక వర్షం కారణంగా అర్ధగంట పాటు మ్యాచ్ ఆగింది. కానీ ఆ తర్వాత టైటాన్స్ ఒక్కసారిగా తడబడింది. వరుసగా నాలుగు ఓవర్లలో గిల్, రూథర్‌ఫోర్డ్, షారుక్ (6), రషీద్ (2)ల వికెట్లను కోల్పోయింది. ఇక 12 బంతుల్లో 24 రన్స్ కావాల్సిన వేళ మరోసారి వర్షంతో బ్రేక్ ఏర్పడింది. అర్ధరాత్రి 12.30కి మ్యాచ్ ఆరంభం కావడంతో లక్ష్యం 19 ఓవర్లలో 147కు మార్చారు. దీంతో గుజరాత్ ఆరు బంతుల్లో 15 పరుగులు చేయాల్సి ఉండగా..తెవాటియా ఫోర్, కొట్జీ సిక్సర్ బాదాడు. అయితే, ఐదో బంతికి కొట్జీని చాహర్ అవుట్ చేయడంతో ఉత్కంఠ నెలకొంది. కాగా, ఆఖరి బంతికి కావాల్సిన సింగిల్‌ను అర్షద్ పూర్తిచేయడంతో గుజరాత్ గట్టెక్కింది.

బ్యాటింగ్ వైఫల్యంతో..: టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ముంబైని టైటాన్స్ బౌలర్లు అద్భుతంగా కట్టడి చేశారు. వీరి ధాటికి ఓపెనింగ్ జోడీతో పాటు మిడిలార్డర్ కూడా వైఫల్యం చెందగా.. విల్ జాక్స్, సూర్యకుమార్ మాత్రం ఇన్నింగ్స్‌ను చక్కదిద్దే ప్రయత్నం చేశారు. చివర్లో బాష్ మెరుపు ఆటతో జట్టు గౌరవప్రదమైన స్కోరందుకుంది. వాస్తవానికి గుజరాత్ ఫీల్డింగ్‌లో కాస్త చురుకుగా ఉంటే ముంబై పరిస్థితి మరింత దారుణంగా ఉండేది. పేసర్ సిరాజ్ తొలి ఓవర్‌లోనే ఓపెనర్ రికెల్టన్ (2)ను అవుట్ చేశాడు. అదే ఓవర్‌లో వన్‌డౌన్ బ్యాటర్ జాక్స్ క్యాచ్‌ను సుదర్శన్ వదిలేశాడు. అటు ఫామ్ ప్రదర్శిస్తున్న రోహిత్ (7)ను నాలుగో ఓవర్‌లో అర్షద్ పెవిలియన్ చేర్చాడు. ఈ దశలో జాక్స్-సూర్య జోడీ నిలబడింది. సిరాజ్ ఓవర్‌లో జాక్స్ 6,4 బాదగా, సూర్య ఐదో ఓవర్‌లో 3 ఫోర్లతో 16 రన్స్ అందించాడు. అదే ఓవర్‌లో అతడి క్యాచ్‌ను సాయికిశోర్ వదిలేశాడు. ఆ తర్వాతి ఓవర్‌లోనే జాక్స్ మరో 3 ఫోర్లు బాదగా, అతడి క్యాచ్‌ను కూడా సిరాజ్ అందుకోలేకపోయాడు. దీంతో పవర్‌ప్లేలో జట్టు 56/2తో నిలిచింది. 11వ ఓవర్‌లో జాక్స్ సిక్సర్‌తో 29 బంతుల్లోనే ఫిఫ్టీ పూర్తి చేసుకోగా.. ఆ వెంటనే షారుక్ క్యాచ్‌తో సూర్య వెనుదిరిగాడు. దీంతో మూడో వికెట్‌కు 71 పరుగుల కీలక భాగస్వామ్యం ముగిసింది. ఇక్కడినుంచి టైటాన్స్ బౌలర్లు పరుగులను కట్టడి చేయడంతో పాటు వరుస ఓవర్లలో జాక్స్, కెప్టెన్ హార్దిక్ పాండ్యా (1), తిలక్ వర్మ (7), నమన్ ధిర్ (7)ల వికెట్లను తీసి పైచేయి ప్రదర్శించారు. 123/7 స్కోరుతో ఇబ్బందుల్లో పడిన ముంబై చివర్లో బాష్ జోరుతో కోలుకుంది. ఆఖరి ఓవర్‌లో బాష్ రెండు సిక్సర్లు, దీపక్ (8 నాటౌట్) ఫోర్‌తో 18 రన్స్ రావడంతో ముంబై స్కోరు 150 దాటింది.

మీరు తెచ్చిన నిధులెన్నో తేలుద్దామా?: అద్దంకి

హైదరాబాద్, మే 6 (ఆంధ్రజ్యోతి): కేంద్రం నుంచి రాష్ట్రానికి తెచ్చిన నిధులెన్నో లెక్క తేలుద్దామా అంటూ కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌కు కాంగ్రెస్ ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ సవాలు విసిరారు. ఏ రోజు తేలుస్తారో చెబితే చర్చ కోసం తామే బీజేపీ ఆఫీసుకు వస్తామన్నారు. రాష్ట్రానికి ఎన్ని నిధులు తెచ్చారన్నదానిపై శ్వేతపత్రం ప్రకటించాలన్నారు. పొద్దున లేస్తే సీఎం రేవంత్‌ను ఆడిపోసుకోవడం కాదని, రాష్ట్రానికి నిధులు తెచ్చుకోవడంలో ఏపీ కేంద్ర మంత్రులను చూసి నేర్చుకోవాలని హితవు పలికారు. రాష్ట్రంలో తలసరి ఆదాయం గురించి మాట్లాడుతున్న కేటీఆర్.. తలసరి అప్పు గురించి ఎందుకు మాట్లాడట్లేదని దయాకర్ నిలదీశారు.

బెల్టుతో కొట్టి.. అట్లకాడ కాల్చి వాతలు పెట్టి..

» మనవడి అల్లరి తాళలేక అమ్మమ్మ దాష్టీకం..



రాంనగర్, మే 6 (ఆంధ్రజ్యోతి) : వేసవి సెలవులకు ఇంటికొచ్చిన మనవడు చేసిన అల్లరిని తట్టుకోలేక అమ్మమ్మ దాష్టీకానికి పాల్పడింది. మనవడు ఏడేళ్ల బాలుడని కూడా చూడకుండా బెల్టుతో చావగొట్టింది. ఆపై ఇనుప అట్లకాడను కాల్చి చేతిపై వాతలు కూడా పెట్టింది. కల్వకుర్తికి చెందిన సంకీర్తన తన కుమారుడు మాధవచారి(7)ని వేసవి సెలవుల నేపథ్యంలో వారం క్రితం హైదరాబాద్‌లోని నాగమయ్యకుంటలో నివాసముండే తన తల్లి స్వప్న వద్దకు పంపింది. అయితే, సోమవారం సాయంత్రం ఇంట్లో అల్లరి చేస్తున్న తన మనవడు మాధవచారిని అదుపు చేసే క్రమంలో అమ్మమ్మ స్వప్న రెచ్చిపోయింది. ఆ బాలుడి వీపుపై బెల్టుతో విపరీతంగా కొట్టింది. అనంతరం అట్లకాడ కాల్చి వాతలు పెట్టింది. బాలుడి ఏడుపులు విన్న ఇరుగుపొరుగు వారు స్థానికంగా నివాసముండే అక్షరజ్యోతి ఉమెన్ అండ్ చైల్డ్ సంస్థ అధ్యక్షురాలు బి.అనూషకు సమాచారం అందించారు. బాలుడిని పరిశీలించి అనూష.. జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ అధికారికి ఫిర్యాదు చేయగా.. చైల్డ్ ప్రొటెక్షన్ వలంటీర్లు అక్కడికి చేరుకున్నారు. వారి ద్వారా సమాచారం అందుకున్న పోలీసులు బాలుడికి స్థానిక వైద్యుడి వద్ద చికిత్స చేయించి తల్లి సంకీర్తనకు సమాచారం అందించారు. బాలుడి పట్ల దారుణంగా ప్రవర్తించిన అమ్మమ్మ స్వప్నను పోలీసులు విచారిస్తున్నారు.

కొడుకు పెళ్లి ఆగిందని తండ్రి ఆత్మహత్య

నారాయణపేట, మే 6 (ఆంధ్రజ్యోతి): నాలుగు రోజుల్లో పెళ్లనగా.. పెళ్లి కుమార్తె ప్రియుడితో వెళ్లిపోగా.. తన కొడుకు పెళ్లి ఆగిపోయిందని తీవ్ర మనస్తాపం చెందిన పెళ్లి కుమారుడి తండ్రి ఆత్మహత్య చేసుకున్నాడు. నారాయణపేటలో మంగళవారం జరిగిన ఈ ఘటనలో కాంజీ గోవిందరావు అనే వ్యక్తి బలవన్మరణానికి పాల్పడ్డాడు. నారాయణపేటకు చెందిన కాంజీ గోవిందరావు కుమారుడు అభిషేక్‌కు శ్వేత అనే యువతితో మే9న వివాహం జరగాల్సి ఉంది. నాలుగు నెలల క్రితం నిశ్చితార్థం వేడుకను కూడా వైభవంగా నిర్వహించారు. అయితే, పెళ్లి కుమార్తె శ్వేత ఆదివారం ఉదయం తన ప్రియుడితో కలిసి ఇల్లు వదిలి వెళ్లిపోవడంతో వివాహం ఆగిపోయింది. పెళ్లి ఆగిపోయి పరువు పోయిందని మనస్తాపం చెందిన గోవిందరావు తన ఇంట్లోనే ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. దీంతో తన తమ్ముడి ఆత్మహత్యకు కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని గోవిందరావు సోదరుడు నారాయణరావు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

డిండి-ఏదుల లింక్‌లో నాలుగో ప్యాకేజీకి ఆమోదం

హైదరాబాద్, మే 6 (ఆంధ్రజ్యోతి): డిండి ఎత్తిపోతల పథకంలో భాగంగా ఏదుల-డిండి లింకులో నాలుగో ప్యాకేజీ పనులకు కమిషనరేట్ ఆఫ్ టెండర్స్(సీవోటీ) ఆమోదం తెలిపింది. సీవోటీ సమావేశం చైర్మన్, ఈఎన్‌సీ(జనరల్) జి.అనిల్‌కుమార్ అధ్యక్షతన మంగళవారం జరిగింది. ఇందులో రెండు కిలోమీటర్ల మేర టన్నెల్‌తో పాటు 3 కిలోమీటర్ల ప్రధాన కాలువ పనులు, ఆ తర్వాత దుందుభి నదిలో పనుల కోసం రూ.290.41 కోట్ల అంచనా వ్యయంతో టెండర్లు పిలవగా... టీవీఆర్-ఎంఎస్ ప్రసాద్ జాయింట్ వెంచర్ 4.91 శాతం అధికానికి టెండరు వేసింది. రూ.304.9 కోట్లతో పనులు చేపట్టడానికి టెండర్ వేయగా... సీవోటీ అంగీకారం తెలిపింది. ఇప్పటికే మూడు ప్యాకేజీల టెండర్లను సీవోటీ ఓకే చేసింది. ఏదుల రిజర్వాయర్ నుంచి 30 టీఎంసీలు డిండి ఎత్తిపోతల పథకంలో భాగంగా తరలించనున్నారు.

వేసవి సెలవుల్లో ఇంటర్ తరగతులు

» హైకోర్టులో పిటిషన్ దాఖలు

హైదరాబాద్, మే 6 (ఆంధ్రజ్యోతి): వేసవి సెలవుల్లో తరగతులు నిర్వహిస్తున్న ఇంటర్ కాలేజీలపై చర్యలు తీసుకోవాలని బోడుప్పల్‌కు చెందిన న్యాయవాది బి.క్రాంతి కుమార్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న కాలేజీలపై చర్యలు తీసుకోవాలని ఇంటర్ బోర్డును కోరారు. వారాంతపు సెలవు దినాలు సహా పండగల సమయంలో కూడా తరగతులు నిర్వహిస్తున్నారని పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై ఫిర్యాదు చేయడానికి రహస్య ఫిర్యాదుల వ్యవస్థను ఏర్పాటు చేసే విధంగా ఆదేశాలు జారీ చేయాలని కోరారు.

మాతృత్వం మరిచిన తల్లి

» ప్రియుడితో కలిసి ఐదేళ్ల కొడుకుపై కర్కశత్వం

» తలపై కొట్టడంతో మృతి చెందిన బాలుడు

సిరిసిల్ల క్రైం, మే 6 (ఆంధ్రజ్యోతి): కన్న ప్రేమను మరిచిన ఓ తల్లి ప్రియుడితో కలిసి తన ఐదేళ్ల కుమారుడిని దారుణంగా కొట్టింది. దాంతో బాలుడి తలకు గాయమై మృతి చెందాడు. ఈ ఘటన రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో మంగళవారం జరిగింది. సిరిసిల్ల పట్టణంలోని సుభాష్‌నగర్‌కు చెందిన మంగళారపు మాధవి, అరుణ్‌కుమార్‌కు ఆరుష్ (5), ఎనిమిదేళ్ల కూతురు ఉన్నారు. మాధవి భర్త అరుణ్‌కుమార్ పవర్‌లూం కార్మికుడిగా పనిచేస్తూ నాలుగేళ్ల క్రితం కిడ్నీలు పాడై మృతిచెందాడు. బీడీ కార్మికురాలిగా పనిచేసే మాధవి కొంత కాలంగా ఓ మెడికల్ షాప్‌లో సేల్స్ ఉమెన్‌గా పనిచేస్తోంది. నాలుగు నెలల క్రితం అదే మెడికల్ షాప్‌లో పనిచేసే సిరిసిల్ల పట్టణానికి చెందిన సామాల బాలకిషన్‌కు దగ్గరయింది. ఈ క్రమంలో తల్లి మాధవి, ఆమె ప్రియుడు బాలకిషన్ 15 రోజులుగా ఆరుష్ (5)పై దాడిచేసి కొడుతున్నారు. సోమవారం బాలుడి తలకు గాయమై స్పృహ తప్పి పడిపోయాడు. దీంతో మాధవి, ఆమె ప్రియుడు బాలకిషన్ అతడిని స్థానిక జిల్లా ఆసుపత్రికి తీసుకెళ్లారు. బాలుడి పరిస్థితి విషమించడంతో వైద్యులు మెరుగైన చికిత్స నిమిత్తం కరీంనగర్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆరుష్ మృతిచెందాడు.

వ్యవసాయ కళాశాల భూసర్వే రసాభాస

» సూర్యాపేట జిల్లా బూరుగడ్డలో పోలీసులు, రైతుల మధ్య తోపులాట

» రైతు ఆత్మహత్యాయత్నం, అడ్డుకున్న సిబ్బంది

హుజూర్‌నగర్ , మే 6 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ కళాశాల కోసం రెవెన్యూ అధికారులు సూర్యాపేట జిల్లాలో నిర్వహించిన భూసేకరణ సర్వే రసాభాసగా మారింది. హుజూర్‌నగర్ నియోజకవర్గానికి ప్రభుత్వం ఇటీవల వ్యవసాయ కళాశాలను మంజూరుచేసింది. ఇందుకు అవసరమైన భూసేకరణ చేసేందుకు రెవెన్యూ అధికారులు మండలంలోని బూరుగడ్డ గ్రామం ఎంచుకున్నారు. గ్రామంలోని సర్వే నెం. 604లో ఉన్న ప్రభుత్వ భూమిని సర్వే చేసేందుకు మంగళవారం రెవెన్యూ సిబ్బంది అక్కడికి వెళ్లగా, బూరుగడ్డకు చెందిన సుమారు 100 మంది రైతులు వారిని అడ్డుకున్నారు. రెవెన్యూ సిబ్బంది తహసీల్దార్‌కు సమాచారం ఇవ్వటంతో ఆయన అక్కడకు చేరుకొని సర్వేకు సహకరించాలని రైతులను కోరారు. నాలుగు తరాలుగా ప్రభుత్వ భూములను సాగు చేసుకుంటున్నామని, భూసర్వేకు సహకరించేది లేదని రైతులు తేల్చి చెప్పడంతో అధికారులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు అక్కడకు చేరుకొని రైతులను ఒప్పించేందుకు యత్నించినా వారు అంగీకరించలేదు. ఈ క్రమంలో రైతులను పోలీసులు నెట్టివేయడంతో బూరుగడ్డకు చెందిన రైతు గువ్వల గురవయ్య కిందపడ్డాడు. దీంతో మనస్తాపం చెందిన గురవయ్య పక్కనే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను పట్టుకుని ఆత్మహత్యాయత్నం చేయగా, అక్కడే ఉన్న కానిస్టేబుల్ అడ్డుకున్నారు. దాంతో అక్కడ తీవ్ర ఉద్రిక్త నెలకొంది. ఈ క్రమంలో వారం రోజుల పాటు సర్వేను నిలిపివేస్తున్నట్లు తహసీల్దార్ ప్రకటించారు. సర్వే నెం.604లో పట్టాదారు పాస్ పుస్తకాలు కలిగిన రైతులు తమ పట్టా పుస్తకాలు, నకలు ప్రతులు తీసుకొని రావాలని చెప్పి తహసీల్దార్ వెనుదిరిగారు.

30వేల కోట్లు ఉన్న పన్ను ఆదాయం.. 1.30లక్షల కోట్లకు పెరగడం దివాలానా?

» పాలన చేతగాక పేద రాష్ట్రమంటారా?

» అధికారులను బ్యాంకులు దొంగల్లాగా చూస్తున్నాయని రాష్ట్రం పరువు తీశారు

» ఆయన రాజీనామా చేయాలి: ఈటల



హైదరాబాద్, మే 6(ఆంధ్రజ్యోతి): ఉద్యోగ సంఘాల సమ్మెపై సీఎం రేవంత్ మాట్లాడిన మాటలతో తెలంగాణ సమాజం తలదించుకోవాల్సి వచ్చిందని, ఆయన రాష్ట్రం పరువు తీశారని మల్కాజ్‌గిరి ఎంపీ, బీజేపీ నేత ఈటల రాజేందర్ విమర్శించారు. 2014లో రూ.30వేల కోట్ల పన్ను ఆదాయం ఉన్న రాష్ట్రం 11 ఏళ్లలో రూ.1.30 లక్షల కోట్లకు చేరుకుందంటే అది దివాలానా అని ప్రశ్నించారు. లక్ష కోట్ల బడ్జెట్ 3లక్షల కోట్లకు పెరగడం ఆర్థిక సంక్షోభమా అని నిలదీశారు. తాజా వ్యాఖ్యలతో రేవంత్ అబద్ధాల కోరు అని తేలిందన్నారు. తెలంగాణ దివాలా తీసిందని రేవంత్ పదే పదే చెప్తూ తన దివాలాకోరుతనాన్ని బయటపెట్టుకుంటున్నారని ఎద్దేవా చేశారు. మంగళవారం హైదరాబాద్‌లోని బీజేపీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పాలన చేతగాకపోతే రేవంత్‌రెడ్డి సీఎం పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికలప్పుడు ఇచ్చిన హామీలను నెరవేర్చలేనందుకు ప్రజలకు క్షమాపణలు చెప్పాలన్నారు. పరిపాలన చేతగాక తెలంగాణను పేద రాష్ట్రంగా చిత్రించే సీఎం ప్రయత్నాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని ఈటల అన్నారు. తెలంగాణ అధికారులు బ్యాంకులకు పోతే దొంగల్లాగా చూస్తున్నారని సీఎం వ్యాఖ్యానించడం సిగ్గుచేటన్నారు. రాష్ట్రంలో ఒక వేళ నిజంగానే ఆర్థిక పరిస్థితి లేదనుకుంటే సీఎం మరింత నిబద్ధతతో, ప్రణాళికతో పనిచేయాలని, అనుభవజ్ఞుల సలహాలు తీసుకుని రాష్ట్రాన్ని ముందుకు తీసుకుపోవాలని సూచించారు. కానీ సీఎం రేవంత్ ఇంత తొందరగా కాడి వదిలేస్తారని, తెలంగాణ సమాజం, రాష్ట్రం పరువు తీస్తారని ఎవరూ ఊహించలేదన్నారు. తెలంగాణ ఉద్యోగులకు రావాల్సిన ప్రయోజనాలను ఇప్పటికైనా ప్రభుత్వం చెల్లించాలని, ఆర్టీసీ కార్మికులను పిలిచి మాట్లాడాలని ఈటల డిమాండ్ చేశారు. తెలంగాణ సమాజం కుంగిపోవద్దని, ప్రజలకు బీజేపీ అండగా ఉంటుందని తెలిపారు. 2014-15లో రూ.లక్ష కోట్ల బడ్జెట్ పెట్టిన రాష్ట్రంలో.. 11 ఏళ్ల తరువాత ఇటీవల భట్టి ప్రవేశపెట్టిన బడ్జెట్ రూ.3.4 లక్షల కోట్లు ఉందంటే రాష్ట్రం పురోగమిస్తున్నట్టా.. కాదా.. అని ఈటల ప్రశ్నించారు. తెలంగాణలో పెట్టుబడి వ్యయం 2014-15లో రూ.8,373 కోట్లుంటే.. 2023-24లో రూ.44 వేల కోట్లు, రేవంత్ పాలనలో కూడా రూ.32 వేల కోట్లు ఉందన్నారు. ఏ రాష్ట్రంలో పెట్టుబడి వ్యయం పెరుగుతుందో ఆ రాష్ట్రం అభివృద్ధి చెందుతోందనడానికి నిదర్శనమని చెప్పారు. తాను ఆర్థిక మంత్రిగా ఉన్న సమయంలో రాష్ట్ర ఆదాయం క్రమంగా పెరిగిందని ఈటల చెప్పారు. 2014-15లో రూ.29,285 కోట్లు ఉంటే.. 2024-25లో రూ.1.28లక్షల కోట్లకు పెరిగిందని వివరించారు. ఈ లెక్కలు రాష్ట్ర బలమైన ఆర్థిక స్థితిని సూచిస్తున్నాయని చెప్పారు. అలాంటి రాష్ట్రాన్ని సీఎం రేవంత్ రెడ్డి.. ఒక వ్యక్తిని, ఒక పార్టీని దృష్టిలో పెట్టుకుని దివాలా తీసిందని పదే పదే చెప్పడం సరికాదని ఈటల ఈ సందర్భంగా అభిప్రాయపడ్డారు.

నట్టేట ముంచిన అకాల వర్షం

» ఉమ్మడి వరంగల్, ఖమ్మం జిల్లాల్లో గాలివాన బీభత్సం

» తడిసిపోయిన ధాన్యం

» పలు జిల్లాలకు నేడు, రేపు వర్షసూచన

ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్



వరంగల్ జిల్లా ఇల్లంద వ్యవసాయ మార్కెట్‌లో తడిసిన ధాన్యాన్ని ఎత్తుతున్న రైతు

పలు జిల్లాల్లో సోమవారం రాత్రి, మంగళవారం కురిసిన అకాల వర్షం, ఈదురుగాలులు రైతులను నట్టేట ముంచాయి. జనగామ, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ జిల్లాల్లో సోమవారం రాత్రి గాలివానకు పంటలకు నష్టం వాటిల్లింది. మామిడి కాయలు రాలిపోయాయి. కల్లాలు, మార్కెట్లు, కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం తడిసింది. చెట్లు, విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. పలుచోట్ల సుమారు రెండు గంటలకు పైగా వీచిన బలమైన గాలులకు జనం భయభ్రాంతులకు గురయ్యారు. ఇళ్లు, రైస్ మిల్లుల పైకప్పు రేకులు ఎగిరిపోగా, షెడ్లు, గోడలు కూలిపోయాయి. హన్మకొండ జిల్లా భీమదేవరపల్లిలో అత్యధికంగా 4 సెంటీమీటర్ల వర్షం కురిసింది. ఖమ్మం జిల్లాలో పలుచోట్ల మంగళవారం సాయంత్రం ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎండ, ఉక్కపోతతో వాతావరణం వేడిగా ఉండగా సాయంత్రం ఒక్కసారిగా మబ్బులు కమ్ముకున్నాయి. భారీ వర్షంతో రోడ్లు మునిగిపోయాయి. పలుచోట్ల చెట్లు, విద్యుత్ స్తంభాలు, హోర్డింగులు పడిపోయాయి. జిల్లాలో వైరా కొణిజర్ల, ఏన్కూరు, ముదిగొండ, ఖమ్మం రూరల్ తదితర మండలాల్లోనూ భారీగా వర్షం కురిసింది. కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం తడిచిపోయింది. వైరాలో చెట్లు నేలకూలాయి. సోమవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి ఎదులాబాద్ కొనుగోలు కేంద్రంలోని ధాన్యమంతా పక్కనే ఉన్న కాలువలోకి కొట్టుకుపోయింది. తూకమేసిన ధాన్యం బస్తాలు సైతం తడిసిపోయాయి. ఉదయం రైతులు కాలువలో నుంచి ధాన్యాన్ని తీసి ఆరబెట్టుకున్నారు. ధాన్యాన్ని సకాలంలో మిల్లులకు తరలించేందుకు అధికారులు లారీలను ఏర్పాటు చేయడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. రంగారెడ్డి జిల్లా ఎదులాబాద్, మాధారం కేంద్రాల్లో ధాన్యం సేకరణ నత్తనడకన సాగుతోందని తెలిపారు. కాగా, కొన్ని జిల్లాల్లో బుధ, గురువారాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు వర్షం కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. బుధవారం భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, ములుగు, భూపాలపల్లి, పెద్దపల్లి, యాదాద్రి, జనగామ, మంచిర్యాల, ఆసిఫాబాద్, నల్గొండ, వనపర్తి, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని పేర్కొంది. కొన్నిచోట్ల ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురుస్తుందని తెలిపింది. కాగా, మంగళవారం నిజామాబాద్ జిల్లా మెండోరాలో అత్యధికంగా 42.8 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. మహబూబాబాద్‌కు చెందిన తునికి అమరావతి (40) అనే మహిళ వడదెబ్బతో సోమవారం అర్ధరాత్రి మృతిచెందింది.

ధాన్యం కొనుగోలు చేయాలని రైతుల ఆందోళన

మహబూబ్‌నగర్ జిల్లా బాదేపల్లి వ్యవసాయ మార్కెట్‌లో రైతులు మంగళవారం ఆందోళనకు దిగారు. మార్కెట్ తీసుకొచ్చిన ధాన్యాన్ని తేమ శాతం ఎక్కువగా ఉందంటూ వ్యాపారులు కొనుగోలు చేయకపోవడంతో కోపోద్రిక్తులైన రైతులు మార్కెట్ గేటును మూసివేశారు. సాయంత్రం వేళల్లో వర్షాలతో ధాన్యంలో కొంతమేర తేమ ఉందని తెలిపారు. దీంతో అధికారులు రైతులను సముదాయించి, వ్యాపారులను పిలిపించి, వారు ధాన్యం కొనుగోలు చేసేలా చర్యలు తీసుకున్నారు.

సిటీ నార్కోటిక్స్ వింగ్‌కు ప్రపంచస్థాయి గుర్తింపు

» మొదటి స్థానంలో నిలిచిన 'హెచ్ న్యూ'

» 15న దుబాయ్‌లో అవార్డు అందుకోనున్న నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్



హైదరాబాద్ సిటీ, మే 6 (ఆంధ్రజ్యోతి): డ్రగ్స్, గంజాయి వంటి మాదక ద్రవ్యాలను అరికడితూ... అంతర్జాతీయ, అంతర్రాష్ట్ర స్మగ్లర్ల భరతం పట్టి కటకటాల్లోకి నెడుతున్న హైదరాబాద్ నార్కోటిక్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ (హెచ్ న్యూ) విభాగం ప్రపంచస్థాయి గుర్తింపు పొందింది. మొదటి స్థానంలో నిలిచి అరుదైన అవార్డును సాధించింది. ఈ నెల 13 నుంచి 15 వరకు దుబాయ్‌లో నిర్వహించే వరల్డ్ పోలీస్ సమ్మిట్ (డబ్ల్యూపీఎస్)-2025లో సీపీ ఆనంద్ ఈ అవార్డును అందుకుంటారు. ప్రపంచ వ్యాప్తంగా 138 దేశాలకు చెందిన పోలీసు ఉన్నతాధికారులు ఈ కార్యక్రమానికి హాజరుకానున్నారు. ఈ సమ్మిట్‌లో ఎఫ్‌బీఐ, ఎన్‌వైపీడీ, మెట్రోపాలిటన్ పోలీస్ (యూకె), ఆస్ట్రేలియన్ ఫెడరల్ పోలీస్, జర్మన్ పోలీస్ వంటి ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన సంస్థల భాగస్వామ్యంతో వారి వ్యూహాత్మక చర్యలు, ఉత్తమ పోలీసింగ్ పద్ధతులు, ఆధునిక పోలీసింగ్‌లో ఎదురవుతున్న సవాళ్లను అధిగమించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఇలా అనేక అంశాలపై నిపుణులు చర్చిస్తారు. కాగా, ఈ ఏడాది అవార్డుల కోసం ప్రపంచవ్యాప్తంగా తీవ్ర పోటీ నెలకొంది. మూడు దశల్లో దరఖాస్తుల వడబోత అనంతరం ఎంపికైన వారిని వర్చువల్ సమావేశానికి ఆహ్వానించారు. సిటీ పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్.. మాదక ద్రవ్యాల కట్టడికి తీసుకుంటున్న ప్రత్యేక చర్యలపై లోతైన అధ్యయనంతో సమగ్రమైన ప్రజెంటేషన్ ఇచ్చి ఈ అవార్డును సాధించారు.

చేతకాకుంటే రాజీనామా చేయాలి

కాంగ్రెస్.. దొంగ చేతికి తాళాలు ఇచ్చింది

ఆ కారణంగానే ఎక్కడా అప్పు పుట్టడం లేదు

మరోసారి కేసీఆర్‌ను విమర్శిస్తే నాలుక చీరేస్తాం: కేటీఆర్



హైదరాబాద్, మే 6 (ఆంధ్రజ్యోతి) : పరిపాలన చేతకాకుంటే సీఎం పదవికి రేవంత్‌రెడ్డి రాజీనామా చేయాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సూచించారు. నోట్ల కట్టతో దొరికిన దొంగ రేవంత్ రెడ్డి అని, అందుకే ఎక్కడా అప్పు పుట్టడం లేదని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ.. దొంగ చేతికి తాళాలిచ్చిందని, ఆయన్ను సీఎం చేసి.. ఏఐసీసీ, రాహుల్‌గాంధీ తప్పుచేశారని దుయ్యబట్టారు. తెలంగాణ భవన్‌లో మంగళవారం కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. 'నన్ను కోసినా ఉన్న ఆదాయానికి మించి ఉద్యోగులకు పైసా ఇవ్వలేను' అని మాట్లాడడం.. సీఎం స్థాయి వ్యక్తికి తగదని, ఇంత అసమర్థ సీఎం దేశంలోనే ఎవరూ లేరన్నారు. బీఆర్ఎస్‌ను, వ్యక్తిగతంగా తమను తిట్టినా భరించామని.. తెలంగాణ ప్రతిష్ఠ దెబ్బతినేలా మాట్లాడితే సహించేది లేదన్నారు. ఉద్యమం వేళ ఉద్యోగుల త్యాగాల గురించి రేవంత్‌కు ఇసుమంత కూడా తెలియదని, ప్రజల ముందు వారిని విలన్లుగా చిత్రీకరించే కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. అందాల పోటీల కోసం ప్రభుత్వం రూ.200కోట్లు ఖర్చు చేస్తోందని, ఉద్యోగుల జీతాలు, రిటైర్డ్ ఉద్యోగుల ప్రయోజనాల చెల్లింపులకు మాత్రం డబ్బుల్లేవని చెబుతోందని దుయ్యబట్టారు. ప్రజలు ఇచ్చిన హామీలను అడగొద్దంటున్న రేవంత్‌రెడ్డి.. రానున్న రోజుల్లో పెట్రోల్ ధరను రూ.200కు పెంచినా పెంచుతారని, రికవరీ యాక్ట్ కింద కేసీఆర్ హయాంలో పెంచిన జీతాలను వెనక్కి ఇవ్వమంటారని వ్యంగ్యాస్త్రాలు సంధించారు. ఏడాదిన్నరలోనే సీఎం కుటుంబ ఆస్తులు భారీగా ఎలా పెరిగాయి? ఫోర్త్‌సిటీలో 2వేల ఎకరాలు ఎలా కొన్నారు? జూబ్లీహిల్స్ ప్యాలెస్ మూడింతలు ఎలా పెరిగింది? సీఎం తమ్ముడు వెయ్యి కోట్లతో స్వచ్ఛ బయో కంపెనీ ఎలా పెట్టారు? అనే ప్రశ్నలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఢిల్లీకి ఎకానమీ క్లాస్‌లో ప్రయాణం చేస్తున్నానని సీఎం అబద్ధాలు చెప్తున్నారని, ఆయన ప్రైవేట్ ట్రిప్పులకు సంబంధించిన ఫొటోలను త్వరలోనే బయట పెడతామన్నారు. సీఎం, మంత్రుల పర్యటనలకు అయిన ఖర్చుపై దమ్ముంటే శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సుదీర్ఘ రాజకీయ అనుభవానికి తోడు పదేళ్ల సీఎంగా పని చేసిన కేసీఆర్‌ను రేవంత్‌రెడ్డి నోటికొచ్చినట్లు దూషిస్తున్నారని, మరో సారి అలా మాట్లాడితే నాలుక చీరేస్తామని హెచ్చరించారు. కాగా, ఆర్టీసీ కార్మికులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం నెరవేర్చాలని, తక్షణమే వారి సమస్యలు పరిష్కరించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

పోక్సో కేసు టీచర్‌కు పాత బడిలోనే పోస్టింగ్

» ఇతర టీచర్ల నుంచి తీవ్ర అభ్యంతరం

» ఆయన వస్తే ఇబ్బందులని ఆందోళన

» పది రోజులైనా జాయిన్ చేసుకోని వైనం

» వేరే స్కూల్‌కు పంపాలని వినతి పత్రం?

హైదరాబాద్ సిటీ, మే 6 (ఆంధ్రజ్యోతి): ఆరో తరగతి చదువుతున్న బాలికతో అసభ్యకరంగా ప్రవర్తించాడనే ఆరోపణలతో పోక్సో కేసులో అరెస్టయి రిమాండ్‌కు వెళ్లి వచ్చిన ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడికి పోస్టింగ్ వ్యవహారం జిల్లాలో హాట్‌టాపిక్‌గా మారింది. పోక్సో కేసులో సస్పెండ్ అయిన వ్యక్తిని వేరే పాఠశాలకు పంపించాల్సిన జిల్లా విద్యాధికారులు తాజాగా పేరెంట్ స్కూల్ (సొంత స్కూల్)కు కేటాయించడం ఉపాధ్యాయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశమైంది. అయితే సదరు టీచర్ జాయినింగ్‌పై అక్కడ పనిచేస్తున్న ఉపాధ్యాయులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారుల అండతోనే సొంత స్కూల్‌లోనే చేరేలా ఆ ఉపాధ్యాయుడు ఉత్తర్వులు తెచ్చుకున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. సికింద్రాబాద్ జోన్ పరిధిలోని ఓ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న సైన్స్ స్కూల్ అసిస్టెంట్‌ను గత ఏడాది జూలైలో దోమలగూడ పోలీస్ స్టేషన్ పరిధిలోని మరో హైస్కూల్‌కు డిప్యూటేషన్‌పై పంపించారు. అయితే అక్కడ సదరు ఉపాధ్యాయుడు స్కూల్ ముగిసిన తర్వాత సాయంత్రం సమయంలో కొంతమంది విద్యార్థినులను బైక్‌పై ఎక్కించుకుని వెళ్లాడనే ఆరోపణలు ఉన్నాయి. ఇదే క్రమంలో ఆయన వ్యవహార శైలిపై కొంతమంది బాలికలు పాఠశాలలోని ఫిర్యాదుల పెట్టెలో లేఖలు రాసి వేశారు. అందులో మొత్తం 16 లేఖలు ఉండగా.. అన్నీ కూడా సదరు టీచర్ అసభ్య ప్రవర్తనకు సంబంధించినవే ఉన్నట్లు తెలిసింది. ఈ లేఖల విషయం పోలీస్ భరోసా టీమ్‌కు అందడంతో వారు గత ఏడాది డిసెంబరు మొదటి వారంలో స్కూల్‌కు వచ్చి ఉపాధ్యాయుడిని అదుపులోకి తీసుకుని విచారించారు. పాఠశాలలోని 6వ తరగతి విద్యార్థినితో ఆయన అసభ్యంగా ప్రవర్తిస్తున్నట్లు వారికి అనుమానం రావడంతో పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ క్రమంలో జిల్లా అధికారులు ఆయనను డిసెంబరు 6న విధుల నుంచి సస్పెండ్ చేశారు.

డీఈవో కార్యాలయంలో ఫిర్యాదు

పోక్సో కేసులో రిమాండ్‌కు వెళ్లి వచ్చిన ఉపాధ్యాయుడికి గతంలో పనిచేసిన సికింద్రాబాద్ జోన్ పరిధిలోని స్కూల్‌లోనే నియమిస్తూ ఉత్తర్వులు ఇవ్వడంపై అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. హైదరాబాద్ జిల్లా విద్యాశాఖ కార్యాలయం నుంచి గత ఏప్రిల్ 26న ఆయనకు జాయినింగ్ ఉత్తర్వులు వెలువడ్డాయి. సదరు ఉపాధ్యాయుడు సికింద్రాబాద్ డిప్యూటీ ఈవో వద్దకు వెళ్లి తనను చేర్చుకోవాలని కోరగా.. ఆయన హెచ్‌ఎంను ఆదేశించినట్లు తెలిసింది. అయితే ఆ టీచర్ తమకొద్దని ఇతర టీచర్లు అధికారులను వేడుకుంటున్నట్లు తెలిసింది. వారు డీఈవో కార్యాలయంలో వినతిపత్రం కూడా సమర్పించినట్లు సమాచారం. ఒక కేసులో సస్పెండ్ అయిన టీచర్‌ని వేరే స్కూల్‌కు పంపించాల్సిన అధికారులు ఏకంగా గతంలో అతను పనిచేసిన సొంత పాఠశాలకే పంపడం ఏమిటని అడుగుతున్నారు. కాగా, తనపై తప్పుడు ఆరోపణలు చేయడంతోనే రిమాండ్‌కు వెళ్లాల్సి వచ్చిందని, జిల్లా అధికారులిచ్చిన ఉత్తర్వుల మేరకు తనను జాయిన్ చేసుకోవాలని ఆయన హెచ్‌ఎంను కోరుతున్నట్లు తెలిసింది.

'సంధ్య కన్వెన్షన్' ఆక్రమణల కూల్చివేత

గచ్చిబౌలిలో దాదాపు అరెకరం ఆక్రమణ

పక్కన లే అవుట్‌ను ఆక్రమించి నిర్మాణాలు

యజమానుల ఫిర్యాదుతో రంగంలోకి హైడ్రా

40 కోట్ల స్థలంలో ఆక్రమణల తొలగిపు



సంధ్య కన్వెన్షన్ ఆక్రమణలను కూల్చివేస్తున్న హైడ్రా యంత్రాలు

హైదరాబాద్ సిటీ, మే 6 (ఆంధ్రజ్యోతి): సంధ్య కన్వెన్షన్ ఆక్రమణలపై హైడ్రా కొరడా ఝుళిపించింది. గచ్చిబౌలిలోని ఫర్టిలైజర్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఎంప్లాయీస్ కో ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ లే అవుట్‌లో సంధ్య కన్వెన్షన్ యజమాని శ్రీధర్‌రావు ఆక్రమణలకు పాల్పడ్డారంటూ ప్రజావాణిలో పలువురు హైడ్రాకు ఫిర్యాదు చేశారు. స్పందించిన హైడ్రా అధికారులు.. అనుమతి లేకుండా నిర్మించిన సంధ్య కన్వెన్షన్ మినీ హాల్‌తోపాటు ప్రధాన కన్వెన్షన్‌ను ఆనుకొని నిర్మించిన వంటగదులు, పది రెస్ట్ రూంలను కూల్చివేశారు. జీ+2 అంతస్తులున్న మరో రెండు ఐరన్ నిర్మాణాలనూ నేలమట్టం చేశారు. దాదాపు అరెకరం స్థలంలోని ఆక్రమణలను తొలగించారు. గచ్చిబౌలిలోని ఈ భూమి విలువ సుమారు రూ.40 కోట్లకుపైనే ఉంటుందని అధికారులు చెబుతున్నారు. వివరాల్లోకి వెళితే.. గచ్చిబౌలి గ్రామం పరిధిలోని 20 ఎకరాల్లో 162 ప్లాట్లతో 1980లో లే అవుట్‌ను అభివృద్ధి చేశారు. గతంలో ప్లాట్లు కొన్న కొందరు ప్రస్తుతం విదేశాల్లో ఉంటున్నారు. కొందరు ప్లాట్లను ఇతరులకు విక్రయించారు. సంధ్య కన్వెన్షన్ నిర్మాణం చేపట్టిన శ్రీధర్‌రావు పక్కనే ఉన్న లే అవుట్‌లోని తమ ప్లాట్లను ఆక్రమించారని యజమానులు హైడ్రాకు ఫిర్యాదు చేశారు. రహదారులు, ప్లాట్ల సరిహద్దులు లేకుండా చేశారని పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో పరిశీలించిన హైడ్రా అధికారులు లే అవుట్‌లో స్థలం ఆక్రమించినట్టు నిర్ధారణకు వచ్చారు. విషయాన్ని కమిషనర్ ఏవీ రంగనాథ్ దృష్టికి తీసుకెళ్లగా.. చట్ట ప్రకారం ముందుకు వెళ్లాలని అధికారులను ఆదేశించారు. దీంతో రంగంలోకి దిగిన అధికారులు ఆక్రమణలను పూర్తిగా నేలమట్టం చేశారు. లే అవుట్ ఆక్రమణలకు సంబంధించి శ్రీధర్‌రావుపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఐదు కేసులు నమోదైనట్లు హైడ్రా దృష్టికి వచ్చింది. ఇతరత్రా అంశాలకు సంబంధించి ఆయనపై 30 వరకు కేసులున్నట్టు ప్లాట్ల యజమానులు చెబుతున్నారు.

గాజుల రామారంలో 15 ఎకరాలు..

కుత్బుల్లాపూర్ మండలంలోని గాజులరామారంలో 15 ఎకరాల ప్రభుత్వ భూమిని కబ్జాదారుల నుంచి హైడ్రా విడిపించింది. సర్వే నంబరు 354లో ఉన్న సర్కారీ భూమిలో నిర్మించిన అక్రమ కట్టడాలను మంగళవారం కూల్చివేసింది. ఇందులో కేఎల్ యూనివర్సిటీ ఆక్రమించిన 5 ఎకరాల భూమి కూడా ఉంది. ఈ భూమిని రాజీవ్ స్వగృహ నిర్మాణాలకు రాష్ట్ర ప్రభుత్వం 2009లో కేటాయించింది. అక్కడ నిర్మాణాలు చేయకపోవడంతో భూమిపై స్థానిక నాయకుల కన్ను పడింది. ప్రహరీలు నిర్మించుకొని, షెడ్లు వేసి ఆక్రమణలకు పాల్పడ్డారు. దీనిపై స్థానికులు హైడ్రాకు ఫిర్యాదు చేశారు. క్షేత్రస్థాయిలో పరిశీలించిన హైడ్రా అధికారులు.. అది ప్రభుత్వ భూమి అని నిర్ధారించి, కమిషనర్ రంగనాథ్‌కు నివేదిక అందజేశారు. ఆయన కూడా భూమిని స్వయంగా పరిశీలించారు. సర్కారీ భూమి అని తేలడంతో ఆక్రమణల తొలగింపునకు ఆదేశాలు జారీ చేశారు. అక్రమ నిర్మాణాలను కూల్చేసిన అధికారులు సర్కారీ స్థలం అని బోర్డులు పెట్టి, ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. కాటేదాన్‌లో కూడా హైడ్రా కూల్చివేతలు చేపట్టింది. ఇందిరా సొసైటీ కాలనీలో రోడ్డు ఆక్రమణలు తొలగించింది.

హైదరాబాద్‌లో 'ఆపరేషన్ అభ్యాస్'

ఆర్మీ, ఎన్‌సీసీ ఆధ్వర్యంలో నేడు మాక్ డ్రిల్

- సాయంత్రం 4 గంటల నుంచి 4.30 గంటల దాకా!
- 4.15 గంటలకు సికింద్రాబాద్, గోల్కొండ, కంచన్‌బాగ్
- మౌలాలీలో నిర్వహించనున్న 12 విభాగాల సిబ్బంది
- ఆయా ప్రాంతాలకు చేరుకుని సంరక్షణ చర్యలు
- యుద్ధ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై
- నగర ప్రజలకు అవగాహన కల్పించనున్న అధికారులు

అల్వాల్, సికింద్రాబాద్, చంపాపేట, మే 6 (ఆంధ్రజ్యోతి): కేంద్ర హోం శాఖ ఆదేశాల మేరకు.. రాజధాని హైదరాబాద్‌లో 'ఆపరేషన్ అభ్యాస్' అనే సంకేత నామంతో పౌరుల భద్రత సన్నద్ధతపై మాక్ డ్రిల్ నిర్వహించనున్నారు. సాయంత్రం 4 గంటల నుంచి 4.30 గంటల దాకా ఔటర్ రింగ్ రోడ్డు లోపల.. ఆర్మీ, ఎన్సీసీ ఆధ్వర్యంలో ఈ ప్రక్రియ చేపడతారు. పోలీసులు, అగ్నిమాపక విభాగం, వైద్య, మునిసిపల్ తదితర 12 విభాగాల సిబ్బంది ఈ డ్రిల్ నిర్వహణలో కీలకపాత్ర పోషిస్తారు. అందులో భాగంగా సాయంత్రం 4 గంటలకు.. రెండు నిమిషాలపాటు సైరన్లు మోగిస్తారు. పారిశ్రామిక, అగ్నిమాపక శకటాల సైరన్లు మోగించి, పోలీస్ మైకులు, గస్తీ వాహనాల ద్వారా ప్రకటనలతో ప్రజలను అప్రమత్తం చేస్తారు. ఆ సైరన్లు మోగగానే ప్రజలందరూ విద్యుత్, గ్యాస్ ఉపకరణాలను వెంటనే ఆపేయాల్సి ఉంటుంది. బయట ఉంటే.. సమీపంలో సురక్షిత ప్రాంతానికి చేరుకోవడం, ఇంట్లో ఉంటే తదుపరి ఆదేశాలు వచ్చేదాకా లోపలే ఉండడం వంటివి చేయాలి. ఇక.. మధ్యాహ్నం 4.15 గంటల సమయంలో 'ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్' నగరంలోని నాలుగు కీలక ప్రాంతాల్లో.. సికింద్రాబాద్ కంటోన్మెంట్, గోల్కొండ, కంచన్ బాగ్ డీఆర్‌డీవో, మౌలాలీ ఎన్ఎఫ్‌సీ) వైమానిక దాడులకు సంబంధించి హెచ్చరికలు జారీచేస్తుంది. ఐదంటే ఐదే నిమిషాల్లో.. అంటే 4.20 గంటలకల్లా అత్యవసర సేవల విభాగాలను ఆయా ప్రాంతాలకు తరలిస్తారు. పోలీసు బృందాలు ఆ ప్రాంతంలో రక్షణ చర్యలు చేపడతాయి. రద్దీని నియంత్రించి.. రెస్క్యూ ఆపరేషన్స్ నిర్వహిస్తాయి. విపత్తు స్పందన దళాల సిబ్బంది శిథిలాల తొలగింపు ప్రక్రియ చేపడతారు. గాయపడినవారిని ఆస్పత్రులకు తరలిస్తారు. వైద్య బృందాలు.. గాయపడ్డవారిని పరీక్షించి, ప్రాథమిక చికిత్స చేస్తాయి. వారిని తాత్కాలిక ఆస్పత్రులకు తరలిస్తాయి. రవాణా సిబ్బంది.. ప్రజలను నిర్దిష్ట సురక్షిత ప్రాంతాలకు తరలిస్తారు. అక్కడ.. రెవెన్యూ, పౌరసరఫరాలు, మునిసిపల్ శాఖల సిబ్బంది ప్రజలకు తక్షణ సహాయం అందిస్తారు. బ్లాక్ అవుట్ చర్యలు (అంటే దాడి జరిగినప్పుడు విద్యుద్దీపాలన్నింటినీ ఆపేయడం) కూడా మాక్ డ్రిల్‌లో భాగమే అయినప్పటికీ.. హైదరాబాద్‌లో ఈ ప్రక్రియ సూర్యాస్తమయానికి ముందే నిర్వహిస్తున్నందున ఇక్కడ వాటిని అమలుచేయట్లేదు. కాకపోతే.. దాడి జరిగినప్పుడు వీధిదీపాలు, ఇళ్లల్లో దీపాలు, దుకాణాల ముందు ఉండే సైన్‌బోర్డులు.. అన్నింటినీ ఆర్పివేయాలని, ఇళ్లల్లోంచి చిన్న కాంతి రేఖ కూడా బయటకు కనిపించకుండా కిటికీలు, తలుపులు, వెంటిలేటర్లు.. అన్నింటినీ మూసేయాలని, వాహనాల హెడ్‌లైట్లను కూడా ఆపేయాలని ప్రజలకు చెబుతారు. అలాగే.. ఆయా ప్రాంతాల్లోని అత్యంత కీలకమైన భవనాలు, కట్టడాలు, చారిత్రక కట్టడాలను శత్రుదేశ విమానాలు గుర్తించకుండా తీసుకోవాల్సిన చర్యల గురించి వివరిస్తారు. సాయంత్రం 4.30 గంటల సమయంలో మరోసారి సైరన్లు మోగడంతో మాక్ డ్రిల్ పూర్తవుతుంది. ఈ డ్రిల్ సజావుగా జరిగేలా తమకు సహకరించాలని అధికారులు ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నారు. కాగా.. దేశవ్యాప్తంగా చేపట్టిన మాక్ డ్రిల్ కార్యక్రమాన్ని దక్షిణ మధ్య రైల్వే పరిధిలోని కాచిగూడ, రాయచూర్, ఔరంగాబాద్ రైల్వే స్టేషన్లలోనూ బుధవారం నిర్వహించనున్నారు. దక్షిణ మధ్య రైల్వే సివిల్ డిఫెన్స్ కంట్రోలర్ ఉదయనాథ్ కోట్లా పర్యవేక్షణలో ఈ డ్రిల్ చేపడతారు. యుద్ధ సమయంలో రైల్వే సిబ్బంది సన్నద్ధతను పరిశీలించడమే ఈ డ్రిల్ లక్ష్యంగా అధికారులు పేర్కొన్నారు.

భారత్, బ్రిటన్ ఒప్పందంతో తెలంగాణకు మేలు

- రాష్ట్ర వస్త్ర, ఐటీ పరిశ్రమలకు లబ్ధి: కిషన్‌రెడ్డి

న్యూఢిల్లీ, మే 6 (ఆంధ్రజ్యోతి): భారత్-బ్రిటన్ మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కుదరడాన్ని కేంద్ర బొగ్గు, గనుల మంత్రి కిషన్‌రెడ్డి స్వాగతించారు. భారత్ నుంచి బ్రిటన్ దిగుమతి చేసుకునే దాదాపు 99శాతం ఉత్పత్తులపై ఎలాంటి సుంకం ఉండదని.. దేశంలోని వస్త్ర, ఫుట్‌వేర్ పరిశ్రమలు, సముద్ర ఉత్పత్తులు, తోలు ఉత్పత్తులు, ఆభరణాలు, ఇంజనీరింగ్, ఆర్గానిక్ రంగాలకు లబ్ధి చేకూరుతుందని చెప్పారు. ముఖ్యంగా తెలంగాణకు ప్రత్యేక లబ్ధి కలుగుతుందని.. రాష్ట్రం నుంచి చేనేత వస్త్రాలను బ్రిటన్‌కు ఎగుమతి చేసేందుకు మార్గం సుగమం అవుతుందని తెలిపారు. మన ఐటీ సర్వీసులకు మరింత మార్కెట్ లభిస్తుందని చెప్పారు. ఎగుమతులు భారీగా పెరగడం ఆర్థిక వృద్ధికి దోహదం చేసి.. వికసిత భారత్ లక్ష్యాన్ని అందుకోవడంలో కీలక పాత్ర పోషిస్తుందని విశ్వసిస్తున్నట్టు కిషన్‌రెడ్డి పేర్కొన్నారు.

ఎమ్మెల్యే సుజనా చౌదరి కుడి భుజానికి గాయం

- ఐదారు ముక్కలైన ఎముక .. కిమ్స్‌లో శస్త్ర చికిత్స

హైదరాబాద్ సిటీ, మే 6 (ఆంధ్రజ్యోతి): విజయవాడ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే సుజనా చౌదరి కుడి భుజానికి తీవ్ర గాయమైంది. లండన్ పర్యటనలో ఉన్న ఆయన ఆదివారం ఓ సూపర్ మార్కెట్‌లో ప్రమాదవశాత్తూ కిందపడిపోయారు. కుడి భుజం వద్ద ఎముక విరగడంతో శస్త్రచికిత్స కోసం హైదరాబాద్‌కు తీసుకొచ్చారు. మంగళవారం ఉదయం ఆయన్ను బేగంపేటలోని కిమ్స్ సన్‌షైన్ ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రి ఎండీ, చీఫ్ రోబోటిక్ జాయింట్ రీప్లేస్మెంట్ సర్జన్ డాక్టర్ ఏవీ గురవారెడ్డి నేతృత్వంలో నలుగురు డాక్టర్ల బృందం అవసరమైన పరీక్షలు చేశారు. భుజంలో ఎముక ఐదారు ముక్కలైనట్లు గుర్తించారు. నాలుగు గంటలపాటు జరిగిన శస్త్రచికిత్స విజయవంతమైందని గురవారెడ్డి తెలిపారు. నెల నుంచి రెండు నెలల పాటు ఫిజియోథెరపీ అవసరమన్నారు. ఆ తర్వాత ఆయన ఆ చేతితో అన్ని పనులూ యథావిధిగా చేసుకోవచ్చని చెప్పారు.

మినీ అంగన్వాడీ టీచర్లకు పదోన్నతి

హైదరాబాద్, మే 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం మినీ అంగన్వాడీ టీచర్లకు తీపి కబురు చెప్పింది. రాష్ట్రంలోని 3,989 మినీ అంగన్వాడీ టీచర్లకు మెయిన్ అంగన్వాడీ టీచర్లుగా పదోన్నతి కల్పించింది. ఇక నుంచి వారంతా అంగన్వాడీ టీచర్ల మాదిరిగానే వేతనం పొందనున్నారు. ప్రస్తుతం మినీ అంగన్వాడీ టీచర్లకు నెలకు రూ.7,800 వస్తుండగా.. ఇక నుంచి నెలకు రూ.13,650 చొప్పున ఇవ్వనున్నారు. ఈ పెరిగిన వేతనాన్ని ఏప్రిల్ నుంచే అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

8 నుంచి కేఎల్‌యూలో ఇంజనీరింగ్ కౌన్సెలింగ్

- కేఎల్ఈఈ ప్రవేశపరీక్ష ర్యాంకర్లతోపాటు ఇంటర్ మార్కులు, జేఈఈ పర్సెంటైల్ ఆధారంగా మెరిట్ అడ్మిషన్లు

తాడేపల్లి (వడ్డేశ్వరం), మే 6(ఆంధ్రజ్యోతి): కేఎల్ యూనివర్సిటీ విజయవాడ, హైదరాబాద్ క్యాంపస్‌లలో ఇంజనీరింగ్ కోర్సులలో ప్రవేశాలకు ఈ నెల 8 నుంచి 11వ తేదీ వరకు కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్టు యూనివర్సిటీ అడ్మిషన్స్ డైరెక్టర్ డాక్టర్ జె.శ్రీనివాసరావు తెలిపారు. 8వ తేదీ ఉదయం 9.30 గంటలకు కౌన్సెలింగ్ ప్రారంభమవుతుందని జాతీయ స్థాయిలో నిర్వహించిన కేఎల్ ఇంజనీరింగ్ ప్రవేశ పరీక్షలో 30 వేల లోపు ర్యాంకులు వచ్చిన విద్యార్థులు, స్పోర్ట్స్, ఎన్‌సీసీ, సాంస్కృతికం, ఎక్స్ సర్వీస్‌మెన్ కోటాతో పాటు ఓపెన్ కేటగిరీలో ఇంటర్‌లో 80 శాతం పైగా మార్కులు పొందిన విద్యార్థులు మొదటి రోజు కౌన్సిలింగ్‌లో పాల్గొంటారని ఆయన ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 9, 10, 11 తేదీల్లో కేఎల్ ఇంజనీరింగ్ ప్రవేశ పరీక్షలో 30 వేలకు పైగా వచ్చిన ర్యాంకర్లు, ఓపెన్ కేటగిరీ కింద ఇంటర్, జేఈఈలలో మెరిట్ మార్కులు వచ్చిన విద్యార్థులు పాల్గొంటారని చెప్పారు. కౌన్సెలింగ్ ద్వారా సులువుగా అడ్మిషన్స్ ప్రక్రియ పూర్తి చేసుకునేలా ఏర్పాట్లు చేసినట్టు చెప్పారు. మెరిట్ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు కూడా అందిస్తున్నట్టు కౌన్సెలింగ్ కమిటీ కన్వీనర్ డాక్టర్ సుమన్ పేర్కొన్నారు. యూనివర్సిటీ ఎంహెచ్‌ఎస్ విభాగం డీన్ డాక్టర్ కిషోర్‌బాబు మాట్లాడుతూ కౌన్సెలింగ్ సమాచారాన్ని విద్యార్థులకు తెలియజేశామని విజయవాడ, హైదరాబాద్ రెండు క్యాంపస్‌లలో నాలుగు రోజులపాటు కౌన్సెలింగ్ నిర్వహించేలా అన్ని ఏర్పాట్లు చేసినట్టు వివరించారు.

గాలికి ఏడేళ్ల జైలు



(మొదటిపేజీ తరువాయి)

అప్పటి ముఖ్యమంత్రి రోశయ్య కేంద్రానికి లేఖ రాయడంతో సీబీఐ రంగంలోకి దిగింది. సరిహద్దులను కూడా మార్చేసి, నిబంధనలకు విరుద్ధంగా జరిపిన తవ్వకాల వల్ల రాష్ట్ర ప్రభుత్వ ఖజానాకు అప్పట్లోనే రూ.884 కోట్ల నష్టం వాటిల్లినట్టు సీబీఐ తన దర్యాప్తులో తేల్చింది. మంగళవారం వెలువడిన తీర్పులో ఏ1 బి.వి.శ్రీనివాస్‌రెడ్డి(గాలి బావమరిది), ఏ2 గాలి జనార్దన్‌రెడ్డి, ఏ3 అప్పటి గనుల శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ వీడీ రాజగోపాల్, ఏ4 ఓబుళాపురం మైనింగ్ కంపెనీ, ఏ7 మెహఫూజ్ అలీ ఖాన్ (గాలి వ్యక్తిగత సహాయకుడు)లను దోషులుగా నిర్ధారించి, నలుగురికి ఏడేళ్ల జైలు శిక్ష విధించారు. ఎనిమిదవ నిందితుడిగా ఉన్న మాజీ ఐఏఎస్ అధికారి కృపానందం, తొమ్మిదో నిందితురాలిగా ఉన్న ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అప్పటి గనుల మంత్రి, ప్రస్తుత తెలంగాణ ఎమ్మెల్యే పటోళ్ల సబితా ఇంద్రారెడ్డిని కోర్టు నిర్దోషులుగా ప్రకటించింది. కేసు విచారణ సమయంలో ఏ5 ఆర్.లింగారెడ్డి మృతి చెందారు. ఏ6గా ఉన్న సీనియర్ ఐఏఎస్ అధికారి వై.శ్రీలక్ష్మీ హైకోర్టులో క్వాష్ పిటిషన్ ద్వారా 2022లో ఈ కేసు నుంచి విముక్తి పొందారు. ఈ కేసు దర్యాప్తులో భాగంగా 219 మంది సాక్షులను విచారించారు. 3,336 పత్రాలను సాక్ష్యంగా కోర్టుకు సమర్పించారు. జనార్దన్‌రెడ్డిని సీబీఐ 2011 సెప్టెంబరు 5న అరెస్టు చేసింది. దాదాపు మూడున్నరేళ్ల జైల్లో గడిపిన తర్వాత సుప్రీంకోర్టు బెయిలుతో బయటకు వచ్చారు. తీర్పు వెలువరించే క్రమంలో భాగంగా న్యాయస్థానం తొలుత కృపానందం, సబితా ఇంద్రారెడ్డిలను నిర్దోషులుగా ప్రకటించింది. ఆ వెంటనే సబిత కోర్టు హాల్ నుంచి బయటకు వచ్చిన కుమారుడు కార్తీక్‌రెడ్డిని ఆలింగనం చేసుకొని తనని నిర్దోషిగా ప్రకటించిన విషయం చెప్పారు. ఆ తర్వాత న్యాయస్థానం నిందితుల వరుస క్రమంలో పిలుస్తూ, దోషులుగా ప్రకటిస్తూ శిక్షను ఖరారు చేసింది. గాలి జనార్దన్‌రెడ్డికి శిక్ష విధించడానికి ముందు కోర్టుకు ఏమైన చెప్పాలనుకుంటున్నారా? అని జడ్జి ప్రశ్నించారు. తనకు శిక్ష తగ్గించాలని గాలి ప్రాధేయపడ్డారు. మాజీ మంత్రిగా, ఒక ప్రజాప్రతినిధిగా ప్రజలకు సుదీర్ఘ కాలంగా సేవ చేస్తున్నానని, స్వచ్ఛంద సంస్థల ద్వారా కూడా పలు సామాజిక సహాయ కార్యక్రమాలను చేస్తున్నందున శిక్ష తగ్గించాలని కోరారు. తాను చేస్తున్న ప్రజాసేవను గుర్తించి గత శాసనసభ ఎన్నికల్లో కర్ణాటకలోని గంగావతి, బళ్లారి నియోజకవర్గ ప్రజలు అఖండ మెజారిటీతో గెలిపించారని గాలి జనార్దన్‌రెడ్డి కోర్టు దృష్టికి తెచ్చారు. ఈ కేసులో ఇప్పటికే సుమారు నాలుగేళ్ల పాటు జైలు శిక్ష అనుభవించినందున, తన వయసును కూడా దృష్టిలో పెట్టుకొని శిక్ష తగ్గించాలని కోరారు. ఈ కేసులో ఆరోపణలు రుజువైనందున మీకు యావజ్జీవ శిక్ష ఎందుకు విధించకూడదని న్యాయమూర్తి ప్రశ్నించారు. దాంతో గాలి మౌనం వహించారు. గాలికి శిక్ష ఖరారు కాగానే కోర్టు హాల్‌లోని అతడి కుమార్తె బ్రాహ్మణిరెడ్డి కన్నీటిపర్యంతమయ్యారు. గాలితో సహా నలుగురు ముద్దాయిలను పోలీసులు చంచల్‌గూడ జైలుకు తరలించారు.

హైకోర్టుకు గాలి

సీబీఐ కోర్టు తీర్పును బుధవారం హైకోర్టులో సవాల్ చేయనున్నట్లు గాలి జనార్దన్‌రెడ్డి తరఫున న్యాయవాదులు తెలిపారు. ఈ నెల 17వ తేదీన గాలి కుమారుడు కిరీటిరెడ్డి వివాహం ఉండటంతో ఆయనకు బెయిల్ మంజూరు చేయాలని న్యాయస్థానాన్ని కోరనున్నామని న్యాయవాది జితేందర్‌రెడ్డి చెప్పారు. గాలి అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారని, బెయిల్ పిటిషన్లో ఈ విషయాన్ని కూడా ప్రస్తావిస్తామని వెల్లడించారు.


గాలిపై అనర్హత వేటు

రెండేళ్లకు మించి గాలి జనార్దన్‌రెడ్డికి జైలుశిక్ష పడడంతో అతడి ఎమ్మెల్యే పదవికి గండం ఏర్పడింది. ఏడేళ్ల జైలు శిక్ష పడడంతో అతడిపై అనర్హత వేటు పడే అవకాశముందని తెలుస్తోంది. ప్రజాప్రాతినిధ్య చట్టం ప్రకారం ఏదైనా కేసులో రెండేళ్ల కంటే ఎక్కువ శిక్ష పడితే ప్రజాప్రతినిధులపై అనర్హత వేటు పడుతుంది.

న్యాయం గెలిచింది: సబిత

సీబీఐ కోర్టు తనను నిర్దోషిగా ప్రకటించడం పట్ల సబిత సంతోషం వ్యక్తం చేశారు. కోర్టుకు ధన్యవాదాలు తెలిపారు. మైనింగ్ కేసు నమోదైన తర్వాత కన్నీళ్లతో సీబీఐ కోర్టు మెట్లెక్కానన్నారు. న్యాయవ్యవస్థపై పూర్తి నమ్మకం ఉందని, 12 ఏళ్ల ఈ కేసులో న్యాయం కోసం పోరాటం చేశానని, చివరకు న్యాయం గెలిచిందని చెప్పారు. కేసు నమోదు, విచారణ సమయంలో తాను ఎన్నో అవమానాలు ఎదుర్కొన్నానని తెలిపారు. ఇబ్బందికర పరిస్థితుల్లో తనకు మద్దతుగా నిలిచిన ప్రతి ఒక్కరికీ సబిత ధన్యవాదాలు తెలిపారు.

రాజశేఖర్‌రెడ్డి అండతో గనుల మాఫియాగా ఎదిగి!



ఫైనాన్స్ కంపెనీ, చిట్ ఫండ్‌లతో ప్రారంభమై ఏడేళ్లలో ఐరన్ ఓర్ వ్యాపారాన్ని శాసించే స్థాయికి

- బంగారు సింహాసనం చేయించుకున్న గాలి
- సొంత హెలికాప్టర్లో కర్ణాటక సచివాలయానికి
- రూ.వేల కోట్ల విలువైన ఖనిజాల అక్రమ తవ్వకం
- ఇతరుల భూముల్లో చొరబడి యథేచ్ఛగా మైనింగ్
- బెయిల్ కోసం జడ్జికే లంచం ఇవ్వజూపిన వైనం

బళ్లారిలో సాధారణ కానిస్టేబుల్‌గా పనిచేసిన చెంగారెడ్డి కుమారుడే మైనింగ్ కింగ్ గాలి జనార్దన్‌రెడ్డి. చిత్తూరు జిల్లాకు చెందిన చెంగారెడ్డి కుటుంబం బళ్లారి వలస వెళ్లింది. అత్యంత సాధారణమైన జీవితం నుంచి జనార్దన్‌రెడ్డి వేల కోట్లకు పడగలెత్తడం వెనుక అక్రమ వ్యాపారాల చరిత్ర ఉంది. 1967లో బళ్లారిలో జన్మించిన జనార్దన్‌రెడ్డి.. కేవలం 21 ఏళ్ల వయసులో బళ్లారిలో 'ఎన్నేబుల్ ఇండియా సేవింగ్స్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్స్ కంపెనీ'ని ప్రారంభించి ప్రజల నుంచి పెద్దఎత్తున డిపాజిట్లు వసూలు చేశారు. రిజర్వ్ బ్యాంక్‌కు ఫిర్యాదులు రావడంతో ఎన్నేబుల్ సంస్థను మూసివేయించింది. వేల మంది ప్రజలు నష్టపోయారు. సోదరులైన కరుణాకర్ రెడ్డి, సోమశేఖర్‌రెడ్డితో కలిసి చిట్‌ఫండ్ వ్యాపారం ప్రారంభించారు. మైనింగ్ వ్యాపారంలోకి అడుగుపెట్టారు. ఓబుళాపురం మైనింగ్ కంపెనీ (ఓఎంసీ)ని ప్రారంభించారు. ఇనుప ఖనిజం అమ్మకాలతో భారీగా డబ్బు సంపాదించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డి ద్వారా ఓఎంసీకి ఉమ్మడి అనంతపురం జిల్లాలో మైనింగ్ లీజులు పొందారు. రాజకీయ అండ కోసం గాలి సోదరులు బీజేపీలో చేరారు.



సొంత హెలికాప్టర్.. బంగారు కుర్చీ

గాలి జనార్దన్‌రెడ్డి రాజశేఖర్‌రెడ్డి సాన్నిహిత్యంతో అపరిమితంగా ఎదిగారు. అత్యంత విలాసవంతమైన జీవితం గడిపారు. ఇంట్లో బాత్‌రూం కమోడ్ నుంచి భోజనం చేసే కంచాల వరకు అన్నీ బంగారమేనని అనేవారు. బంగారు సింహాసనంలో కూర్చునేవారని ప్రచారం. కొన్నాళ్లు కర్ణాటక మంత్రిగా పనిచేసిన గాలి.. అప్పట్లో సొంత హెలికాప్టర్లో సచివాలయానికి వచ్చేవారు. అక్రమ తవ్వకాల కేసులో 2011 సెప్టెంబరు 5న సీబీఐ ఆయన్ను అరెస్టుచేసింది. మూడేళ్లకు పైగా జైల్లోనే ఉన్నారు. బెయిల్ కోసం ఏకంగా జడ్జికే రూ.కోట్ల లంచం ఇవ్వడానికి గాలి ముఠా ప్రయత్నించడం అప్పట్లో సంచలనం సృష్టించింది. 2015 జనవరి 21న సుప్రీంకోర్టు ఎట్టకేలకు ఆయనకు బెయిల్ మంజూరుచేసింది. 2016లో కుమార్తె బ్రహ్మణి వివాహానికి ఆయన భారీగా రూ.500 కోట్లు ఖర్చుపెట్టినట్లు ప్రచారం జరిగింది. ఆయన మాత్రం రూ.30 కోట్లే ఖర్చయినట్లు ఆదాయపు పన్ను శాఖకు చూపించారు.

ఇచ్చింది కొంత.. తవ్వింది కొండంత

కేవలం 69 హెక్టార్ల మైనింగ్ లీజు పొందిన గాలి జనార్దన్‌రెడ్డి కంపెనీ ఓఎంసీ.. అక్రమంగా అంతకు రెట్టింపు మైనింగ్ జరిపిందని సీబీఐ దర్యాప్తులో తేలింది. ఈ క్రమంలో కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ సరిహద్దులను కూడా ధ్వంసం చేశారు. 60 లక్షల టన్నుల ఇనుప ఖనిజాన్ని విదేశాలకు అక్రమంగా ఎగుమతి చేశారు. కృష్ణపట్నం పోర్టు నివేదికలు, మైనింగ్ శాఖ జారీ చేసిన రశీదులకు మధ్య తేడాలు ఉన్నట్లు సీబీఐ అధికారులు గుర్తించారు. అక్రమాలను నిర్ధారించడానికి సీబీఐ అధికారులు అప్పట్లో అధునాతన పరికరాలను, జియోమ్యాపింగ్ ఉపయోగించారు. 2011లో నాడు బహుళ దర్యాప్తు సంస్థలు నిర్వహించిన దాడుల్లో బళ్లారిలోని ఆయన నివాసంలో అధునాతన స్విమింగ్‌పూల్, మసాజ్ పార్లర్, హోం థియేటర్, బాంబ్ షెల్టర్ వంటి విలాసవంతమైన సౌకర్యాలు బయటపడ్డాయి. ప్రైవేటు హెలికాప్టర్ 'రుక్మిణి'తో పాటు అనేక లగ్జరీ కార్లను కూడా సీజ్ చేశారు. 15 కిలోల బరువైన బంగారు సింహాసనంపై ఆయన కూర్చునేవారు. వజ్రాలు పొదిగిన జీజేఆర్ అనే అక్షరాలను ఈ సింహాసనంపై చెక్కించారు. రహస్యంగా రాజుగా పట్టాభిషేకం కూడా చేసుకున్నట్లు చెబుతారు. ఆయన నివాసంలో దర్యాప్తు అధికారులు 30 కిలోల బంగారాన్ని జప్తుచేసినట్లు సమాచారం. అసలైన బంగారు తీగలతో నేసిన షర్టులు మాత్రమే వేసుకునేవారు. రూ.15 లక్షల విలువైన ఆభరణాలతో కూడిన బెల్టు ధరించేవారు.

రూ.10 లక్షల పెట్టుబడితో ఆరంభం

2001-02 సంవత్సరంలో కేవలం రూ.10 లక్షల పెట్టుబడితో ప్రారంభమైన ఓబుళాపురం మైనింగ్ కంపెనీ ఆరేడేళ్లలోనే రూ.3 వేల కోట్లు ఆర్జించినట్లు ఆరోపణలున్నాయి. కర్ణాటక, ఆంధ్ర సరిహద్దులో మైనింగ్ మాఫియాను గాలి జనార్దన్‌రెడ్డి నడిపించారు. అనంతపురం జిల్లా రాయదుర్గం నియోజకవర్గం డి.హీరేహాళ్ మండలంలో ఆరు గనులు ఉండగా.. వాటిలో ఐదు ఓఎంసీ అధీనంలోనే ఉన్నాయి. అటవీ శాఖ అనుమతులు లేకుండానే ఖనిజాన్ని తరలించినట్లు తేలింది. బళ్లారి ఐరన్‌ఓర్‌కు చెందిన లీజు ప్రాంతంలో చొరబడి 2.5 లక్షల మెట్రిక్ టన్నుల ఖనిజాన్ని అక్రమంగా తవ్వి తరలించినట్లు ఓఎంసీపై ఆరోపణలు వచ్చాయి. అక్రమ తవ్వకాలు చేపట్టే ప్రాంతాల్లో తుపాకులతో సాయుధ బందోబస్తు ఏర్పాటు చేసుకున్నారు. అక్రమ తవ్వకాలను ప్రశ్నిస్తే ఎస్సీ, ఎస్టీ కేసులను పెట్టించి భయభ్రాంతులకు గురిచేశారు. ఇతరుల ముడి ఖనిజంలో 40 శాతం వాటా లాక్కున్నారు.రక్షిత అటవీ ప్రాంతంలోని 1.50 హెక్టార్లలో ఖనిజ వ్యర్థాలను నిల్వ చేసి, అటవీ సంరక్షణ చట్టాన్ని ఉల్లంఘించారు. నాణ్యమైన ఖనిజం కోసం సరిహద్దులో ఉండే సుంకులమ్మ దేవాలయాన్ని సైతం కూల్చారు. అనంతపురం డీఎఫ్‌వోగా పనిచేసిన బిశ్వాస్ తన నివేదికలో రూ.700 కోట్ల విలువైన ఇనుప ఖనిజాన్ని ఓఎంసీ తరలించినట్లు నివేదిక ఇచ్చారు. ఆయనపై కూడా అక్రమ కేసులు బనాయించే ప్రయత్నం చేశారు. గాలి జనార్దన్‌రెడ్డి అక్రమ మైనింగ్‌ను పరిశీలించేందుకు 2007 జూలైలో ఉమ్మడి ఏపీ టీడీపీ నేతల బృందం ఓబుళాపురానికి వెళ్లింది. వారు లోపలికి వెళ్లకుండా పోలీసులు అడుగడుగునా అడ్డుకుని, అరెస్టు చేశారు. నాటి కేసులను విజయవాడ ప్రజాప్రతినిధుల కోర్టు ఈ ఏడాది మార్చిలో కొట్టివేసింది. "సీబీఐ సీజ్ చేసిన ఇనుప ముడిఖనిజం దొంగతనం జరిగింది. దానిపైనా కేసు నమోదు చేసి విచారించాలని ఫిర్యాదు చేశాం. మా మైనింగ్ మెటీరియల్‌ను మాకు ఇప్పించాలి" అని ఈ కేసులో ప్రధాన సాక్షి అయిన టపాల్ శ్యాంప్రసాద్ కోరారు.

- హైదరాబాద్/బెంగళూరు, ఆంధ్రజ్యోతి

ఇక జగన్ వంతేనా?!

'గాలి'కి శిక్ష పడటంతో సర్వత్రా ఇదే చర్చ

- ఒక్క కేసులోనే జనార్దనరెడ్డికి ఏడేళ్ల కఠిన శిక్ష
- జగన్‌పై 11 సీబీఐ కేసులు.. 12 ఏళ్లుగా సీబీఐ కోర్టులో పెండింగ్
- అదే కోర్టులో ఇప్పుడు గాలికి దండన



(అమరావతి- ఆంధ్రజ్యోతి)

మాజీ సీఎం జగన్‌ను తన బ్రదర్‌గా చెప్పుకొన్న కర్ణాటక మాజీ మంత్రి, ఎమ్మెల్యే గాలి జనార్దనరెడ్డికి ఓబులాపురం అక్రమ మైనింగ్ కేసులో సీబీఐ కోర్టు ఏడేళ్ల కఠిన కారాగార శిక్ష విధించడంతో ఏపీ రాజకీయాల్లో కలకలం మొదలైంది. ఒక్క కేసులోనే గాలికి ఏడేళ్ల కఠినశిక్ష పడితే.. 11 కేసుల్లో నిందితుడైన జగన్‌కు ఇంకెన్నేళ్ల శిక్ష పడుతుందో!? అనే చర్చ జరుగుతోంది. ఓఎంసీ కేసులో రూ. 884 కోట్ల అక్రమాలు జరిగితే.. జగన్ ఏకంగా రూ.43వేల కోట్ల అక్రమాల ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. ఈ లెక్కన ఆయనపై నేరాలు రుజువైతే జీవితకాలం జైలు పాలేననే వాదనలు వినిపిస్తున్నాయి. ఉమ్మడి ఏపీ సీఎంగా వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఉన్నప్పుడు గాలి జనార్దనరెడ్డి ఒక వెలుగు వెలిగారు. జగన్‌ను బ్రదర్ అని సంబోధిస్తూ.. తన వ్యాపార విస్తరణకు అడ్డదారులు తొక్కారు. ఆయనకు అప్పట్లో 69 హెక్టార్ల భూమిని అనంతపురం జిల్లాలో కేటాయించారు. ఈ వ్యవహారంలోనే గాలికి సీబీఐ శిక్ష వేయించింది. ఈ కేసులో జగన్‌ను నేరుగా ప్రాసిక్యూట్ చేయలేదు. కానీ, గాలిని దండించిన సీబీఐ కోర్టులోనే జగన్ కేసులున్నాయి. తండ్రి అధికారాన్ని అడ్డుపెట్టుకుని, క్విడ్‌ప్రోకో ఒప్పందాలను జగన్ కుదుర్చుకున్నారనేది ప్రధాన అభియోగం. మైనింగ్ లీజులు, అడ్డగోలు అనుమతుల ద్వారా రాజశేఖరరెడ్డి హయాంలో లబ్ధి పొందిన సంస్థలు ప్రతిఫలంగా జగన్ కంపెనీల్లో వేల కోట్ల విలువైన పెట్టుబడులు పెట్టాయని సీబీఐ నిగ్గుతేల్చింది. ఈ వ్యవహారంలో జగన్‌కు సహకరించిన ఆరోపణలపై అప్పట్లో ఆరుగురు మంత్రులు, ఎనిమిది మంది ఐఏఎస్‌లను సైతం సీబీఐ నిందితుల జాబితాలో చేర్చింది. జగన్‌పై సీబీఐ దాఖలు చేసిన 11 చార్జిషీట్లలో రూ.43వేల కోట్ల మేర అక్రమ లావాదేవీలు జరిగినట్లు తేల్చింది. వాటి ఆధారంగా ఈడీ నమోదు చేసిన మరో ఆరు మనీలాండరింగ్ కేసులు సైతం విచారణలో ఉన్నాయి. 2012 మే చివరి వారంలో జగన్ 16 నెలల పాటు జైలు పాలవ్వడానికి కారణమైన ఈ కేసుల్లో తీర్పు వెలువడితే.. పదహారేళ్లకు పైగా జైలుకే అంకితమయ్యే అవకాశం ఉందనే వ్యాఖ్యలు బలంగా వినిపిస్తున్నాయి. అధికారాన్ని అడ్డంపెట్టుకొని దోచుకోవడంలో గాలి జనార్దనరెడ్డి, వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఒకే తరహా వ్యక్తులని న్యాయవాదులు అభిప్రాయ పడుతున్నారు. అధికారంలో ఉన్నప్పుడు అవినీతి ఆరోపణల్లో చిక్కుకుని జైలు పాలైన రాజకీయ నాయకులు దేశంలో చాలా మందే ఉన్నారు. కానీ జగన్ తరహాలో 11 అక్రమాస్తుల కేసులు, ఆరు మనీ లాండరింగ్ కేసులు, మొత్తం 38కేసుల్లో నిందితుడిని అంటూ ఎన్నికల అఫిడవిట్‌లో చూపించిన నేత.. దేశంలోనే మరెవరూ కనిపించరు. జగన్‌తోపాటు మాజీ ఎంపీ విజయసాయి రెడ్డి ఈ కేసులో ప్రధాన నిందితులు అని సీబీఐ పేర్కొంది. ఆ తర్వాత దర్యాప్తులో మొత్తం 71మందిని చేర్చింది.

భూకబ్జాల భూమన

- వైసీపీ హయాంలో 16.30ఎకరాల చెర
- ఏపీ సర్కారుకు విజిలెన్స్ నివేదిక
- క్రిమినల్, సివిల్ చర్యలకు మంత్రి ఆదేశం

అమరావతి, మే 6(ఆంధ్రజ్యోతి): వైసీపీ నేత భూమన కరుణాకర్ రెడ్డి భూఆక్రమణల బాగోతం బయటపడింది. గత ప్రభుత్వ హయాంలో ఆయన 16.30 ఎకరాల భూములను చెరబట్టారని విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం తేల్చి ఇటీవల రాష్ట్ర ప్రభుత్వానికి సమగ్ర నివేదిక ఇచ్చింది. భూఆక్రమణలకు సంబంధించి భూమన కరుణాకర్‌రెడ్డిపై వచ్చిన ఫిర్యాదులకు స్పందనగా విజిలెన్స్ అధికారుల బృందం ప్రత్యేక విచారణ చేపట్టింది. తిరుపతి గ్రామీణ మండలం తిరుచానూర్, తిరుపతి అర్బన్(నగర) మండలం మంగళం గ్రామంలోని తిమ్మినాయుడి పాలెం తదితర గ్రామాల పరిధిలోని 16.30 ఎకరాల భూ ఆక్రమణలకు భూమన పాల్పడ్డారని విజిలెన్స్ నిర్ధారించింది. తిరుచానూరులోని సర్వే నంబర్ 472, 473, 474 లో 15.36 ఎకరాల భూమి భూమన కుమారుడు, ఆయన భార్య రేవతి పేరిట ఉంది. కానీ పొజిషన్‌లో ఉన్న భూమిని సర్వే చేయగా మొత్తం 24.36 ఎకరాలున్నట్లు తేలింది. ఇందులో 9 ఎకరాల భూమిని భూమన ఆక్రమించుకున్నట్లు విజిలెన్స్ నిర్ధారించింది. అలాగే, మంగళం గ్రామంలో సర్వే నంబర్ 47 పరిధిలో 10.37 ఎకరాలు భూమన ఆక్రమణలో ఉన్నట్టు విజిలెన్స్ గుర్తించింది. ఇందులో ప్రభుత్వ భూమి 7.30 ఎకరాలుంది. ఈ మేరకు విజిలెన్స్ ఇచ్చిన నివేదికపై రెవెన్యూమంత్రి అనగాని సత్యప్రసాద్ ఉన్నతాధికారులతో సమీక్షించారు. ఆయా భూములను స్వాధీనం చేసుకోవాలని, భూమనపై సివిల్, క్రిమినల్ చర్యలు తీసుకోవాలని మంత్రి అనగాని ఆదేశించారు.

గాలిని పట్టుకునేందుకు మారువేషాల్లో వెళ్లాం

ఓఎంసీ అక్రమ మైనింగ్‌ను నిరూపించేందుకు అమెరికా నుంచి శాటిలైట్ చిత్రాలు తెప్పించి సరిపోల్చాం

- ఎంత తవ్వారు? అక్రమం ఎంత? అన్న సాక్ష్యాలు పక్కాగా ఇచ్చాం
- అక్రమ మైనింగ్ చేసేవారికి ఈ తీర్పు ఒక గుణపాఠం
- ఆనాటి మా దర్యాప్తులో వెల్లడైందే నేడు రుజువయింది
- నాటి సీబీఐ జాయింట్ డైరెక్టర్ లక్ష్మీనారాయణ వెల్లడి



హైదరాబాద్, మే 6 (ఆంధ్రజ్యోతి): ఓబుళాపురం మైనింగ్ కేసులో సీబీఐ కోర్టు ఇచ్చిన తీర్పు.. అక్రమ మైనింగ్ చేసేవారికి ఒక గుణపాఠం అవుతుందని సీబీఐ మాజీ జాయింట్ డైరెక్టర్ లక్ష్మీనారాయణ అన్నారు. ఆనాడు ఈ కేసు దర్యాప్తు బాధ్యతలు నిర్వహించిన లక్ష్మీనారాయణ.. అప్పట్లో తమ దర్యాప్తులో వెల్లడైన విషయాలే ఇప్పుడు రుజువయ్యాయని పేర్కొన్నారు. గాలి జనార్దన్‌రెడ్డిని పట్టుకునేందుకు మారువేషాల్లో వెళ్లామన్నారు. కోర్టు తీర్పు నేపథ్యంలో ఆనాటి అనుభవాలను లక్ష్మీనారాయణ 'ఆంధ్రజ్యోతి'తో పంచుకున్నారు. "విచారణలో అనేక అనుభవాలున్నాయి. కళ్లముందు అక్రమ మైనింగ్ జరిగిందని కనిపిస్తున్నా.. నిరూపించేందుకు కావాల్సింది సాక్ష్యం. దానికోసం అప్పట్లో అనుసరించిన పద్ధతులు అపూర్వం. శాస్త్రీయంగా అక్రమాలు నిరూపించాం. రూ.882 కోట్ల అక్రమ మైనింగ్ జరిగిందని చెప్పాం" అని సీబీఐ మాజీ జేడీ అన్నారు. ఓబుళాపురం మైనింగ్ కంపెనీ అక్రమ మైనింగ్ చేసిందన్నది స్పష్టమని, కానీ.. అది ఎక్కడ జరిగింది, ఎంత జరిగిందన్నది నిరూపించడం చాలా కష్టమయిందని చెప్పారు. తాము విచారణ ప్రారంభించేసరికే అక్కడ తవ్వకాలన్నీ అయిపోయాయని, అక్కడికి వెళ్లేసరికి అన్నీ ఖాళీ గోతులే ఉన్నాయని తెలిపారు. దీంతో ఏం చేయాలన్నది ఆలోచించి అమెరికా నుంచి ఆ ప్రాంతం శాటిలైట్ ఇమేజ్‌లు తెప్పించామని, వాటిని క్షేత్రస్థాయిలో సరిపోల్చామని వివరించారు. మళ్లీ అక్కడ మైనింగ్ సీన్ మొత్తం రీకన్‌స్ట్రక్షన్ చేసి.. ఏ రోజు ఎంత తవ్వకం జరిగి ఉంటుందన్నది లెక్కలేసి పరిశీలించామన్నారు. "అనుమతులు ఇచ్చింది ఎక్కడ, ఎంత పరిమాణం? తవ్వింది ఎక్కడ, ఎంత పరిమాణం? వంటివన్నీ లెక్కలేశాం. సింగరేణి సర్వే బృందాలతో మళ్లీ సర్వే చేయించాం. చివరకు ఎంత ఇనుప ఖనిజాన్ని అక్రమంగా తవ్వారో అంచనా వేసి.. రూ.882 కోట్లుగా తేల్చాం. దాదాపుగా అదే ఇప్పుడు నిజమైంది" అని లక్ష్మీనారాయణ అన్నారు.

"అప్పుడు ఎంత జాగ్రత్తగా విచారణ చేశామన్నదానిపై ఒక్క విషయం చెబుతాను. గాలి జనార్దన్‌రెడ్డిని అరెస్టు చేసేందుకు మా బృందంతో బళ్లారికి వెళ్లాం. అక్కడ హోటల్‌లో ఎక్కడా సీబీఐ అధికారులమని చెప్పలేదు. ఐటీ అధికారులమని చెప్పాం. ఎందుకంటే బళ్లారిలో అతని నెట్‌వర్క్ పెద్దది. సీబీఐ

ఐటీ అధికారుల్లా హోటల్‌లో దిగాం..

అనగానే అప్రమత్తం అయిపోవచ్చు. ఎక్కడికైనా వెళ్లిపోవచ్చు. ఇంట్లో ఉన్న డబ్బు, బంగారం, పత్రాలు తరలించివేయొచ్చు. అందుకే సీబీఐలా కాకుండా వేరేలా వెళ్లాం. ఉదయాన్నే ఇంటికెళ్లి అరెస్టు చేసి.. ఇంట్లో ఉన్న కీలక పత్రాలు, నగదు, బంగారం స్వాధీనం చేసుకున్నాం. అన్నింటినీ హెలికాప్టర్‌లో సీబీఐ కార్యాలయానికి తరలించాం" అని సీబీఐ మాజీ జేడీ వివరించారు. గాలి జనార్దన్‌రెడ్డి కేసును విచారించేటప్పుడు తమపై ఒత్తిడేమీ లేదని లక్ష్మీనారాయణ తెలిపారు. "ఓవైపు వ్యవస్థల్ని గుప్పిట్లో పెట్టుకునే నేత ఆయన. మరోవైపు రాంజెఠ్మలానీ, ఉదయ్ లలిత్ లాంటి పేరుమోసిన న్యాయవాదులు దిగేవారు. అయినా మా సీబీఐ లీగల్ టీం బాగా పని చేసింది. నాటి సీబీఐ అధికారులు వెంకటేశ్, ఆర్.ఎం. ఖాన్ తదితరులంతా బాగా సహకరించారు. అంతా కలిసి ఒక బృందంలా పనిచేశాం" అని వివరించారు.

ప్రపంచానికి చాటే అవకాశం!

(మొదటి పేజీ తరువాయి)

సోనూసూద్, మిస్ ఇండియా నందినీ గుప్తా తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి మాట్లాడుతూ.. ప్రపంచ సుందరి పోటీలకు ఎవరైనా హాజరు కావచ్చని చెప్పారు. పోటీలకు వచ్చే ప్రతినిధులందరూ ప్రపంచ శ్రేణి అనుభవాలను పొందుతారని ధీమా వ్యక్తం చేశారు. మిస్ వరల్డ్ అనేది కేవలం అందాన్ని, ప్రతిభను చాటుకొనే పోటీ మాత్రమే కాదని.. ఇది సాధికారత, వైవిధ్యం, ప్రపంచ ఐక్యతకు వేదిక అని పేర్కొన్నారు. ఈ పోటీల వల్ల తెలంగాణ గురించి యావత్ ప్రపంచం తెలుసుకుంటుందని, రాష్ట్ర పర్యాటకాన్ని ప్రపంచానికి చూపటానికి ఇదో మంచి అవకాశమని చెప్పారు. మిస్ వరల్డ్ పోటీల నిర్వహణ కోసం దేశంలోని పలు రాష్ట్రాలతో పాటు ఇతర దేశాలూ పోటీపడ్డాయని, సీఎం రేవంత్ చొరవతో ఈ పోటీల నిర్వహణ అవకాశం రాష్ట్రానికి దక్కిందని తెలిపారు. ఈ పోటీల ద్వారా రాష్ట్రంలో యువతకు ఉపాధి అవకాశాలు మెరుగవుతాయన్నారు. ఈ పోటీలు మన మహిళలకు స్ఫూర్తి కలిగిస్తాయని జూపల్లి చెప్పారు. ప్రతి దేశం తమ ప్రతినిధిని పంపడం మాత్రమే కాదు, తెలంగాణను దగ్గరగా చూస్తుందని మిస్ వరల్డ్ సీఈవో జూలియా తెలిపారు. ప్రతి ఒక్కరికీ పర్యాటకం కావాల్సిందేనని, ప్రపంచంలో పర్యాటక రంగానికి ఎంతో ప్రాధాన్యం ఉందని చెప్పారు. తమకు సాదరంగా ఆహ్వానించారని.. తెలంగాణకు అత్యుత్తమమైంది కావాలని, అది తాము ఇస్తామని అన్నారు. ఈ పోటీలకు 120కి పైగా దేశాల నుంచి అందగత్తెలు రానున్నారన్నారు. ఈ పోటీల ద్వారా భారతదేశం నుంచి ప్రపంచం నేర్చుకునే అవకాశం కలుగుతుందని భావిస్తున్నట్లు చెప్పారు. ప్రతి సంవత్సరం మిస్ వరల్డ్ పోటీలకు ఒక నేపథ్యం ఉంటుందని.. ఈ సారి పర్యాటకంపై దృష్టి సారించామని జూలియా వివరించారు. సినీ నటుడు సోనూసూద్ మాట్లాడుతూ.. తెలుగు ప్రజలు తనను ఎంతగానో ఆదరించారని, వారి ప్రేమ అపూర్వమని చెప్పారు. మిస్ వరల్డ్ పోటీలు చూస్తూ ఎదిగిన తాను.. ఈ రోజు ఆ పోటీల నిర్వాహకులతో కలిసి వేదిక పంచుకోవడం ఆనందంగా ఉందన్నారు. తాను రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన కల్పించే ప్రయత్నం చేస్తున్నట్లు తెలిపారు. తన జీవితంలో అత్యంత అందమైన మహిళ తన భార్యేనన్నారు. ఈ పోటీలకు న్యాయనిర్ణేతగా వ్యవహరిస్తుండడం ఆనందంగా ఉన్నప్పటికీ ఒత్తిడి కూడా అధికంగానే ఉందని చెప్పారు.

ప్రతి ఒక్కరూ చూడొచ్చు..

భారతదేశంలో ఎన్నో అద్భుతమైన ప్రాంతాలు ఉన్నప్పటికీ, విదేశీయులకు కొన్ని ప్రాంతాలు మాత్రమే తెలుసని జయేశ్ రంజన్ అన్నారు. మిస్ వరల్డ్ పోటీల ద్వారా తెలంగాణలో కూడా అద్భుతమైన పర్యాటక ప్రాంతాలు ఉన్నాయని చాటి చెప్పే ప్రయత్నం చేస్తున్నామన్నారు. మిస్ వరల్డ్ పోటీలకు ఎవరైనా హాజరు కావొచ్చన్నారు. కేవలం ప్రముఖులకు మాత్రమే అన్నది అపోహ అని చెప్పారు. సీఎం రేవంత్‌రెడ్డి ఈ కార్యక్రమాన్ని అందరికీ అందుబాటులో ఉండేలా చూడాలని ఆకాంక్షిస్తున్నారన్నారు. ఆయన ఆశయాలకు అనుగుణంగా ప్రతి ఒక్కరికీ అవకాశం కల్పిస్తూ ప్రత్యేకంగా టూరిజం వెబ్‌సైట్ (https://tourism.telangana.gov.in/)ను అభివృద్ధి చేశామని చెప్పారు. ఇందులో నమోదు చేసుకొని, మిస్ వరల్డ్‌కు సంబంధించి ఐదు కార్యక్రమాల్లో పాల్గొనవచ్చని తెలిపారు. పొరుగు దేశాలతో ఉద్రిక్తతల గురించి మాట్లాడుతూ.. అవి కాస్త ఆందోళన కలిగించేవే అయినప్పటికీ, మన పోలీసులు దేశంలోనే అత్యుత్తమంగా పనిచేస్తారని జయేశ్ చెప్పారు.



మీడియా సమావేశంలో మంత్రి జూపల్లి, మిస్ వరల్డ్ ఇండియా నందినీ గుప్తా, నటుడు సోనూసూద్, మిస్ వరల్డ్ సీఈవో జూలియా మోర్లే, పర్యాటక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్ తదితరులు

నా హృదయంలో తెలంగాణకు ప్రత్యేక స్థానం: నందిని

'అందరికీ నమస్కారం. నేను మీ నందినీ గుప్తా. మీరందరూ ఎలా ఉన్నారు?' అంటూ మిస్ వరల్డ్ ఇండియా నందినీ గుప్తా తెలుగులో అందరినీ పలకరించారు. ఈ పోటీలకు తాను ఇప్పటికే సన్నద్ధమయ్యానని, దాన్ని ప్రదర్శించడానికి ఆసక్తిగా ఎదురుచూస్తున్నానని చెప్పారు. తనపై తనకు నమ్మకం ఉందన్నారు. తన హృదయంలో తెలంగాణకు ప్రత్యేక స్థానం ఉందని తెలిపారు. హైదరాబాద్.. చారిత్రక వైభవం, ఆధునిక అద్భుతం కలగలిసిన నగరమని చెప్పారు. నగరంలో అన్నీ అద్భుతమేనని కొనియాడారు. తెలంగాణలోని ప్రతి ఒక్క అంశాన్నీ గొప్పగా చెప్పిన నందిని.. తెలంగాణకు తప్పకుండా రావాలని అందరికీ పిలుపునిచ్చారు.

మన సంస్కృతి ప్రతిబింబించాలి: జూపల్లి

శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయాన్ని తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలు ప్రతిబింబించేలా తీర్చిదిద్దాలని మంత్రి జూపల్లి కృష్ణారావు విమానాశ్రయ అధికారులను ఆదేశించారు. మిస్ వరల్డ్ పోటీల్లో పాల్గొనేందుకు వివిధ దేశాల నుంచి వచ్చే అతిథులకు విమానాశ్రయంలో తెలంగాణ సంప్రదాయ పద్ధతిలో ఆహ్వానం పలకాలని స్పష్టం చేశారు. మంగళవారం ఆయన శంషాబాద్ ఎయిర్‌పోర్టులో ఏర్పాట్లను పరిశీలించారు. అతిథులకు ఎలాంటి లోటు లేకుండా చూసుకోవాలని జీఎంఆర్, పర్యాటక శాఖ అధికారులకు స్పష్టం చేశారు. విమానాశ్రయాన్ని పూలు, మామిడి, అరటి తోరణాలతో అలంకరించాలని చెప్పారు. ఇమిగ్రేషన్, కస్టమ్స్ క్లియరెన్స్ త్వరగా పూర్తి చేయాలని సీఐఎస్ఎఫ్ అధికారులకు సూచించారు. అడుగడుగునా తెలంగాణ సంస్కృతి ఉట్టిపడేలా చూడాలని తెలిపారు. అదే సమయంలో ఎయిర్‌పోర్టుకు చేరుకున్న మిస్ ఇండియా నందినీ గుప్తా, మిస్ మెక్సికో మార్లే లీల్‌తో జూపల్లి సమావేశమయ్యారు. తెలంగాణలోని వారసత్వ, చారిత్రక కట్టడాలను సందర్శించాలని వారిని కోరారు. గచ్చిబౌలి స్టేడియంలో జరుగుతున్న ప్రపంచ సుందరి పోటీల ఏర్పాట్లపై మంత్రి జూపల్లి తీవ్ర అసహనం వ్యక్తంచేశారు. సమయం దగ్గర పడుతున్నా.. అనుకున్న స్థాయిలో పనులు జరగకపోవడం పట్ల భాష సాంస్కృతిక శాఖ సంచాలకుడు మామిడి హరికృష్ణపై ఆగ్రహం వ్యక్తం చేశారు. స్వాగత తోరణాలను కార్డు బోర్డులతో కాకుండా మామిడి, అరటి ఆకులు, పూలతో ఘనంగా తీర్చిదిద్దాలని సూచించారు. షోబోట్ ఈవెంట్స్ సంస్థ ఏర్పాటు చేస్తున్న స్వాగత తోరణాలపై అసంతృప్తి వ్యక్తం చేశారు. తెలంగాణ సంస్కృతికి సంబంధం లేకుండా ఇష్టం వచ్చినట్లు ఏర్పాట్లు చేయొద్దన్నారు. ఏర్పాట్లలో అలసత్వం ప్రదర్శిస్తే ఉపేక్షించబోమని హెచ్చరించారు.

పర్యాటక ప్రాంతాలు ముస్తాబు..

ప్రపంచ సుందరి పోటీలకు నగరంలోని పర్యాటక ప్రాంతాలు ముస్తాబవుతున్నాయి. అందాల భామలు, విదేశీ ప్రతినిధులను ఆకర్షించేందుకు ఆయా ప్రదేశాలను విద్యుద్దీపాలతో అలంకరిస్తున్నారు. చార్మినార్ చుట్టూ ఉన్న చిరు వ్యాపారులను దూరంగా పంపించి, అక్కడి ప్రదేశాలను శుభ్రపరుస్తున్నారు. కాగా, వివిధ దేశాల నుంచి వచ్చే అందగత్తెలు బస చేసే, సందర్శించే ప్రాంతాల్లో పటిష్ఠ బందోబస్తుతో పాటు 163 సెక్షన్ (గతంలో 144) అమల్లో ఉంటుందని సీపీ సీవీ ఆనంద్ తెలిపారు. కాగా, మిస్ వరల్డ్ పోటీల్లో పాల్గొనేందుకు దాదాపు 70 దేశాల అందగత్తెలు బుధవారం హైదరాబాద్ చేరుకోనున్నట్లు అధికారులు వెల్లడించారు.

పోటీల భద్రతపై కేంద్రం ఆరా

మిస్ వరల్డ్ పోటీలకు వస్తున్న అతిథులు, విదేశీ పాత్రికేయులు, పోటీదారుల భద్రతపై కేంద్రం దృష్టి సారించింది. పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో తెలంగాణ పోలీసులకు కేంద్ర నిఘా వర్గాలు పలు సూచనలు చేసినట్లు తెలుస్తోంది. మరోవైపు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల నేపథ్యంలో మిస్ వరల్డ్ పోటీల భద్రతపై డీజీపీ జితేందర్ స్వయంగా రోజూ సమీక్ష నిర్వహిస్తున్నారు.

తాజ్‌మహల్‌ను చూసినట్టు..
తెలంగాణను చూస్తారు

- రాష్ట్ర భవిష్యత్తును మార్చే పోటీలివి
- కేవలం వీఐపీల కార్యక్రమం కాదు.. సామాన్యులూ పాల్గొనే అవకాశం
- అందాల పోటీల ఖర్చు రూ.54 కోట్లు.. ఇందులో ప్రభుత్వం భరిస్తున్నది రూ.2కోట్లే
- 'ఆంధ్రజ్యోతి'తో పర్యాటక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్



హైదరాబాద్, మే 6 (ఆంధ్రజ్యోతి): "మన దేశానికి విదేశీ పర్యాటకులు పెద్దఎత్తున వస్తున్నారు. చాలా మంది తాజ్‌మహల్ చూసేందుకు ఆగ్రా, వారసత్వ కట్టడాలు చూసేందుకు జైపూర్, బీచ్ కోసం గోవా, పర్యాటకం కోసం కేరళ వెళ్తున్నారు. తక్కువ మంది మాత్రమే తెలంగాణకు వస్తున్నారు. అదే విదేశీ పర్యాటకులతోపాటు ఇతర రాష్ట్రాల వారు కూడా తెలంగాణకు పెద్దఎత్తున వచ్చేలా చేయడమే ప్రపంచ సుందరి పోటీల వెనుక ప్రభుత్వ ప్రధాన ఉద్దేశం" అని మిస్ వరల్డ్ పోటీల ఇన్‌చార్జి, రాష్ట్ర పర్యాటక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్‌రంజన్ చెప్పారు. రాష్ట్రంలో పర్యాటక అభివృద్ధి లక్ష్యంగా ఈ నెల 10 నుంచి 31 వరకు ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నామని వివరించారు. తెలంగాణ హస్తకళలు, సంస్కృతిని లోకానికి పరిచయం చేయబోతున్నామని తెలిపారు. ఈ పోటీలు పర్యాటకరంగంలో రాష్ట్ర భవిష్యత్తును మారుస్తాయన్నారు. తెలంగాణ పర్యాటక రంగాన్ని ప్రపంచానికి పరిచయం చేయాలన్న సీఎం లక్ష్యానికి అనుగుణంగా పోటీల ఏర్పాట్లు చేస్తున్నామని వెల్లడించారు. ప్రపంచ సుందరి పోటీల ఏర్పాట్లు, విశేషాలపై ఆయన మంగళవారం 'ఆంధ్రజ్యోతి'కి ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. వివరాలు.. ఆయన మాటల్లోనే..

కొత్త అనుభూతి పొందడం ఖాయం..

"ఈ నెల 10న గచ్చిబౌలి స్టేడియంలో మిస్ వరల్డ్ ప్రారంభ కార్యక్రమం ఉంటుంది. వేల సంఖ్యలో సందర్శకులు హాజరవుతారు. అక్కడ కొన్నేళ్లుగా ఎలాంటి అభివృద్ధి పనులు జరగకపోవడంతో ఏర్పాట్లకోసం సమయం పడుతోంది. యుద్ధ ప్రాతిపదికన పనులు పూర్తి చేస్తాం. వచ్చే ఏడాది గచ్చిబౌలి స్టేడియంలో అనేక అంతర్జాతీయ క్రీడాపోటీలు జరగనున్నాయి. నేను తెలంగాణ క్రీడల కార్యదర్శిగా కూడా ఉన్నాను. అందువల్ల భవిష్యత్తులో క్రీడలకు ఉపయోగపడేలా, పనులు శాశ్వతంగా నిలిచిపోయేలా గచ్చిబౌలి స్టేడియంలో ఏర్పాట్లు జరుగుతున్నాయి. ప్రారంభ పోటీలకు హాజరయ్యేవారు కొత్త అనుభూతిని పొందుతారు.

భద్రతపై నేరుగా సీఎం సమీక్షలు..

ప్రస్తుతం పాక్‌తో యుద్ధ మేఘాలు కమ్ముకున్నాయి. దానికితోడు రాష్ట్ర భవిష్యత్తుకు సంబంధించి కీలకం కావడంతో.. ప్రపంచ సుందరి పోటీల భద్రతా ఏర్పాట్లను సీఎం రేవంత్‌రెడ్డి ప్రతిరోజూ స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. రాష్ట్రానికి వచ్చిన 120 దేశాల ప్రతినిధులు సురక్షితంగా తిరిగి వెళ్లేందుకు చర్యలు చేపడుతున్నాం. కొందరు ఈ పోటీలను వ్యతిరేకిస్తున్నారు. నిరసన తెలిపాలని భావిస్తున్నారు. ప్రపంచమంతా తెలంగాణ వైపు చూస్తున్న తరుణంలో.. అలాంటి నిరసనలు రాష్ట్ర ప్రతిష్ఠను దెబ్బతీస్తాయి. నిరసన తెలిపే వారిని పోలీసు శాఖ గుర్తించి తగిన చర్యలు చేపడుతోంది.

చేనేత..విశ్వవ్యాప్తం

తెలంగాణ చేనేత, హస్తకళల గురించి విస్తృతంగా ప్రచారం చేస్తాం. వివిధ దేశాల నుంచి వచ్చిన అందగత్తెలతో రాష్ట్రంలోని ప్రముఖ చేనేత గ్రామాల్లో ప్రత్యేక కార్యక్రమాలు చేపడతాం. శిల్పారామంలో చేనేత ఉత్పత్తులకు ప్రపంచ అందగత్తెలు ప్రత్యేకంగా ప్రచారం చేస్తారు. కళాకారుల నైపుణ్యం, సృజనాత్మకతను లోకానికి చాటిచెప్పేలా కార్యక్రమాలు ఉంటాయి. నేను ఇప్పుడు ధరించినది ఇక్కత్ జాకెట్ (తను ధరించిన జాకెట్‌ను చూపిస్తూ). ఉదయం నుంచి ఎండలో తిరుగుతున్నా ఉక్కపోతగానీ, వేడిగానీ అనిపించలేదు. ఈ విషయాన్ని సహచర అధికారికి చెబితే.. ఆయన వెంటనే ఇలాంటివి కొన్ని ఆర్డర్ ఇచ్చారు. చేనేత ఉత్పత్తులను స్వయంగా ఉపయోగించడంతోపాటు ఇతరులకూ చెప్తే.. విక్రయాలు పెద్దఎత్తున పెరుగుతాయి. ప్రపంచ సుందరి పోటీల తర్వాత చేనేత ఉత్పత్తులకు ప్రపంచవ్యాప్తంగా డిమాండ్ పెరుగుతుంది.

సామాన్యులూ పాల్గొనే అవకాశం..

ప్రపంచ పోటీలంటే వీఐపీల కార్యక్రమం అనుకుంటారు. ఆ ఆలోచనను మార్చి సామాన్యులూ పాల్గొనేలా ప్రణాళిక రూపొందించాలని సీఎం ఆదేశించారు. ఈ క్రమంలో గతంలో ఎన్నడూ లేనివిధంగా ప్రపంచ సుందరి పోటీల్లో ప్రజలు కూడా పాల్గొనే అవకాశం కల్పించాం. గచ్చిబౌలి స్టేడియంలో ప్రారంభ కార్యక్రమం, అందగత్తెల క్రీడా పోటీలు, శిల్పకళా వేదికలో టాలెంట్ షో, ఫ్యాషన్ షో, బ్యూటీ విత్ పర్పస్ తదితర కార్యక్రమాలకు ప్రజలను అనుమతిస్తాం. ఆసక్తి ఉన్నవారు పర్యాటక శాఖ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకుంటే పరిశీలించి అనుమతులిస్తాం.

వృథా కాదు.. భవిష్యత్తుకు బాటలు..

అందాల పోటీల పేరిట పెద్దఎత్తున ప్రజాధనాన్ని వృథా చేస్తున్నారంటూ కొందరు చేస్తున్న విమర్శలు అర్థరహితమే. రాష్ట్ర ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా అతి తక్కువ ఖర్చుతో ఈ పోటీలు నిర్వహిస్తున్నాం. పోటీలకు మొత్తం రూ. 54 కోట్లు ఖర్చవుతుండగా.. రాష్ట్ర ప్రభుత్వం సగం, ప్రపంచ పోటీల నిర్వహణ సంస్థ సగం భరిస్తాయి. రాష్ట్ర ప్రభుత్వ వాటా రూ. 27 కోట్లలో రూ.25 కోట్ల వరకు స్పాన్సర్లు చెల్లిస్తున్నారు. ప్రభుత్వం చేసే ఖర్చు రూ.2 కోట్ల వరకే ఉంటుంది. మిస్ వరల్డ్ పోటీల నిర్వహణ కోసం దేశంలోని అనేక రాష్ట్రాలు, ఇతర దేశాలు పోటీపడ్డాయి. సీఎం ప్రత్యేక చొరవతో రాష్ట్రంలో నిర్వహణకు మార్గం సుగమమైంది. ఈ కార్యక్రమంతో తెలంగాణకు పర్యాటకుల సంఖ్య భారీగా పెరుగుతుంది. యువతకు ఉపాధి అవకాశాలు దక్కుతాయి" అని జయేశ్ రంజన్ వెల్లడించారు.



సీఎం రేవంత్‌తో స్విస్ రాయబారి భేటీ

హైదరాబాద్, మే 6 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డిని స్విట్జర్లాండ్ రాయబారి మాయా తిస్సాఫీ మంగళవారం మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. తిస్సాఫీ వెంట సీఎంను కలిసిన వారిలో ఎంపీ రఘువీర్, రీజనల్ పాస్‌పోర్టు అధికారి జొన్నలగడ్డ స్నేహజ, సీఎంఓ అధికారి అజిత్ రెడ్డి తదితరులు ఉన్నారు.

జలసౌధలో నేడు ప్రాజెక్టులపై సీఎం సమీక్ష

- కృష్ణా, గోదావరి బోర్డుల చైర్మన్లతోనూ సమావేశం
- కొత్త ఏఈలు, జేటీవోలకు నియామక పత్రాల అందజేత

హైదరాబాద్, మే 6 (ఆంధ్రజ్యోతి): ప్రాధాన్య ప్రాజెక్టులపై సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష నిర్వహించానున్నారు. బుధవారం జలసౌధకు వెళ్లనున్న సీఎం.. ఆయా ప్రాజెక్టులకు 15నెలలుగా నిధులు ఏ విధంగా విడుదలవుతున్నాయి? పనుల పురోగతి ఏ విధంగా ఉంది? పనుల పూర్తికి ఉన్న ప్రతిబంధకాలపై సమీక్షించనున్నారు. కృష్ణా జలాల వివాదంతో పాటు నీటి కేటాయింపులు, ఎన్జీటీ కేసులు, జస్టిస్ బ్రిజేష్‌కుమార్ ట్రైబ్యునల్ విచారణతోపాటు సుప్రీంకోర్టులో ఉన్న కేసుల వివరాలను నీటిపారుదల శాఖ సలహాదారుడు ఆదిత్యనాథ్‌దాస్ సీఎంకు వివరించనున్నారు. ఇప్పటికే జస్టిస్ బ్రిజేష్‌కుమార్ ట్రైబ్యునల్ అవార్డును నోటిఫై చేయడానికి కేంద్ర జలశక్తి శాఖ కసరత్తు చేస్తున్న నేపథ్యంలో పర్యవసానాలేంటి? ఏ రాష్ట్రానికి తక్షణ మేలు జరగనుంది? ప్రధానంగా తెలంగాణకు జరగనున్న అన్యాయంపై సీఎం చర్చించి, అధికారులకు తగిన ఆదేశాలు ఇచ్చే అవకాశాలున్నాయి. కాగా, నీటి పారుదల శాఖలో అసిస్టెంట్ ఇంజనీర్లు(ఏఈ), జూనియర్ టెక్నికల్ అధికారులుగా ఎంపికైన 400మందికి మంత్రి ఉత్తమ్‌తో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి నియామక పత్రాలు అందించనున్నారు. అనంతరం కృష్ణా, గోదావరి బోర్డుల చైర్మన్లు, సభ్యులతో సీఎం రేవంత్‌రెడ్డి సమావేశం కానున్నారు.

'మిస్ వరల్డ్' వేళ.. పర్యాటక శాఖలో బదిలీలు!

- స్పాన్సర్ విషయంలో నిర్లక్ష్యం.. ఇద్దరు అధికారులపై చర్యలు

హైదరాబాద్, మే 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న 'మిస్ వరల్డ్-2025' పోటీలు మరో మూడ్రోజుల్లో ప్రారంభంకానుండగా.. పర్యాటకాభివృద్ధి సంస్థలో అకస్మాత్ బదిలీలు జరిగాయి..! మిస్ వరల్డ్ ఆతిథ్యం నేపథ్యంలో ఈ సంస్థలో ఇద్దరు అధికారుల పనితీరుపై ఏర్పడ్డ గందరగోళం కాస్తా.. చినికిచినికి గాలివానగా మారి బదిలీలకు కారణమైనట్లు చర్చ జరుగుతోంది. పోటీల నిర్వహణకు అవసరమైన వసతులు, అతిథులకు సౌకర్యాలను సమకూర్చే బాధ్యతను సర్కారు ఈ సంస్థకు అప్పగించింది. అయితే.. కొందరు స్పాన్సర్లు స్వచ్ఛందంగా ముందుకు వస్తే.. వారి సహకారాన్ని తీసుకోవడంలో ఈ అధికారులిద్దరూ ఉదాసీనంగా వ్యవహరించినట్లు ప్రభుత్వం భావిస్తోంది. ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించాలనుకుంటున్న పోటీల విషయంలో వీరిద్దరూ ఆధిపత్య పోరు, బాధ్యతారాహిత్యంతో వ్యవహరించినట్లు గుర్తించింది. ఇప్పటికే కంచ గచ్చిబౌలి స్థలాల విషయంలో ఎక్స్‌లో ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోస్టు చేసిన స్మితాసబర్వాల్‌ను బదిలీ చేసిన విషయం తెలిసిందే..! ఇప్పుడు ఇద్దరు కీలక అధికారుల్లో ఒకరిని సొంత శాఖకు పంపుతూ 1నే ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిసింది. మరొకరిని ఈ పోటీల బాధ్యతల నుంచి తప్పించినట్లు సమాచారం. అయితే.. వీరిద్దరూ మంగళవారం యథావిధిగా విధులకు హాజరవ్వడం గమనార్హం.

సీఎం రేవంత్.. ముక్కుసూటి మనిషి

- ఆర్థిక పరిస్థితిపై కుండబద్దలు కొట్టారు
- సర్కార్‌ను బెదిరిస్తూ ఒకరిద్దరి వ్యాఖ్యలు
- ఆ ఆవేదనతోనే సీఎం మాట్లాడారు
- ఉద్యోగులు మా మిత్రులే.. సహకరించాలనే కోరాం: శ్రీధర్‌బాబు



హైదరాబాద్, మే 6 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి ముక్కుసూటి మనిషి అని, రాష్ట్ర ఆర్థిక పరిస్థితి గురించి కుండ బద్దలు కొట్టినట్టు చెప్పారని మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. ఇది కొంత మందికి ఇబ్బంది కలిగించి ఉండవచ్చేమో కానీ, వాస్తవ పరిస్థితి అదేనని పేర్కొన్నారు. ఒకరిద్దరు ప్రభుత్వాన్ని బెదిరించినట్లుగా వ్యాఖ్యలు చేశారని, ఆ ఆవేదనతోనే సీఎం అలా మాట్లాడారని తెలిపారు. ఉద్యోగులందరూ తమకు విత్రులేనని, ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో అందరూ సహకరించాలనే రేవంత్ విజ్ఞప్తి చేశారని చెప్పారు. సీఎల్పీ కార్యాలయంలో మంగళవారం మీడియాతో ఆయన చిట్‌చాట్‌గా మాట్లాడారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని ఆర్టీసీ ఉద్యోగులు అర్థం చేసుకున్నారని, అందుకే సమ్మె నిర్ణయాన్ని వెనక్కు తీసుకున్నారని చెప్పారు. కాస్త ఆలస్యమైనా ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తామని స్పష్టం చేశారు. ఆర్థిక ఇబ్బందులను సాకుగా చూపి రాష్ట్రంలో సంక్షేమ పథకాలను ఆపే ప్రసక్తే లేదన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి గురించి ప్రజల ముందు పెడితే తప్పేంటని ప్రశ్నించారు. బీఆర్ఎస్ హయాంలో ప్రతి నెలా మూడో వారంలో జీతాలు ఇచ్చేవారని, అలాంటి వారికి ఉద్యోగులపై ప్రేమ ఉన్నట్లా? అని నిలదీశారు. డబ్బులు ఇవ్వలేకనే ఉద్యోగుల పదవీ విరమణ వయస్సును బీఆర్ఎస్ ప్రభుత్వం పెంచిందన్నారు. ప్రభుత్వం చేసిన అప్పుల గురించే కేటీఆర్ మాట్లాడుతున్నారని, కార్పొరేషన్ల పేరుతో తెచ్చిన అప్పులనూ ప్రభుత్వమే కడుతుందన్న విషయం తెలియదా? అని ధ్వజమెత్తారు. బీజేపీ నేతల వ్యాఖ్యలపై మంత్రి స్పందిస్తూ.. పెహల్గాం దాడికి బాధ్యత వహిస్తూ కేంద్రంలోని బీజేపీ గద్దె దిగాలని తాము డిమాండ్ చేయలేమా? అని ప్రశ్నించారు.

హెలికాప్టర్‌లో వెళ్తేనే ఖర్చు తక్కువ

ఓ మంత్రి.. ఒక జిల్లా నుంచి మరో జిల్లాకు కారులో వెళ్లడం కన్నా.. హెలికాప్టర్‌లో వెళ్తేనే ఖర్చు తక్కువని శ్రీధర్‌బాబు వెల్లడించారు. బీఆర్ఎస్ హయాంలో అద్దెకు తీసుకున్న హెలికాప్టర్‌కు ఊరికే డబ్బులు కట్టలేక వాడుతున్నామని తెలిపారు. అందాల పోటీలతో హైదరాబాద్ ఇమేజ్ పెరుగుతుందని, దానికి.. ఉద్యోగుల సమస్యలకు సంబంధమేంటని ప్రశ్నించారు. ఐఏఎస్ స్మితపై తమకు కక్ష లేదని నిబంధనల ప్రకారమే నడుచుకుంటున్నామన్నారు. కమాండ్ కంట్రోల్ సెంటర్, సచివాలయంలో సమీక్షలు చేస్తే.. అది వర్క్ ఫ్రమ్ హోమ్ ఎలా అవుతుందని ప్రశ్నించారు. మావోయిస్టులతో శాంతి చర్చలు తప్పు కాదని, వారు జనజీవన స్రవంతిలో కలిసేలా చర్యలు తీసుకోవాలని కేంద్రానికి సూచించారు.

కాంగ్రెస్‌ను వదిలేది లేదు

హామీల అమలులో రేవంత్ చేతులెత్తేశారు.. మంత్రులు, ఎమ్మెల్యేలను అడ్డుకుని నిలదీస్తాం

- కేంద్రం నిధులతోనే రాష్ట్ర అభివృద్ధి: సంజయ్



గంభీరావుపేట కొనుగోలు కేంద్రంలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న బండి సంజయ్

సిరిసిల్ల, మే 6 (ఆంధ్రజ్యోతి): ఇచ్చిన మాట తప్పి చేతులెత్తేసిన కాంగ్రెస్‌ను వదిలిపెట్టే ప్రసక్తే లేదని, ఆ పార్టీ సంగతి తేలుస్తామని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. ఎన్నికల హామీలను అమలు చేయలేమని, ఉద్యోగుల సమస్యలను పరిష్కరించలేమని సీఎం రేవంత్‌రెడ్డి పూర్తిగా చేతులెత్తేశారని మండిపడ్డారు. రాజ్యాంగాన్ని చేత పట్టుకొని తెలంగాణ ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తామన్న రాహుల్‌గాంధీ.. ఇప్పుడు ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. బుధవారం నుంచి కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, మంత్రులను నిలదీస్తామని, ప్రజలతో కలిసి అడ్డుకుని తీరతామని హెచ్చరించారు. మంగళవారం సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేటలో సంజయ్ మీడియా సమావేశం నిర్వహించారు. అనంతరం గంభీరావుపేట మండలంలో అకాల వర్షానికి తడిసిన ధాన్యాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా సంజయ్ మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రమనే కుటుంబానికి పెద్దగా ఉండాల్సిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. 'నాతో ఏం కాదు.. ఏమీ చేయలేని స్థితిలో ఉన్నా.. రాష్ట్రం దివాలా తీసింది..' అని మాట్లాడటం సిగ్గుచేటన్నారు. 'ఢిల్లీకి వెళితే అపాయింట్‌మెంట్ కూడా ఇవ్వడం లేదు' అని రేవంత్ చెప్పడం పచ్చి అబద్ధమని సంజయ్ అన్నారు. ప్రధాన మంత్రిని రేవంత్ చాలా సార్లు కలిశారని, కేంద్ర మంత్రులను ఎప్పుడంటే అప్పుడు కలుస్తూనే ఉన్నారని.. నిన్న కూడా గడ్కరీని కలిశారని పేర్కొన్నారు. కేంద్ర మంత్రులను కలిసి కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు బాగా సాయం చేస్తోందని పొగుడుతారని, బయటకు వచ్చి నయాపైసా ఇవ్వడం లేదని రెండు నాల్కల ధోరణితో మాట్లాడతారని విమర్శించారు. కేంద్రం నిధులివ్వలేదంటూ రాష్ట్ర సర్కారు ఆరోపణలు చేయడం అబద్ధమని సంజయ్ అన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి అంతా కేంద్రం నిధులతోనే అని చెప్పారు. కాంట్రాక్టర్‌తో కలిసి భారీగా కమీషన్లు దండుకుని ఆనాడు రాజీవ్ రహదారిని అడ్డదిడ్డంగా నిర్మించింది కాంగ్రెస్ పార్టీయేనని సంజయ్ మండిపడ్డారు. 2036 దాకా ఆ కాంట్రాక్టు కొనసాగేలా ఒప్పందం చేసుకున్నారని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం కాంట్రాక్టర్‌తో ఆ సమస్యను పరిష్కరించుకోవాలని చెప్పారు. రాజీవ్ రహదారిని 6 లేన్లకు విస్తరించేందుకు కేంద్రం సిద్ధంగా ఉందని సంజయ్ అన్నారు.

హామీలు ఇచ్చే ముందు తెలియదా: లక్ష్మణ్

హైదరాబాద్/న్యూఢిల్లీ, మే 6(ఆంధ్రజ్యోతి): ఆరు గ్యారెంటీలు, 420 హామీలతో ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ నేతలు.. ఇప్పుడు హామీల అమలు తమ వల్ల కాదంటూ కూనిరాగాలు తీస్తున్నారని ఎంపీ లక్ష్మణ్ విమర్శించారు. మంగళవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మాట్లాడారు. హామీలు ఇచ్చే ముందు రాష్ట్ర ఆర్థిక పరిస్థితి తెలియదా..? అని ప్రశ్నించారు. ప్రభుత్వ ఉద్యోగులపై ప్రజలను ఉసిగొల్పుతున్నట్లుగా రేవంత్ వ్యాఖ్యలు ఉన్నాయని బీజేఎల్పీ నేత మహేశ్వర్‌రెడ్డి అన్నారు. రాష్ట్రం దివాలా తీసిందని పదే పదే చెప్పడం వెనుక.. ఇచ్చిన హామీల నుంచి తప్పించుకునే కుట్ర ఉందన్నారు. రేవంత్‌రెడ్డి అంత అసమర్థ సీఎంను చూడలేదని, పాలన చేతగాక ప్రజలను మోసం చేస్తున్నారని ఎంపీ రఘునందన్ రావు విమర్శించారు. ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర ఆర్థిక స్థితిపై సీఎం భాష సరికాదన్నారు.

50 ఏళ్ల అవసరాలకు తగినట్లుగా అలైన్‌మెంట్లు

(మొదటి పేజీ తరువాయి)

రోడ్లకు రూపకల్పన చేయాలన్నారు. మంగళవారం ఆర్ఆర్ఆర్ దక్షిణ భాగం, రేడియల్ రోడ్లు, ఇతర రహదారుల నిర్మాణాలపై జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో ఆర్అండ్‌బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డితో కలిసి ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రేవంత్ మాట్లాడుతూ.. ఔటర్ రింగు రోడ్డు (ఓఆర్ఆర్) నుంచి ఆర్ఆర్ఆర్ వరకు రేడియల్ రోడ్ల నిర్మాణ ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. హైదరాబాద్ నుంచి వెళ్లే జాతీయ, రాష్ట్ర రహదారులు ఆర్ఆర్ఆర్ బయటకు వెళ్లే ప్రాంతంలో అవసరమైన స్థాయిలో ట్రంపెట్‌లు నిర్మించాలని, ఎటువంటి గందరగోళానికి తావులేకుండా, ట్రాఫిక్ సిగ్నళ్లు లేకుండా రోడ్డు దాటేలా ఉండాలని సూచించారు. ఆర్ఆర్ఆర్ దక్షిణ భాగం అలైన్‌మెంట్‌ను పరిశీలించి పలు మార్పులు సూచించారు. హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారిలో ఎలివేటెడ్ కారిడార్ నూతన అలైన్‌మెంట్‌కు సంబంధించి కూడా సీఎం పలు సూచనలు చేశారు. రాజీవ్ రహదారికి ప్రత్యామ్నాయంగా ఓఆర్ఆర్ నుంచి మంచిర్యాల వరకు నూతన రహదారి నిర్మాణానికి ప్రత్యామ్నాయ అలైన్‌మెంట్‌ను వీలైనంత త్వరగా పూర్తి చేయాలన్నారు. ఆ మార్గంలో పారిశ్రామిక పార్కుల ఏర్పాటుకు ఉన్న అనుకూలతలను పరిశీలించాలని సూచించారు. ఈ కొత్త రహదారులకు సంబంధించి జాతీయ రహదారుల విభాగం అధికారులతో ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకోవాలన్నారు. సమీక్షలో ఆర్అండ్‌బీ ప్రత్యేక ముఖ్యకార్యదర్శి వికాస్‌రాజ్, ప్రత్యేక కార్యదర్శి హరిచందన, పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ కార్యదర్శి ఇలంబర్తి, హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధిహామీ సిబ్బందికి వేతనాల చెల్లింపు

- రూ.62కోట్లు విడుదల.. నేటి నుంచి ఖాతాల్లో జమ

హైదరాబాద్, మే 6 (ఆంధ్రజ్యోతి): ఉపాధిహామీ పథకం కింద పనిచేసే సిబ్బందికి రాష్ట్రప్రభుత్వం వేతనాలు చెల్లించనుంది. ఇందుకుగాను రూ.62 కోట్లు విడుదల చేసినట్లు సంబంధిత విభాగాలు తెలిపాయి. ఎన్ఆర్ఈజీఎస్ పరిధిలో రాష్ట్రవ్యాప్తంగా ఫిక్స్‌డ్ టెన్యూర్, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు, ఫీల్డ్ అసిస్టెంట్లు మొత్తం కలిపి 12,520 మంది సిబ్బంది పనిచేస్తున్నారు. వీరికి సంబంధించి నాలుగు నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలకు ఈ రూ.62 కోట్లను వినియోగించనున్నారు. బుధవారం నుంచి ఉపాధి హామీ సిబ్బంది ఖాతాల్లోకి నగదు జమ చేయనున్నట్లు అధికారులు వెల్లడించారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84, RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.